'సంపద పంపిణీ సక్రమంగా జరిగితే అట్టడుగు వర్గాలకు చేరుతుంది. అప్పుడే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 6.50

సంపుటి: 18 సంచిక: 251

మంగళవారం 2-12-2025

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

భారీ విజయంతో భారత్ బోణీ

జూనియర్ మహిళల ప్రపంచకప్ హాకీ.. నమీబియా జట్టుపై విజయం - 12లో

రికార్డు స్థాయి నుంచి రివర్స్

స్వల్ప లాభాలతో ముగిసిన సూచీలు.. సెన్సెక్స్ 65 పాయింట్ల పతనం - 13లో



లక్ష్మణరేఖను దాటొద్దు

పార్లమెంటరీ నిబంధనలను తూ.చ. తప్పకుండా పాటించాలని ఎంపీలకు ఉప రాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ సూచించారు.

వివరాలు 6లో ▸



'డిజిటల్ అరెస్ట్' దర్యాప్తు సీబీఐకి

డిజిటల్ అరెస్టుల కుంభకోణం విచారణ బాధ్యతను సీబీఐకి అప్పగిస్తూ సుప్రీంకోర్టు ఆదేశాలు జారీ చేసింది.

వివరాలు 6లో ▸

చలి తీవ్రత ఎక్కువే

డిసెంబర్ 2025 నుంచి 2026 ఫిబ్రవరి వరకు చలి ఎక్కువగానే ఉంటుందని అంచనా వేస్తున్నట్లు ఐఎండీ తెలిపింది.

వివరాలు 6లో ▸

10న ఎంపిక చేస్తాం

సమాచార హక్కు చట్టం ప్రధాన కమిషనర్ ఎంపికను ఈ నెల 10న చేస్తామని సుప్రీం కోర్టుకు కేంద్రం తెలిపింది.

వివరాలు 6లో ▸

హామీలు ఎగ్గొట్టి..

పెన్షన్లు పోగొట్టి!

కొత్తవి దేవుడెరుగు.. ఉన్న పెన్షన్లే దాదాపు 5 లక్షలు తగ్గుదల

ఏడాదిన్నరగా పెండింగ్‌లోనే 2.5 లక్షల దరఖాస్తులు

అర్హత ఉన్నా.. పింఛన్ దరఖాస్తుకు అవకాశం లేక మరో 3 లక్షల మందికిపైగా ఎదురుచూపులు

రీ వెరిఫికేషన్ పేరుతో లక్ష దివ్యాంగ పింఛన్లపై వేలాడుతున్న కత్తి..

వలంటీర్ వ్యవస్థతో.. అవ్వాతాతల ఆత్మగౌరవాన్ని కాపాడుతూ ఇంటివద్దే సాగిన ప్రక్రియను రోడ్డుకీడ్చిన బాబు సర్కారు

పింఛన్ల పంపిణీని పార్టీ కార్యక్రమంలా మార్చేసి స్వీయ ప్రచారం.. ఎండావానలో అవ్వాతాతలు, దివ్యాంగులు, వితంతువుల అవస్థలు

విజయవాడలో సోమవారం ఉదయం చలిగాలుల మధ్య రోడ్డుపై పింఛన్ల కోసం వృద్ధులు

2 లో

50 ఏళ్లకే పింఛన్ హామీకీ బాబు సర్కారు మంగళం

ఐదేళ్లలో 29.51 లక్షల కొత్త పెన్షన్లు ఇచ్చిన వైఎస్ జగన్ ప్రభుత్వం

అర్హులందరికీ సంతృప్త స్థాయిలో ప్రయోజనం చేకూర్చి మేలు

డ్రామాలొద్దు..

పనిచూడండి

పార్లమెంట్‌లో విపక్షసభ్యులు అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్నారంటూ ప్రధాని మోదీ చురకలు

నిర్మాణాత్మక, విధానాత్మక చర్చలకు పార్లమెంట్ వేదిక కావాలి

శీతాకాల సమావేశాల ఆరంభానికి ముందు పార్లమెంట్ ప్రాంగణంలో ప్రధాని ప్రసంగం

బిహార్ ఓటమి నైరాశ్యాన్ని సభలో చూపొద్దని విపక్షాలకు హితవు

కొత్త వ్యూహాల కోసం మీకు చిట్కాలు చెపుతానని ఎద్దేవా

6 లో

"పలు రాష్ట్రాల శాసనసభ ఎన్నికలకు కసరత్తు చేసే వ్యాయామశాలగా పార్లమెంట్‌ను మార్చొద్దు. ఇటీవల ముగిసిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాభవాన్ని చవిచూసిన విపక్షపార్టీలు ఆ నైరాశ్యాన్ని పార్లమెంట్‌లో ప్రదర్శించాలనుకుంటున్నాయి. పార్లమెంట్ పవిత్రమైంది. ఇది నాటకాలు వేసే రంగస్థలం కాదు. బలమైన ఆధారాలతో ప్రభుత్వంపై విమర్శలకు విపక్షాలు దిగుతామంటే నేను సైతం వారికి కొన్ని చిట్కాలు చెబుతా -ప్రధాని మోదీ

ప్రజాసమస్యలపై నిలదీస్తే డ్రామాలంటారా?

- సమస్యలపై చర్చకు అనుమతించకపోవడమే అసలైన డ్రామా
- మోదీ 'డ్రామా' వ్యాఖ్యలపై ప్రియాంకా గాంధీ తీవ్ర ఆగ్రహం

6 లో

వాయిదాల పర్వం

- ఇరుసభల్లో ఎస్ఐఆర్‌పై చర్చకు పట్టుబట్టిన విపక్షాలు
- ఇప్పటికిప్పుడు కుదరదన్న అధికారపక్షం... నినాదాలతో వేడెక్కిన శీతాకాల సమావేశాలు

న్యూస్‌రీల్

ఒక్కటైన సమంత-రాజ్ నిడిమోరు

ప్రముఖ హీరోయిన్ సమంత రుత్ ప్రభు, దర్శక నిర్మాత రాజ్ నిడిమోరు వివాహ బంధంలోకి అడుగు పెట్టారు. కోయంబత్తూరులోని ఈశా యోగా సెంటర్‌లో సోమవారం యోగ సంప్రదాయం ప్రకారం ఒక్కటయ్యారు.

వివరాలు 14లో ▸

రాష్ట్ర ప్రజల వ్యక్తిగత ఆదాయం ధమాల్

ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో రాష్ట్ర ప్రజల వ్యక్తిగత ఆదాయం పడిపోయింది. 2023–24 ఆర్థిక ఏడాది కన్నా 2024–25లో రాష్ట్రం నుంచి కేంద్రానికి ప్రత్యక్ష పన్నుల రూపంలో వచ్చే ఆదాయం తగ్గిపోవడమే ఇందుకు నిదర్శనం.

వివరాలు 5లో ▸

99 పైసలకే భూ పందేరం

రాష్ట్రంలో అప్పనంగా భూ పందేరానికి చంద్రబాబు ప్రభుత్వం తెర తీసింది. కేవలం 99 పైసలకే ఎకరం చొప్పున కంపెనీలకు ఎన్ని ఎకరాలైనా ఇచ్చేందుకు సిద్ధమని స్పష్టం చేస్తోంది.

వివరాలు 5లో ▸

'లాంఛనాలను' బట్టి అంచనాలు

అనకాపల్లి జిల్లాలోని బల్క్ డ్రగ్ పార్క్, ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ కోసం నిర్వాసితులకు చెల్లించాల్సిన నష్టపరిహారంలో ప్రభుత్వం అన్యాయం చేస్తోంది. ఇళ్లకు నష్టపరిహారం అంచనా వేయడంలో ఏపీఐఐసీ సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తుండటాన్ని నిరసిస్తూ నిర్వాసితులు ఆందోళన చేశారు.

వివరాలు 10లో ▸

బాబు మద్యం దోపిడీ కేసు క్లోజ్!

ఆధారాల్లేవన్న బాబు గూటి-చిలుక సీఐడీ

ప్రభుత్వ వేధింపులకు తలొగ్గిన ఫిర్యాదుదారు వాసుదేవరెడ్డి

■ చంద్రబాబు బరి తెగించి సాగించిన మద్యం దోపిడీ దందాకు టీడీపీ గూటి చిలుక సీఐడీ 'పచ్చతర్పణం' వదిలేసింది! ఆ కేసులో ఆధారాలు లేవని న్యాయస్థానానికి నివేదించింది. తద్వారా ఆ కేసు మూసివేతకు మార్గం సుగమం చేసింది. 2014–19లో టీడీపీ హయాంలో చంద్రబాబు సాగించిన అవినీతి దందాపై నమోదైన కేసుల మూసివేత కుట్రలో మరో అంకాన్ని ముగించింది.

2లో

ఫీజు చెల్లిస్తేనే

తరగతికి అనుమతి

- మాజీ మంత్రి పల్లె రఘునాథ రెడ్డి శ్రీకృష్ణదేవరాయ హార్టికల్చర్ కళాశాలలో సిబ్బంది దౌర్జన్యం..
- ఫీజు చెల్లించలేదని హార్టికల్చర్ కళాశాలలో విద్యార్థులను బయటే నిలబెట్టిన వైనం.. రీయింబర్స్‌మెంట్‌తో సంబంధం లేదంటూ తేల్చి చెప్పిన యాజమాన్యం
- టీడీపీ నేత కాలేజీలోనే విద్యార్థులకు తప్పని ఇబ్బందులు

3 లో

హలో ఇండియా.. ఓసారి

ఏపీ వైపు చూడండి

కిలో అరటిపండ్లు కేవలం 50 పైసలే.. ఔను.. మీరు విన్నది నిజమే

ఇదీ ఏపీలో రైతుల దుస్థితి... అగ్గిపెట్టె కంటే చౌక... ఒక బిస్కెట్ కంటే చౌక

- రూ.లక్షల పెట్టుబడితో నెలల పాటు కష్టపడిన రైతులకు దక్కిన ప్రతిఫలం ఇంతే
- అరటే కాదు... ఉల్లి నుంచి టమాట వరకు ఏ పంటకూ గిట్టుబాటు ధర లేదు
- విపత్తుల సమయంలో ఉచిత పంటల బీమా, ఇన్‌పుట్ సబ్సిడీ హామీని తుంగలో తొక్కారు
- మా ప్రభుత్వ హయాంలో అరటి పంట టన్నుకు సగటున రూ.25 వేల ధర దక్కింది
- రైతులు నష్టపోకుండా ఉండేందుకు రాష్ట్రం నుంచి ఢిల్లీకి ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేశాం
- రాష్ట్రవ్యాప్తంగా కోల్డ్ స్టోరేజీలను అందుబాటులోకి తెచ్చాం.. మా నిబద్ధత వేలాది రైతు కుటుంబాలను కాపాడింది
- కానీ, సీఎం చంద్రబాబు నేడు రైతులను వారి ఖర్మకు వదిలేశారు
- వ్యవసాయం సంక్షోభంలోకి కూరుకుపోతుంటే మౌనం వహిస్తున్నారు

- ఆహారం 50 పైసలైతే... దానిని ఉత్పత్తి చేసే రైతుల శ్రమ విలువ ఎంత?
- రాష్ట్ర రైతుల దుస్థితిని ప్రస్తావిస్తూ, చంద్రబాబు నిర్వాకాన్ని ఎండగట్టిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్
- అనంతపురం కలెక్టరేట్ ఎదుట రైతుల ఆందోళన ఫొటోలను ట్యాగ్ చేస్తూ 'సేవ్ ఫార్మర్స్' హ్యాష్ ట్యాగ్‌తో 'ఎక్స్'లో పోస్టు

2 లో

వరి వేస్తే కొనేవారే ఉండరు

- ఒక పంట వరివేద్దాం.. మరో పంట మారుద్దాం
- వరివల్ల డయాబెటిస్ వస్తుంది
- గోదావరి పుష్కరాల కంటే ముందే పోలవరాన్ని పూర్తిచేస్తాం
- ఏలూరు జిల్లా గోపీనాథపట్నం ప్రజావేదికలో సీఎం చంద్రబాబు

5 లో



సీఎం,మంత్రులు, సీఎస్ కార్యాలయాల్లో కంప్యూటర్ల కోసం రూ.12.50 కోట్లు

5లో

నేటి గుడ్లు & చికెన్ గుంటూరు జోన్ ధరలు

12 గుడ్ల రిటైల్ ధర ₹90	ఫారం దగ్గర లైవ్ బర్డ్ 118 కిలో	డ్రెస్డ్ స్కిన్‌తో 210 కిలో
	రిటైల్ లైవ్ బర్డ్ 145 కిలో	స్కిన్ లెస్ 239 కిలో

Conditions Apply

వినియోగదారుల శ్రేయస్సు దృష్ట్యా జారీచేయడమైనది

మొన్నటి వరకు వ్యవసాయం దండగ అన్నారు.. ఇప్పుడు సార్ దృష్టి చదువు మీద పడింది!

రైతన్నా.. కన్నెత్తి చూడలేం

చంద్రబాబు సర్కారు చేపట్టిన 'రైతన్నా మీ కోసం' అట్టర్ ఫ్లాప్

అన్నదాతల దగ్గరకు వెళ్లలేక మొహం చాటేసిన సీఎం, ఆయన బృందం

- తొలిరోజే హడావుడి... మరునాటి నుంచి పత్తా లేని మంత్రులు, ప్రజా ప్రతినిధులు.. మొదటి రోజే రైతుల నుంచి తీవ్ర ప్రతిఘటన
- నిలదీస్తూ వాళ్లు అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పలేని దుస్థితి
- 18 నెలల్లో ఏం మేలు చేశారంటూ కడిగేసిన అన్నదాతలు.. స్వయంగా పాల్గొంటానన్న చంద్రబాబు... తర్వాత రైతుల ఊసెత్తని వైనం
- యాప్ ఇన్‌స్టాల్ చేసే బాధ్యత ఆర్‌బీకే సిబ్బందికి అప్పగింత
- ఏం చేశామని చెబుతాం...? ఏం మొహం పెట్టుకుని వెళ్తామన్న నేతలు

గిట్టుబాటు ధరలు రావడం లేదని పల్నాడు జిల్లా తల్లార్లపల్లె గ్రామంలో ప్రభుత్వ చీఫ్ విప్ జీవి ఆంజనేయులును నిలదీస్తున్న రైతులు

సాక్షి, అమరావతి: ప్రకటన ఆర్భాటం... ఆచరణ అధ్వానం..! ఇదీ చంద్రబాబు ప్రభుత్వం చేపట్టే కార్యక్రమాల అమలు తీరు. ఈ కోవలోనే 'రైతన్నా మీ కోసం' అంటూ హడావుడి చేశారు. కానీ, హామీల ఎగవేత తప్ప ఏడాదిన్నర పాలనలో చేసిందేమీ లేకపోవడం, అన్నదాత సుఖీభవ అంటూ దగా చేయడం, విపత్తుల వేళ ఆదుకోకుండా గాలికి వదిలేయడంతో తొలిరోజే అన్నదాతల నుంచి తీవ్ర ప్రతిఘటన ఎదురైంది. దీంతో రెండో రోజు నుంచే మొహం చాటేశారు. కనీసం కరపత్రాలు కూడా పంచే సాహసం చేయలేకపోయారు. ప్రతి నెల సామాజిక పింఛన్ల పంపిణీలో ఫొటో షూట్‌తో నానా హంగామా చేస్తున్న సీఎం చంద్రబాబు రైతుల గడప తొక్కలేకపోయారు. రైతుల కోసం

మిగతా 5వ పేజీలో ▶

'సాక్షి' మీడియాకు నోటీసులు

■ సాక్షి మీడియాపై కొందరు టీడీపీ నాయకులు కక్షగట్టారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ, స్త్రీ–శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అనధికార పీఏ సతీష్ అనైతిక వ్యవహారాలపై ఓ ఒంటరి మహిళ ఆవేదనను, ఫిర్యాదులను ప్రజల ముందు ఉంచినందుకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

3లో

టీటీడీలో స్తంభించిన సర్వర్

- వీఐపీ దర్శన టికెట్ల జారీలో తీవ్ర జాప్యం
- ఎంబీసీ 34 వద్ద గంటల తరబడి క్యూ కట్టిన భక్తులు



- వివరాలు 2లో



తిరుపతి జిల్లా ఏర్పేడు మండలం ఎండీ పుత్తూరులో నీటమునిగిన పంటపొలాలు

మరింత బలహీనపడిన వాయుగుండం

నేడు ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు

నెల్లూరులో నీట మునిగిన పంటలు

పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు

- వివరాలు 3లో

హలో ఇండియా...

ఓసారి ఆంధ్రప్రదేశ్ వైపు చూడండి

కిలో అరటిపండ్లు కేవలం 50 పైసలే.. ఔను.. మీరు విన్నది నిజమే

ఇదీ ఏపీలో రైతుల దుస్థితి... అగ్గిపెట్టె కంటే చౌక... ఒక బిస్కెట్ కంటే చౌక

రాష్ట్ర రైతుల దుస్థితిని ప్రస్తావిస్తూ, చంద్రబాబు నిర్వాకాన్ని ఎండగట్టిన వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్

అనంతపురం కలెక్టరేట్ ఎదుట రైతుల ఆందోళన ఫొటోలను ట్యాగ్ చేస్తూ 'సేవ్ ఫార్మర్స్' హ్యాష్ ట్యాగ్‌తో 'ఎక్స్'లో పోస్టు

సాక్షి, అమరావతి: రాష్ట్ర రైతులు పండించిన అరటి పండ్ల ధర కిలో కేవలం 50 పైసలు మాత్రమే పలుకుతుండడం, ఉల్లిపాయల నుంచి టమాట వరకు ఏ పంటకూ గిట్టుబాటు ధర దక్కక అన్నదాతలు అవస్థ పడుతుండడాన్ని దేశం మొత్తానికి తెలియజేస్తూ సామాజిక మాధ్యమం 'ఎక్స్'లో వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం పోస్టు చేశారు. అన్నదాతలకు దన్నుగా నిలవాల్సిన చంద్రబాబు సర్కారు అందుకు పూర్తి భిన్నంగా వ్యవహరిస్తుండడాన్ని సూటిగా ప్రస్తావిస్తూ తీవ్రంగా ధ్వజమెత్తారు. అరటి పంటకు గిట్టుబాటు ధర కల్పించకపోవడాన్ని నిరసిస్తూ అనంతపురం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట రైతులు భారీఎత్తున ధర్నా చేస్తున్న ఫొటోలను ట్యాగ్ చేస్తూ ''సేవ్ ఫార్మర్స్'' హ్యాష్‌ట్యాగ్‌తో ''హలో ఇండియా... ఒక్కసారి ఆంధ్రప్రదేశ్ వైపు చూడండి'' అంటూ వైఎస్ జగన్ ట్వీట్ చేశారు. ఆ పోస్టులో ఆయన ఏమన్నారంటే..

''హలో ఇండియా.. ఓ సారి ఆంధ్రప్రదేశ్ వైపు చూడండి! కిలో అరటిపండ్లు కేవలం రూ.0.50కి అమ్ముడవుతున్నాయి! ఔను, మీరు విన్నది నిజమే, యాభై పైసలే. ఇదీ ఏపీలో అరటి రైతుల దుస్థితి.అగ్గిపెట్టె కంటే చౌక, ఒక బిస్కెట్ కంటే చౌక. లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి, నెలల తరబడి కష్టపడి పనిచేసిన రైతులకు దక్కిన దారుణమైన ప్రతిఫలం ఇది. అరటిపండ్లు మాత్రమే కాదు, ఉల్లిపాయల నుంచి టమాట వరకు, ఏ పంటకూ గిట్టుబాటు ధర లభించడం లేదు. విపత్తుల సమయంలో ఉచిత పంటల బీమా లేదా ఇన్‌పుట్ సబ్సిడీ ఇస్తామని హామీ ఇచ్చి, పంటలకు గిట్టుబాటు ధర కల్పిస్తామని నమ్మబలికి మోసం చేశారు. చంద్రబాబు ప్రతి హామీ ఒక మోసమేనని నిరూపితమైంది.

➡ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అరటి పండ్లను టన్నుకు సగటున రూ.25 వేల ధరకు రైతులు అమ్ముకున్నారు. రైతులు ఎప్పుడూ నష్టపోకుండా చూసుకోవడానికి రాష్ట్రం నుంచి న్యూఢిల్లీకి ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేశాం. రైతులు పండించిన పంటలను నిల్వ చేసుకోవడానికి రాష్ట్రవ్యాప్తంగా కోల్డ్ స్టోరేజీలు నిర్మించాం. నాటి మా నిబద్ధత వేలాది కుటుంబాలను కాపాడింది. గిట్టుబాటు ధరలకు పంటల ఉత్పత్తులను విక్రయించుకుని లబ్ధి పొందేలా రైతులకు తోడుగా నిలిచాం. కానీ నేడు చంద్రబాబు రైతులను వారి ఖర్మకు వదిలేశారు. వ్యవసాయం తీవ్ర సంక్షోభంలోకి కూరుకుపోతుంటే మౌనరాగం ఆలపిస్తున్నారు. నేడు ఆహారం విలువ 50 పైసలైతే దానిని ఉత్పత్తి చేసే రైతుల శ్రమ విలువ ఎంత?'' అని వైఎస్ జగన్ ఆవేదన వ్యక్తం చేశారు.

రైతులతో కలిసి కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన శైలజానాథ్, వైఎస్సార్‌సీపీ నాయకులు

కదంతొక్కిన అరటి రైతు

- అనంతపురంలో కలెక్టరేట్ వద్ద భారీ ధర్నా
- శైలజానాథ్ ఆధ్వర్యంలో ర్యాలీ

అనంతపురం: ఆరుగాలం పంటను పండించిన అనంత రైతన్న.. దాన్ని అమ్ముకోలేక పొలాల్లోనే ట్రాక్టర్‌తో దున్నేసే పరిస్థితి నెలకొందని వైఎస్సార్‌సీపీ నేత, మాజీ మంత్రి సాకే శైలజానాథ్ ఆవేదన వ్యక్తంచేశారు. రైతును పూర్తిగా విస్మరించిన చంద్రబాబు సర్కార్ తీరును నిరసిస్తూ సోమవారం శైలజానాథ్ నేతృత్వంలో అనంతపురంలో అరటి రైతులు కదం తొక్కారు. ఓటీఆర్ఐ నుంచి కలెక్టరేట్ వరకూ అరటి గెలలతో వినూత్న నిరసన తెలిపారు. అనంతరం కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా శైలజానాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన భారీ ర్యాలీలో రైతులు వేలాది మంది పాల్గొన్నారు. అరటి గెలలను తీసుకొచ్చి కలెక్టరేట్ ఎదుట పడేశారు. 'కేజీకి రెండు రూపాయలకు కూడా కొనుగోలు చేసే వారు లేరు' అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. 'చంద్రబాబు డౌన్ డౌన్' అంటూ నినాదాలు చేశారు. వైఎస్సార్ సీపీ శింగనమల నియోజకవర్గ సమన్వయకర్త శైలజానాథ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ అరటి పంటలను తక్షణం ప్రభుత్వం కొనుగోలు చేయాలని, గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు.

క్లుప్తంగా...

తీర ప్రాంతం రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి గ్రోత్ ఇంజిన్

వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: సుదీర్ఘ తీర ప్రాంతం మన రాష్ట్ర ఆర్థిక అభివృద్ధికి గ్రోత్ ఇంజిన్ వంటిదని వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. 'మన రాష్ట్రానికి ఉన్న పొడవైన తీరప్రాంతం కేవలం భౌగోళిక సరిహద్దు మాత్రమే కాదు... అది మన రాష్ట్ర ఆర్థిక అభివృద్ధికి గ్రోత్ ఇంజిన్. పోర్టుల ద్వారా జరిగే అభివృద్ధి, తద్వారా మన రాష్ట్రాన్ని మార్చే ఆర్థిక వృద్ధికి తీరప్రాంతం ఇంజిన్ లాంటిది' అని వైఎస్ జగన్ తెలిపారు. ఈ మేరకు ఆయన సోమవారం 'ఎక్స్'లో 'వైఎస్సార్‌సీపీ పోర్ట్స్ రెవల్యూషన్' హ్యాష్ ట్యాగ్‌ను రీ పోస్ట్ చేశారు.

టీటీడీలో స్తంభించిన సర్వర్

వీఐపీ టికెట్ల జారీలో తీవ్రజాప్యం

తిరుమల/తిరుపతి క్రైమ్: తిరుమలలో వీఐపీ దర్శనం టికెట్లు జారీ చేసే సర్వరు సోమవారం స్తంభించింది. ఎస్ఎంఎస్‌లు వచ్చిన భక్తులకు పేమెంట్ చెల్లించడానికి వీలు కాక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దీంతో ఎంబీసీ కౌంటర్ వద్దకు వెళ్లి టికెట్లు కొనుగోలు చేయాలని టీటీడీ భక్తులకు సూచించింది. వారంతా ఎంబీసీ 34 వద్ద క్యూ కట్టడం గమనార్హం. ఇది బ్యాంకర్స్ ద్వారా తలెత్తిన సమస్యగా టీటీడీ గుర్తించింది. ఇదిలా ఉండగా తిరుపతిలో సోమవారం ఓ హోటల్‌కు బాంబు బెదిరింపు మెయిల్ రావడం కలకలం రేపింది. అలిపిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని కపిల తీర్థం సమీపంలో ఉన్న రాజ్ పార్క్ హోటల్‌లో బాంబు పెట్టామని, కాసేపట్లో పేలిపోతోందని గుర్తు తెలియని వ్యక్తులు పోలీసులకు మెయిల్ పంపారు. దీంతో సీఐ రామకిషోర్ బృందం, బాంబ్ స్క్వాడ్ హోటల్లోని గదులు, బాత్‌రూములు మొత్తం క్షుణ్ణంగా తనిఖీలు చేశారు. ఎలాంటి బాంబు లేకపోవడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు. ఇటీవల ఎస్వీ యూనివర్సిటీలో బాంబు పెట్టామని ఉత్తుత్తి బెదిరింపులు చేసిన సంగతి తెలిసిందే.

బంగ్లాదేశ్ మత్స్యకారులపై కేసు

13 మంది రిమాండ్‌కు తరలింపు

గార: శ్రీకాకుళం జిల్లా ఎచ్చెర్ల మండలం మూసవానిపేట సముద్రతీరానికి ఆదివారం చేరిన 13 మంది బంగ్లాదేశీయులను గార మండలం కళింగపట్నం మెరైన్ పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కళింగపట్నం మెరైన్ పోలీస్‌స్టేషన్ సీఐ బి.ప్రసాదరావు తెలిపిన వివరాల ప్రకారం.. బంగ్లాదేశ్‌లోని బోలబార్సిల్ జిల్లా చర్‌కోలాచద్ గ్రామానికి చెందిన సయిబ్, జహంగీర్, సబీర్, కోకస్, మఖ్‌సూద్, మాలిక్, మహ్మద్ ఫరూఖ్, మాక్‌సుద్, నాసిర్, హెలెల్, ఫరూఖ్, అలామ్, సమోన్ నవంబర్ 10న ఢాకా సిటీ మార్కెట్ సముద్ర తీరం నుంచి వారం రోజుల వేటకని బయలుదేరారు. 11వ తేదీ ఇంజిన్ మరమ్మతులకు గురైంది. సముద్రంలో గాలులకు పడవ మనదేశం వైపు వచ్చింది. 20 రోజులుగా వారు ఉన్న సరుకులతోనే అరకొర ఆకలి తీర్చుకుంటూ గడిపారు. మూసవానిపేట సముద్రజలాల్లో వేరే ప్రాంతానికి చెందిన బోటు లంగరు వేసి ఉండటాన్ని ఆదివారం గమనించిన స్థానిక మత్స్యకారుడు రమణ 1093కు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. వెంటనే మెరైన్ ఎస్ఐ లక్ష్మణరావు సిబ్బంది సముద్రంలోకి వెళ్లి వారిని అదుపులోకి తీసుకున్నారు. మారిటమ్ జోన్ ఆఫ్ ఇండియా యాక్టు–1981 ప్రకారం ఈ 13 మందిపై చొరబాటుదారులుగా కేసు నమోదు చేశారు. సోమవారం కళింగపట్నం మెరైన్ పోలీస్ స్టేషన్‌లో అధికారులు వారిని విచారించారు. వారిని సోమవారం రాత్రి నరసన్నపేట కోర్టులో హాజరుపరిచారు. న్యాయస్థానం 14 రోజుల రిమాండ్ విధించడంతో నరసన్నపేట సబ్‌జైలుకు తరలించారు.

హామీలు ఎగ్గొట్టి.. పెన్షన్లు పోగొట్టి!

కొత్తవి దేవుడెరుగు.. ఉన్న పెన్షన్లే దాదాపు 5 లక్షలు తగ్గుదల

పింఛన్ల పంపిణీపై మంత్రి అనగాని సత్యప్రసాద్‌ను నిలదీస్తున్న మహిళ

సాక్షి, అమరావతి:

వైఎస్ జగన్ హయాంలో ఎన్నికల నాటికి అత్యధికంగా ఇచ్చిన పింఛన్లు 66.34 లక్షలు..!

చంద్రబాబు ప్రభుత్వం ఈ నెల 1వతేదీ రాత్రి సమయానికి పంపిణీ చేసిన పెన్షన్లు 59.11 లక్షలు!

పోనీ గత నెలలో చూసినా.. నవంబర్ 1న బాబు సర్కారు పంచిన పెన్షన్లు 61.64 లక్షలే!!

అంటే.. గత 18 నెలల వ్యవధిలో ఏకంగా దాదాపు ఐదు లక్షల పింఛన్లు ఎగిరిపోయాయ్!

50 ఏళ్లకే పింఛన్ హామీ గాలికి..

ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు 50 ఏళ్లకే రూ.నాలుగు వేల చొప్పున పింఛన్ ఇస్తామని ఎన్నికల ముందు చంద్రబాబు మేనిఫెస్టోలో హామీ ఇచ్చారు. ఒకపక్క ఉన్న పింఛన్లనే ఎగరగొడుతూ.. దరఖాస్తులను తొక్కిపెడుతూ నిర్దాక్షిణ్యంగా వ్యవహరిస్తున్న చంద్రబాబు సర్కారు 50 ఏళ్లకే పెన్షన్ హామీని గాలికి వదిలేసింది.

తిరుపతి జీవకోనలో పింఛన్ల కోసం ఇళ్ల ముందుఎదురు చూస్తున్న లబ్ధిదారులు

ఏలూరు జిల్లా వేంపాడులో పింఛన్ల కోసం ఓ ఇంటి వద్దకు చేరుకున్న వృద్ధులు

రాష్ట్రంలో దాదాపుగా తొలిరోజే పింఛన్లు తీసుకునే లబ్ధిదారులే అత్యధికంగా ఉంటారు. దీన్నిబట్టి ఎలా చూసినా గత ప్రభుత్వ హయాంతో పోలిస్తే చంద్రబాబు సర్కారు వచ్చాక దాదాపు ఐదు లక్షల పింఛన్లు తగ్గినట్లు తెలిసిపోతోంది. మరి ఇది సుపరిపాలనా? ప్రజలకు మంచి చేసినట్లా? సూపర్ సిక్స్‌లు అమలు చేసినట్లా? కొత్త పెన్షన్లు ఇచ్చినట్లా? టీడీపీ కూటమి ప్రభుత్వం అవ్వాతాతలతోపాటు దివ్యాంగులనూ కనికరించడం లేదు. రీ వెరిఫికేషన్ పేరుతో నోటీసులిచ్చి దాదాపు లక్ష మంది దివ్యాంగులపై కత్తి వేలాడదీసింది! ఇలా ఒకవైపు పెన్షన్లు ఎగరగొడుతూ.. మరోవైపు ఈ నెలలో 8,190 మందికి కొత్త పింఛన్లు ఇచ్చినట్లు మంత్రి కొండపల్లి శ్రీనివాస్ రెండు రోజుల క్రితం మీడియాకు ఓ ప్రకటన విడుదల చేయడం గమనార్హం. ఇక పింఛన్ల పంపిణీని చంద్రబాబు ప్రభుత్వం స్వీయ ప్రచార వేదికగా, పార్టీ కార్యక్రమంలా మార్చేసింది. గత ప్రభుత్వంలో వలంటీర్ల ద్వారా ప్రతి నెలా ఒకటో తేదీ తెల్లవారుజామున ఇంటివద్దే గుడ్‌మార్నింగ్ చెప్పి మరీ వారి ఆత్మగౌరవాన్ని కాపాడుతూ ఠంచన్‌గా పెన్షన్లు పంపిణీ సాగగా... ఇప్పుడు చంద్రబాబు సర్కారు అవ్వాతాతలను, దివ్యాంగులను, వితంతువులను రోడ్డుకీడ్చి పడిగాపులు కాసేలా చేసింది. ఉదయం పూట ఇవ్వాల్సిన పింఛన్లు కాస్తా సోమవారం తిరుపతిలోని జీవకోనలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ సమక్షంలో మధ్యాహ్నం 12:30 గంటలకు వానలో గుంపులుగా నిల్చోబెట్టి అరకొరగా అందజేశారు.

దరఖాస్తులకే దిక్కులేదు.. పంపిణీ పేరుతో పబ్లిసిటీ!

రాష్ట్రంలో చంద్రబాబు ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచే కొత్త పింఛన్ల మంజూరుకు దరఖాస్తు ప్రక్రియ కూడా నిలిచిపోయింది. కొత్తగా 60 ఏళ్లు నిండినవారు, వితంతువులకు అర్హత ఉన్నా గత 18 నెలలుగా పింఛనుకు దరఖాస్తు కూడా చేసుకునే అవకాశం లేకుండా చేసింది. కనీసం ఆన్‌లైన్ పోర్టల్‌ను కూడా అందుబాటులోకి తేలేదు. ఒకవైపు దరఖాస్తులను తొక్కిపెడుతూ మరోవైపు పంపిణీ పేరుతో పార్టీ ప్రచార కార్యక్రమాలను రక్తి కట్టిస్తోంది. గ్రామాల్లో టీడీపీ నేతలంతా సచివాలయాల ఉద్యోగులతో కలిసి పింఛన్ల పంపిణీలో పాల్గొని ఫోటోలు దిగి ప్రచారం చేయాలని తెలుగుదేశం ప్రధాన కార్యాలయం నుంచి ఆదేశాలు జారీ కావడం గమనార్హం. దీనికి అనుగుణంగా టీడీపీ ప్రజా ప్రతినిధులు హడావుడి చేస్తున్నారు. పాత పింఛనుదారులకే ఇప్పుడే కొత్తగా ఇచ్చినట్లు ప్రచారం చేశారు.

ఐదేళ్లలో 29.51 లక్షల కొత్త పెన్షన్లు

2024 జనవరిలోనే చివరిగా..!

వైఎస్సార్ సీపీ హయాంలో వృద్ధాప్య పింఛను అర్హత వయసును 60 ఏళ్లకు తగ్గించడంతో మరింత మందికి ప్రయోజనం చేకూరింది. అర్హులు ఏడాదిలో ఏ రోజైనా సరే గ్రామ, వార్డు సచివాలయాల్లో దరఖాస్తు చేసుకునేందుకు గత ప్రభుత్వం అవకాశం కల్పించింది. చివరిగా 2024లో జనవరి ఆరంభంలో వైఎస్ జగన్ ప్రభుత్వం అర్హులైన అవ్వాతాతలకు కొత్త పింఛన్లు మంజూరు చేసింది. ఐదేళ్ల కాలంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏకంగా 29.51 లక్షల మందికి కొత్త పింఛన్లు మంజూరు చేసినట్లు పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పర్యవేక్షించే గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ (సెర్ప్) స్వయంగా ప్రకటించడం గమనార్హం.

ఇంటి పన్ను చెల్లిస్తేనే పింఛన్

కాకినాడ జిల్లాలో వింత నిబంధన

ప్రత్తిపాడు రూరల్: ఇంటి పన్నుకు, పింఛన్లకు చంద్రబాబు సర్కారు ముడి పెడుతోంది. ఇంటి పన్ను కడితేనే పింఛన్లు ఇస్తామని సచివాలయ సిబ్బంది హుకుం జారీ చేశారు. కాకినాడ జిల్లా ప్రత్తిపాడు మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో సోమవారం 11,463 మందికి పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉండగా 10,500 మందికే పంపిణీ చేశారు. మండలంలోని పోతులూరులో పింఛన్ల పంపిణీలో ఇంటి పన్నులు వసూలు చేసినట్లు పలువురు లబ్ధిదారులు చెప్పారు. ఈ విషయాన్ని వారు స్థానిక వైఎస్సార్‌సీపీ నేత శెట్టి సత్తిబాబు దృష్టికి తీసుకువెళ్లారు. దీనిపై స్పందించిన సత్తిబాబు స్థానిక గ్రామ కార్యదర్శిని నిలదీశారు. అప్పటికే పింఛన్ల పంపిణీ ముగిసింది. సత్తిబాబు మాట్లాడుతూ..గ్రామంలో ఇంటి పన్ను కడితేనే పింఛన్లు ఇచ్చారని చెప్పారు. ఇలా బలవంతంగా ఇంటి పన్నులు వసూలు చేయడం గతంలో ఎన్నడూ జరగలేదని సత్తిబాబు అన్నారు. దీనిపై ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబును వివరణ కోరగా, స్వచ్ఛందంగా ముందుకు వచ్చినవారి వద్ద మాత్రమే పన్ను వసూలు చేసి, రశీదులు ఇచ్చామని చెప్పారు.

పెండింగ్‌లో 2.5 లక్షల దరఖాస్తులు..

దాదాపు రెండున్నర లక్షల మంది కొత్త పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోగా చంద్రబాబు ప్రభుత్వం వాటిని ఏడాదిన్నరకుపైగా పెండింగ్‌లో పెట్టింది. మరోవైపు అర్హత ఉన్నప్పటికీ కొత్తగా దరఖాస్తు చేసుకునే అవకాశం లేక పింఛన్ కోసం ఎదురు చూస్తున్న వారు సుమారు మరో 3 లక్షలమందికిపైగా ఉంటారని అంచనా.

బాబు మద్యం దోపిడీ కేసు క్లోజ్!

ఆధారాల్లేవన్న బాబు గూటిచిలుక సీఐడీ

- ప్రభుత్వ వేధింపులకు తలొగ్గిన ఫిర్యాదుదారు వాసుదేవరెడ్డి
- ఇదీ చంద్రబాబు మార్కు కుట్ర

సాక్షి, అమరావతి: చంద్రబాబు బరి తెగించి సాగించిన మద్యం దోపిడీ దందాకు టీడీపీ గూటి చిలుక సీఐడీ 'పచ్చతర్పణం' వదిలేసింది! ఆ కేసులో ఆధారాలు లేవని న్యాయస్థానానికి నివేదించింది. తద్వారా ఆ కేసు మూసివేతకు మార్గం సుగమం చేసింది. 2014–19లో టీడీపీ హయాంలో చంద్రబాబు సాగించిన అవినీతి దందాపై నమోదైన కేసుల మూసివేత కుట్రలో మరో అంకాన్ని ముగించింది. మద్యం దోపిడీ కేసులో నిందితుడైన చంద్రబాబు 2024లో ముఖ్యమంత్రి అయ్యారు. దాంతో సీఐడీ ఆయన గూటి చిలుకగా మారిపోయింది. అదే అదనుగా తన మద్యం దోపిడీ కేసు అర్థాంతరంగా మూసివేతకు చంద్రబాబు చకచకా పావులు కదిపారు. నిందితుడైన ఆయనే స్వయంగా ముఖ్యమంత్రి హోదాలో పోలీసు, సీఐడీ అధికారులతో ఆ కేసులపై సమీక్ష నిర్వహించి కుట్రకు తెరతీశారు. ఆ కేసును ఎలా క్లోజ్ చేయాలో ఆయనే దిశానిర్దేశం చేసినట్టు అప్పుడే స్పష్టమైంది. ఆ బాధ్యతను చంద్రబాబు తన ఆస్థాన న్యాయవాది సిద్ధార్థ లూథ్రాకు అప్పగించడంతోపాటు మాజీ డీజీపీ ద్వారకా తిరుమలరావు, ప్రస్తుత డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తా, సీఐడీ చీఫ్ రవిశంకర్ అయ్యన్నార్‌లకు ప్రత్యేక బాధ్యతలు కేటాయించారు. మొత్తం రాజ్యాంగ వ్యవస్థలను బరితెగించి దుర్వినియోగం చేస్తూ మద్యం దోపిడీ కేసు మూసివేత ద్వారా కుట్రలో ఓ అంకాన్ని పూర్తి చేశారు.

చీకటి జీవోలతో మద్యం దోపిడీ...

రాష్ట్రంలో 2014లో టీడీపీ అధికారంలోకి రాగానే చంద్రబాబు మద్యం దోపిడీకి తెగబడ్డారు. 2012 నుంచి అమలులో ఉన్న ప్రివిలేజ్ ఫీజును నిబంధనలకు విరుద్ధంగా రద్దు చేశారు. ఆర్థిక శాఖ అనుమతి గానీ కేబినెట్ ఆమోదం గానీ లేకుండానే 2015లో చంద్రబాబు ప్రభుత్వం కొత్త మద్యం విధానాన్ని తెచ్చింది. మద్యం దుకాణాలు, బార్లపై ప్రివిలేజ్ ఫీజును రద్దు చేస్తూ చీకటి జీవోలు 216, 217 జారీ చేసింది. తద్వారా 2015 నుంచి 2019 వరకు నాలుగేళ్లలో ఏడాదికి రూ.1,300 కోట్ల చొప్పున నాలుగేళ్లలో రూ.5,200 కోట్ల మేర ప్రభుత్వ ఖజానాకు గండికొట్టింది. ఇక 4,840 ప్రైవేటు మద్యం దుకాణాలతోపాటు మరో 4,840 పర్మిట్ రూమ్‌లు ఏర్పాటు చేసింది. మద్యం దుకాణాలు, బార్లు అన్నీ టీడీపీ సిండికేట్‌కే కట్టబెట్టింది. 43 వేల బెల్ట్ దుకాణాలను ఏర్పాటు చేసింది. రాష్ట్రంలోని 20 డిస్టిలరీలలో 14 డిస్టిలరీలకు టీడీపీ ప్రభుత్వమే అనుమతినిచ్చింది. మిగిలిన డిస్టిలరీలకు కూడా అంతకుముందు ప్రభుత్వాలే అనుమతులు ఇచ్చాయి. అంతేకాదు.. బెవరేజస్ కార్పొరేషన్ ద్వారా మద్యం కొనుగోళ్లకు మొత్తం 20 డిస్టిలరీలను ఎంప్యానల్ చేసింది కూడా బాబు సర్కారే! ఎంఆర్‌పీ కంటే 20 శాతం అధిక ధరలకు మద్యం విక్రయాలు సాగించి మరో రూ.20 వేల కోట్లు కొల్లగొట్టింది. మొత్తం మీద 2014–19లో రూ.25 వేల కోట్ల దోపిడీకి పాల్పడింది. ఈ కుంభకోణాన్ని సీఐడీ ఆధారాలతో సహా నిగ్గు తేల్చింది. ప్రధాన నిందితులుగా అప్పటి సీఎం చంద్రబాబు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రలతోపాటు పలువురిపై ఐపీసీ, సెక్షన్లు: 166, 167, 409, 120(బి) రెడ్ విత్ 34, అవినీతి నిరోధక చట్టంలోని సెక్షన్లు: 13(1),(డి), రెడ్ విత్ 13(2) కింద సీఐడీ ఎఫ్ఐఆర్ నమోదు చేసింది. ఆ కేసులో చంద్రబాబు ఇప్పటికీ బెయిల్‌పై ఉన్నారు.

అబ్బే..! ఆధారాల్లేవ్

2024లో అధికారంలోకి వచ్చిన టీడీపీ కూటమి ప్రభుత్వం కుట్రపూరితంగా ఈ కేసును అటకెక్కించింది. కేసు దర్యాప్తును నిలిపివేసింది. చంద్రబాబు అవినీతిపై ఫిర్యాదు చేసిన అప్పటి బెవరేజస్ కార్పొరేషన్ ఎండీ వాసుదేవరెడ్డిని వేధించి బెంబేలెత్తించింది. ఆయనపై కేసులు నమోదు చేసి లొంగదీసుకుంది. చంద్రబాబుపై గతంలో ఇచ్చిన కేసును వాపసు తీసుకోవాలని బెదిరించింది. అనంతరం పక్కాగా కుట్ర కథ నడిపింది. టీడీపీ హయాంలో మద్యం కుంభకోణంపై ఆధారాలు లేవని న్యాయస్థానానికి నివేదించింది. తద్వారా కేసు క్లోజ్ కావటానికి మార్గం సుగమం చేసింది. దీనిపై స్పందించి సమగ్ర దర్యాప్తు కోరాల్సిన వాసుదేవరెడ్డి.. కూటమి ప్రభుత్వం ఒత్తిడికి తలొగ్గారు. ఆ మద్యం కేసు మూసివేతకు తనకు అభ్యంతరం లేదని తెలిపినట్లు సమాచారం. అంటే గతంలో తాను ఇచ్చిన ఫిర్యాదు, వాంగ్మూలాలకు వ్యతిరేకంగా ఆయన ప్రస్తుతం వ్యవహరించారు. తద్వారా ఆ కేసు మూసివేతకు ఆయన సహకరించారని తెలుస్తోంది. దాంతో చంద్రబాబు మద్యం దోపిడీ కేసు మూసివేతకు లైన్ క్లియర్ అయింది!

కేసులను ఎదుర్కొనే దమ్ములేక మూసేయించుకుంటున్నారా?

- సీఎం చంద్రబాబుపై బొత్స ఆగ్రహం
- ఇది అధికార దుర్వినియోగానికి పరాకాష్ట
- సాక్షులను, ఫిర్యాదుదారులను బెదిరిస్తున్నారు
- తద్వారా కేసులను మూసివేయించుకుంటున్నారు
- ఈ ధోరణికి అడ్డుకట్ట వేయాలని గవర్నర్‌కు విజ్ఞప్తి
- న్యాయపోరాటానికి సిద్ధమని ప్రకటన

సాక్షి, అమరావతి: అవినీతి కేసులను ఎదుర్కొనే ధైర్యం లేక వాటి నుంచి తప్పించుకోవడానికి అడ్డదారులు తొక్కుతున్నారంటూ సీఎం చంద్రబాబుపై శాసనమండలిలో ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇటీవల అసైన్డ్ భూముల కుంభకోణం కేసు, తాజాగా మద్యం కుంభకోణం కేసును మూసేయించుకోవడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. ఈ కేసుల్లో ఫిర్యాదుదారులైన అధికారులు కొందరిని లేని స్కాంలలో ఇరికించి.. భయపెట్టి.. ఫిర్యాదును వెనక్కి తీసుకునేలా చేస్తే, మరికొందరితో కూడా అడ్డదారుల్లో ఫిర్యాదులను ఉపసంహరించుకునేలా చేస్తున్నారని మండిపడ్డారు. దర్యాప్తు సంస్థలు సైతం కేసుల మూసివేతకు సహకరిస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. బెయిల్‌పై ఉన్న చంద్రబాబు ఇలాంటి చర్యలకు పాల్పడ్డం అత్యంత దుర్మార్గమన్నారు. దేశంలో ఎక్కడా ఇంతటి అధికార దుర్వినియోగాన్ని చూడలేదన్నారు. తక్షణమే చంద్రబాబు అధికార దుర్వినియోగాన్ని నిలువరించాలని గవర్నర్‌కు విజ్ఞప్తి చేశారు. చంద్రబాబు చర్యలపై న్యాయపోరాటం చేస్తామని కూడా బొత్స హెచ్చరించారు. ఈ మేరకు సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో ముఖ్యాంశాలు..

కుట్రపూరితమే..

'ఒక పద్ధతి ప్రకారం కుట్రపూరితంగా వ్యవహరించి కేసులు మూసివేయిస్తున్నారు. వ్యవస్థలను కలుషితం చేసి, ప్రజాస్వామ్య వ్యవస్థలను అపహాస్యం చేస్తున్నారు. తన రాజకీయ జీవితం ప్రారంభం నుంచి కూడా చట్టం నుంచి ఈ రకంగా తప్పించుకోవడం చంద్రబాబునాయుడికి అలవాటే. అదే ఒరవడి ఈసారి కూడా కొనసాగుతోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో 2014–19 మధ్య చంద్రబాబు చేసిన అవినీతికి సంబంధించి పక్కా ఆధారాలు, సాక్ష్యాలతో పలు కేసులు నమోదయ్యాయి. స్కిల్ స్కాం కేసులో ప్రాథమిక ఆధారాలు ఉండడంతో చంద్రబాబును కోర్టు జ్యుడిషియల్ రిమాండ్‌కు కూడా పంపింది. ఆ కేసులో చంద్రబాబు బెయిల్‌పై ఉన్నారు. ఇవికాక అసైన్డ్ ల్యాండ్ కేసు, అమరావతి రింగ్‌రోడ్డు అలైన్‌మెంట్ కేసు, ఉచిత ఇసుక పేరుతో దోపిడీచేసిన వ్యవహారంలో కేసు, ఫైబర్ నెట్‌లో వందలకోట్ల అవినీతికేసు సహా లిక్కర్ కేసులు కూడా నమోదయ్యాయి. చంద్రబాబు అధికారంలోకి వచ్చిన నాటి నుంచి ఈ కేసుల దర్యాప్తులో పురోగతి లేదు. దర్యాప్తు సంస్థలను తన గుప్పిట్లో పెట్టుకుని, ప్రతి క్షణం కేసులను నిర్వీర్యం చేయడానికి బాబు సర్కార్ ప్రయత్నిస్తోంది. ఈ ధోరణిని సహించబోము' అని బొత్స స్పష్టం చేశారు.

సాక్షి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్నా..
మా టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ.7.00 గం.ల నుండి రా.8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగిన చర్యలు తీసుకుంటాం.
టోల్ ఫ్రీ నెం 1800 425 9899

లూథ్రాకు మరో రూ.33 లక్షలు

దీంతో ఇప్పటి వరకు చెల్లించింది రూ.8.62 కోట్లు

సాక్షి, అమరావతి: తన ఆస్థాన న్యాయవాది సిద్ధార్థ లూథ్రాకు సీఎం చంద్రబాబు ప్రజా ధనాన్ని దోచిపెడుతూనే ఉన్నారు. ఇప్పటికే లూథ్రాకు రూ.8.29 కోట్లు చెల్లించిన చంద్రబాబు సర్కార్ తాజాగా ఆయనకు మరో రూ.33 లక్షలు చెల్లించింది. మద్యం అక్రమ కేసులో సీఐడీ సిట్ తరఫున ఈ ఏడాది అక్టోబర్‌లో మూడు వేర్వేరు రోజుల్లో వాదనలు వినిపించినందుకు ఆయనకు రోజుకు రూ.10 లక్షల చొప్పున రూ.30 లక్షలు, దీనికి 10 శాతం క్లర్కేజీ కలిపి మొత్తం రూ.33 లక్షలు చెల్లించింది. ఈ రూ.33 లక్షలను కలుపుకుంటే లూథ్రాకు చంద్రబాబు ప్రభుత్వం ఇప్పటి వరకు రూ.8.62 కోట్లు చెల్లించినట్లయింది.

బాబు పాలనలో విద్యార్థులకు దగా

వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం అధ్యక్షుడు చైతన్య, వర్కింగ్ ప్రెసిడెంట్ రవిచంద్ర

సాక్షి,అమరావతి: సీఎం చంద్రబాబు, ఆయన తనయుడు లోకేశ్ విద్యార్థులను దారుణంగా దగా చేశారని, అధికారం చేపట్టి 18 నెలలు గడుస్తున్నా.. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు, స్కాలర్‌షిప్స్ చెల్లించలేదని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం ఆగ్రహం వ్యక్తం చేసింది. తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం విద్యార్థి విభాగం ప్రెసిడెంట్ పానుగంటి చైతన్య, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎ.రవిచంద్ర మీడియాతో మాట్లాడుతూ.. తక్షణమే ప్రభుత్వం పెండింగ్‌లో పెట్టిన రూ.5,600 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. లేకుంటే విద్యార్థులతో కలిసి దశలవారీ ఆందోళన చేపడతామని, రాష్ట్రవ్యాప్తంగా ఎమ్మెల్యేల నుంచి, సీఎం సహా మంత్రుల నివాసాలను ముట్టడిస్తామని హెచ్చరించారు. గత ప్రభుత్వ హయాంలో విద్యాదీవెన, వసతిదీవెన కింద రూ.18,663 కోట్లు ఖర్చుచేసి, 55 లక్షల మంది విద్యార్థులకు లబ్ధి చేకూరిస్తే.. 2014–19 మధ్య చంద్రబాబు కేవలం 16 లక్షల మందికి మాత్రమే ఫీజు రీయింబర్స్ చేశారన్నారు. కూటమి ప్రభుత్వంలో 18 నెలలుగా ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు మంగళం పాడటంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, 8 త్రైమాసికాలకు రూ.5,600 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, హాస్టల్ ఖర్చుల కింద ఏటా రూ.1,100 కోట్ల చొప్పున మరో రూ.2,200 కోట్లు.. వెరసి మొత్తం రూ.7,800 కోట్లు ప్రభుత్వం విద్యార్థులకు బకాయి పడిందని విమర్శించారు.

ఫీజు చెల్లిస్తేనే తరగతికి అనుమతి

మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి శ్రీకృష్ణదేవరాయ హార్టీకల్చర్ కళాశాలలో సిబ్బంది దౌర్జన్యం

- ఫీజు చెల్లించలేదని విద్యార్థులను బయటే నిలబెట్టిన వైనం
- రీయింబర్స్‌మెంట్‌తో సంబంధం లేదంటూ తేల్చి చెప్పిన యాజమాన్యం
- టీడీపీ నాయకుడి కళాశాలలోనే విద్యార్థులకు ఇబ్బందులు
- అప్పులు చేసి ఫీజులు కడుతున్న తల్లిదండ్రులు

అనంతపురం: టీడీపీ నేత, మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డికి చెందిన శ్రీకృష్ణదేవరాయ హార్టీకల్చర్ కళాశాల యాజమాన్యం విద్యార్థుల పట్ల దారుణంగా ప్రవర్తించింది. ఫీజులు చెల్లించేంత వరకూ తరగతులకు అనుమతించేది లేదని విద్యార్థులకు తేల్చిచెప్పింది. సోమవారం కళాశాల నిర్వాహకులు 50 మంది విద్యార్థులను నిర్ధాక్షిణ్యంగా గేటు బయటే నిలబెట్టారు. మొత్తం కోర్సు ఫీజు చెల్లిస్తేనే కళాశాలలోకి అనుమతిస్తామని, పరీక్ష ఫీజు చెల్లింపునకు అనుమతిస్తామని యాజమాన్యం స్పష్టం చేసింది. దీంతో విద్యార్థులు ఆందోళన చెందారు. చాలాసేపు కార్యాలయం బయటే వేచి ఉండి.. ఇక చేసేదేమి లేక ఇంటికి వెళ్లిపోయారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ మంజూరుకాకే తమకీ దుస్థితి వచ్చిందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేశారు.

లోకేశ్ అనాలోచిత నిర్ణయాలతోనే ఈ దుస్థితి

సీఎం చంద్రబాబు తనయుడు, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అనాలోచిత నిర్ణయాలతో రాష్ట్రంలో విద్యావ్యవస్థ కుదేలైంది. పాఠశాల విద్య నుంచి ఉన్నత విద్య వరకు అస్తవ్యస్తంగా మారింది. ప్రపంచస్థాయి విద్య, క్వాంటం సెంటర్లు అంటూ ప్రచారం మినహా కళాశాలలకు సకాలంలో ఫీజు మాత్రం రీయింబర్స్‌మెంట్ చేయడం లేదు. ఉన్నత విద్యపై సమీక్ష చేసినప్పుడల్లా అదిగో ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లిస్తున్నాం.. ఇదిగో ఇచ్చేస్తున్నాం. అంటూ ' ఎక్స్' ఖాతాలో ట్వీట్లు చేసుకోవడంతోనే లోకేశ్ కాలం గడిపేస్తున్నారు. ఈ తంతు గతేడాది జూన్ నుంచి జరుగుతోంది. ఈ ఏడాది నవంబర్ వచ్చినా బకాయిలు చెల్లించలేదు. ఫలితంగా అవి బకాయిలు కొండలా పేరుకుపోయాయి. ఈ ఏడాది జూలైలో కచ్చితంగా ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు విడుదల చేస్తామని యాజమాన్యాలకు హామీ ఇచ్చిన లోకేశ్.. అక్టోబర్ చివరిలో కంటితుడుపుగా విదిల్చారు. ఆ తర్వాత 'ఫీజు రీయింబర్స్‌మెంట్ పూర్తిగా చెల్లించేవరకు విద్యార్థులను తరగతులకు అనుమతించాలి. విద్యార్థులు ఫీజు చెల్లించాలని ఒత్తిడి చేయకూడదు' అని కలెక్టర్ల ద్వారా ఉత్తర్వులు జారీ చేయించారు. అయినప్పటికీ ఆ ఆదేశాలను టీడీపీకి చెందిన మాజీ మంత్రి పల్లె రఘునాథరెడ్డి పాటించడం లేదు. విద్యార్థుల నుంచి నిర్బంధంగా ఫీజులు వసూలు చేయడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. పల్లె రఘునాథరెడ్డి కళాశాల తీరుపై తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు. అవమాన భారంతో అప్పులు తెచ్చిమరీ ఫీజులు చెల్లిస్తున్నారు. పాత విద్యా సంవత్సరంలో రెండు త్రైమాసికాలు, ఈ విద్యా సంవత్సరంలో పూర్తయిన మూడు త్రైమాసికాలకు కలిపి అనంతపురం జిల్లాలో రూ.90 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు ఉన్నట్టు విద్యార్థులు చెబుతున్నారు.

మరింత బలహీన పడిన వాయుగుండం

నేడు ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు

నెల్లూరులో నీట మునిగిన పంటలు

పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు

ఉత్తర చెన్నైలోని ఓ రోడ్డుపై పోటెత్తిన వర్షపు నీరు

నెల్లూరు నగరంలో మోకాలి లోతు నీళ్లు

సాక్షి, అమరావతి/నెల్లూరు (అర్బన్)/తిరుమల/సాక్షి, చెన్నై: తీవ్ర వాయుగుండం తమిళనాడు–పుదుచ్చేరి మీదుగా గంటకు 5 కిలోమీటర్ల వేగంతో కదులుతోంది. సోమవారం సాయంత్రానికి ఇది చెన్నైకి 50 కిలోమీటర్లు, పుదుచ్చేరికి 130, కడలూరుకు 150, నెల్లూరుకు 200 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఇది క్రమేపీ బలహీనపడుతోంది. దీని ప్రభావంతో మంగళవారం ప్రకాశం, నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. కాకినాడ, అంబేద్కర్ కోనసీమ, తూర్పుగోదావరి పశ్చిమగోదావరి, ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు, రాయలసీమ జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

స్తంభించిన 'నెల్లూరు'

నెల్లూరు జిల్లాను దిత్వా తుపాను వణికిస్తోంది. వాయుగుండం బలహీన పడి నెల్లూరుకు దగ్గరగా వస్తున్న నేపథ్యంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ జిల్లాకు రెడ్ అలెర్ట్ ప్రకటించింది. మూడు రోజులుగా మోస్తరు వర్షాలు కురుస్తుండగా, ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షంతో జనజీవనం స్తంభించింది. సముద్రంలో అలలు ఎగిసి పడుతున్నాయి. పలు ప్రాంతాల్లో సముద్రం నాలుగైదు మీటర్ల వరకు ముందుకు చొచ్చుకువచ్చింది. తీరం వెంబడి ఈదురుగాలులు వీస్తున్నాయి. దీనికి తోడు చలి కూడా ఎక్కువగా ఉంది. తుపాను ప్రభావంతో జిల్లాలో పలు చోట్ల వాగులు, వంకలు పొంగిపొర్లాయి. చేజర్ల మండలంలోని నల్లవాగుకు ప్రవాహం పెరగడంతో యనమదల, తూర్పుకంభంపాడు, తూర్పుపల్లి తదితర ఐదు గ్రామాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. పొదలకూరు మండలంలోని నావూరు వద్ద పెద్దవాగుకు నీటి ప్రవాహం పెరిగింది. బొగ్గేరు, బీరాపేరుకు ఓ మోస్తరు వరద పెరిగింది. విడవలూరు మండలంలోని మలిదేవి డ్రైన్, పైడేరులకు నీటి ప్రవాహం పెరిగింది. ఇప్పటికే పలుచోట్ల చెరువులు నిండిపోయాయి. అవి ఎక్కడ తెగిపోతాయోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. సోమశిల నుంచి పెన్నానదిలోకి 35 వేల క్యూసెక్కుల నీటిని వదిలారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు పొలాల నిండా నీరు చేరడంతో నాట్లు, నారుమళ్లు కుళ్లిపోతాయేమోనని రైతులు భయపడుతున్నారు. నెల్లూరు శివారు ప్రాంతాలైన ఆర్టీసీ కాలనీ, చంద్రబాబునగర్, వైఎస్సార్ నగర్, పడారుపల్లి, కల్లూరుపల్లి, రాజీవ్ గృహకల్ప, సాయినగర్, జనార్ధన్‌రెడ్డినగర్ ప్రాంతాల్లో వర్షం నీరు నిలబడిపోయింది.

తిరుమలలో వర్షం

తుపాను కారణంగా తిరుమలలో సోమవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు చిరు జల్లులు కురుస్తూనే ఉన్నాయి. దీంతో భక్తులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. శ్రీవారి ఆలయ ప్రాంగణం నిర్మానుష్యంగా మారింది. దట్టమైన పొగమంచు తిరుమల కొండలను కమ్మేసింది.

చెన్నైలో కుండపోత

బలహీన పడ్డ దిత్వా తుపాన్ తీవ్ర వాయుగుండంగా మారడంతో చెన్నైలో సోమవారం అనేక చోట్ల భారీ వర్షం పడింది. మంగళవారం మరింతగా భారీ వర్షాలు పడుతాయనే హెచ్చరికలతో చెన్నై, శివారు జిల్లాలలోని విద్యా సంస్థలకు సెలవు ప్రకటించారు. సోమవారం ఉదయం ఆరు గంటల సమయంలో చెన్నై తీరానికి సమీపంలో తీవ్ర వాయుగుండంగా మారిన దిత్వా రూపంలో చిరు జల్లుల వాన మొదలైంది. ఇది చెన్నైకు 50 కి.మీ దూరంలో ఏడు గంటలకు పైగా కేంద్రీకృతం కావడంతో క్రమంగా వర్షం ప్రభావం పెరిగింది. చెన్నై, శివారులలోని తిరువళ్లూరు, కాంచీపురం, చెంగల్పట్టు, రాణిపేట జిల్లాలో వర్షాలు పడుతున్నాయి. అర్ధరాత్రి సమయంలో లేదా మంగళవారం ఉదయం చెన్నై తీరానికి 30 కి.మీ దూరంలోకి తీవ్ర వాయుగుండంగా మారిన దిత్వా సమీపిస్తుందని, ఈసమయంలో భారీ వర్షాలు పడవచ్చని వాతావరణ కేంద్రం ప్రకటించింది. చెన్నై, తిరువళ్లూరు జిల్లాలకు మంగళవారం రెడ్ అలర్ట్ ప్రకటించారు.

'సాక్షి' మీడియాకు నోటీసులు

మంత్రి సంధ్యారాణి అనధికార పీఏ సతీష్ అనైతిక వ్యవహారాలపై ఒంటరి మహిళ ఆవేదనను వెలుగులోకి తేవడమే నేరం

కొందరు టీడీపీ నాయకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు

విజయనగరం 'సాక్షి' కార్యాలయంలో అందజేసిన పోలీసులు

సాక్షి ప్రతినిధి, విజయనగరం: సాక్షి మీడియాపై టీడీపీ నాయకులు కక్షగట్టారు. రాష్ట్ర గిరిజన సంక్షేమ, స్త్రీ–శిశు సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి అనధికార పీఏ సతీష్ అనైతిక వ్యవహారాలపై ఓ ఒంటరి మహిళ (దివంగత ఉపాధ్యాయుడి భార్య) ఆవేదనను, ఫిర్యాదులను ప్రజల ముందు ఉంచినందుకు కొందరు టీడీపీ నేతలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఓ వితంతు మహిళకు ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మించి ఆర్థికంగా దోచుకోవడమే కాకుండా లైంగికంగా వేధించిన సతీష్ వ్యవహారాన్ని 'సాక్షి'తో పాటు పలు మీడియా చానళ్లు ప్రజల ముందుకు తెచ్చాయి. ఈ తరుణంలో బాధితురాలికి అండగా నిలుస్తూ తన పీఏపై చర్యలు తీసుకోవాల్సిన మంత్రి సంధ్యారాణి కేవలం 'సాక్షి' మీడియాను టార్గెట్ చేశారు. తమపై వార్తలు ప్రచురించి, చానల్‌లో ప్రసారం చేయడాన్ని భరించలేక ఏకంగా 'సాక్షి' మీడియాపైకి పోలీసులను ఉసిగొల్పారు. సాలూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కార్యాలయం నుంచి విజయనగరం 'సాక్షి' కార్యాలయానికి సోమవారం వచ్చిన పోలీసులు నోటీసులు అందజేశారు. పీఏ సతీష్‌కు వ్యతిరేకంగా కథనాలు ఇచ్చినందుకు పోలీస్ స్టేషన్‌కు వచ్చి వివరణ ఇవ్వాలని నోటీసుల్లో పేర్కొన్నారు. మక్కువ మండల టీడీపీ అధ్యక్షుడు గుల్ల వేణుగోపాల్‌నాయుడు లెటర్ హెడ్‌పై టీడీపీ సాలూరు పట్టణ అధ్యక్షుడు నిమ్మాది తిరుపతిరావు, సాలూరు మార్కెట్ కమిటీ చైర్మన్ ముఖి సూర్యనారాయణ తదితరుల ఫిర్యాదు మేరకు 353(1)(బి), 353(1)(సి), 356(1), 356(2) బీఎన్ఎస్ 67 ఐటీఏ–2000–2008 సెక్షన్ల కింద కేసు నమోదు చేసినట్టు ఆ నోటీసుల్లో పేర్కొన్నారు.

ఐక్యతారాగంలో మరో విందు

- నేడు డీకే ఇంట్లో సీఎం సిద్ధరామయ్యకు బ్రేక్‌ఫాస్ట్
- మరోవైపు సీఎం మార్పుపై కొలిక్కిరాని హైకమాండ్ చర్చలు

బెంగళూరు విధానసౌధలో జరిగిన ఓ కార్యక్రమంలో సీఎం, డిప్యూటీ సీఎం

సాక్షి, బెంగళూరు: అధికార మార్పిడి వివాదానికి అల్పాహార భేటీ ద్వారా విరామం ప్రకటించి ఐక్యతారాగం పాడిన సీఎం సిద్ధరామయ్య, ఉపముఖ్యమంత్రి డీకే శివకుమార్ మరోసారి తమ ఐక్యతను చాటిచెప్పేందుకు సిద్ధమయ్యారు. మూడు రోజుల క్రితం ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్‌కు సీఎం సిద్ధరామయ్య తన నివాసంలో అల్పాహార విందు ఇచ్చారు. ఇప్పుడు డీకే వంతు వచ్చింది. సోమవారం విధానసౌధలో జరిగిన ఒక ప్రభుత్వ కార్యక్రమంలో 'తన నివాసంలో భోజన విందుకు' రావాల్సిందిగా సీఎంను డీకే ఆహ్వానించారు. అయితే బ్రేక్‌ఫాస్ట్‌కు వస్తానని సీఎం తెలిపారు. దీంతో సీఎం సిద్ధరామయ్యకు ఇష్టమైన నాటుకోడి పులుసుతో పాటు ఇతరత్రా వంటకాలను ప్రత్యేకంగా డీకే సిద్ధం చేయిస్తున్నారు. కలిసి కూర్చుని మాట్లాడుకోవాలంటూ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సూచనల మేరకు ఈ నెల 29న ముఖ్యమంత్రి నివాసంలో బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్ జరిగింది. ఈ సందర్భంగా ఇరువురు నాయకులు తామిద్దరం కలసికట్టుగా సాగుతున్నట్లు మీడియాకు వివరించారు. తద్వారా సీఎం మార్పిడి వివాదానికి తాత్కాలికంగా విరామం ప్రకటించారు.

జనవరి మొదటి వారానికి వాయిదా!

కాగా, సీఎం మార్పుపై కాంగ్రెస్ పార్టీ ఇంకా ఎటూ తేల్చకుండా నాన్చుతోంది. పార్లమెంట్ సమావేశాల నేపథ్యంలో పార్టీ నాయకులు బిజీగా ఉండడంతో కర్ణాటక అధికార మార్పిడిపై చర్చించేందుకు అధిష్టానం నాయకులు అందుబాటులో లేరని తెలుస్తోంది. ఢిల్లీలో ఆదివారం సోనియాగాంధీ నేతృత్వంలో జరిగిన కాంగ్రెస్ పార్లమెంటరీ కమిటీ సమావేశంలో కర్ణాటక రాజకీయ పరిస్థితి చర్చకువచ్చింది. సిద్ధరామయ్య, డీకేల కార్యాచరణపై వివరాలను అడిగి తెలుసుకున్న సోనియా జనవరి మొదటి వారంలో పరిశీలిస్తామని ఖర్గేకు తెలిపినట్లు సమాచారం.

మేం సోదర సమానులం: డీకే

ముఖ్యమంత్రి, తాను సోదర సమానులమని, కలసికట్టుగా పనిచేసుకుంటూ ముందుకు సాగుతామని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. మాజీ సీఎం దివంగత కెంగల్ హనుమంతయ్య వర్ధంతి సందర్భంగా విధానసౌధలోని ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించిన శివకుమార్ అనంతరం మీడియాతో మాట్లాడారు. తమలో గ్రూపులు మీడియా సృష్టి అన్నారు. రాజకీయ ద్వేషంతోనే కేంద్ర ప్రభుత్వం దర్యాప్తు సంస్థలను దుర్వినియోగం చేస్తోందని నేషనల్ హెరాల్డ్ కేసును ఉదహరిస్తూ ఆయన పేర్కొన్నారు. డీకే ఇస్తున్న విందుకు వెళుతున్నట్లు ఇదే కార్యక్రమం సందర్భంగా సీఎం తెలిపారు. నేషనల్ హెరాల్డ్ కేసుకు ప్రస్తావిస్తూ సోనియా, రాహుల్ గాంధీలపై ఎఫ్ఐఆర్ నమోదు చేయడం సరికాదన్నారు.

వివేకా హత్యకేసులో సునీతపై అనుమానం

- ఈ హత్య కేసులో ఆమె బాధితురాలు కానేకాదు
- ఆమె, నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డిని సీబీఐ పరిగణనలోకి తీసుకోలేదు
- కిరాయి హంతకుడు షేక్ దస్తగిరి స్వేచ్ఛగా తిరుగుతున్నాడు
- సునీత పిటిషన్‌పై ప్రతివాదుల వాదనలు
- తదుపరి విచారణ నేటికి వాయిదా వేసిన సీబీఐ ప్రత్యేక న్యాయస్థానం

సాక్షి, హైదరాబాద్: మాజీమంత్రి వైఎస్ వివేకా హత్య కేసులో పరిస్థితులను పరిశీలిస్తే ఆయన కుమార్తె నర్రెడ్డి సునీతపైనే అనుమానం వస్తోందని న్యాయవాది ఉమామహేశ్వర్‌రావు చెప్పారు. ఈ కేసులో కిరాయి హంతకుడు షేక్ దస్తగిరి యథేచ్ఛగా తిరుగుతుంటే.. నిందారోపణలు భరిస్తున్నవారు మాత్రం కుటుంబాలకు దూరంగా బతకాల్సి వస్తోందని పేర్కొన్నారు. ఈ కేసుకు సంబంధించి నర్రెడ్డి సునీత బాధితురాలు కాదని.. ఆమె, నర్రెడ్డి రాజశేఖర్‌రెడ్డిపై కూడా అనేక అనుమానాలున్నాయని తెలిపారు. ఈ కేసులో మరింత లోతైన దర్యాప్తు చేపట్టేలా సీబీఐని ఆదేశించాలని కోరుతూ నర్రెడ్డి సునీత సీబీఐ ప్రత్యేక కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై న్యాయాధికారి టి.రాఘురామ్ సోమవారం మరోసారి విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా శివశంకర్‌రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి తరఫు న్యాయవాది ఉమామహేశ్వర్‌రావు వాదనలు వినిపించారు. ఆర్థిక విభేదాలు, కుటుంబ వివాదాలు, వివేకా మరో పెళ్లితో పరువు పోతోందన్న గొడవ, ఆస్తిని రెండో భార్యకు, ఆమెకు కుమారుడికి రాసిస్తారన్న కోపం , ఆయన్ని ఏకాకిని చేయడం, తిండిపెట్టే దిక్కు లేక పోవడం, తండ్రిని గొడ్డలితో నరికానని చెప్పిన కిరాయి నరహంతకుడు షేక్ దస్తగిరికి అనుకూలంగా వ్యవహరించడం, అతడి బెయిల్‌ను వ్యతిరేకించకపోవడం, అతడు స్వేచ్ఛగా తిరుగుతున్నా మిన్నకుండటం.. ఇవన్నీ గమనిస్తే కనీస పరిజ్ఞానం ఉన్న వాళ్లకు కూడా సునీతపై అనుమానం వస్తుందని చెప్పారు. కానీ సీబీఐ ఆ దిశగా విచారణ జరపలేదన్నారు. ఆమె చెప్పిన మేరకు నిరాధార నిందలు మోపి మరికొందరిని నిందితులుగా చేర్చేలా దర్యాప్తు మరింత లోతుగా చేసేలా ఆదేశించాలని పిటిషన్ వేయడం ఆశ్చర్యం కలిగిస్తోందన్నారు. అనంతరం విచారణను న్యాయస్థానం నేటికి (మంగళవారానికి) వాయిదా వేసింది.

కుటుంబాలకు దూరంగా ఎన్నాళ్లు..

'కరుడుగట్టిన కిరాయి నరహంతకుడు దస్తగిరి స్వేచ్ఛగా ఎక్కడికంటే అక్కడికి తిరుగుతుంటే.. నిందమోపబడిన వారు స్వగ్రామానికి దూరంగా హైదరాబాద్‌లో ఉంటూ న్యాయస్థానం చుట్టూ తిరుగుతున్నారు. వివేకా హత్య జరిగి వచ్చే మార్చికి ఏడేళ్లు. ఈ కేసు ఇంకా ఎన్నాళ్లు కొనసాగాలి. 2023 వరకల్లా సీబీఐ చార్జిషీట్, అనుబంధ చార్జిషీట్లు దాఖలు చేసింది. 2025 జనవరి వరకు సత్వర విచారణ కోరిన సునీత యూటర్న్ తీసుకుని ఇప్పుడిలా పిటిషన్ వేయడం వెనుక రాజకీయ కుట్ర ఉంది. వచ్చే సార్వత్రిక ఎన్నికల వరకు కేసు పూర్తిగాకుండా చూడాలన్న వైఎస్సార్‌సీపీ వ్యతిరేకుల కుయుక్తిలో ఆమె కూడా చేరారు. అందుకే ఆగమేఘాల మీద తన నిర్ణయాన్ని మార్చుకుని దర్యాప్తు కొనసాగించాలని పిటిషన్ వేశారు తప్ప.. మరో కారణం లేదు. వైఎస్ భాస్కర్ రెడ్డి, శివశంకర్‌రెడ్డి ఇద్దరూ వయోవృద్ధులు. విచారణ జరిపి వారు నిర్దోషులని నిరూపించుకునే అవకాశం ఇవ్వాల్సిన బాధ్యత న్యాయస్థానంపై ఉంది' అని ఉమామహేశ్వరరావు తన వాదనల్లో పేర్కొన్నారు.

హైకోర్టుల్లోని పిటిషన్లు దాచిపెట్టి..

'కొత్తగా సాక్షులు వచ్చినా, డాక్యుమెంట్ ఆధారాలు లభించినా.. పిటిషన్ వేయడంలో అర్థముంది. కానీ ఇక్కడ కొత్తగా ఎలాంటి ఆధారం దొరకలేదు. విచిత్రంగా ఎఫ్ఎస్ఎల్ నివేదిక కూడా తప్పుగా ఉందని, మార్చాల్సిందేనని ఆమె పట్టుబడుతుండటం విడ్డూరం. ఇలా ఆమె కోరిన వాటన్నింటికి కోర్టుకు అంగీకరిస్తే.. ఏళ్లకు ఏళ్లు గడిచినా ట్రయల్ కూడా ప్రారంభం కాదు. రోజువారీ విచారణ కోరుతూ హైకోర్టులో ఆమె వేసిన పిటిషన్‌ను ధర్మాసనం అనుమతిస్తే.. ఈ కోర్టు తదుపరి దర్యాప్తునకు అనుమతి ఇచ్చినా నిష్ప్రయోజనం. సునీల్‌యాదవ్ తనకు రూ.కోటి ఇచ్చాడని దస్తగిరి వాంగ్మూలం ఇచ్చాడు. అందులో చాలా మొత్తం సీబీఐ రికవరీ చేయలేదు. అది రికవరీ చేయాలని మేం వాదనలు వినిపిస్తున్నాం. కానీ సునీత దాన్ని పట్టించుకోరు. చైతన్యరెడ్డి.. దస్తగిరిని బెదిరించాడన్న అంశాన్ని ఆమె పేర్కొన్నారు. ఆ అంశంపై ఎఫ్ఐఆర్ నమోదైంది. ఏపీ హైకోర్టు దర్యాప్తు నిలిపేస్తూ ఆదేశాలిచ్చింది. వీటితోపాటు తెలంగాణ హైకోర్టులో వేసిన పిటిషన్‌ను దాచిపెట్టి ఈ కోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ విచారణార్హం కాదు. కొట్టివేయండి' అని ఉమామహేశ్వర్‌రావు వాదించారు.

శీలము, సమాధి, ప్రజ్ఞలు మనకు గంగా యమునా సరస్వతులు.
ఈ త్రివేణీ సంగమంతోనే మనకు నిర్వాణ ప్రాప్తి కలుగుతుంది.
- ఎస్.ఎన్. గోయెంకా

సాక్షి
మంగళవారం, 2 డిసెంబర్ 2025

ఒడిశా మేల్కోనాలి!

వలస జీవులపై విషం కక్కే సంస్కృతి ఒడిశాలో ఇంకా పోలేదని అక్కడ జరుగుతున్న దాడులు తెలియజేస్తున్నాయి. ఒకప్పుడు పిల్లల్ని అపహరించడానికొచ్చారనో, మహిళలపై అఘాయిత్యానికి పాల్పడబోయారనో బెంగాల్ నుంచి వలసవచ్చి చిన్నా చితకా పనులు చేసుకుంటున్నవారిపై దాడులు జరిగాయి. ఇప్పుడు 'విదేశీయుల' పేరిట ఆ వేలంవెర్రి కొనసాగుతోంది. ఒడిశాలోని గంజాం జిల్లాలో బెంగాల్ నుంచి ఉన్ని దుస్తులు అమ్ముకోవటానికి వచ్చిన యువకులపై అయిదారు నెలలుగా మూకలు దాష్టీకం చేస్తున్నాయి. ఎవరూ అకారణంగా ఉన్న ఊరునూ, అయినవారినీ వదిలి వలసలకు సిద్ధపడరు. సరైన జీవిక దొరక్క తప్పనిసరై వేరే ప్రాంతానికి వెళ్లేందుకు సిద్ధపడతారు. కొన్ని వలసలు సీజనల్‌గా ఉంటాయి. తొలకరి సమయంలో పంట పొలాల్లో పనులు దొరుకుతాయని వచ్చేవారుంటారు. శీతకాలం సమీపించే సమయానికి ఉన్ని దుస్తులు, దోమతెరలు వగైరాలు అమ్ముకోవడానికి పోతారు. అదేమీ భద్రమైన జీవితం కాదు. సంపాదనపై అనిశ్చితి. వచ్చిన తృణమో, పణమో రక్షించుకోవటం కూడా సమస్య. స్థానికుడు కాదని తెలిశాక రౌడీ మూకల ఆగడాలుంటాయి. పోలీసులు సరేసరి. వలసపోయేవారికి శాశ్వత చిరునామా ఉండదు గనుక స్వరాష్ట్రంలోనూ, వలసపోయే రాష్ట్రంలోనూ కూడా తిప్పలే. వారు ఎక్కడా ఓటు బ్యాంకు కాదు. కనుక సంక్షేమం ఎప్పుడూ ఆమడ దూరంలో ఉంటుంది.

ఇప్పుడు వలస జీవులను అకారణంగా వేధించటానికి 'విదేశీయులు' అనే ఆయుధం అక్కరకొస్తోంది. పార్టీలు తమకు రాలిపడతాయనుకున్న ఓట్ల కోసం ఈ ఆయుధాన్ని నిర్విచక్షణగా ఉపయోగిస్తుంటే రౌడీ మూకలకూ అదే ఆదర్శం! నాలుగు రోజుల క్రితం రాహుల్ ఇస్లాం అనే యువకుడిపై గంజాం జిల్లాలోని గ్రామంలో మూక విరుచుకుపడి తీవ్రంగా దాడిచేసి, అతని దగ్గరున్న రూ. 6,000 అపహరించింది. ఆధార్ కార్డు అడగటం, అది నకిలీదని ఆరోపిస్తూ కొట్టడం సరే.... అతని పేరునుబట్టి వేరే మతం వాడని తెలిశాక 'జై శ్రీరాం' అని బలవంతంగా అనిపించి సమస్తం ఊడ్చి పంపారు. అంతకు నాలుగు రోజుల ముందు బెంగాల్ నుంచి వెళ్లిన మరో ఇద్దరు యువకులకు కూడా ఇలాంటి అనుభవమే ఎదురైంది. ఈ ఉదంతాలపై పశ్చిమ బెంగాల్ వలస కార్మికుల సంక్షేమ సంఘం ఒడిశా డీజీపీకి ఫిర్యాదు చేసింది. ఫలితం ఉంటుందా? ఫిర్యాదు చేయడానికి పోతే 'బతకాలని ఉంటే ఇటువైపు వచ్చే ప్రయత్నం చేయొద్ద'ని పోలీసులు ఉచిత సలహా ఇచ్చారట. కొన్ని వారాల క్రితం బెంగాల్ నుంచి పోయిన ముగ్గురు కూలీలు పోలీసుల నుంచి ఇలాంటి సమస్యే ఎదుర్కొన్నారు. వారిపై బంగ్లాదేశీయులన్న ముద్రవేసి మూడు రోజులపాటు పోలీసు స్టేషన్‌లో నిర్బంధించగా, చివరకు పశ్చిమ బెంగాల్ పోలీసుల జోక్యంతో బయటపడ్డారు. కేంద్రపారా, ఝార్సుగూడ, జగత్‌సింగ్‌పూర్ జిల్లాల్లో బెంగాల్ నుంచి వచ్చిన 500 మందికి పైగా వలస కార్మికులను పోలీసులు నిర్బంధించి పలు విధాలుగా వేధించారు.

ఏడేళ్ల క్రితం గుజరాత్‌లో ఒక పసిపాపపై బిహార్‌కు చెందిన యువకుడు లైంగిక నేరానికి పాల్పడ్డాడని ఆరోపణ వచ్చినప్పుడు మూకలు చెలరేగి 'బయటి వ్యక్తుల'ని అనుమానం వచ్చినవారిని తీవ్రంగా కొట్టి, వారి గుడిసెలకు నిప్పంటించారు. దాంతో బిహార్, ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన వేలాదిమంది ప్రాణభయంతో స్వస్థలాలకు తరలిపోయారు. ఆలస్యంగానైనా ప్రభుత్వం జోక్యం చేసుకుని భరోసా ఇచ్చాకే పరిస్థితి చక్కబడింది. ఒడిశాలో రౌడీ మూకల ఆగడాలపై ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్టు ఉండటమే కాదు... తనవంతుగా వేధింపులకు దిగుతోంది. ఇది సరికాదు. వలసలు నిజానికి జనాగ్రహం నుంచి పాలకుల్ని కాపాడే రక్షాకవచాలు. కడుపు మండిన వారు ప్రభుత్వాలపై ఆగ్రహం వ్యక్తం చేయకుండా, తమ దురదృష్టాన్ని నిందించుకుంటూ వేరేచోటకు వలసపోవడంలో అభ్యంతరం ఎందుకుండాలి? దేశభక్తి గురించి లెక్చర్లిస్తూ పక్క రాష్ట్రం నుంచి వచ్చినవారిని విదేశీయులుగా ముద్రేయటం సిగ్గనిపించటం లేదా? ఒడిశా నుంచి కూడా లక్షల మంది వలసపోతుంటారు. ఈ చీడ విస్తరిస్తే అన్ని రాష్ట్రాల వారికీ పరాయి రాష్ట్రాల్లో ఇదే దుఃస్థితి తలెత్తదా? ఈ పోకడలు సమైక్య భారత్ భావనకు ముప్పు కలిగించవా? ఒడిశా పాలకులు ఆలోచించాలి.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు మార్గశిర మాసం, **తిథి:** శు.ద్వాదశి ప.12.19 వరకు, తదుపరి, త్రయోదశి, **నక్షత్రం:** అశ్విని రా.6.28 వరకు, తదుపరి భరణి, **వర్జ్యం:** ప.2.42 నుండి 4.12 వరకు, తదుపరి రా.3.25 నుండి 4.55 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.37 నుండి 9.21 వరకు, తదుపరి రా.10.37 నుండి 11.29 వరకు, **అమృత ఘడియలు:** ప.11.36 నుండి 1.07 వరకు.

సూర్యోదయం : 6.17
సూర్యాస్తమయం: 5.20
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

సోషల్ టాక్

బద్ధ శత్రువులు

అభివృద్ధి చెందటానికి పరిమితి ఉండదు. ముఖ్యంగా, ఆర్థిక విషయాలలో లక్ష్య సాధనకు పెట్టుకోదగిన ఒక గీత ఉండదు. మీ శక్తి స్థాయిని పెంచుకుంటూ, లక్ష్యాన్ని అంతకంతకూ పెద్దది చేసుకుంటూ పోవాలి. విరామం, విశ్రాంతి మీ బద్ధ శత్రువులు అన్నట్లుగా ఉండండి.

– కె.వి. కామత్, బ్యాంకర్

జీరో బల్బు

నీ జీవితంలోని 'జీరో బల్బు' క్షణాలను గుర్తుకు తెచ్చుకో! అవి కనుక లేకపోతే, నువ్వు పెద్ద పనులు చేయటానికి సిద్ధంగా ఉండే మార్గమే లేదు. గతం మరచి, నీకు తిరుగే లేదనీ, ప్రపంచం నిన్ను తిప్పికొట్ట లేదనీ, గర్వంగా ప్రవర్తించి నీ విజయాన్ని నాశనం చేసుకోకు!

– బొమన్ ఇరానీ, నటుడు

అద్భుతాలు

ప్రతి భారతీయుడూ కొంత ఆత్మగౌరవం, కొంత జవాబుదారీతనం, కొంత నిజమైన జాతీయవాదం కలిగి ఉండాలని నిర్ణయించుకుంటే అద్భుతమైన విషయాలు జరుగుతాయి. కలిసి పని చేయటం, కలుపుకొని ముందుకు సాగటం వల్లనే ఇది సాధ్యం అవుతుంది.

– శివ అయ్యాదురై, ఆంట్రప్రెన్యూర్

ఆచరణ

రుషులు మన భారతీయ వారసత్వ సంపద. కష్ట కాలంలో నిలకడగా ఎలా ఉండాలో, మహా దుర్లభమైన కాలాలను నిర్నిమిత్తంగా ఎలా దాటేయాలో వారు మనకు చెప్పి వెళ్లటానికి ముందు... ఆచరించి, అలా జీవించి వెళ్లారు. వారినే నేను అనుకరిస్తూ వస్తున్నాను.

– రజత్ కుమార్ గుప్తా, బిజినెస్ ఎగ్జిక్యూటివ్

తెచ్చుకోవద్దు!

చివరికి, మీరు ఏర్పరచుకున్న ప్రతి బంధానికీ మీరే బాధ్యత వహించాలి. కాబట్టి ఉద్యోగం, కుటుంబం... ఈ రెండిటికీ మధ్య, ఈ రెండింటికీ ఆవల కొత్తగా బాధ్యతలేవీ తెచ్చి పెట్టుకోకండి. అవి బంధాలుగా, బంధనాలుగా మారే పరిస్థితి రాకుండా జాగ్రత్త పడండి.

– ఓం ప్రకాశ్ రావత్, మాజీ చీఫ్ ఎలక్షన్ కమిషనర్

ప్రయాణం

నిజమైన ప్రయాణం ప్రదేశం నుండి ప్రదేశానికి కాదు. ఆలోచన నుండి ఆలోచనకు! భావోద్వేగం నుండి భావోద్వేగానికి!! మనః స్థితి నుండి మనః స్థితికి!! ఇవన్నీ సత్యమేదో తెలిపే ప్రయాణాలు. సత్యం తెలుసుకోవడానికి ఏకైక మార్గం దానిని అనుభవించటమే, నమ్మటం మాత్రమే కాదు.

– ప్రీతా కృష్ణ, ఆధ్యాత్మిక గురువు

సింగపూర్ చూపుతున్న మార్గం

విశ్లేషణ

సి. ఉదయ్ భాస్కర్

ఢిల్లీలో ఎర్రకోట వద్ద నవంబర్ 10న జరిగిన ఉగ్ర దాడి, భారత్ ఎదుర్కొంటున్న ఆంతరంగిక భద్రతా సవాళ్ళపైకి మరోసారి దృష్టిని మరల్చింది. ఈ దాడిలో 13 మంది చనిపోగా, 30 మందికి పైగా గాయపడ్డారు. ఢిల్లీలో హైకోర్టు వద్ద 2011లో జరిగిన బాంబు పేలుడు తర్వాత, అంతటి భీతావహమైన దాడి చోటుచేసుకోవడం మళ్లీ ఇదే మొదటిసారి. ముంబయిలో 2008 నవంబర్ 26న భారత్ పెద్ద ఉగ్ర దాడిని చవిచూసింది. ఆ దాడిలో పాల్గొన్నవారిలో ఒకడైన కసబ్‌కు పాకిస్తాన్‌తో ఉన్న సంబంధం స్పష్టంగా వెల్లడైంది.

వైట్ కాలర్ ఉగ్రవాదం

అయితే, ఢిల్లీ ఘటన ఇస్లామీయ ర్యాడికలైజేషన్‌లో వచ్చిన పెద్ద మార్పునకు అద్దం పడుతోందని చెబుతున్నారు. అది గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణాలకు పాకింది. వృత్తి నిపుణులు (ఈ కేసులో డాక్టర్లు) తమకు తాము ఉగ్రవాదులుగా మారుతున్నారు. వారు డిజిటల్ సాధనాలను, సంస్థాపరమైన సౌలభ్యాన్ని వినియోగించుకుంటున్నారు.

జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఏ) తదనంతర దర్యాప్తులో అనేక సంగతులు వెల్లడయ్యాయి. ఊహకందని ఉగ్ర సాలెగూడు జమ్ము–కశ్మీర్, హరియాణా, ఉత్తర ప్రదేశ్‌లను మించి విస్తరించినట్లు తేలింది. ఒక వైట్–కాలర్ ఉగ్ర వ్యవస్థ బయటపడింది. దానికి పాకిస్తాన్‌లోని జైష్–ఏ–మహమ్మద్ (జెమ్), అన్సార్ గజవత్ ఉల్–హింద్‌తో సంబంధాలున్నాయి. వారు అనుసరించిన ఎత్తుగడలు హమాస్ నుంచి స్ఫూర్తి పొందినవిగా కనిపిస్తున్నాయని కూడా ప్రాథమిక నివేదికలు సూచించాయి. విదేశీ సూత్రధారుల (ఉదాహరణకు తుర్కియేలోని 'ఉకాస') ఆదేశాలను పాటించినట్లు కూడా వెల్లడవుతోంది. దానికి వారు సెషన్, టెలిగ్రామ్ వంటి యాప్‌లను వాడుకున్నారు. సోదాలలో 2,900 కిలోల పేలుడు పదార్థాలు, డిటొనేటర్లు, అసాల్ట్ రైఫిళ్ళు, (42 వీడియోలతో సహా) ప్రాపగాండా సామగ్రి దొరికాయి. 'జెమ్' వంటి ఉగ్ర తండాలు, వాటి అనుబంధ వర్గాలు స్లీపర్ సెల్స్ సృష్టించేందుకు, విద్యావంతులైన యువతను లక్ష్యంగా చేసుకుంటున్నాయని, అందుకు సామాజిక మాధ్యమాలను వాడుకుంటున్నాయని తేటతెల్లమైంది. బంగ్లాదేశ్‌లో ప్రస్తుతం ఉన్న అస్థిర పరిస్థితులు, అశాంతి ఈ వ్యవహారాలలో ఒక వారధిగా పనిచేయడానికి అవకాశం కల్పించి ఉండవచ్చునని కూడా అనుమానిస్తున్నారు.

సింగపూర్‌కూ తప్పని సంకటం

ఇటీవలి నా సింగపూర్ సందర్శన సందర్భంగా నాకు కొన్ని నిగూఢమైన అంశాలు తెలిసి వచ్చాయి. సోషల్ మీడియా, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత ఇస్లామీయ ర్యాడికలైజేషన్ విసురుతున్న సవాల్, అది ఆ నగర రాజ్యంలోని యువ వర్గాలపై చూపుతున్న ప్రభావం దిగ్భ్రమకు గురిచేశాయి.

◆ పెరుగుతున్న ఉగ్రవాద పెడ ధోరణులకు అడ్డుకట్ట వేసేందుకు సింగపూర్ ప్రభుత్వం 2005లోనే 'రెలిజియస్ రీహాబిలిటేషన్ గ్రూప్' (ఆర్.ఆర్.జి.) పేరుతో ఓ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. వ్యవస్థీకృత ఉగ్ర తండాల సభ్యుల నుంచి పొంచి ఉన్న బెడదను ఎదుర్కోవడాన్ని అది మొదట లక్ష్యంగా పెట్టుకుంది.

సెక్యూరిటీ ఏజెన్సీలు నిర్బంధంలోకి తీసుకుంటున్న యువ ర్యాడికల్ సింగపూరియన్ల సంఖ్య క్రమేపీ పెరుగుతూ వస్తోందని మరిన్ని తాజా నివేదికలు వెల్లడిస్తున్నాయి. సెక్యూరిటీ ఏజెన్సీలు జాగు చేయకుండా వెంటనే నివారణ చర్యలకు దిగడం వల్ల చాలా ప్రమాదకర ఘటనలు తప్పిపోయాయి. సింగపూర్‌లో తుపాకీ నిరోధక చట్టాలు పకడ్బందీగా అమలవుతున్నాయి. వాటిని తప్పించుకుని ఒక ఆయుధాన్ని తయారు చేసేందుకు, 17 ఏళ్ళ ఓ యువకుడు 3–డి ప్రింటింగ్‌ను వినియోగించుకునే ప్రణాళికలో ఉన్నాడు. కానీ, ఆంతరంగిక భద్రతా విభాగం (ఐఎస్డీ) ఈ ఏడాది మార్చిలో అతడిని నిర్బంధంలోకి తీసుకోగలిగింది. అతడి నుంచి రాబట్టిన విషయాలు మరింత ఆశ్చర్యం గొలిపాయి. అతడు ఆ ఆయుధాన్ని ఉపయోగించి స్థానిక మసీదు ఒక దానిలో కనీసం 100 మందిని చంపేసి, తనను తాను కాల్చుకుని చనిపోయే ఆలోచనలో ఉన్నాడు.

దీనికి ముందు, ఫిబ్రవరి నెలలో, ఐఎస్డీకి ఓ 15 ఏళ్ళ అమ్మాయిపై అనుమానం కలిగింది. ఆమె కదలికలపై నిఘా పెట్టి, తర్వాత నిర్బంధంలోకి తీసుకుంది. ఆంతరంగిక భద్రతా చట్టం కింద సింగపూర్‌లో ఓ అమ్మాయిని అరెస్టు చేయడం అదే మొదటిసారి. ఆమె 'ఐసిస్' సభ్యుడిని పెళ్ళి చేసుకుని, దానికి అనుకూలమైన కుటుంబాన్ని పెంచాలని భావిస్తోంది. సిరియాలో పోరాటంలోకి దిగి, అమర వీరురాలిగా మారాలని కలలు గంటోంది.

అరికట్టే చర్యలు

ఈ పెడ ధోరణులకు అడ్డుకట్ట వేసేందుకు సింగపూర్ ప్రభుత్వం రెలిజియస్ రీహ్యాబిలిటేషన్ గ్రూప్ (ఆర్.ఆర్.జి.) పేరుతో 2005లోనే ఓ వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. వ్యవస్థీకృత ఉగ్ర తండాల సభ్యుల నుంచి పొంచి ఉన్న బెడదను ఎదుర్కోవడాన్ని అది మొదట లక్ష్యంగా పెట్టుకుంది. ముఖ్యంగా జెమా ఇస్లామియా (జేఐ) నుంచి ఉన్న ముప్పును నివారించే పనిలో పడింది. కాలక్రమంలో పరిస్థితులకు తగ్గట్లుగా ఆర్.ఆర్.జి. తన కార్యాచరణను మార్చుకుంటూ వచ్చింది. అసలు మతం ఉద్దేశాలు, ఆశయాల గురించి యువతకు సక్రమ అవగాహన కల్పించే పనిని ప్రశంసనీయమైన రీతిలో కొనసాగిస్తూ వచ్చింది. యువతలో కొందరు ఆవేశం, నిరాశా నిస్పృహలతో హింసకు దిగడాన్ని గమనించి అది పరిష్కారం కాదని పరివర్తనకు దారి చూపింది.

అది సత్ఫలితాలను ఇచ్చినట్లు ఒక విస్తృత సర్వేలో తేలింది. సింగపూర్ ఐ.ఎస్.ఏ. కింద గడచిన దశాబ్దంలో కేవలం 17 మంది మాత్రమే అరెస్టు అయ్యారు. ముఖ్యంగా, ఆ నగర రాజ్యంలో పెద్ద ఉగ్ర ఘటన ఏదీ చోటుచేసుకోలేదు. అయితే, సింగపూర్ ముస్లిం వ్యవహారాల మంత్రి ప్రొఫెసర్ ఫైజల్ ఇబ్రహీం తాజా ర్యాడికలైజేషన్‌ను గమనించకపోలేదు. ''దేశాల మధ్య అనుసంధానకత్వం పెరిగిపోతున్న ప్రపంచంలో ఉగ్ర సామగ్రి తేలిగ్గా అందుబాటులోకి వస్తోంది. డిజిటల్ సాధనాలలో సైద్ధాంతిక ప్రబోధాలు ప్రతిధ్వనిస్తున్నాయి. యువత ఇంటర్నెట్‌లోనే ఎక్కువ సమయం గడుపుతూండటం వల్ల ర్యాడికలైజేషన్‌కు వెసులుబాటు ఏర్పడడమే కాక, ఆ ప్రక్రియ వేగం పెరుగుతోంది'' అన్నారు.

అయితే, భారతదేశాన్ని ఆ నగర రాజ్యంతో పోల్చుకోలేం. సింగపూర్ జనాభా అరవై లక్షలు మాత్రమే. భారత్ జనాభా ఇంచుమించు 150 కోట్లు. వైవిధ్యంతో కూడిన భారతీయులు దాదాపు 800 జిల్లాలలో విస్తరించి ఉన్నారు. వివిధ మతాలు, భాషలు, కులాలకు చెందిన వారి సామాజిక–సాంస్కృతిక మిశ్రమత్వం మరింత జటిలమైంది. కానీ టెక్నాలజీ, సోషల్ మీడియా, ఏఐ ఆధారిత ర్యాడికలైజేషన్ తీరుతెన్నులకు సరిహద్దులు లేవు. సింగపూర్ ఆర్.ఆర్.జి. నమూనాను సమీక్షించి, భారతదేశానికి తగ్గ విరుగుడు కార్యక్రమాలను రూపొందించుకోవచ్చు.

వ్యాసకర్త 'సొసైటీ ఫర్ పాలసీ స్టడీస్' డైరెక్టర్

'ప్రత్యేక' విద్య అందించాలి!

వైకల్యం అనేది శరీరానికి సంబంధించిన ఒక పరిమితి మాత్రమే, మనసుకు కాదు. ఈ మహత్తరమైన సందేశాన్ని ప్రపంచానికి చాటి చెప్పేందుకు ప్రతి సంవత్సరం డిసెంబర్ 3న 'అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం' ప్రపంచవ్యాప్తంగా జరుపుకొంటున్నాం. శారీరక, మానసిక, దృశ్య, శ్రవణాల్లో ఏ వైకల్యం ఉన్నవారికైనా మిగతా వారితో పాటు సమాన హక్కులు, సమాన అవకాశాలు, గౌరవప్రదమైన జీవితం ఉండాలని గుర్తు చేసే రోజు ఇది. మిగతా రంగాల్లో ఎలా ఉన్నా... క్రీడా రంగంలో వికలాంగులు ప్రపంచ వ్యాప్తంగా అద్భుత నైపుణ్యాలను ప్రదర్శిస్తున్నారు. ప్యారా అథ్లెటిక్స్ వారి ధైర్యానికీ, పట్టుదలకూ, నిశ్చయానికీ ప్రతీక.

మన దేశం ప్యారా అథ్లెట్ల వల్ల ప్రపంచ వేదికపై వెలుగొందుతోంది. భారతదేశానికి తొలి ప్యారాలింపిక్ స్వర్ణ పతకాన్ని అందించిన మురళీకాంత్ పేట్కర్ 1965 ఇండో–పాక్ యుద్ధంలో శత్రువుల దాడిలో తీవ్రంగా గాయపడి శాశ్వత వైకల్యం పాలయ్యారు. దీంతో వీల్ చైర్‌పై కొత్త జీవితం ప్రారంభించారు. 1972లో పశ్చిమ జర్మనీలోని హీడెల్‌బర్గ్‌లో జరిగిన ప్యారాలింపిక్ క్రీడల్లో చరిత్ర సృష్టించారు. 50 మీటర్ల ఫ్రీ స్టైల్ స్విమ్మింగ్ ఈవెంట్‌లో 37.33 సెకన్లలో లక్ష్యాన్ని చేరుకుని ప్రపంచ రికార్డుతో పాటు భారతదేశానికి మొట్టమొదటి వ్యక్తిగత ప్యారాలింపిక్ స్వర్ణ పతకాన్ని అందించారు. క్రీడలకు ఆయన చేసిన సేవకు గుర్తింపుగా, భారత ప్రభుత్వం 2018లో 'పద్మశ్రీ', 50 ఏళ్లకు పైగా నిరీక్షణ తర్వాత 2024 సంవత్సరానికిగానూ 'అర్జున' అవార్డు ఇచ్చి సత్కరించింది. ఆయన అసాధారణ జీవిత కథ ఆధారంగా హిందీ చిత్రం 'చందు ఛాంపియన్' 2024లో విడుదలైంది.

భారతదేశం ఇప్పటివరకు ప్యారాలింపిక్స్‌లో 60 పతకాలను గెలుచుకుంది. దేవేంద్ర ఝాఝరియా తన బాల్యంలోనే ప్రమాదవశాత్తు తన ఎడమ చేతిని కోల్పోయాడు. ప్యారా అథ్లెటిక్స్ విభాగంలో ఏథెన్స్ (2004), రియో డీజెనీరో (2016)లో జావలిన్‌త్రోలో స్వర్ణాలు గెలిచాడు. అవనీ లేఖరా 11 ఏళ్ల వయసులో ఉన్నప్పుడు తీవ్ర కారు ప్రమాదం కారణంగా రెండు కాళ్లు దాదాపు పనిచేయడం మానుకున్నాయి. ప్యారాప్లీజియా వ్యాధిని ఎదుర్కొంది. ఈ స్థితిలో షూటింగ్‌లో కెరీర్ ప్రారంభించి ప్రపంచ స్థాయికి ఎదిగింది. ప్యారాలింపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన మొదటి భారతీయ మహిళ అయ్యింది. మారియప్పన్ తంగవేలు భారతీయ పారా హైజంపర్, వరుసగా మూడు ప్యారాలింపిక్స్‌లో పతకాలు గెలుచుకున్న మొదటి భారతీయుడు.

పుట్టుకతోనే రెండు చేతులు లేకుండా జన్మించిన శీత్లా దేవి కాళ్లతో, నోటితో విల్లును, బాణాన్ని పట్టుకుని వదలడంలో శిక్షణ పొంది. 2024 ప్యారాలింపిక్స్‌లో కాంస్య పతకం సాధించింది. 2023లో రాష్ట్రపతి చేతుల మీదుగా 'అర్జున' అవార్డు అందుకుంది. ప్రపంచ దేశాల్లో అనేకం ఇటువంటి విజయగాథలు కనిపిస్తాయి.

మనదేశంలో అందరికీ చదువుకునే హక్కు ఉంది కానీ అంగవైకల్యం ఉన్నవారికి అది ఇంకా దూరంగానే ఉండిపోయింది. అంగవైకల్య విద్యార్థుల కోసం ప్రత్యేక శారీరక విద్య అందించాలని చట్టం ఉన్నా అది సరిగా అమలుకు నోచుకోవడం లేదు. భారతదేశంలో సుమారు 78 లక్షల అంగవైకల్యం ఉన్న విద్యార్థులు ఉన్నారు. వారిలో 70% విద్యార్థులు ప్రత్యేక శారీరక విద్య పొందడం లేదు. పాఠశాలల్లో వీరికి బోధించగల అర్హతలు ఉన్న టీచర్లు 15 శాతమే. అంగవైకల్యం ఉన్న విద్యార్థులు ఆటల ద్వారా ఎదగాలి, గెలవాలి, ప్రపంచాన్ని మార్చాలి. ప్రత్యేక శారీరక విద్య అంటే ఒక కార్యక్రమం కాదు, వారి భవిష్యత్తుకు తలుపులు తెరచే బంగారు తాళం చెవి.

– జక్కుల వెంకటేశ్ యాదవ్ । విద్యార్థి నాయకుడు
(రేపు అంతర్జాతీయ వికలాంగుల దినోత్సవం)

ఆ హింస సమర్థనీయమా?

ఇన్ బాక్స్

భారతదేశ అంతర్గత భద్రతకు, ప్రజాస్వామ్య వ్యవస్థకు సవాలుగా మారిన అతి పెద్ద సమస్యలలో మావోయిజం ఒకటి. ఒకప్పుడు భూమి లేని నిరుపేదలకు న్యాయం చేకూర్చాలనే ఉద్దేశంతో, పీడిత వర్గాల గొంతుకగా మొదలైన ఈ ఉద్యమం, కాలక్రమంలో తన దిశను, దశను కోల్పోయింది. అయినా, ఒక మావోయిస్టు నాయకుడో, లేదా హిడ్మా లాంటి కమాండరో చనిపోతే వినిపించే పౌర హక్కుల సంఘాల గొంతుకలు; నక్సలైట్ల చేతిలో దారుణంగా హత్య చేయబడిన అమాయక గిరిజనుల కోసమో, లేదా విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసుల కోసమో ఎప్పుడూ వినిపించకపోవడం ఆశ్చర్యం! ఈ 'సెలెక్టివ్ హ్యూమన్ రైట్స్' (ఎంపిక చేసిన పౌర హక్కులు) అనే ద్వంద్వ నీతిని, ఆ ముసుగులోని ప్రమాదకర భావజాలాన్ని ప్రశ్నించాల్సిన అవసరం ఉంది.

ఇక్కడ ఒక మౌలికమైన ప్రశ్న ఉదయిస్తుంది. రాజ్యాంగం అంటే నమ్మకం లేదనీ, అది బూటకమనీ, దాన్ని కూలదోయడమే తమ అంతిమ లక్ష్యమనీ బహిరంగంగా ప్రకటించి తుపాకీ పట్టిన వారిని... అదే రాజ్యాంగం, చట్టం ప్రకారం మాత్రమే శిక్షించాలని పౌర హక్కుల సంఘాలు కోరడం ఎంతవరకు సమంజసం? గత నాలుగు దశాబ్దాలలో భారతదేశంలో నక్సలైట్ల హింస కారణంగా సుమారు 30 వేల మందికి పైగా పౌరులు, భద్రతా సిబ్బంది ప్రాణాలు కోల్పోయారు. 'రాజ్యం తన సొంత పిల్లలను తానే చంపుకోవడం దుర్మార్గం' అని విప్లవ సానుభూతిపరులు తరచుగా వాపోతుంటారు. మరి వర్గపోరాటం పేరుతో నిస్సహాయలైన గ్రామ సర్పంచులను, విధి నిర్వహణలో ఉన్న కానిస్టేబుళ్లనే కదా వీళ్లు చంపేసింది!

వీళ్లను అణచివేయడానికి భారత ప్రభుత్వం 'ఆపరేషన్ గ్రీన్ హంట్' నుండి నేటి 'ఆపరేషన్ కగార్' వరకు అనేక చర్యలు చేపట్టింది. ప్రస్తుతం నడుస్తున్న 'ఆపరేషన్ కగార్' ద్వారా మావోయిస్టుల కోటలైన అబూజ్‌మడ్ వంటి ప్రాంతాల్లోకి భద్రతా దళాలు చొచ్చుకువెళ్లాయి. నక్సలైట్లు అభివృద్ధిని ఎలా అడ్డుకున్నారో చెప్పడానికి ఛత్తీస్‌గఢ్‌లోని బస్తర్ ప్రాంతమే సాక్ష్యం. మావోయిస్టుల అగ్రనేత హిడ్మా సొంత గ్రామమైన పువర్తికి, స్వాతంత్ర్యం వచ్చిన 70 ఏళ్ళ తర్వాత గానీ బస్సు రాలేదు. ఇన్నాళ్లు అక్కడ రోడ్లు వేయకుండా, టవర్లు కట్టకుండా అడ్డుకున్నారు. బస్సును చూసి గిరిజనులు పడిన ఆనందం మావోయిస్టుల డొల్లతనాన్ని బయటపెట్టింది. 2010లో 96 జిల్లాల్లో ఉన్న నక్సల్స్ ప్రభావం నేడు 4, 5 జిల్లాలకు పడిపోయింది. ఇది నక్సలిజం తన ముగింపు దశలో ఉందనీ, ప్రజల మద్దతు పూర్తిగా కోల్పోయిందనీ సూచిస్తోంది.

– భరత్ చౌహాన్ । సోషల్ యాక్టివిస్ట్

యూపీ, మహారాష్ట్ర.. రయ్ రయ్

డేటా పాయింట్

ఈ ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో (జూలై 1 – సెప్టెంబరు 30) అత్యధిక ప్రయాణికుల వాహనాలు (పీవీ) మహారాష్ట్రలో అమ్ముడైతే, ద్విచక్ర వాహనాలు యూపీలో అమ్ముడయ్యాయి. పీవీల అమ్మకాల్లో తెలంగాణ 12, ఏపీ 14 స్థానాల్లో; టూవీలర్ల అమ్మకాల్లో ఏపీ 10, తెలంగాణ 11 స్థానాల్లో నిలిచాయి.

టాప్ రాష్ట్రాల వారీగా ● పీవీల శాతం ● ద్విచక్ర వాహనాల శాతం

రాష్ట్రం	పీవీల శాతం	రాష్ట్రం	ద్విచక్ర వాహనాల శాతం
మహారాష్ట్ర	12.7	ఉత్తరప్రదేశ్	12.5
ఉత్తరప్రదేశ్	9.7	మహారాష్ట్ర	11.3
గుజరాత్	8.5	గుజరాత్	8
కర్ణాటక	7.4	తమిళనాడు	7.2
కేరళ	6.7	రాజస్థాన్	6.5

ఆధారం: సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫ్యాక్చరర్స్

న్యాయార్జిత ధనంతోనే...

జ్యోతిర్మయం

పాండవులు అరణ్యవాసం చేస్తున్న కాలంలో ధర్మరాజుకు ఒక సందర్భంలో – తపస్సు, దానం – ఈ రెండిటిలో ఏది గొప్పది? అన్న సందేహం కలిగింది. వ్యాస భగవానుడిని ఈ సందేహం తీర్చమని అడిగాడు. 'దానమే ఉన్నతమైన ఫలితాలను ఇస్తుంది. డబ్బును దానం చేయడం ద్వారానే ఇది సాధించబడుతుంది కాబట్టి, దానం ద్వారా సమకూరే ఫలితాలను సాధించడం కష్టం. ధనార్జన కోసం మనిషి పడని పాట్లు ఉండవు. కత్తులు, కటారుల మొనలపై పరుగెడతాడు, అనగా యుద్ధాలలో పాల్గొంటాడు. ఖండాంతర ప్రయాణానికి సిద్ధమవుతాడు. శరీర కష్టంతో వ్యవసాయం చేస్తాడు. పశుపాలన చేస్తాడు. డబ్బు సంపాదించి పెట్టే పనికై అడవులలో, కొండల మధ్యన తిరుగుతాడు. ఇతరుల దగ్గర పనివాడై పగలనక రేయనక చెమటోడుస్తాడు. అందువలననే, దానం కారణంగా ధనాన్ని త్యాగం చేయడంలో ఎంతో గొప్పదనం దాగి ఉంటుందని ఒప్పుకోక తప్పదు!' అని వ్యాసులవారు చెప్పారు. అయితే, ప్రతి దానానికీ ఆ గొప్పదనం ఉంటుందా? అంటే ఉండదు గాక ఉండదు అని ఆ వెంటనే మరొక మాట కూడా ఆంధ్ర మహాభారతం, అరణ్యపర్వం, షష్ఠాశ్వాసంలో చెప్పారు.

శా. అన్యాయార్జిత మైన విత్తమున జేయం బూను దానంబు మూ
ర్ఖన్యాయం బది; దానజేసి ఫలపాకం బేమియున్ లేదు; యు
క్తన్యాయార్జిత మించుకంత యయినం గాలంబు దేశంబు స
మ్మాన్యంబై తగ బాత్రయోగమున సౌమ్యంబై ఫలించుం దుదిన్.

అన్యాయంగా సంపాదించిన డబ్బుతో చేసే దానం, దేనికీ పనికిరానిదే అవుతుంది తప్ప ఫలితం ఉండదు. ఆ దానం వలన ఎటువంటి మేలూ జరగదు. న్యాయంగా సంపాదించిన డబ్బుతో చేసే దానం ఎంత చిన్నదైనప్పటికీ, కాలంలో నిలిచి, ఎప్పటికైనా అదే సత్ఫలితాలను ఇస్తుందని తేల్చి చెప్పాడు వ్యాసమహర్షి. కాబట్టి న్యాయంగా సంపాదించిన డబ్బు వలననే దాన ఫలితం దక్కుతుంది అన్నది విదితం.

– భట్టు వెంకటరావు

క్లుప్తంగా...

5 శాతం పడిపోయిన ఏపీ జీఎస్టీ వసూళ్లు

గతేడాదితో పోలిస్తే రూ.131 కోట్లు తగ్గుదల

సాక్షి, అమరావతి/సాక్షి, న్యూఢిల్లీ: నవంబర్ నెలలో రాష్ట్ర జీఎస్టీ ఆదాయం 5 శాతం క్షీణించింది. గతేడాది నవంబర్లో రూ.2,828 కోట్లుగా ఉన్న జీఎస్టీ (ఎస్జీఎస్టీ సర్దుబాటు తర్వాత) ఆదాయం ఈ ఏడాది నవంబర్లో 5 శాతం తగ్గి రూ.2,697 కోట్లకు పడిపోయినట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ విడుదల చేసిన తాజా గణాంకాల్లో స్పష్టమైంది. ఇదే సమయంలో దక్షిణాది రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక, కేరళ, తెలంగాణలో ఆదాయం పెరగడం గమనార్హం. చంద్రబాబు సర్కారు అధికారం చేపట్టినప్పటి నుంచి రాష్ట్ర జీఎస్టీ ఆదాయం తిరోగమన బాట పట్టింది. రెడ్బుక్ రాజ్యాంగంపై దృష్టిపెట్టి అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలు అటకెక్కించడంతో ప్రజల్లో కొనుగోలు శక్తి భారీగా పడిపోయింది. దీనికి కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ ప్రతినెలా విడుదల చేస్తున్న గణాంకాలే తార్కాణం. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో నవంబర్తో ముగిసిన 8 నెలల కాలానికి రాష్ట్ర స్థూల జీఎస్టీ వసూళ్లు గతేడాదితో పోలిస్తే ఎటువంటి వృద్ధి లేకుండా రూ.30,042 కోట్లుగా ఉన్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ పేర్కొంది.

సీఎం, మంత్రులు, సీఎస్ కార్యాలయాల్లో కంప్యూటర్ల కోసం రూ.12.50 కోట్లు

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి కార్యాలయం(సీఎంవో), సీఎం క్యాంపు ఆఫీసు తోపాటు మంత్రులు, సీఎస్ కార్యాలయాల్లో కంప్యూటర్లు, సాఫ్ట్వేర్, హార్డ్వేర్ కోసం రూ.12.50 కోట్లు విడుదల చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ (ఏపీటీఎస్) ద్వారా ఈ కార్యాలయాలకు కంప్యూటర్లు, సాఫ్ట్వేర్, హార్డ్వేర్లను సరఫరా చేశారు. ఇందుకుగాను ఏపీటీఎస్కు రూ.12.5 కోట్లు విడుదల చేస్తూ ఐటీ శాఖ కార్యాదర్శి కాటమనేని భాస్కర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈ మొత్తంతో ఇప్పటికే పెండింగ్లో ఉన్న బిల్లులు చెల్లించడంతోపాటు భవిష్యత్తులో కొనుగోళ్లకు వినియోగించుకోవడానికి అనుమతించారు.

వాహనాల ఫిట్నెస్ చార్జీలు తగ్గించాల్సిందే!

- సౌత్ ఇండియా మోటార్ ట్రాన్స్పోర్ట్ అసోసియేషన్ తీర్మానం
- చార్జీల పెంపును నిరసిస్తూ 9 అర్ధరాత్రి నుంచి 12 ఏళ్లు నిండిన వాహనాల నిలిపివేత

సాక్షి, అమరావతి: వాహనాల ఫిట్నెస్ చార్జీల పెంపును నిరసిస్తూ ఈనెల 9 అర్ధరాత్రి నుంచి 12 ఏళ్లు పూర్తయిన వాహనాలను నిలిపివేయనున్నట్టు సౌత్ ఇండియా మోటార్ ట్రాన్స్పోర్ట్ అసోసియేషన్ వెల్లడించింది. తమిళనాడులోని వెల్లూరులో సోమవారం నిర్వహించిన సౌత్ ఇండియా మోటార్ ట్రాన్స్పోర్ట్ అసోసియేషన్ సమావేశంలో పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. కేంద్ర ప్రభుత్వం విడుదల చేసిన నోటిఫికేషన్ ప్రకారం రూ.1,340 ఉన్న ఫిట్నెస్ చార్జీ రూ.33,040కి పెరుగుతుందని వారు వాపోయారు. కేంద్ర నిర్ణయం వల్ల పాతలారీల యజమానులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫిట్నెస్ చార్జీలను తగ్గించాలని, పాత రేట్లనే కొనసాగించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 9వ తేదీ అర్ధరాత్రి నుంచి 12 సంవత్సరాల కంటే ఎక్కువ వయసు కలిగిన వాహనాలను నిలిపివేయాలని తీర్మానించారు. చార్జీల పెంపు కారణంగా ఫిట్నెస్ చేయించుకోలేక ఇప్పటికే దక్షిణాది రాష్ట్రాల్లో వందల లారీలు నిలిచిపోయాయని తెలిపారు. సమావేశంలో సౌత్ ఇండియా మోటార్ ట్రాన్స్పోర్ట్ అసోసియేషన్ అధ్యక్షుడు గోపాల్ నాయుడు, పలు రాష్ట్రాల లారీ యజమానుల సంఘాల నేతలు పాల్గొన్నారు.

అపార్ట్మెంట్ పార్కింగ్ స్థలంలో నిర్మాణాలు అక్రమమే

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ హరినాథ్ తీర్పు

సాక్షి, అమరావతి: అపార్ట్మెంట్లో పార్కింగ్ కోసం నిర్దేశించిన స్థలంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టడానికి వీల్లేదని, అలాంటి నిర్మాణాలు అక్రమమే అవుతాయని హైకోర్టు తేల్చి చెప్పింది. ఇలాంటి నిర్మాణాలను ఎట్టి పరిస్థితుల్లోనూ క్రమబద్ధీకరించడానికి వీల్లేదని స్పష్టం చేసింది. అలాగే పార్కింగ్ స్థలాన్ని వాణిజ్య కార్యకలాపాల కోసం వినియోగించరాదంది. పార్కింగ్ స్థలంలో చేపట్టిన అనధికార నిర్మాణాలను క్రమబద్ధీకరించుకోవడానికి ఈ ఏడాది నవంబర్లో జారీచేసిన జీవో 225ను అనుమతించడంలేదని గుర్తుచేసింది. విశాఖపట్నం ఈస్ట్ పాయింట్ కాలనీలోని మాధురి మనోర్ అపార్ట్మెంట్ స్టిల్ట్ ఫ్లోర్లో తమ దుకాణాలను తొలగించాలంటూ జీవీఎంసీ అధికారులు నోటీసులు జారీ చేయడాన్ని సవాలు చేస్తూ నడింపల్లి శ్రీదివ్యదుర్గ మధులిక, ఈదర్లపల్లి బాలసుబ్రహ్మణ్యం హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్పై ఇటీవల విచారణ జరిపిన కోర్టు అనుమతి పొందిన ప్లాన్కు విరుద్ధంగా స్టిల్ట్ ఫ్లోర్లో షాపులు నిర్మించడమేగాక, గత 26 ఏళ్లుగా ఆ షాపులు తమ నిర్వహణలో ఉన్నాయన్న కారణంతో వాటిని క్రమబద్ధీకరించాలని పిటిషనర్లు కోరజాలరని స్పష్టం చేసింది. ఈ షాపులను కూల్చివేయాలని అధికారులను ఆదేశించింది. పార్కింగ్ కోసం వినియోగించుకునేందుకు వీలుగా ఆ ప్రాంతాన్ని మాధురి మనోర్ ప్లాట్స్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్కు నాలుగు వారాల్లో అప్పగించాలని అధికారులను ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ నూనెపల్లి హరినాథ్ తీర్పు చెప్పారు.

రాష్ట్ర ప్రజల వ్యక్తిగత ఆదాయం ఢమాల్

ఏపీలో బాబు హయాంలో పడిపోయిన ప్రత్యక్ష పన్నుల రాబడి

రాష్ట్రం నుంచి 2023-24లో కేంద్రానికి ఈ రాబడి రూ.26,066 కోట్లు

- అదే 2024-25లో రూ.23,804 కోట్లే..
- అనేక రాష్ట్రాల్లో పురోగమనం.. ఇక్కడ మాత్రం తిరోగమనం
- అమ్మకం పన్ను రాబడీ పడిపోతోంది
- పార్లమెంట్లో కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడి

సాక్షి, అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో రాష్ట్ర ప్రజల వ్యక్తిగత ఆదాయం పడిపోయింది. 2023–24 ఆర్థిక ఏడాది కన్నా 2024–25లో రాష్ట్రం నుంచి కేంద్రానికి ప్రత్యక్ష పన్నుల రూపంలో వచ్చే ఆదాయం తగ్గిపోవడమే ఇందుకు నిదర్శనం. బిహార్, పశ్చిమ బెంగాల్తో పాటు వివిధ రాష్ట్రాల నుంచి కేంద్రానికి 2023–24 ఆర్థిక ఏడాది కన్నా 2024–25లో ప్రత్యక్ష పన్నుల రూపంలో వచ్చిన ఆదాయం పెరిగింది. కానీ, ఆంధ్రప్రదేశ్లో మాత్రం పడిపోయింది. ఈ విషయాన్ని సోమవారం పార్లమెంట్లో కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ వెల్లడించింది. ఆంధ్రప్రదేశ్ నుంచి 2023–24లో ప్రత్యక్ష పన్నుల ద్వారా కేంద్రానికి రూ.26,066 కోట్లు రాబడి వస్తే 2024–25లో అది రూ.23,804 కోట్లకు పడిపోయింది. అంటే.. రూ.2,262 కోట్ల రాబడి తగ్గిపోయింది. రాష్ట్ర ప్రజల వ్యక్తిగత ఆదాయం పడిపోవడంవల్లే పన్ను రూపంలో కేంద్రానికి ఏపీ నుంచి రాబడి తగ్గిపోయినట్లు స్పష్టమవుతోంది.

నెలనెలా తగ్గుతున్న అమ్మకం పన్ను రాబడులు..

చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి రాష్ట్ర అమ్మకం పన్ను రాబడులు అంతకుముందు ఆర్థిక ఏడాదితో పోలిస్తే ప్రతినెలా తగ్గుతున్నాయని కాగ్ నివేదికలు స్పష్టంచేస్తున్నాయి. ప్రజల కొనుగోలు శక్తి పడిపోవడంతోనే అమ్మకం పన్ను రాబడి తగ్గిపోతోంది. ఎన్నికల ముందు ప్రజలకిచ్చిన హామీలను చంద్రబాబు అధికారంలోకి వచ్చాక సంక్షేమ పథకాలను అమలుచేయకపోవడంతో ప్రజల కొనుగోలు శక్తి క్షీణిస్తోంది.

2023-24, 2024-25లో వివిధ రాష్ట్రాల నుంచి కేంద్రానికి వచ్చిన ప్రత్యక్ష పన్నుల నికర రాబడులు.. (రూ.కోట్లలో)

రాష్ట్రం పేరు	2023-24	2024-25
గుజరాత్	93,300	1,70,241
తెలంగాణ	84,439	97,860
పశ్చిమ బెంగాల్	60,374	63,075
ఉత్తరప్రదేశ్	48,333	69,011
రాజస్థాన్	30,551	34,382
ఆంధ్రప్రదేశ్	26,066	23,804
కేరళ	23,966	27,974
బిహార్	6,692	6,904
ఒడిశా	17,215	19,656

99 పైసలకే భూ పందేరం

'లిఫ్ట్' పాలసీ విధివిధానాలను విడుదల చేసిన ప్రభుత్వం

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో అప్పనంగా భూ పందేరానికి చంద్రబాబు ప్రభుత్వం తెర తీసింది. కేవలం 99 పైసలకే ఎకరం చొప్పున కంపెనీలకు ఎన్ని ఎకరాలైనా ఇచ్చేందుకు సిద్ధమని స్పష్టం చేస్తోంది. ఐటీ, గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్స్ (జీసీసీ)లను ఆకర్షించే పేరుతో ఎంత భూమి అయినా 99 పైసలకే కేటాయించేలా చంద్రబాబు ప్రభుత్వం 'ల్యాండ్ ఇన్సెంటివ్ ఫర్ టెక్ హబ్స్ (లిఫ్ట్) పాలసీ 2025–2030'ని రూపొందించింది. లిఫ్ట్ పాలసీ విధివిధానాలను రాష్ట్ర ప్రభుత్వం సోమవారం విడుదల చేసింది. ఈ పాలసీ కింద ఐటీ కంపెనీలు, ఐటీఈఎస్, జీసీసీ, గ్లోబల్ క్యాపబిలిటీ సెంటర్ డెవలపర్స్, ఐటీ పార్క్ డెవలపర్స్ తక్కువ ధరకు భూమిని పొందడానికి దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొంది. పెద్ద కంపెనీలకు ఎంత భూమి అవసరమైనా మొత్తం 99 పైసలకే కేటాయిస్తామని నిబంధనల్లో స్పష్టంచేశారు. మధ్య స్థాయి కంపెనీలైతే రాయితీ ధరపై ఎకరం రూ.4 కోట్ల చొప్పున కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. వీటికి అదనంగా ఐటీ, జీసీసీ పాలసీ కింద ఇతర రాయితీలూ అందించనున్నట్లు స్పష్టంచేశారు. పెద్ద కంపెనీలు ఒక్కో ఎకరానికి 500 చొప్పున ఉద్యోగాలు కల్పించాలని తెలిపారు. భారీ ఐటీ కంపెనీలు కనీసం మూడేళ్లుగా రూ.8,900 కోట్ల టర్నోవర్ను కలిగి ఉండాలని, ఐటీ డెవలపర్స్ ఇప్పటికే 10 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణం అభివృద్ధి చేసి ఉండాలని పేర్కొన్నారు. మధ్యస్థాయి కంపెనీలైతే మూడేళ్లలో కనీసం రూ.30 కోట్ల టర్నోవర్ కలిగి ఉండాలని, 500 ఉద్యోగాలు ఇచ్చి ఉండాలని స్పష్టం చేశారు.

రైతన్నా.. కన్నెత్తి చూడలేం

▶ మొదటి పేజీ తరువాయి

ప్రాణం ఇస్తానంటూ ఎన్నికల్లో నమ్మబలికిన జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అయితే పత్తా లేరు. వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు సైతం కూడా రైతుల వైపు కన్నెత్తి చూసిన పాపాన పోలేదు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలే కాదు చివరకు స్థానిక ప్రజా ప్రతినిధులకూ హాజరయ్యేందుకు ధైర్యం చాల్లేదు. ఫలితంగా 'రైతన్నా మీ కోసం' అట్టర్ఫ్లాప్ అయ్యింది. అసలు ఈ కార్యక్రమం కోసం పైసా కూడా విదల్చలేదంటేనే చంద్రబాబు ప్రభుత్వం చిత్తశుద్ధి ఏమిటో తెలుస్తోంది.

పంచసూత్రాల్లేవ్.. ఇంటింటికీ పోలేదు..

''నేనూ రైతు బిడ్డనే. రాష్ట్రంలోని ప్రతి కర్షకుడి కష్టం నాకు తెలుసు. మీతో కలిసి నడవడానికి మీ సమస్యలు పరిష్కరించడానికి, మీకు పూర్తిగా అండగా ఉండేందుకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నాం'' అంటూ 'రైతన్నా మీ కోసం'పై ఉన్నతాధికారుల సమీక్షలో సీఎం చంద్రబాబు గొప్పలు పోయారు. ప్రతి రైతు ఇంటికి వెళ్లి తమ ప్రభుత్వం గత ఏడాదిన్నరలో ఏం చేసిందో చెబుతామన్నారు. కూటమి పార్టీల ప్రజాప్రతినిధులు, నేతలతో పాటు అధికారులు కూడా పాల్గొంటారని, తానూ రైతుల ఇళ్లకు వెళ్తానని సీఎం స్వయంగా ప్రకటించారు. రైతును రాజును చేసేందుకు పంచ సూత్రాల పేరిట ముద్రించిన కరపత్రాలను అందించడంతో పాటు ప్రత్యేకంగా తెచ్చిన ఏపీఏఐఎంఎస్ (ఏపీ వ్యవసాయ సమాచార, నిర్వహణ వ్యవస్థ) యాప్ను వారి మొబైల్ ఫోన్లో ఇన్స్టాల్ చేయించి, దాని నిర్వహణపై అవగాహన కల్పించాలని ఆదేశాలిచ్చారు. ఆచరణకు వచ్చేసరికి ఆరంభ శూరత్వంగా మిగిలిపోయింది. తొలి రోజు హడావుడి, హంగామా చేసినా రైతుల నుంచి కనీస స్పందన లేదు. సరికదా పలుచోట్ల తీవ్ర ప్రతిఘటన ఎదుర్కోవాల్సి వచ్చింది.

ఏ పంటకూ మద్దతు ధర లేదు.. ఇదే మీ నిర్వాకం

''మిరప మొదలు అరటి వరకు 18 నెలలుగా ఏ పంటకూ గిట్టుబాటు ధర కాదు కదా కనీస మద్దతు ధర కూడా దక్కలేదు. ధాన్యానికి సైతం తేమ శాతం వంకతో మద్దతు ధర దక్కకుండా చేస్తున్నారు. ఓ వైపు ధరలు పతనమవుతున్నా ప్రభుత్వం పట్టించుకోలేదు. కనీసం మద్దతు ధరకు సేకరించేందుకు కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదు. గతంలో ఈ పరిస్థితి ఉండేది కాదు'' అంటూ రైతన్నా మీ కోసంలో తొలిరోజే రైతులు ప్రజాప్రతినిధులను కడిగేశారు. మరోవైపు 'ఉచిత పంటల బీమా ఎత్తేశారు. ప్రీమియం కట్టలేక బీమా చేయించుకోలేకపోయాం. వరుస విపత్తులతో పంటలు నష్టపోతే పైసా పరిహారం కూడా ఇవ్వలేదంటూ' నిలదీశారు.

ఎక్కడొచ్చింది అన్నదాత సుఖీభవ?

అన్నదాత సుఖీభవ రెండు విడతల్లో పీఎం కిసాన్తో కలిపి రూ.14 వేలు జమ చేసినట్లు చెప్పి తప్పించుకుందాం అని కూటమి ప్రజాప్రతినిధులు భావించినా, ఆ సొమ్ము తమకు పడలేదంటే తమకు పడలేదని, తొలి విడతకు సంబంధించిన వినతులను కనీసం పట్టించుకోలేదంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. దానికి సమాధానం చెప్పలేక, రైతులను సముదాయించలేక జారుకున్న ఘటనలు చోటుచేసుకున్నాయి. దీంతో చేసేది లేక పాల్గొనలేదని పల్నాడుకు చెందిన టీడీపీ ప్రజాప్రతినిధి ఒకరు చెప్పుకొచ్చారు. ''అన్నదాత సుఖీభవ తొలి ఏడాది ఎగ్గొట్టాం. రెండో ఏడాది పీఎం కిసాన్తో కలిపి రెండు విడతల్లో రూ.14వేలు ఇవ్వడం తప్ప రైతులకు చేసిందేమి లేదు'' అని కూటమి నేతలే బాహాటంగా చెబుతున్నారు.

భజన మీడియా గప్చుప్..

సీఎం చంద్రబాబు బృందం కాలుబయటపెడితే చాలు.. అహో ఒహో అంటూ భజన చేసే పచ్చ మీడియా సైతం ''రైతన్నా మీకోసం'' గురించి ప్రస్తావించలేదు. దీంతోనే ఈ కార్యక్రమం ఎలా సాగిందో స్పష్టం అవుతోంది. రైతుల ఇళ్లకు వెళ్లినట్టు, వారు యాప్ ఇన్స్టాల్ చేసుకున్నట్టు రోజువారీ నివేదికలివ్వడం తప్ప ప్రత్యక్షంగా రైతుల ఇళ్లకు వెళ్లిన దాఖలాలు మచ్చుకైనా కన్పించలేదు. మెజార్టీ గ్రామాల్లో రైతులనే అధికారులు పిలిపించుకుని యాప్ ఇన్స్టాల్ చేసుకోండి, లేదంటే మా ఉద్యోగాలు పోతాయంటూ బతిమిలాడిన పరిస్థితి నెలకొంది.

➤ రైతన్నా మీ కోసం ముగింపు సందర్భంగా ఈ నెల 3న ఆర్బీకేల పరిధిలో వర్క్షాపులు చేపట్టనున్నారు. తూర్పుగోదావరి జిల్లా నల్లజర్లలో సీఎం చంద్రబాబు పాల్గొననున్నారు.

మా ఊరికి వస్తే నిలదీద్దామనుకున్నా.. ఎవరూ రాలేదు

'నా వయస్సు 60 ఏళ్లు.. 45 ఏళ్లుగా వ్యవసాయం చేస్తున్నా. ఇంత దారుణమైన ప్రభుత్వాన్ని ఎప్పుడూ చూడలేదు. అన్నదాత సుఖీభవ కింద ఏటా రూ.20 వేలు ఇస్తానని చంద్రబాబు హామీ ఇచ్చారు. తొలి ఏడాది ఎగ్గొట్టారు. రెండో ఏడాది రెండు విడతల్లో రూ.10 వేలు వేశామని చెబుతున్నారు. నాకు పడలేదు. ఎవరికి పడ్డాయో కూడా తెలియదు. సొంతంగా ఏడు ఎకరాలు, కౌలుకు మూడు ఎకరాలు తీసుకుని వ్యవసాయం చేస్తున్నా. అప్పు చేసి పెట్టుబడి పెట్టి టమాట, పత్తి, కూరగాయలు పండించా. అధిక వర్షాల కారణంగా పత్తి 2–3 క్వింటాళ్ల దిగుబడే రాగా, మిగిలిన పంటలన్నీ పూర్తిగా దెబ్బతిన్నాయి. పత్తికి క్వింటాకి రూ.5 వేలకు మించి ఇవ్వడం లేదు. కేంద్రానికి తీసుకెళ్తే కొనే పరిస్థితి లేదు. రైతన్నా మీ కోసం కార్యక్రమంలో మా గ్రామానికి వస్తే నిలదీద్దామనుకున్నా. ఏ ఒక్కరూ మాఇంటికి వచ్చిన పాపాన పోలేదు.

– కె.తిమ్మయ్య, నలకలదొడ్డి, కర్నూలు జిల్లా

బాబు సర్కారును రైతులు నమ్మడం లేదు

మాటల గారడీ తప్ప రైతులకు కూటమి ప్రభుత్వం చేసిందేమీ లేదు. మద్దతు ధర దక్కక ఓవైపు అరటి, ఉల్లి, మొక్కజొన్న, సజ్జ రైతులు గగ్గోలు పెడుతుంటే ఆదుకునేందుకు ఎలాంటి చర్యలు చేపట్టలేదు. దీంతో ఎక్కడ నిలదీస్తారో అన్న భయంతో చంద్రబాబు అన్నదాతల గడప తొక్కలేదు. అన్నదాత సుఖీభవ కింద ఏటా రూ.20 వేలు ఇస్తానని నమ్మబలికి తొలి ఏడాది నిస్సిగ్గుగా ఎగ్గొట్టింది. రెండో ఏడాది రూ.10 వేలతో సరిపెట్టింది. కౌలు రైతులనైతే నిండా ముంచేసింది. అన్నింటా విఫలమైన చంద్రబాబు ప్రభుత్వం రైతన్నా మీ కోసం అంటూ ఆడుతున్న దొంగ నాటకాన్ని నమ్మే స్థితిలో రైతులు లేరు.

– పి.జమలయ్య, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఏపీ కౌలు రైతు సంఘం

1న వేతనాలు, పెన్షన్ పడలేదు

- ఇవ్వాలంటే.. మంగళవారం అప్పు ఖజానాకు రావాల్సిందే
- ప్రతి నెలా వేతనాలు, పెన్షన్లకు 10వ తేదీ వరకు ఎదురుచూపులే

సాక్షి, అమరావతి: ఉద్యోగులకు జీతాలు, పెన్షనర్లకు పెన్షన్ ప్రతి నెలా 1వ తేదీన ఇస్తామన్న చంద్రబాబు హామీ ఒక నెల ముచ్చటగానే మిగిలిపోయింది. చంద్రబాబు ప్రభుత్వం వచ్చిన తరువాత తొలి నెల మాత్రమే 1వ తేదీన జీతాలు, పెన్షన్లు ఇచ్చింది. ఆ తరువాత నుంచి ప్రతి నెలా జీతాల కోసం ఉద్యోగులు, పెన్షన్ల కోసం రిటైర్డ్ ఉద్యోగులు ఎదురు చూడాల్సిన దుస్థితి నెలకొంది. ఈ నెల రాష్ట్ర సచివాలయ ఉద్యోగులకు మాత్రమే సోమవారం వేతనాలు పడ్డాయి. మిగతా శాఖల ఉద్యోగులకు వేతనాలు పడలేదు. మున్సిపాలిటీ ఉద్యోగులతో సహా ఏ ప్రభుత్వ ఉద్యోగికీ జీతాలు రాలేదు. పెన్షనర్లకు పెన్షన్లు కూడా పడలేదు. తక్కువ జీతాలతో పనిచేసే హోంగార్డులు, వీఆర్ఏలకు కూడా 1వ తేదీన జీతాలు ఇవ్వడం లేదు. ఒక్కోనెల ఐదు, ఆరు తేదీలు వచ్చినా ఉద్యోగులకు జీతాలు ఇవ్వడం లేదని, చంద్రబాబు హామీ ఒక నెలకే పరిమితమైందని ఉద్యోగవర్గాలు పేర్కొంటున్నాయి. ప్రతి నెలా 1వ తేదీనే జీతాలు, పెన్షన్లు ఇస్తున్నామని చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని చెబుతున్నాయి. ప్రతి నెలా జీతాలు, పెన్షన్లకోసం 10వ తేదీ వరకు వేచి చూడాల్సి వస్తోందని ఉద్యోగులు, పెన్షనర్లు పేర్కొంటున్నారు. రాష్ట్ర ప్రభుత్వం మంగళవారం రూ.3 వేల కోట్ల అప్పు చేయనుంది. ఆ నిధులు ప్రభుత్వ ఖజానాకు చేరేవరకు జీతాలకు, పెన్షన్కు ఆగాల్సిందేనని ఉద్యోగులు చర్చించుకుంటున్నారు.

చంద్రబాబు సర్కారులో విద్యారంగం భ్రష్టుపట్టింది

వైఎస్సార్సీపీ పీఏసీ సభ్యుడు, మాజీమంత్రి ఆదిమూలపు సురేష్

సింగరాయకొండ: చంద్రబాబు ప్రభుత్వంలో విద్యారంగం భ్రష్టుపట్టిందని, ఫలితంగా పేద, మధ్యతరగతి విద్యార్థులు తీవ్రస్థాయిలో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వైఎస్సార్సీపీ పీఏసీ సభ్యుడు, మాజీమంత్రి, పార్టీ కొండపి నియోజకవర్గ ఇన్చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ ధ్వజమెత్తారు. ప్రకాశం జిల్లా సింగరాయకొండలోని పార్టీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో విద్యారంగానికి పెద్దపీట వేస్తామని, ఉచితవిద్య అందించటంతో పాటు ఉన్నతవిద్యకు భరోసా కల్పిస్తామని, పేద, బలహీనవర్గాల విద్యార్థులకు అండగా ఉంటామని కల్లబొల్లి మాటలు చెప్పి చంద్రబాబు అధికారంలోకి వచ్చారన్నారు. నేడు విద్యారంగాన్ని గాలికొదిలేసి పేద విద్యార్థులను మోసం చేశారని విమర్శించారు. సీఎం చంద్రబాబు, విద్యామంత్రి లోకేశ్ విద్యార్థుల జీవితాలతో చెలగాటమాడుతున్నారని దుయ్యబట్టారు. ఎంతసేపటికీ మంత్రి లోకేశ్ ఐటీ పార్కు, ఐటీ హబ్, క్వాంటమ్ వ్యాలీ, ఏఐ యూనివర్సిటీ అంటూ అరచేతిలో వైకుంఠం చూపిస్తున్నారని ఎద్దేవా చేశారు. వసతిదీవెన రూ.5,600 కోట్లు, హాస్టల్ విద్యార్థులకు సంవత్సరానికి రూ.1,100 కోట్లు చొప్పున రెండు సంవత్సరాలకు రూ.2,200 కోట్లు కలిపి మొత్తం రూ.7,800 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. ఈ విధంగా కాలేజీలకు, విద్యార్థులకు బకాయిలు పెడితే ఆర్థికభారంతో నాణ్యమైన విద్య ఏ విధంగా అందుతుందని ప్రశ్నించారు.

బకాయిలపై చర్చకు సిద్ధమా?

ప్రజలను పక్కదారి పట్టించేందుకు గత వైఎస్సార్సీపీ ప్రభుత్వం బకాయిలు పెట్టిందని ఆరోపిస్తున్న మంత్రి లోకేశ్ దీనిపై చర్చకు సిద్ధమా అని సవాల్ విసిరారు. వాస్తవానికి 2014–19 మధ్య చంద్రబాబు ప్రభుత్వం పెట్టిన రూ.1,778 కోట్ల బకాయిలను జగనన్న చెల్లించారని గుర్తుచేశారు. దేశంలోనే పూర్తిగా ఫీజు రీయింబర్స్మెంటు ఇచ్చిన ఘనత వైఎస్సార్సీపీ ప్రభుత్వానికి దక్కుతుందన్నారు. జగనన్న ప్రభుత్వంలో విద్యార్థులకు విద్యాదీవెన, వసతిదీవెన కింద రూ.18,663 కోట్ల లబ్ధి చేకూరిందని చెప్పారు.

నాబార్డు నుంచి డిస్కమ్స్కు రూ.3,762.26 కోట్లు అప్పు

- ఈ అప్పునకు ప్రభుత్వం గ్యారెంటీ
- ఉత్తర్వులు జారీచేసిన సీఎస్ విజయానంద్

సాక్షి, అమరావతి: నాబార్డు నుంచి విద్యుత్ పంపిణీ సంస్థలు(డిస్కమ్స్) రూ.3,762.26 కోట్లు అప్పు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం గ్యారెంటీ ఇచ్చింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎటువంటి షరతుల్లేని, మార్చలేని హామీకి లోబడి ప్రభుత్వం గ్యారెంటీ ఉంటుందని ఉత్తర్వుల్లో స్పష్టంచేశారు. ఎస్సీ, ఎస్టీ విద్యుత్ వినియోగదారులకు రూఫ్టాప్ సోలార్ ఇన్స్టలేషన్ల అమలు కోసం ఈ రుణాన్ని వినియోగించనున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. ఏపీఈపీడీసీఎల్కు రూ.1,294.87 కోట్లు, ఏపీసీపీడీసీఎల్కు రూ.1,162.86 కోట్లు, ఏపీఎస్పీడీసీఎల్కు రూ.1,304.53 కోట్లు కలిపి మొత్తం రూ.3,762.26 కోట్లు నాబార్డు నుంచి రుణం తీసుకుంటున్నట్లు వివరించారు. చంద్రబాబు సర్కారు ఇప్పటికే డిస్కమ్స్ పేరిట వివిధ బ్యాంకుల నుంచి విద్యుత్, బొగ్గు కొనుగోళ్ల పేరుతో రూ.5,473 కోట్ల అప్పులకు గ్యారెంటీ ఇచ్చింది. ప్రస్తుత రూ.3,762.26 కోట్లు కూడా కలిపితే డిస్కమ్స్ అప్పులు రూ.9,235.26 కోట్లకు ప్రభుత్వం గ్యారెంటీ ఇచ్చినట్లయ్యింది.

కూటమి పాలనలో వ్యవసాయ సంక్షోభం

మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్బాబు

సాక్షి, అమరావతి: చంద్రబాబు కూటమి పాలనలో రాష్ట్రంలో వ్యవసాయ రంగం పరిస్థితి అత్యంత దారుణంగా ఉందని, ఒకవైపు వరసగా ప్రకృతి వైపరీత్యాలు.. మరోవైపు ప్రభుత్వం నుంచి ఏ మాత్రం సహాయం అందక రైతులు విలవిల్లాడుతున్నారని మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్సీపీ అవనిగడ్డ నియోజకవర్గం సమన్వయకర్త సింహాద్రి రమేష్బాబు విమర్శించారు. తాడేపల్లి వైఎస్సార్సీపీ కేంద్ర కార్యాలయంలో సోమవారం మీడియాతో ఆయన మాట్లాడారు. ఈ సీజన్లో రాష్ట్రంలో 83 లక్షల టన్నుల ధాన్యం పండుతుందని అంచనా వేయగా, 51లక్షల టన్నుల ధాన్యమే కొంటామని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అంటున్నారని, అది కూడా కనీసం కార్యరూపం దాల్చడం లేదని సింహాద్రి ధ్వజమెత్తారు. ఇప్పుడు భారీవర్షాల ప్రమాదం పొంచి ఉన్నా.. ప్రభుత్వం కనీస ముందుజాగ్రత్త చర్యలు తీసుకోలేదని, చాలా చోట్ల ధాన్యం కళ్ళాల్లోనే ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో రైతుల దగ్గరకు వెళ్లి వారి సమస్యల గురించి ఆరా తీసి, వాటిని ప్రస్తావిస్తున్న ప్రతిపక్ష వైఎస్సార్సీపీ నేతలను దారుణంగా నిందిస్తున్నారని ఆక్షేపించారు. ''1318 రకం ధాన్యాన్ని అసలు కొనుగోలు చేయట్లేదు. ఆ బ్రీడ్ను మార్టేరు వ్యవసాయ పరిశోధన కేంద్రం నుంచి ప్రభుత్వమే సరఫరా చేసింది. అయినా సరే, కొనడం లేదు. ఇప్పుడు పండించే పంట అంతా విత్తనాలకే తప్ప తినడానికి పనికి రాదని సీఎం చంద్రబాబు మాట్లాడుతున్నారు. అవి ప్రభుత్వం సరఫరా చేసినవే. వాస్తవానికి బీపీటీలు, 2716 రకం ధాన్యం అంతా తినడానికి పనికొచ్చేవే. ఓ వైపు వరుస ప్రకృతి వైపరీత్యాలు వెన్నాడుతుంటే.. మరోవైపు ప్రభుత్వం ధాన్యం కొనక, మద్దతు ధరలు లేక రైతులు అల్లాడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో బీపీటీలు 75 కేజీల బస్తాను రూ.2,200కు కొన్నారు. ఇవాళ వాటినే రూ.1,250కు రైతులు తెగనమ్ముకోవాల్సి వస్తోంది. ఈ దౌర్భాగ్య స్థితి నుంచి రైతాంగాన్ని గట్టెక్కించాలి.'' అని మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్బాబు డిమాండ్ చేశారు.

వరి వేస్తే కొనేవారే ఉండరు..

గోపీనాథపట్నం ప్రజావేదికలో సీఎం చంద్రబాబు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: 'వరి పంట వేస్తే.. కొనేవారే ఉండరు. ఒక పంట తప్పదు కాబట్టి వరి వేద్దాం.. మరో పంట మారుద్దాం. మెట్ట ప్రాంతాల్లో ఆదాయం వచ్చే పంటలు వేసుకోవాలి..' అని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రైతులకు సూచించారు. ఏలూరు జిల్లా ఉంగుటూరు మండలం గోపీనాథపట్నంలో సోమవారం జరిగిన ప్రజావేదికలో ఆయన మాట్లాడారు. వరి వల్ల షుగర్ (డయాబెటిస్) వస్తుందన్నారు. రైతులు వాణిజ్యపంటల వైపు మరలాలని పేర్కొన్నారు. జిల్లాలో పరిశ్రమల ఏర్పాటుకు ముందుకు రావాలని కోరారు.

మహిళలు గంజాయి అమ్మకాల్లో లేడీ డాన్లుగా మారారు

మహిళలు గంజాయికి బానిసలవుతున్నారని, ఆడవారు గంజాయి అమ్మే పరిస్థితికి వచ్చారని, లేడీ డాన్లుగా మారారని పేర్కొన్నారు. 2027 గోదావరి పుష్కరాల కంటే ముందే పోలవరం ప్రాజెక్టును పూర్తిచేస్తామని చెప్పారు. త్వరలో చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని తీసుకొచ్చి మెట్ట ప్రాంతాన్ని సస్యశ్యామలం చేస్తామని ఆయన చెప్పారు.

రాజీనామాను ఉపసంహరించుకున్న జకియా ఖానం

సాక్షి, అమరావతి: శాసనమండలి వైస్ చైర్పర్సన్ మయానా జకియా ఖానం ఎమ్మెల్సీ పదవికి చేసిన రాజీనామాను ఉపసంహరించుకున్నారు. రాష్ట్రంలో 2024 ఎన్నికల అనంతరం వైఎస్సార్సీపీ తరపున ఎన్నికైన ఆరుగురు ఎమ్మెల్సీలు పదవులకు రాజీనామా చేశారు. దీనిపై తుది నిర్ణయం తీసుకోవడానికి ముందు ఆ ఎమ్మెల్సీల అభిప్రాయాలు తెలుసుకునేందుకు సోమవారం వారితో చైర్మన్ ప్రత్యేకంగా సమావేశమయ్యారు. చైర్మన్తో భేటీకి జకియాఖానం, కర్రి పద్మశ్రీ, బల్లి కళ్యాణచక్రవర్తి, మర్రి రాజశేఖర్, జయమంగళ వెంకటరమణ హాజరయ్యారు. ఒక్కొక్కరితో చైర్మన్ విడివిడిగా మాట్లాడి వారి అభిప్రాయాలు తెలుసుకున్నారు. అనంతరం తన రాజీనామాను ఉపసంహరించుకుంటున్నట్లు తెలియజేస్తూ మండలి చైర్మన్కు జకియా ఖానం లేఖ అందించారు. ఆమె ఇటీవల బీజేపీలో చేరిన విషయం తెలిసిందే. ఈ సమావేశానికి పోతుల సునీత మాత్రం హాజరుకాలేదు.

మాదకద్రవ్యాలకు హబ్గా నెల్లూరు

- 300 మంది డెలివరీ బాయ్స్తో గంజాయి చేరవేత
- ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్రెడ్డి

నెల్లూరు (స్టోన్హౌస్పేట): గతంలో నిజాయితీకి, మంచి మనుషులకు ప్రతీకగా ఉండే నెల్లూరు నగరం.. చంద్రబాబు ప్రభుత్వం ఏర్పడిన తరువాత మాదక ద్రవ్యాలకు హబ్గా మారిందని వైఎస్సార్సీపీ నెల్లూరు నగర నియోజకవర్గ ఇన్చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్రెడ్డి విమర్శించారు. సోమవారం ఇక్కడ ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం నెల్లూరు నగరం మాదకద్రవ్యాలకు నిలయంగా మారిపోయిందని, లా అండ్ ఆర్డర్ అదుపు తప్పి నేరాలు విచ్చలవిడిగా జరుగుతున్నాయని చెప్పారు. పోలీసు ఇంటెలిజెన్స్ వ్యవస్థ నిర్వీర్యమై నేరాలకు క్యాపిటల్గా మారిందన్నారు. నెల్లూరులో విచ్చలవిడిగా దొరుకుతున్న గంజాయే దీనికి ప్రధాన కారణమని చెప్పారు. గంజాయికి బానిసలైనవారు ఇళ్లమీదకు వెళ్లి దాడులు చేస్తున్నారని, రూ.200కు రూ.300కు గొంతులు కోస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. చంద్రబాబు ప్రభుత్వం వచ్చిన తరువాత ఇలాంటివి నిత్యకృత్యమయ్యాయన్నారు. 24 గంటలు మద్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చి విచ్చలవిడిగా విక్రయించడం, విపరీతంగా గంజాయి, చీప్ లిక్కర్ దొరుకుతుండడం వల్ల నెల్లూరు నగరం నేరాలకు అడ్డాగా మారిందన్నారు. చంద్రబాబు ప్రభుత్వం జైల్లో ఖైదీలకు ఇంటర్ జోనల్ సిస్టం తీసుకువచ్చి వైజాగ్, రాజమహేంద్రవరం జైళ్లలో ఉన్న ఖైదీలను నెల్లూరు జైలుకు తీసుకొస్తోందని చెప్పారు. వారు నెల్లూరు జైల్లో ఉంటున్న ఖైదీలను వాడుకుని నెల్లూరులో గంజాయి విక్రయాలు సాగిస్తున్నారన్నారు. నగరంలో 300 మందిని డెలివరీ బాయ్స్గా పట్టుకుని వారి ద్వారా గంజాయిని విపరీతంగా యువతకు చేరవేస్తున్నారని చెప్పారు. మెడికల్, ఇంజినీరింగ్ విద్యార్థులకు గంజాయి అలవాటు చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. గంజాయి తీసుకుంటున్న యువత చీప్ లిక్కర్కు కూడా అలవాటై హత్యలకు పాల్పడుతున్నారని చెప్పారు. ఈ పరిణామాల్లోనే కమ్యూనిస్టు పెంచలయ్య హత్య జరిగిందన్నారు. పెంచలయ్య మృతికి నిరసనగా మంగళవారం వామపక్షాలు తలపెట్టిన బంద్కు సంపూర్ణ మద్దతు ఇస్తున్నట్లు ఆయన చెప్పారు. అనంతరం ఆయన నేతలతో కలిసి సేవ్ ది నెల్లూరు అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు.

డ్రామాలొద్దు..!

విపక్షసభ్యులకు ప్రధాని మోదీ చురకలు

- నిర్మాణాత్మక, విధానాత్మక చర్చలకు పార్లమెంట్ వేదిక కావాలి
- శీతాకాల సమావేశాల ఆరంభానికి ముందు పార్లమెంట్ ప్రాంగణంలో ప్రధాని ప్రసంగం
- బిహార్ ఓటమి నైరాశ్యాన్ని సభలో చూపొద్దని విపక్షాలకు హితవు
- కొత్త వ్యూహాల కోసం మీకు చిట్కాలు చెపుతానని ఎద్దేవా

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంట్ శీతాకాల సమావేశాలకు కొద్దిసేపటిముందు పార్లమెంట్ ప్రాంగణంలో విపక్షసభ్యులకు హితబోధచేస్తూ ప్రధాని మోదీ పలు విమర్శనాత్మక, వ్యంగ్య వ్యాఖ్యలుచేశారు. ''పలు రాష్ట్రాల శాసనసభ ఎన్నికలకు కసరత్తు చేసే వ్యాయామశాలగా పార్లమెంట్‌ను మార్చొద్దు. ఇటీవల ముగిసిన బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరాభవాన్ని చవిచూసిన విపక్షపార్టీలు ఆ నైరాశ్యాన్ని పార్లమెంట్‌లో ప్రదర్శించాలనుకుంటున్నాయి. పార్లమెంట్ పవిత్రమైంది. ఇది నాటకాలు వేసే రంగస్థలం కాదు. పార్లమెంట్ అనేది నిర్మాణాత్మకమైన, ఫలవంతమైన చర్చలు, సద్విమర్శలకు పట్టుగొమ్మ. బలమైన ఆధారాలతో ప్రభుత్వంపై విమర్శలకు విపక్షాలు దిగుతాయంటే నేను సైతం వారికి కొన్ని చిట్కాలు చెబుతా'' అని మోదీ చురకలంటించారు.

డ్రామాలకు వేరే స్థలాలున్నాయ్..

''నాటకాలు ప్రదర్శించడానికి పార్లమెంట్ వేదిక కాదు. వాటికి వేరే వేదికలున్నాయి. అక్కడ వేసుకోండి మీ డ్రామాలు. ఇది ప్రజాసంక్షేమాన్ని కాంక్షిస్తూ చట్టాలుచేసే పవిత్ర స్థలి. డ్రామాలొద్దు.. పనిచూడండి. అయినాసరే నినాదాలు చేస్తామంటే మీరు దేశంలో ఎక్కడైనా చేసుకోండి. గతంలో ఓడిపోయిన రాష్ట్రాల్లోనూ పెద్దపెద్ద ప్రసంగాలిచ్చారు. భవిష్యత్తులో ఓటమిని చవిచూడబోయే నియోజకవర్గాలకు వెళ్లి ప్రసంగాలివ్వండి. పార్లమెంట్ విషయానికొచ్చేసరికి మీ దృష్టంతా కేవలం విధానపర నిర్ణయాలపై జరపాల్సిన విస్తృతస్థాయి చర్చల మీదనే ఉండాలి. నినాదాల మీద కాదు. బిహార్‌లో మా అద్వితీయమైన విజయాన్ని చూశాకైనా విపక్ష సభ్యులు బాధ్యతతో వారి నియోజకవర్గాల్లో పనులు నిర్వర్తించాలని తెలుసుకోవాలి. అంతేగానీ రాబోయే ఎన్నికలకు సన్నద్ధమయ్యేందుకు కసరత్తు క్రీడాస్థలిగా పార్లమెంట్‌ను దుర్వినియోగం చేయొద్దు'' అని మోదీ వ్యాఖ్యానించారు.

ఓటమిని జీర్ణించుకోలేకపోతున్నారు

''బిహార్‌లో ఎదురైన ఘోర పరాభవాన్ని విపక్షపార్టీలు ఇప్పటికీ జీర్ణించుకోలేకపోతున్నాయి. ఈ ఓటమి నుంచి పుట్టుకొచ్చిన ఆక్రోశంతో పార్లమెంట్ వంటి వేదికలపై గందరగోళం సృష్టించకూడదు. మా విజయం కూడా దురహంకారంగా ఏమీ మారబోదు. సమాచారాత్మక సద్విమర్శను మేం కోరుకుంటున్నాం. సభ్యులందరూ నిర్మాణాత్మక, కచ్చితత్వంతో కూడిన సద్విమర్శలకే పెద్దపీట వేయాలి. అప్పుడే పౌరులకు సైతం మన నుంచి సరైన సందేశం వెళ్తుంది. ఇలాంటి సంస్కృతినే పార్లమెంట్ సమావేశాల నుంచి పౌరులు కోరుకుంటున్నారు. దేశానికి ఇదే అత్యావశ్యకం'' అని మోదీ అన్నారు. ''పార్లమెంట్ కార్యకలాపాలపై విపక్షాల ఓటమి నీడ పడకుండా చూసుకోవాలి. ఈసారి శీతాకాల సమావేశాల్లో అన్ని పార్టీల సభ్యుల నుంచి బాధ్యత, సమతుల్యత, సమగౌరవాన్ని ఆశిస్తున్నా. బిహార్ ఎన్నికల్లో నమోదైన అత్యధిక పోలింగ్ శాతం అనేది ప్రజాస్వామ్యంలోని గొప్పతనాన్ని చాటుతోంది. ఈ ఎన్నికల ఓటమి నుంచి విపక్షాలు వెనువెంటనే తేరుకొని తమ విపక్షపాత్రను సమర్థవంతంగా పోషిస్తాయని ఆశిస్తున్నా'' అని అన్నారు.



వాళ్ల పదేళ్ల ఆటను జనం మెచ్చలేదు

''విపక్ష పార్టీలు గత దశాబ్దాకాలంగా ఆడుతున్న రాజకీయ క్రీడలను ఇప్పటికీ పౌరులు మెచ్చట్లేరు. ఇకనైనా ఆట తీరును విపక్షాలు మార్చుకోవాలి. ఈ విషయంలో ఏమైనా సలహాలు ఇచ్చేందుకు నేను సిద్ధం. కావాలంటే కొన్ని చిట్కాలు చెప్తా'' అని మోదీ వెటకారంగా మాట్లాడారు. ''ఇప్పటికైనా పార్లమెంట్ సమావేశాల్లో విపక్షాలు నెరవేర్చాల్సిన విధ్యుక్తధర్మాన్ని గుర్తెరగాలి. ఓటమి నుంచి వాళ్లింకా తేరుకోలేదని నిన్న వాళ్ల నేతలు చేసిన ప్రసంగాలు వింటే అర్థమవుతోంది. ఓటమి అనేది వాళ్లను ఎంతగా చిత్రవధ చేస్తోందో తెలుస్తోంది'' అని అన్నారు. ''సభలో చర్చల వేళ కొత్త తరం సభ్యులకు మాట్లాడే అవకాశం కల్పించాలి. అనుభవజ్ఞుల అనుభవసారాన్ని పార్లమెంట్ గ్రహిస్తూనే భావినేతల తాజా ఆలోచనలకూ పార్లమెంట్ తగు ప్రాతినిధ్యం కల్పిస్తుంది'' అని మోదీ అన్నారు.

నిలదీస్తే డ్రామాలంటారా?

- సమస్యలపై చర్చకు అనుమతించకపోవడమే అసలైన డ్రామా
- మోదీ 'డ్రామా' వ్యాఖ్యలపై ప్రియాంకా గాంధీ తీవ్ర ఆగ్రహం

న్యూఢిల్లీ: డ్రామాలు ఆడొద్దంటూ ప్రధాని మోదీ చేసిన వ్యాఖ్యలపై ప్రియాంకగాంధీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. సోమవారం పార్లమెంట్ ప్రాంగణంలో మీడియాతో ఆమె మాట్లాడారు. ''ప్రజాస్వామ్యానికి దేవాలయమైన పార్లమెంట్ అంటే ఏంటో మాకూ తెలుసు. ఇది డ్రామాలాడే స్థలం కాదు. పట్టిపీడిస్తున్న ప్రజాసమస్యలను పార్లమెంట్ వేదికగా ఎత్తిచూపితే డ్రామా ఎలా అవుతుంది?. పౌరసమస్యలపై చర్చకు ప్రభుత్వం అనుమతి ఇవ్వకపోవడమే అసలైన డ్రామా. ప్రజాస్వామ్యయుత చర్చలకు తావివ్వకపోవడమే నిజమైన డ్రామా. ప్రజలకు సంబంధించిన అంశాలపై సమాలోచనలు, సంప్రదింపులు జరక్కుండా అడ్డుకోవడమే అసలైన డ్రామా. పెను సమస్యగా మారిన వాయు కాలుష్యంపై మాట్లాడాం. ఆ అంశాన్ని మేం ప్రస్తావించకూడదా?. ఇలాంటి విషయాలపై విస్తృతస్థాయి చర్చ అక్కర్లేదా? దేశరాజధాని వాయుకాలుష్య కోరల్లో చిక్కుకోవడం సిగ్గుచేటు. ఢిల్లీలోని వృద్ధులు కాలుష్యంతో ఇబ్బందిపడుతున్నారు. ఆస్తమాతో బాధపడేవాళ్లు, ఇతర శ్వాససంబంధ సమస్యలు ఉన్న వాళ్లతో ఢిల్లీ ఆస్పత్రులు కిక్కిరిసిపోతున్నాయి. ఇంత జరుగుతున్నా చర్చించకుండా కూర్చోవాలా?'' అని ప్రియాంక నిలదీశారు.

'వెదర్' వ్యాఖ్యలపై మండిపాటు

శీతాకాలపు ప్రకృతి సోయగాలను ఆస్వాదించండి అంటూ మీడియా ప్రతినిధులతో మోదీ చేసిన వ్యాఖ్యలపై ప్రియాంకాగాంధీ మండిపడ్డారు. ''వెదర్‌ను చూసి ఎంజాయ్ చేయండి అని మోదీ ఉచిత సలహాను పడేశారు. కాలుష్యంతో పొగచూరిన ఈ వాతావరణాన్ని ఢిల్లీవాసులు ఆస్వాదించాలా? ఢిల్లీలో జనసమ్మర్ధ ప్రాంతాల్లోకి ప్రధాని వస్తేనే అసలెంత కాలుష్యముందో ఆయనకు బోధపడుతుంది'' అని ప్రియాంక హితబోధ చేశారు.

ఆయనదంతా కపటనాటకం: ఖర్గే

''రక్తికట్టించేలా నాటకాలు వేసేది ప్రధాని మోదీయే. ఆయన కపటనాటక సూత్రధారి. పార్లమెంట్‌లో విపక్షాలు డ్రామాలు ఆడుతాయనడం ఆయనకే చెల్లింది. ప్రజాసమస్యలపై మాట్లాడాల్సిందిపోయి ప్రధాని నిజమైన డ్రామాలేస్తున్నారు. ఇకనైనా దృష్టిమరల్చే డ్రామాలకు తెరదింపి బీజేపీ వాస్తవిక సమస్యలపై దృష్టిపెట్టాలి. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, ఆర్థిక అసమానతలు, దేశ వనరుల లూటీతో జనం అవస్థలు పడుతుంటే అధికారంలో ఉన్న నేతలు మాత్రం దురహంకారంతో డ్రామాలాడుతున్నారు'' అని కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే 'ఎక్స్'లో వ్యాఖ్యానించారు. ''ప్రజావశ్యక సమస్యలను విపక్షాలు పార్లమెంట్‌లో ప్రస్తావించడం ప్రధాని మోదీకి అస్సలు గిట్టదు. పార్లమెంట్ సజావుగా సాగకపోవడానికి మోదీ ధోరణే అసలు కారణం'' అని జైరాం రమేశ్ అన్నారు.

'డిజిటల్ అరెస్ట్' దర్యాప్తు సీబీఐకి

అన్ని రాష్ట్రాలు సహకారం అందించాలి ● సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

సాక్షి, న్యూఢిల్లీ: డిజిటల్ అరెస్టుల పేరుతో ప్రజలను మోసగించి, నిలువు దోపిడీ చేస్తున్న కేసులు పెరిగిపోవడంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేశారు. దేశవ్యాప్తంగా ఇటువంటి కేసులు వెలుగులోకి వస్తున్నందున వీటన్నిటిపైనా ఏకీకృత దర్యాప్తు జరపాల్సిన అవసరముందని పేర్కొంది. ఈ కుంభకోణం విచారణ బాధ్యతను సీబీఐకి అప్పగిస్తూ సోమవారం ఆదేశాలు జారీ చేసింది. ఈ అంశాన్ని అత్యంత ప్రాధాన్యంగా భావించాలని సీబీఐకి స్పష్టం చేసింది. ఈ విషయంలో రాష్ట్రాలు సీబీఐకి సహకరించాలని ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వాధికారులు, పోలీసులు, దర్యాప్తు విభాగాల పేరు చెప్పుకుని సైబర్ నేరగాళ్లు వీడియో, ఆడియో కాల్స్ ద్వారా బాధితులపై ఒత్తిడి తెచ్చి, డబ్బులు వసూలు చేస్తున్న కేసులు పెరిగిపోతుండటంపై ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ) జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చిల ధర్మాసనం ఆందోళన వ్యక్తం చేసింది. ఈ కేసుల దర్యాప్తు విషయంలో బీజేపీయేతర పాలిత తెలంగాణ, తమిళనాడు, బెంగాల్, కర్నాటక సహా అన్ని రాష్ట్రాలు సీబీఐకి సహకారం అందించాలని కోరింది. అదే సమయంలో, కృత్రిమ మేధ సాంకేతికతను వాడుకుంటూ సైబర్ నేరగాళ్ల బ్యాంకు అకౌంట్లను ఎందుకు ఫ్రీజ్ చేయలేకపోతోందంటూ ఆర్‌బీఐని ప్రశ్నించింది. సమాధానమివ్వాలంటూ నోటీసు జారీ చేసింది. హరియాణాకు చెందిన వృద్ధ దంపతులు రాసిన లేఖ ఆధారంగా సుమోటోగా విచారణ చేపట్టిన ధర్మాసనం పలు ఆదేశాలను వెలువరించింది. డిజిటల్ అరెస్ట్ కేసులపై సీబీఐ దర్యాప్తునకు అవసరమైన వివరాలను అందించాలని సంబంధింత ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ వేదికలను కోరింది. ఇతర దేశాల్లో ఉంటూ ఈ దందా సాగిస్తున్న సైబర్ నేరగాళ్ల ఆటకట్టించేందుకు ఇంటర్‌పోల్ సాయం కూడా తీసుకోవాలని సీబీఐని ధర్మాసనం ఆదేశించింది. టెలికం సర్వీస్ ప్రొవైడర్లు ఒక వ్యక్తి లేదా సంస్థకు లెక్కకు మిక్కిలి సిమ్ కార్డులు జారీ చేయకుండా చూడాలని కేంద్ర టెలికం శాఖను కోరింది. సైబర్ నేరగాళ్లకు ఇటువంటి వాటిని అవకాశంగా తీసుకుంటున్నారని తెలిపింది. ఇటువంటి నేరాలపై సమన్వయంతో వ్యవహరించేందుకు ప్రాంతీయ సైబర్ క్రైం కోఆర్డినేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేసుకోవాలని రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలకు సూచించింది. హోం, టెలికం, ఆర్థిక, ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ శాఖలు సైబర్ నేరాల కట్టడికి తీసుకుంటున్న చర్యలను తమ ముందుంచాలని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను కోరింది. మోసగాళ్ల బ్యాంకు ఖాతాలను స్తంభింపజేయాలని స్పష్టం చేసింది. నేరగాళ్ల ముఠాలతో చేతులు కలుపుతున్న బ్యాంకు అధికారుల గుట్టును కనిపెట్టాలంది. తదుపరి విచారణ నాటికి టెలికాం శాఖ అధికారులు స్వయంగా హాజరు కావాలని ఆదేశించింది.

వాయిదాల పర్వం

- ఇరుసభల్లో ఎస్ఐఆర్‌పై చర్చకు పట్టుబట్టిన విపక్షాలు
- ఇప్పటికిప్పుడు కుదరదన్న అధికారపక్షం
- నినాదాలతో వేడెక్కిన శీతాకాల సమావేశాలు

సాక్షి, న్యూఢిల్లీ: పార్లమెంట్ శీతాకాల సమావేశాల తొలిరోజే విపక్షాల ఆందోళనతో లోక్‌సభ అట్టుడికింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) సర్వేపై చర్చించాలని విపక్షాలు పట్టుబట్టాయి. అందుకే లోక్‌సభ స్పీకర్ నిరాకరించడంతో విపక్షసభ్యులు ఆందోళనకు దిగారు. దీంతో పలుమార్లు లోక్‌సభ వాయిదాపడింది.

నివాళులతో మొదలై నినాదాలతో కొనసాగి..

అంతకుముందు సోమవారం ఉదయం 11 గంటలకు జాతీయగీతం జనగణమనతో లోక్‌సభలో సమావేశాలు ప్రారంభమయ్యాయి. ఇటీవల మృతి చెందిన మాజీ సభ్యులకు ప్రస్తుత లోక్‌సభ సభ్యులు నివాళిగా సంతాపం తెలిపారు. అనంతరం స్పీకర్ ఓంబిర్లా ప్రశ్నోత్తరాలు చేపట్టారు. వెనువెంటనే కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, తృణమూల్ కాంగ్రెస్ పార్టీసహా పలు విపక్ష పార్టీల ఎంపీలు తమతమ స్థానాల్లోంచి లేచారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర(ఎస్ఐఆర్) సర్వే అంశంపై లోక్‌సభలో చర్చించాలని పట్టుబట్టారు. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో సభాకార్యకలాపాలను అడ్డుకున్నారు. దీంతో స్పీకర్ ఓంబిర్లా వెంటనే కల్పించుకున్నారు. 'తొలిరోజే సభాకార్యకలాపాలకు అడ్డుతగలడం ఏమాత్రం మంచి పద్ధతి కాదు. సభలో విధానాత్మక, నిర్మాణాత్మక చర్చలు జరగాలి. సభలో సమ్మతి, అసమ్మతి రెండు ఉన్నా, చర్చల ద్వారానే అన్నింటికీ సమాధానం దొరుకుతుంది. అతిపెద్ద ప్రజాస్వామ్య దేవాలయమైన పార్లమెంట్‌ను నినాదాలతో అడ్డుకోకూడదు. ప్రశ్నోత్తరాలు కొనసాగనివ్వండి'' అని స్పీకర్ అన్నారు. అయినప్పటికీ విపక్ష ఎంపీలు వెనక్కి తగ్గకుండా, ఎస్ఐఆర్‌పై చర్చను కోరుతూ పోడియం వద్దకు వచ్చి నినాదాలు చేశారు. దీంతో స్పీకర్ సభను మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు. సభ తిరిగి ప్రారంభమయ్యాక సైతం విపక్ష సభ్యుల వైఖరితో మార్పు రాలేదు. విపక్షాల ఆందోళన ఎక్కువవడంతో కేవలం 12 నిమిషాల తర్వాత సభ మళ్లీ వాయిదాపడింది. మధ్యాహ్నం రెండు గంటలకు సభ మళ్లీ మొదలైంది.

బిల్లులను ప్రవేశపెట్టిన సీతారామన్

పొగాకు, పొగాకు ఉత్పత్తులపై ఎక్సయిజ్ డ్యూటీ, పాన్ మసాలాపై కొత్త సెస్ వేసేందుకు ఉద్దేశించిన బిల్లుతోపాటు, సెంట్రల్ ఎక్సయిజ్(సవరణ) బిల్లు–2025, హెల్త్‌సెక్యూరిటీ, నేషనల్ సెక్యూరిటీ సెస్ బిల్లు–2025లను ఈలోపే ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ప్రస్తుతం మణిపూర్‌లో రాష్ట్రపతిపాలన కొనసాగుతుండటంతో మణిపూర్ జీఎస్‌టీ(సవరణ) బిల్లును సైతం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. విపక్ష సభ్యుల ఆందోళనల మధ్యే ఈ బిల్లుకు లోక్‌సభ ఆమోదముద్ర వేసింది. 2025–26 ఆర్థికసంవత్సర గ్రాంట్లకు సంబంధించిన అనుబంధ పద్దును సైతం సీతారామన్ లోక్‌సభలో ప్రవేశపెట్టారు. తర్వాత సభ మరోసారి వాయిదాపడింది. తర్వాత సభ మొదలైనా విపక్ష సభ్యుల నినాదాలు ఆగలేదు. దీంతో చేసేదిలేక స్పీకర్ మధ్యాహ్నం 2.20 గంటలకు సభను మంగళవారానికి వాయిదావేశారు.

రాజ్యసభలోనూ..

ఎగువసభలోనూ దాదాపు ఇవే దృశ్యాలు కనిపించాయి. ఎస్ఐఆర్‌పై చర్చకు విపక్షాలు పట్టుబట్టాయి. దీంతో పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు స్పందించారు. ''ఎస్ఐఆర్‌పై చర్చకు ప్రభుత్వం వెనుకడుగు వేయట్లేదు. అయితే నిర్ణీత కాలావధిలోపు ఫలానా సమయంలోనే చర్చించాలనే మొండిపట్టును విపక్షాలు విడనాడాలి. ఎస్ఐఆర్‌పై చర్చ అంశంలో కేంద్రానికి మరింత సమయం కావాలి'' అని ఆయన అన్నారు. మంత్రి సమాధానంతో సంతృప్తిచెందని విపక్ష సభ్యులు వెనువెంటనే రాజ్యసభ నుంచి వాకౌట్‌చేశారు. అంతకుముందు ఎస్ఐఆర్‌సహా పలు అంశాలపై తక్షణం చర్చ జరపాలంటూ తొమ్మిది మంది విపక్ష సభ్యులు వేర్వేరుగా రాజ్యసభ చైర్మన్ సీపీ రాధాకృష్ణన్‌కు నోటీస్‌లను అందజేశారు. ఉపరాష్ట్రపతిగా ప్రమాణంచేశాక రాజ్యసభ డిప్యూటీచైర్మన్ హోదాలో రాధాకృష్ణన్ సేవలందించడం ఇదేతొలిసారికావడం విశేషం. ఈ సందర్భంగా ఆయనను ప్రధాని మోదీ పొగిడారు. ''సాధారణ కుటుంబం నుంచి వచ్చిన రాధాకృష్ణన్ ఉపరాష్ట్రపతి స్థాయికి ఎదగడం మన ప్రజాస్వామ్యంలోని శక్తికి నిదర్శనం. పలు రాష్ట్రాల్లో కీలక పదవుల్లో సేవచేసి గడించిన అనుభవం రాజ్యసభ సజావుగా సాగేందుకు తోహదపడనుంది'' అని ఆయన అన్నారు. తర్వాత ఖర్గే మాట్లాడారు. ''గత ఉపరాష్ట్రపతి హఠాత్తుగా రాజీనామాచేయడం అధికార పక్షాన్ని సైతం విస్మయపరిచింది. రాజ్యసభలో అధికార, విపక్షాల మధ్య సమతూకం పాటిస్తూ విపక్ష సభ్యులకు సైతం సమస్యలపై మాట్లాడే అవకాశం కల్పించాలని విజ్ఞప్తిచేస్తున్నా'' అని ఖర్గే అన్నారు.

లక్ష్మణరేఖను దాటొద్దు

రాజ్యసభ ఛైర్మన్ హోదాలో తొలిసారిగా ఉపరాష్ట్రపతి దిశానిర్దేశనం

న్యూఢిల్లీ: ఇటీవల ఉపరాష్ట్రపతిగా ప్రమాణం చేసిన సీపీ రాధాకృష్ణన్ సోమవారం మొదలైన పార్లమెంట్ శీతాకాల సమావేశాల్లో తొలిసారిగా రాజ్యసభ ఛైర్మన్‌గా బాధ్యతలు నిర్వర్తించారు. రాజ్యసభలో సభాకార్యకలాపాలు మొదలుకాగానే సభ్యులను ద్దేశించి రాధాకృష్ణన్ మాట్లాడారు. ''రాజ్యాంగబద్ధ సంస్థలను సభ్యులంతా గౌరవించాలి. దేశానికి సంబంధించిన తమ బాధ్యతలను సభ్యులు గుర్తెరగాలి. దేశాన్ని అభివృద్ధి చెందిన భారత్‌గా అవతరింపజేయడంలో మీ వంతు కృషిచేయండి. ఈసారి సిట్టింగ్‌లో చాలా ఎక్కువ అంశాలపై రాజ్యసభలో చర్చించాల్సి ఉంది. సమయం చాలా తక్కువ ఉండటంతో ఇది నాకూ, మీకూ ఎంతో సవాల్‌తో కూడిన విషయం. రాజ్యసభ ఛైర్మన్‌గా నాకు సాదరస్వాగతం పలికి సభాధ్యక్ష స్థానందాకా వెంట నడిచిన ప్రధాని మోదీ, అన్ని పార్టీల సభ్యులకు నా కృతజ్ఞతలు. ప్రధాని మోదీ నా గురించి మాట్లాడేటప్పుడు క్రీడాకారునిగా ఉన్నప్పటి నా గతకాలపు జ్ఞాపకాలు మదిలో మెదిలాయి. క్రీడాకారుడంటేనే కచ్చితమైన నిబంధనలను పాటించాలి. అలాగే ఈ సభలోని సభ్యులు సైతం రాజ్యసభ పార్లమెంటరీ నిబంధనలను తూ.చ. తప్పకుండా పాటించాలి. లక్ష్మణరేఖ దాటకూడదు. లక్షణరేఖకు లోబడే ప్రతి ఒక్క సభ్యుని హక్కులకు విలువ లభిస్తుంది. న్యాయబద్ధమైన అభ్యంతరాలను పరిశీలిస్తా. కర్షకులు, కార్మికులు, వీధి వ్యాపారులు, మహిళలు, యువత, నిరుపేదల ఆకాంక్షలను పార్లమెంట్ ప్రతిబింబించాలి. సమాజంలో ఎస్సీ, ఎస్టీలు, వెనకబడిన, అణచివేతకు గురైన వర్గాల సామాజికన్యాయం, ఆర్థిక సాధికారతే లక్ష్యంగా పనిచేస్తూ రాజ్యాంగంపట్ల మన నిబద్ధతను చాటుదాం. సభ్యులు రాజ్యసభలో ఉన్నంతసేపు తమ ప్రతి రోజు, ప్రతి గంట, ప్రతి నిమిషం, ప్రతి సెకన్‌కాలాన్ని అర్థవంతమైన చర్చల ద్వారా ప్రజాస్వామ్యాన్ని పటిష్టంచేసేందుకు సద్వినియోగం చేయాలి'' అని రాధాకృష్ణన్ అన్నారు.



సభకు నమస్కరిస్తున్న సీపీ రాధాకృష్ణన్

చలి తీవ్రత ఎక్కువే

రానున్న మూడు నెలలకు ఐఎండీ అంచనా

న్యూఢిల్లీ: డిసెంబర్ 2025– 2026 ఫిబ్రవరి వరకు మూడు నెలల సీజన్‌లో చలి తీవ్రత ఎక్కువగానే ఉంటుందని అంచనా వేస్తున్నట్లు భారత వాతావరణ విభాగం(ఐఎండీ) సోమవారం తెలిపింది. మధ్య భారత, వాయవ్య ప్రాంతాలు, దక్షిణాదిన సాధారణం కంటే తక్కువగా ఉష్ణోగ్రతలు నమోదవుతాయని పేర్కొంది. పశ్చిమ హిమాలయ ప్రాంతం, ఈశాన్య రాష్ట్రాలు, తూర్పు, పశ్చిమ భారతంలో మాత్రం సాధారణం కంటే ఎక్కువగానే ఉష్ణోగ్రతలు ఉండొచ్చని ఐఎండీ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ మహాపాత్ర వెల్లడించారు. రాజస్తాన్, ఉత్తర ప్రదేశ్, మధ్య ప్రదేశ్, హరియాణా, పంజాబ్‌తోపాటు మహారాష్ట్రలోని కొన్ని ప్రాంతాల్లో శీతల గాలుల ప్రభావం ఈసారి నాలుగైదు రోజులపాటు అదనంగా ఉంటుందని అంచనా వేశారు. సాధారణంగా డిసెంబర్– ఫిబ్రవరి మధ్య కాలంలో ఈ ప్రాంతాల్లో ఆరు రోజులపాటు శీతల గాలులు వీస్తాయని మహాపాత్ర తెలిపారు. ఈ సీజన్‌లో దేశంలోని అత్యధిక ప్రాంతాల్లో సాధారణం, అంతకంటే తక్కువగానే ఉష్ణోగ్రతలుంటాయని పేర్కొన్నారు. నవంబర్8–18వ తేదీల మధ్య మొదటిసారి శీతల గాలుల ప్రభావం రాజస్తాన్, హరియాణా, మధ్యప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లలోని కొన్ని ప్రాంతాల్లో కనిపించిందన్నారు. అదేవిధంగా, ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు మధ్య, వాయవ్య ప్రాంతాల్లో శీతలగాలుల ప్రభావం ఉండొచ్చని వివరించారు.

ఇజ్రాయెల్‌కు ఐరన్ బీమ్ రక్షణ ఛత్రం

ఈ నెలాఖరుకు సైన్యం చేతికి

టెల్ అవీవ్: ఇజ్రాయెల్ గగనతల రక్షణ వ్యవస్థలను మరింత బలోపేతం చేసుకుంటోంది. ఇప్పటికే ఐరన్ డోమ్ రక్షణ ఛత్రం ఉండగా, తక్కువ ఖర్చుతో లేజర్ వ్యవస్థ 'ఐరన్ బీమ్'ను త్వరలో సమకూర్చుకోనుంది. ఈ విషయాన్ని ఇజ్రాయెల్ రక్షణ శాఖలోని పరిశోధన అభివృద్ధి విభాగం చీఫ్ బ్రిగేడియర్ జనరల్ డేనియల్ గోల్డ్ సోమవారం చెప్పారు. 'ఐరన్ బీమ్ అభివృద్ధి పూర్తయింది, ఈ వ్యవస్థ సామర్థ్యాలను ధ్రువీకరించే సమగ్ర పరిశీలన సైతం ముగిసింది. డిసెంబర్ 30న ఇజ్రాయెల్ మిలటరీకి అందించడానికి సిద్ధంగా ఉన్నాం'అని వివరించారు. దీంతోపాటు తదుపరి తరం ఆయుధ వ్యవస్థల అభివృద్ధి సైతం కొనసాగుతోందన్నారు. రాకెట్లు, శతఘ్నులు, డ్రోన్ల వంటివాటితో ఎదురయ్యే గగనతల ముప్పును ఎదుర్కోవడానికే ఈ భూ ఆధారిత హై–పవర్ లేజర్ వైమానిక రక్షణ వ్యవస్థను తీసుకువచ్చామన్నారు. ఈ వ్యవస్థ యుద్ధరంగంలో పోరాటం తీరునే మార్చేస్తుందని గోల్డ్ ప్రకటించారు. ఈ వ్యవస్థను అభివృద్ధి చేసేందుకు తమకు దశాబ్ద కాలం పట్టిందన్నారు. భవిష్యత్తు సంఘర్షణల కోసం అద్భుతమైన తదుపరి తరం ఆయుధ వ్యవస్థలను అభివృద్ధి చేస్తున్నామన్నారు. వాటిని సరైన సమయంలో కార్యాచరణలోకి తెస్తామని చెప్పారు. ఇటీవలి యుద్ధంలో స్వల్ప–శ్రేణి వ్యూహాత్మక లేజర్ వ్యవస్థలను మోహరించామని, అవి డజన్ల కొద్దీ లక్ష్యాలను విజయవంతంగా అడ్డగించాయని గోల్డ్ ప్రకటించారు. ఇజ్రాయెల్ రక్షణ శ్రేణిలోకి ఐరన్ డోమ్ అదనంగా చేరనుందన్నారు. దీని నిర్వహణ వ్యయం చాలా తక్కువని వివరించారు.

10న సహ చట్టం ప్రధాన కమిషనర్ ఎంపిక

సుప్రీంకు తెలిపిన కేంద్రం

న్యూఢిల్లీ: సమాచార హక్కు చట్టం ప్రధాన కమిషనర్ ఎంపిక, నియామకంపై కేంద్ర ప్రభుత్వం సోమవారం సుప్రీంకోర్టుకు స్పష్టత నిచ్చింది. ఈ నెల 10వ తేదీన ప్రధాని మోదీ అధ్యక్షతన సమావేశ మయ్యే కమిటీ ప్రధాన కమిషనర్‌తోపాటు కమిషనర్ల పోస్టులకు పేర్లను పరిశీలించనున్నట్లు తెలిపింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్ మాల్యా బాగ్చిల ధర్మాసనానికి అదనపు సొలిసిటర్ జనరల్ కేఎం నటరాజ్ ఈ విషయం తెలిపారు. ప్రధాని సారథ్యంలోని ఎంపిక కమిటీలో ప్రతిపక్ష నేత, ఒక కేంద్ర మంత్రి ఉంటారు. ఈ కమిటీ ప్రధాన సహ కమిషనర్‌ను, ఇతర కమిషనర్ల పేర్లను సిఫారసు చేస్తుంది. రాష్ట్రాల సమాచార హక్కు కమిషన్లలో ఖాళీల వివరాలను తమ ముందు ఉంచాలని ధర్మాసనం ఈ సందర్భంగా ఎస్ఐఆసీలను ఆదేశించింది.

మసాలా బాండ్ కేసులో కేరళ సీఎంకు ఈడీ నోటీస్

న్యూఢిల్లీ: మసాలా బాండ్ కేసులో కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌కు, మాజీ మంత్రి థామస్ ఇస్సాక్‌కు, సీఎం చీఫ్ ప్రిన్సిపల్ సెక్రటరీ కేఎం అబ్రహాంకు సోమవారం ఈడీ నోటీసులు పంపింది. కేరళ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్టిమెంట్ ఫండ్ బోర్డ్ అధికారులు రూ.466.91 మేర విదేశీ మారకద్రవ్య నియంత్రణ నిబంధనలను, ఆర్బీఐ షరతు లను ఉల్లంఘించినట్లు ఈడీ ఆరోపిస్తోంది. ఇందుకు సంబంధించి జూన్ 27వ తేదీన కేసు నమోదు చేసింది. కేఐఐఎఫ్‌బీకి కేరళ సీఎం చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు.

లోపల ఉన్న వాళ్లే కరుస్తారు

కుక్కను తీసుకొచ్చినందుకు విమర్శించిన బీజేపీపై రేణుకాచౌదరి ఫైర్

న్యూఢిల్లీ: శీతాకాల సమావేశాలకు హాజరయ్యేందుకు పార్లమెంట్‌కు వచ్చిన కాంగ్రెస్ ఎంపీ రేణుకాచౌదరి వెంట కారులో ఒక వీధిశునకాన్ని తీసుకురావడంపై బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేయగా రేణుకా దీటుగా బదులిచ్చారు. సోమవారం ఉదయం ఒక వీధిశునకాన్ని ఆమె కాపాడి ఇంటికి తీసుకొచ్చారు. తర్వాత వెటర్నరీ వైద్యునికి చూపించేందుకు బయల్దేరారు. డ్రైవర్ ఈమెను మార్గమధ్యంలో పార్లమెంట్ వద్ద దింపేసి వెటర్నరీ ఆస్పత్రికి వెళ్తామనుకున్నాడు. ఈలోపే పార్లమెంట్ వద్ద రేణుక కారులో కుక్క ఉండటం చూసి బీజేపీ నేతలు విమర్శలు మొదలెట్టారు. పార్లమెంట్‌లో చర్చించాల్సిన అంశాలు ఎంత ముఖ్యమైనవో కాంగ్రెస్ నేతలకు బోధపడటం లేదు. ఇలా కుక్కలను తీసుకొచ్చి తమాషా చేస్తున్నారు. ఈ అంశాన్ని రాజ్యసభ ఛైర్మన్ దృష్టికి తీసుకెళ్లాలి'' అని బీజేపీ ఎంపీ జగదాంబికా పాల్ అన్నారు. దీంతో రేణుకాచౌదరి తీవ్రంగా స్పందించారు. ''ప్రభుత్వానికి అసలు కుక్కలంటే గిట్టదనుకుంటా. జంతువులు సమస్యలు చెప్పుకోలేవు. అయినా ఈ శునకం నా కారులో ఉందికదా. బయటకు రాలేదు. అయినా ఇది చాలా చిన్న కుక్క. ఇవేమీ కరవవు. కరిచే వాళ్లు వేరే ఉన్నారు. వాళ్లు పార్లమెంట్ లోపల ఉన్నారు. వీధిశునకాలను కాపాడకూడదని ఏ చట్టంలో రాసి ఉంది?''అని రేణుక వ్యాఖ్యానించారు. దీనిపై కేంద్ర మంత్రి రాందాస్ అథవాలే వెటకారంగా స్పందించారు. ''ఆమె చెప్పింది నిజమే. కుక్కలు అస్సలు కరవవు. విపక్ష సభ్యులు ముఖ్యంగా ఆమె సొంత పార్టీ నేతలే ఇరుసభల్లో హంగామా సృష్టించి కరిచినంత పనిచేస్తారు. పార్లమెంట్‌కు మీరు కుక్కలను వెంట తీసుకొస్తే మేం అధికారాన్ని వెంట తీసుకొస్తాం'' అని అన్నారు.

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 580.10 అడుగులకు చేరింది. శ్రీశైలం నుంచి 37.513 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

పులిచింతల సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 3000 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా దిగువకు 400 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రస్తుత నిల్వ 42.1600 టీఎంసీలు.

పత్తి కొనుగోలుపై సీఐడీ విచారణ

నగరంపాలెం: గతేడాది పత్తి కొనుగోలులో జరిగిన అక్రమాలపై విచారణకు రాష్ట్ర ప్రభుత్వం సీఐడీని ఆదేశించింది. గుంటూరులోని సీసీఐ కార్యాలయాన్ని సీఐడీ అధికారులు సందర్శించారు.

న్యూస్‌రీల్

ఘనంగా గీతా జయంతి

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్య క్షేత్రంపై సోమవారం గీతా జయంతి సందర్భంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ మేనేజర్ పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూ త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజ జీయర్‌స్వామి వారి మంగళా శాసనాలతో గీతా జయంతి మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించామని తెలిపారు. ఉదయం 9.30 గంటలకు శ్రీమద్భగవద్గీత సామూహిక పారాయణం నిర్వహించామని పేర్కొన్నారు. భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారని ఆయన తెలియజేశారు.

నృసింహునికి కిరీటం, కర్ణాభరణాలు బహూకరణ

మంగళగిరి టౌన్: మంగళగిరిలో వేంచేసియున్న శ్రీదేవి భూదేవి సమేత శ్రీ లక్ష్మీ నరసింహస్వామి వారికి కిరీటం, కర్ణాభరణాలు మంగళగిరికి చెందిన దంపతులు సోమవారం బహూకరించారు. మంగళగిరి పట్టణానికి చెందిన వెనిగళ్ల ఉమాకాంతం, భాగ్యలక్ష్మి కుటుంబ సభ్యులు రూ.5 లక్షల వ్యయంతో బంగారు పూత పూయించిన మూడు కిరీటాలు, ఆరు కర్ణాభరణాలు ఆలయ అధికారులకు అందజేశారు. ఏకాదశి పర్వదినం కావడంతో స్వామివారికి, అమ్మవారికి వాటిని ధరింపజేసి దేవస్థాన ప్రధాన అర్చకులు దివి అనంత పద్మనాభాచార్యులు, అర్చకులు నల్లూరి రఘులు శాంతి కల్యాణం నిర్వహించారు. దేవస్థాన కార్యనిర్వహణాధికారి కె.సునీల్‌కుమార్ కల్యాణ మహోత్సవ ఏర్పాట్లు పర్యవేక్షించారు. శాంతి కల్యాణ మహోత్సవంలో వెనిగళ్ల శివకుమార్, తిరుపతమ్మ దంపతులు, జొన్నాదుల వెంకటేశ్వరరావు, రేవతి దంపతులు పాల్గొన్నారు.

సామూహిక భగవద్గీత పారాయణం

మంగళగిరి టౌన్: మంగళగిరి మండలం పెదవడ్లపూడిలో ఉన్న భగవాన్ శ్రీ సత్య షిర్డి సాయిబాబా మందిరంలో గీతాజయంతి పర్వదినాన్ని పురస్కరించుకుని సోమవారం సామూహిక భగవద్గీత పారాయణాన్ని నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని పారాయణం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గీతా జయంతి రోజున కృష్ణ భగవానుడ్ని తలచుకుంటే స్వామి ఆశీస్సులు ఉంటాయని, అందులో భాగంగా గీతా పారాయణం నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మందిర ప్రతినిధి పాతూరి సుధారాణి, నిర్వాహకులు పాతూరి శ్రీనివాసరావు, రాధిక, పలువురు సాయిభక్త బృందం ప్రతినిధులు పాల్గొన్నారు.

పురుగు మందుల వ్యాపారిపై ఎమ్మెల్యే ఫిర్యాదు

నగరంపాలెం(గుంటూరు వెస్ట్) : గత 20 ఏళ్లుగా పురుగు మందుల వ్యాపారం చేస్తున్న ప్రత్తిపాడు మండలం మల్లాయపాలెం గ్రామానికి చెందిన ఓ ఎంటర్‌ప్రైజెస్ యజమాని రైతులు మోసం చేశాడని ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు సోమవారం జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్‌కు ఆయన కార్యాలయంలో ఫిర్యాదు చేశారు. పాత మల్లాయపాలెం, ప్రత్తిపాడు, గింజుపల్లివారిపాలెం, కోయవారిపాలెం పరిసర గ్రామాల్లోని 160 మంది రైతులకు రూ.40 కోట్లకు పైగా ఎగవేశాడని జిల్లా ఎస్పీ దృష్టికి తీసుకొచ్చారు. రైతులకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

కాలేయ మార్పిడిపై కాలయాపన !

- రెండేళ్లుగా ఆరేషన్లు చేసేందుకు ఆపసోపాలు
- జీజీహెచ్‌కు ప్రతిరోజూ చికిత్స కోసం వస్తున్న బాధితులు
- ఆపరేషన్ చేస్తే ప్రాణాలు కాపాడే అవకాశం
- శస్త్రచికిత్సలకు మీనమేషాలు లెక్కిస్తున్న ఆసుపత్రి అధికారులు

జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశశ్వి రమణకు కాలేయ మార్పిడి ఆపరేషన్‌లకు అనుమతి పత్రాన్ని చూపిస్తున్న డాక్టర్ కవిత

గుంటూరు మెడికల్: కాలేయ మార్పిడి ఆపరేషన్లు గుంటూరు జీజీహెచ్‌లో ఉచితంగా చేసేందుకు ప్రభుత్వం జనవరిలోనే అనుమతి ఇచ్చింది. ఇప్పటి వరకు ప్రారంభించకుండా ఆసుపత్రి అధికారులు మీనమేషాల లెక్కిస్తుండటంతో, చికిత్సల కోసం వస్తున్న పేదలు ప్రాణాలు కోల్పోతున్నారు. గుంటూరు జీజీహెచ్‌లో గతంలో మెడికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టులు మాత్రమే అందుబాటులో ఉండేవారు. ప్రతిరోజూ వంద మందికి పైగా పలు గ్యాస్ట్రో ఎంట్రాలజీ సమస్యతో చికిత్స కోసం వస్తున్నారు. వీరిలో 20 మంది కాలేయ సంబంధిత బాధితులే. వీరికి ఆపరేషన్ చేస్తే ప్రాణాలు కాపాడే అవకాశం ఉంటుంది. ఈ నేపథ్యంలో గుంటూరు జీజీహెచ్‌లో కాలేయ మార్పిడి ఆపరేషన్లు చేసేందుకు సర్జికల్ గ్యాస్ట్రో ఎంట్రాలజిస్టును ప్రభుత్వం 2024 ఏప్రిల్‌లో నియమించింది. అందుకు అవసరమైన మిషన్లు సైతం అందజేసింది. కానీ జీజీహెచ్ అధికారులు ఆపరేషన్లు చేసేందుకు చొరవ చూపించడం లేదు.

జనవరిలో అనుమతి

గుంటూరు జీజీహెచ్‌లో చనిపోయిన వారి అవయవాలను సేకరించి, కాలేయ మార్పిడి ఆపరేషన్లు చేసేందుకు జీవన్ ధాన్ ట్రస్టు ఈ ఏడాది జనవరిలో అనుమతి ఇచ్చింది. నేటి వరకు ఒక్క ఆపరేషన్ కూడా ప్రారంభం కాలేదు. ప్రతి రోజూ గుంటూరు జీజీహెచ్‌లో 15 నుంచి 20 మంది వరకు వివిధ రకాల అనారోగ్య సమస్యలు, రోడ్డు ప్రమాదాల్లో, గాయపడి చికిత్స పొందుతూ చనిపోతున్నారు. వారి కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చి, వారు స్వచ్ఛందంగా అవయవదానం చేసేందుకు ముందుకు వచ్చేలా చేసే బాధ్యతలు నిర్వర్తించేందుకు ప్రత్యేకంగా కో–ఆర్డినేటర్‌ను నియమించాల్సి ఉంది. ఇప్పటి వరకు ఆ పోస్టునూ భర్తీ చేయకుండా మిన్నకుండిపోయారు.

గుంటూరు జీజీహెచ్

సమావేశం కాని బ్రెయిన్‌డెడ్ కమిటీ

ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఎవరైనా చనిపోతే, వారి అవయవాలను కుటుంబ సభ్యుల అనుమతితో సేకరించి తీవ్ర అస్వస్థతతో చికిత్స పొందుతున్న వారికి అమర్చడం ద్వారా ప్రాణాలు కాపాడవచ్చు. ఈ ప్రక్రియ కొనసాగించేందుకు తప్పనిసరిగా బ్రెయిన్ డెడ్ కమిటీ అనుమతి కావాల్సి ఉంటుంది. న్యూరాలజిస్టు, న్యూరో సర్జన్, ఎమర్జెన్సీ మెడిసిన్ స్పెషలిస్టులు, సమావేశం నిర్వహించుకుని చికిత్స పొందుతున్న వారు చనిపోయినట్లు నిర్ధారించాల్సి ఉంటుంది. ట్రాన్స్‌ప్లాంట్ కో–ఆర్డినేటర్ పోస్టు భర్తీ చేయకపోవడం, బ్రెయిన్ డెడ్ కమిటీ సమావేశాలు పెట్టకుండా కాలయాపన చేస్తుండటంతో గుంటూరు జీజీహెచ్‌లో కాలేయ మార్పిడి ఆపరేషన్ల ప్రక్రియ ముందుకు కదలడం లేదు.

ఆరోగ్యమే మహా భాగ్యం

ర్యాలీని ప్రారంభిస్తున్న కలెక్టర్

కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా

గుంటూరు వెస్ట్: ఆరోగ్యమే మహా భాగ్యమని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా పేర్కొన్నారు. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా సోమవారం వైద్య ఆరోగ్య శాఖ నిర్వహించిన ర్యాలీని కలెక్టరేట్ ఆవరణలో ఆమె జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మన ఆరోగ్యం .. మన చేతిలోనే ఉందన్నారు. ఈ ఏడాది ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవాన్ని 'హెచ్‌ఐవీ పరీక్ష చేయించుకోండి – సమాచారం కలిగి ఉండండి – సురక్షితంగా ఉండండి' అనే నినాదంతో నిర్వహిస్తున్నామని తెలిపారు. హెచ్‌ఐవీ, ఎయిడ్స్ అంటు వ్యాధులు కాదని, వాటికి గురైన వారిపై వివక్ష అవసరం లేదని స్పష్టం చేశారు. వారితో కలసి తినవచ్చు, జీవించవచ్చని చెప్పారు. ఎయిడ్స్ రహిత సమాజం నెలకొల్పేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని కోరారు. జిల్లాలోని 27 ప్రాథమిక, 47 పట్టణ ఆరోగ్య కేంద్రాల్లో ఉచిత హెచ్‌ఐవీ పరీక్షలు, సూచనలు ఇచ్చేందుకు 10 కౌన్సెలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు.మొబైల్ ఐసీటీసీ ద్వారాను పరీక్షలు చేస్తున్నారని తెలిపారు. హెచ్‌ఐవీతో జీవించే వారికి ప్రభుత్వం ఏఆర్‌టీ పెన్షన్ రూ.4 వేలు చొప్పున 2,634 మందికి అందిస్తున్నామని పేర్కొన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి కె. విజయలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో 3.14 లక్షల మంది హెచ్‌ఐవీతో జీవిస్తున్నారని వెల్లడించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.ఎస్.కె.ఖాజావలి, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, వివిధ కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

5న మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్..

మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ (ఎంపీటీఎం)ను ఈ నెల 5వ తేదీన నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా తెలిపారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ డీఆర్వో షేక్ ఖాజావలితో కలిసి నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించేందుకు నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ఏర్పాట్లను పూర్తిస్థాయిలో సిద్ధం చేసేలా విద్యాశాఖ అధికారులు, మండలస్థాయి అధికారులు, ప్రత్యేక అధికారులు సమన్వయంతో ప్రణాళిక ప్రకారం చర్యలు తీసుకోవాలని చెప్పారు. జిల్లాలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా పట్టణాలు, గ్రామాల్లో పకడ్బందీగా పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. ఉగాది నాటికి ప్రారంభించటానికి జిల్లాలో రూఫ్ పూర్తయిన 5,470, రూఫ్ లెవల్ స్థాయిలో ఉన్న 9,100 ఇళ్ల పనులు వచ్చే ఏడాది మార్చి చివరి నాటికి పూర్తి అయ్యేలా హౌసింగ్ అధికారులను సమన్వయం చేసుకుంటూ మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, చర్యలు తీసుకోవాలని చెప్పారు. ధ్యాన్యం కొనుగోలు చేసిన ఆరు గంటల్లోనే రైస్ మిల్లుల్లో రైతులకు అక్నాలెడ్జిమెంట్ ఇచ్చేలా తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో పరిస్థితులను పర్యవేక్షించాలని తెలిపారు. జెడ్పీ సీఈఓ జ్యోతిబసు, హౌసింగ్ పీడీ ప్రసాద్, డీఎంహెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి, డీపీఓ సాయికుమార్, డీఈఓ రేణుక పాల్గొన్నారు.

నవోదయలో పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

గుంటూరు రూరల్: కేంద్రీయ విద్యాలయాలు, నవోదయ విద్యాలయాల్లో 14,967 (13,025 టీచింగ్, 1942 నాన్ టీచింగ్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని నల్లపాడు కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ బి.శేఖర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పోస్టులను బట్టి అభ్యర్థులు ఇంటర్, డిప్లమో, డీఈడీ, డిగ్రీ, పీజీ, బీఈడీ, బీపీఈడీ, బీఎల్ఐసీ, సీటీఈటీ, ఉత్తీర్ణత అర్హత కలిగి ఉండాలన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు తమ అర్హతలను బట్టి పోస్టులకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈనెల 4 చివరి తేదీ అని తెలిపారు. మరిన్ని వివరాలకు www. kvsangathan. nic. in వెబ్‌సైట్‌ను సందర్శించాలని ఆయన సూచించారు.

ఇద్దరు అంతర్రాష్ట్ర దొంగలు అరెస్ట్

మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

బంగారు, వెండి వస్తువులను పరిశీలిస్తున్న జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

- రూ.26.50 లక్షల బంగారం, వెండి సొత్తు స్వాధీనం
- తెలుగు రాష్ట్రాల్లో 78కి పైగా కేసులు నమోదు

నగరంపాలెం(గుంటూరు వెస్ట్) : ఇళ్లల్లో చోరీలకు పాల్పడే ఇద్దరు అంతర్రాష్ట్ర పాత నేరస్తులతో పాటు దొంగిలించిన సొత్తు విక్రయించి దొంగలకు సహకరించే వ్యక్తిని కూడా గుంటూరు సీసీఎస్, లాలాపేట పీఎస్ పోలీసులు అరెస్ట్ చేశారు. జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో కేసు వివరాలను జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. గుంటూరు సంపత్‌నగర్ మెయిన్‌రోడ్డులో ఉంటున్న అవ్వారి వెంకటప్పయ్యశాస్త్రి గత నెల 8న తిరుపతి వెళ్లి 12న ఇంటికొచ్చారు. ప్రధాన ద్వారం తాళాలు పగుల కొట్టి ఉంది. బీరువాలో దాచిన 152 గ్రాముల బంగారు నగలు కనిపించలేదు. దీనిపై బాధితుడు లాలాపేట పీఎస్‌లో ఫిర్యాదు చేశారు. సీఐ శివప్రసాద్ కేసు దర్యాప్తు చేపట్టారు. దీంతో గుంటూరు సీసీఎస్, లాలాపేట పోలీసులు పాత నేరస్తుల కదలికలపై దృష్టి సారించారు. గుంటూరు మార్కెట్ సెంటర్‌లో సంచరిస్తున్న గోరంట్ల తూర్పుబజార్‌కు చెందిన చిల్లర సురేష్, విజయవాడ రామలింగేశ్వరనగర్ గంగానమ్మ గుడి పక్కన ఉంటున్న కాజా నాగవీరభాస్కరరావును అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారు నేరం ఒప్పుకోవడంతో ఇద్దర్ని అరెస్ట్ చేశారు. నాలుగు కేసుల్లో రూ.26.50 లక్షల ఖరీదు చేసే 227 గ్రాముల బంగారు, 182 గ్రాముల వెండి ఆభరణాలు స్వాధీనం చేసుకున్నారని జిల్లా ఎస్పీ చెప్పారు. దొంగలించిన సొత్తుని విక్రయించి వారికి సహకరిస్తున్న సుగాలినగర్ 4వ వీధికి చెందిన లంకా రాజేష్‌ను కూడా అరెస్ట్ చేశామని తెలిపారు.

పగలు రెక్కీ

సురేష్, నాగవీరభాస్కరరావు పగలు రెక్కీ చేసేవారు. సురేష్ ఇళ్లల్లోకి వెళ్లి చోరీలకు పాల్పడగా, నాగ వీరభాస్కరరావు బయట కాపలా ఉండేవాడు. ఇనుపరాడ్‌తో తాళం పగలగొట్టి లోనికెళ్లి స్క్రూ డ్రైవర్‌తో బీరువాలు తెరవడంలో సురేష్ దిట్ట. తెలుగు రాష్ట్రాల్లో అతనిపై 78 పైగా ఇళ్ల దొంగతనాల కేసులు నమోదయ్యాయి. గుంటూరు జిల్లాలో గుర్తించిన పది మంది దొంగల జాబితాలో సురేష్ ఒకడు. నాగవీరభాస్కరరావు తెలంగాణ హుజూర్‌నగర్‌లోని జైల్లో ఉండగా చిల్లర సురేష్‌తో పరిచయమైంది. ఇద్దరూ దొంగలించిన సొత్తు లంకా రాజేష్ విక్రయించి వారికి సహకరించేవాడు. కేసులను ఛేదించిన సీసీఎస్ డీఎస్పీ బీవీ మధుసూదనరావు, సీఐ ఆర్ఎస్ కిశోర్‌కుమార్, ఎస్ఐ ఎల్.రాములు, ఏఎస్ఐ రామకృష్ణ, హెచ్‌సీ పీటర్‌రాజు, కృష్ణప్రసాద్, శ్రీనివాసరావులను జిల్లా ఎస్పీ అభినందించి, ప్రశంసా పత్రాలు అందించారు. సమావేశంలో డీఎస్పీలు మధుసూదనరావు (సీసీఎస్), అబ్దుల్‌అజీజ్ (గుంటూరు తూర్పు), సీఐలు, ఎస్ఐ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

శుభ కార్యాలకు బ్రేక్

- మూఢంతో 82 రోజుల పాటు అడ్డంకి
- ఫిబ్రవరి 18 వరకూ లేని ముహూర్తాలు
- ఆ తరువాత కూడా మార్చి 11 లోపే శుభ ఘడియలు
- మూగబోనున్న పెళ్లి బాజాలు, వేద మంత్రాలు
- మాఘ మాసంలోనూ నో చాన్స్
- వధూవరులకు తప్పని ఎదురుచూపులు

ప్రత్తిపాడు: పెళ్లి చేసుకోవాలన్నా.. నూతన ఇంట్లో అడుగు పెట్టాలన్నా.. కొత్త వ్యాపారం ఆరంభించాలన్నా, విగ్రహ ప్రతిష్ఠలు చేయాలన్నా.. ఇలా శుభకార్యమేదైనా ముందుగా చూసేకునేది ముహూర్తమే. అది బాగుంటేనే పెళ్లి అయినా వ్యాపారమైనా ఒడుదుడుకులు లేకుండా సజావుగా సాగిపోతుందని విశ్వసిస్తుంటారు. అయితే శుభకార్యాలకు ఈ ఏడాది పెద్ద బ్రేక్ పడింది. నవంబరు 30 శ్రీ విశ్వా వసు నామ సంవత్సరం మార్గ శుద్ధ షష్టి నుంచి శుక్ర మౌఢ్యమి (మూఢం) ప్రారంభమైంది. 2026 ఫిబ్రవరి 13 వరకు ఉంటుంది. అనంతరం మాఘ మాసం బహుళ అమావాస్య 17 వరకూ ఉండటంతో అప్పటి వరకూ ముహూర్తాలు లేవు. ఫిబ్రవరి 19 నుంచి ప్రారంభమవుతాయి. అంటే దాదాపు 82 రోజుల పాటు శుక్ర మూఢం ఉండనుంది. మార్గశిర మాసం మొదలైన వారానికే ప్రారంభమైన మూఢం పుష్య, మాఘ మాసాల వరకూ కొనసాగుతోంది. ఈ సమయంలో పెళ్లిళ్లు, గృహ ప్రవేశాలు, యజ్ఞాలు, కొత్త వ్యాపారాల ప్రారంభంతో పాటు ఇతరత్రా శుభకార్యాలు చేసుకునేందుకు అవకాశం లేదని పండితులు చెబుతున్నారు. దీంతో పెళ్లి బాజాలు, వేదమంత్రాలు, సన్నాయి వాయిద్యాలు మూడు నెలల పాటు మూగబోనున్నాయి.

శుక్ర బలం ఉంటేనే..

సాధారణంగా శుభ కార్యాలు నిర్వహించాలంటే గురు బలం బాగా ఉండాలి. సిరిసంపదలు, సంతోషాలకు శుక్ర బలం ఎక్కువగా ఉండాలి. మౌఢ్యమి సమయంలో ఈ రెండు గ్రహాలు బలహీనమై తేజస్సు కోల్పోతాయని పండితులు చెబుతున్నారు. అందుకే శుభకార్యాలకు మూఢం సమయం కాదని పండితులు సూచిస్తున్నారు.

ముహూర్తాలకు ప్రతికూలత

సాధారణంగా మాఘ మాసంలో వివాహాలు కుదిరి అగ్ని సాక్షిగా ఒక్కటయ్యేందుకు కాబోయే జంటలు ఎదురు చూస్తుంటాయి. వారి ఊహలకు తగినట్లుగానే మాఘ మాసంలో పెళ్లిళ్లకు కూడా బలమైన ముహూర్తాలు ఉంటాయి. కానీ ఈసారి మూఢంలో కలిసిపోవడంతో ముహూర్తాల్లేని పరిస్థితి ఉంది. రథ సప్తమి, వసంత పంచమి, మాఘ పౌర్ణమి వంటి తిథులు కూడా మూఢంలో కలిసిపోవడంతో గృహప్రవేశాలకు ప్రతికూలత ఏర్పడనుంది.

బోసిపోనున్న ఫంక్షన్ హాళ్లు

శుక్ర మౌఢ్యమి కారణంగా శుభ కార్యాలకు బ్రేక్ పడటంతో ఫంక్షన్ హాళ్లు, కల్యాణ మండపాలు బోసి పోనున్నాయి. శుభకార్యాల మీద ఆధారపడ్డ పురోహితులు, డెకరేషన్, షామియానా, సామగ్రి నిర్వాహకులు, వంట మాస్టర్లు, బాజా భజంత్రీలు, వీడియో, ఫొటోగ్రాఫర్లకు దాదాపు రెండున్నర నెలల పాటు ఉపాధికి ఇబ్బంది ఏర్పడనుంది.

మాఘ మాసంలో ఆటంకం



దేవాలయ ప్రతిష్ఠలు, ఉపనయనాలు, వివాహాలు, శంకుస్థాపన వంటి శుభకార్యాలు సహజంగా ఉత్తరాయణ పుణ్యకాలంలో మాఘ, ఫాల్గుణ, వైశాఖ మాసంలో ఎక్కువగా ఆచరించాలన్నది శాస్త్ర ప్రమాణం. అయితే, ఈ సంవత్సరం నవంబర్ 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు శుక్ర మౌఢ్యమి వల్ల ఆటంకం ఏర్పడింది. మరలా ఫాల్గుణ మాసంలో 2026 ఫిబ్రవరి 19వ తేదీ నుంచి మార్చి 11వ తేదీలోపు మాత్రమే శుభ ముహూర్తాలున్నాయి. మార్చి 19 తరువాత ఉగాది, శ్రీరామనవమి పండుగలు వెళ్లిన తరవాత అంటే మళ్లీ ఏప్రిల్‌లో గానీ శుభ ముహూర్తాలు లేవు. ఫాల్గుణ మాసంలో శుభ కార్యాలు నిర్వహించుకోవచ్చు

– జంధ్యాల వేంకట రామలింగేశ్వరశాస్త్రి (ఆగమ పరీక్షాధికారి, గణపతి విద్యాపీఠం నిర్వాహకులు)

అర్జీల పరిష్కారం వేగవంతం

అధికారులకు జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదేశం

ఏఎన్‌ఎంల సమస్యలు వింటున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

గుంటూరు వెస్ట్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో అందిన అర్జీల పరిష్కారం వేగవంతం చేయాలని కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. ఎస్.ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. ప్రతి శాఖకు అందుతున్న అర్జీలపై స్పష్టమైన అవగాహన ఉండాలని చెప్పారు. మొత్తం వచ్చిన వాటిల్లో పరిష్కరించినవి, ఇంకా చేయాల్సిన వాటిపై పక్కా సమాచారం ఉండాలని పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో ఇంకా చూడాల్సిన అర్జీలు ఎన్ని ఉన్నాయి..వాటిపై ఎందుకు జాప్యం జరిగిందో స్పష్టమైన వివరణ ఇవ్వాలని తెలిపారు. కొన్ని సమస్యలు మరలా వస్తున్నాయని (రీ ఓపెన్), వాటికి స్పష్టమైన పరిష్కారం చూపకపోవడం వల్లే అలా జరుగుతున్నాయని భావించాల్సి ఉంటుందని చెప్పారు. పదే పదే వచ్చే అర్జీల్లో పెండింగ్ ఉండటానికి కారణాలు వివరణాత్మకంగా సమర్పించాలని ఆదేశించారు. ప్రతి అర్జీపై ఆడిట్ పక్కాగా జరగాలని ఆదేశించారు. అనంతరం వచ్చిన 260 అర్జీలను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవెన్యూ అధికారి షేక్ ఖాజావలి, రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాసరావు, డెప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీకుమారి, శ్రీనివాస్, జిల్లా అధికారులు పరిశీలించారు.

పని భారాన్ని తగ్గించండి

ప్రజల ఆరోగ్యం కోసం నిరంతరం పని చేస్తున్న తమకు పీ–4, కుశలం, సిటిజన్ సర్వేలతో పాటు బియ్యం కార్డుల పంపిణీ తదితర అదనపు పని భారాన్ని మోపడం దారుణం. ప్రజల ఆరోగ్యం ఎంతో ముఖ్యం . దానిపై తీవ్రంగా కష్టిస్తున్న మాపై పని భారాన్ని తక్షణం తగ్గించాలి. వాటికి అదనపు సిబ్బందిని నియమించుకోవాలి.

– ఏపీ హెచ్‌ఏఎంఎస్‌ఏ ఏఎన్‌ఎంలు

మున్సిపల్ సిబ్బంది దురుసు ప్రవర్తన



పట్టాభిపురం జ్యూట్ మిల్ ఎదురుగా మలేరియా శాఖకు సంబంధించి 1, 3 కార్యాలయాలు ఉన్నాయి. రోడ్డు విస్తరించే క్రమంలో మున్సిపల్ సిబ్బంది మాకు సమయం కూడా ఇవ్వకుండా కార్యాలయ ఫైల్స్, కంప్యూటర్లు, ఇతర సామగ్రిని బలవంతంగా రోడ్డుపై పడేశారు. అత్యంత దురుసుగా ప్రవర్తించి మమ్మల్ని తీవ్ర ఇబ్బందులకు గురి చేశారు. సదరు సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి.

– మలేరియా శాఖ ఉద్యోగులు

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 1,000 గరిష్ఠం : రూ. 1,400

మోడల్ ధర రూ. 1,200

మిర్చి యార్డు సమాచారం

(సోమవారం ధరలు)

వచ్చిన బస్తాలు	39,823
అమ్మకాలు	37,392
నిల్వ	9,063

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,000–17,300
నంబరు–5	11,000–15,000
341	10,500–17,000

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	11,000–17,400
నంబరు–5	10,500–15,800
341	12,000–17,000

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 – 15,200
బాడిగ–355	10,500 – 17,400
దేవనూరు డీలక్స్	11,000 – 16,700
ఆర్మూర్	10,500 – 13,300
తాలుకాయలు	5,200 – 8,000

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,500–15,000
బాడిగ – 355	11,000–17,500
దేవనూరు డీలక్స్	10,500–16,300
తాలు	5,200 – 7,800

–కొరిటెపాడు (గుంటూరు)

పసుపు ధరలు

(సోమవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 566

కొమ్ములు : 371 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
10,700	12,500	10,700

కాయలు : 195 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
9,500	12,000	10,700

మొత్తం అమ్మకాలు : 424.50 క్వింటాళ్లు

–దుగ్గిరాల

మోసపోయాం.. న్యాయం చేయండి

- పీజీఆర్ఎస్‌లో రాజధాని ప్రాంతం కురగల్లు గ్రామ రైతుల వినతిపత్రం
- 21 రోజుల్లో సమస్య పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ

గుంటూరు జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద కురగల్లు రైతులు

తాడేపల్లి రూరల్: రాజధాని గ్రామమైన కురగల్లు పీఏసీఎస్ (ప్రాథమిక వ్యవసాయ పరపతి సహకార సంఘం లిమిటెడ్)లో 72 మంది రైతులు నగదు డిపాజిట్ చేయగా, సహకార సంఘం సీఈఓ రమేష్ నకిలీ డిపాజిట్ బాండ్లను ఇచ్చి వారిని మోసం చేసిన విషయం పాఠక విధితమే. ఈ విషయమై తమకు న్యాయం చేయాలంటూ సొసైటీ అధికారులు, రాజకీయ నాయకులు, ప్రజాప్రతినిధులను కలిసినా బాధితులకు ఎటువంటి భరోసా లభించకపోవడంతో సోమవారం గుంటూరు కలెక్టరేట్‌లో జరిగిన పీజీఆర్ఎస్‌కు హాజరై వినతిపత్రం అందజేశారు. రైతుల బాధలు విన్న అధికారులు 21 రోజుల్లో వారి సమస్యను పరిష్కరిస్తామని రాతపూర్వకంగా హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ రాజధానిలో వున్న ఎకరం, అర ఎకరం పంట పొలాలను రాజధాని నిర్మాణానికి ఇచ్చామని, అందుకు ప్రభుత్వం ఇచ్చిన డబ్బులను నగదు రూపంలో కురగల్లులోని పీఏసీఎస్ బ్యాంక్‌లో డిపాజిట్ చేశామని, సీఈఓ రమేష్ రైతులందరితో కలివిడిగా ఉండేవాడని, అతనిపై నమ్మకంతో రూ.లక్ష నుంచి కోటి వరకు 72 మందిమి డిపాజిట్ చేయగా, మొత్తం రూ.12 కోట్లకు సంబంధించి నకిలీ డిపాజిట్ బాండ్లను అందజేశాడని వాపోయారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ సంఘటనపై మంగళగిరి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామని, పత్రికల్లో వార్తలు రావడంతో రాజకీయ నాయకుల, ప్రజాప్రతినిధుల నుంచి ఒత్తిళ్లు రావడంతో కేసు నమోదు చేసిన పోలీసులు పట్టించుకోవడం మానేశారని ఆరోపించారు. ఈ కేసు విషయమై ఎవరినీ పూర్తిగా విచారించలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాజధానిలో భూములు అమ్ముకోగా వచ్చిన డబ్బు పోగొట్టుకున్న తమ పరిస్థితి ఏంటని వాపోయారు.

ఉద్యోగ మేళాలను సద్వినియోగం చేసుకోవాలి

జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా

గుంటూరు వెస్ట్: ప్రభుత్వంతోపాటు ఇతర సంస్థలు నిర్వహించే ఉద్యోగ మేళాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా కోరారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పోస్టర్‌ను కలెక్టర్, జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవాస్తవ, జిల్లా రెవెన్యూ అధికారి ఎన్.ఎస్.కె.ఖాజావలి, రెవెన్యూ డివిజనల్ అధికారి శ్రీనివాస రావు, డిప్యూటీ కలెక్టర్‌లు గంగరాజు, లక్ష్మీకుమారి, శ్రీనివాస్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉద్యోగ మేళాలు నిర్వహించి ఉద్యోగాలు ఇప్పించడం జరుగుతుందన్నారు. పొన్నూరు ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఆధ్వర్యంలో ఈ నెల 12న వెలగా నాగేశ్వరరావు కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, జి.బి.సి.రోడ్, పొన్నూరులో ఉదయం 10 గంటల నుంచి సాయంత్ర 5 గంటల వరకు జాబ్ మేళా జరుగుతుందన్నారు. ఈ జాబ్ మేళాలో సుమారు 20కి పైగా కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కొండా సంజీవరావు మాట్లాడుతూ మెగా జాబ్ మేళాలో 10వ తరగతి నుంచి బీటెక్ వరకు చదువుకున్న ప్రతి ఒక్కరు పాల్గొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జీతం వారి విద్యార్హతను బట్టి సుమారు రూ.10,000 – 30,000ల వరకు ఉంటుందని తెలిపారు. 18 నుంచి 25 సంవత్సరాల మధ్య గల నిరుద్యోగ యువతి యువకులు బయోడేటా, ఎడ్యుకేషన్ సర్టిఫికేట్స్ జిరాక్స్, ఆధార్ నకలు మరియు పాస్‌పోర్ట్ ఫొటోతో నేరుగా ఇంటర్వ్యూకు హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 99085 65667, 9666545975 నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

జాబ్‌మేళా పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా, జేసీ అశుతోష్ శ్రీవాస్తవ

'కోటి సంతకాల' డిజిటలైజేషన్ ప్రారంభం

సంతకాలను డిజిటలైజ్ చేస్తున్న యువకులు

వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీ కృష్ణ

పొన్నూరు: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు చంద్రబాబు ప్రభుత్వం చేపట్టిన వైద్య కళాశాలల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ పార్టీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీ కృష్ణ ఆధ్వర్యంలో నియోజకవర్గంలో చేపట్టిన కోటి సంతకాల సేకరణ కార్యక్రమం ముమ్మరంగా సాగుతోంది. చంద్రబాబు పనితీరును వ్యతిరేకిస్తూ వైద్య, విద్యను కాపాడుకునేందుకు ప్రజలు సంతకాలు చేసి తమ అభిప్రాయాన్ని తెలియజేశారు. ఈ సందర్భంగా అంబటి మురళీకృష్ణ మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రజల నుంచి ఇప్పటివరకు సేకరించిన 65 వేల సంతకాల డిజిటలైజేషన్ ప్రక్రియ ప్రారంభమైందని, చంద్రబాబు ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై ప్రతి ఒక్కరూ సంతకాల ద్వారా తమ వ్యతిరేకతను వ్యక్తం చేశారని తెలిపారు.

సంపూర్ణ ఆరోగ్య సూత్రమే యోగా

గుంటూరు వెస్ట్(క్రీడలు): సంపూర్ణ ఆరోగ్య మహా సూత్రమే యోగా అని యోగా శిక్షకుడు వంగా వెంకటేష్ తెలిపారు. సోమవారం స్థానిక బ్రాడీపేటలోని జాయ్‌అండ్ షైన్ వెల్‌నెస్ సెంటర్లో ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా ప్రారంభమైన యోగా శిక్షణ శిబిరాన్ని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ సంక్లిష్టమైన కరోనా సమయంలో యోగా సాధకులు అధిక సంఖ్యలో అకాలమరణం పాలు కాకుండా జీవించడానికి కారణం యోగా సాధనే అని తెలిపారు. రోజుకు కనీసం 45 నిమిషాలైనా యోగా, మెడిటేషన్ సాధన చేస్తే జీవన కాలాన్ని అతి సులభంగా పెంచుకోవచ్చని పేర్కొన్నారు. జాయ్‌అండ్ షైన్ వెల్‌నెస్ సెంటర్ ఫిటెనెస్ కోచ్ కె.జ్యోతి శ్యామ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన మిషన్ ఫిట్ ఇండియా కార్యక్రమంలో భాగంగా యోగా శిక్షణా శిబిరం ఏర్పాటు చేశామన్నారు. ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం యోగా శిక్షణతోపాటు ఫిట్‌నెస్, చక్కని ఆరోగ్యం తదితర అంశాలపై ప్రముఖులతో పాఠాలు చెప్పిస్తామన్నారు. అనంతరం యోగా తరగతులను వెంకటేష్ నిర్వహించారు. అయితి సతీష్, భావన్నారాయణ, బీఈడీ కళాశాల ప్రిన్సిపాల్ యానీ అమల, శైలజ, సల్మా, సంధాని, వెంకాయమ్మ పాల్గొన్నారు.

ఏఎన్ఎంల సమస్యలపై కలెక్టర్‌కు ఏపీ ఎన్జీఓ నేతల వినతి

గుంటూరు మెడికల్: గుంటూరు అర్బన్ సచివాలయాల పరిధిలోని ఏఎన్ఎంల సమస్యలపై సోమవారం ఏపీఎన్జీవో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఘంటసాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించారు. ఏఎన్ఎంలకు వైద్య ఆరోగ్య శాఖ విధులనే కాకుండా, మున్సిపల్ కార్పొరేషన్‌కు సంబంధించిన అనేక సర్వేలు చేయించాలని పనిభారం పెట్టడం వల్ల తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారని పేర్కొన్నారు. ఏఎన్ఎంలకు వైద్య ఆరోగ్య శాఖకు సంబంధించిన విధులను మాత్రమే అప్పగించాలని రాష్ట్ర అధికారుల నుంచి స్పష్టమైన ఆదేశాలు ఉన్నప్పటికీ అమలు చేయకపోవడం వల్ల పనిభారంతో ఇబ్బంది పడుతున్నట్లు కలెక్టర్‌కు వివరించారు. వినతి పత్రం సమర్పించిన వారిలో ఏపీఎన్జీవో జిల్లా అధ్యక్షుడితోపాటు, జిల్లా కార్యదర్శి ఆరాధ్యుల శ్యామ్‌సుందర్ శ్రీనివాస్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ నాగూర్ షరీఫ్, నగర అధ్యక్షుడు ఎస్.పి.ఎస్.సూరి, వెంకటరెడ్డి, కృష్ణకిషోర్, విజయ్, పలువురు అర్బన్ సచివాలయ ఏఎన్ఎంలు ఉన్నారు.

ఎస్ఎఫ్ఐ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

లక్ష్మీపురం: ఎస్ఎఫ్ఐ జిల్లా 50వ మహాసభలు గుంటూరులో సోమవారం జరిగాయి. మహాసభలో నూతన ఎస్ఎఫ్ఐ కమిటీ 15 మంది సభ్యులతో ఎన్నుకోవడం జరిగింది. ఈ కమిటీ ఎస్ఎఫ్ఐ గుంటూరు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా కె.పవన్ కుమార్, షేక్ సమీర్, జిల్లా ఉపాధ్యక్షులు రూపస్, సౌమ్య, సహాయ కార్యదర్శులుగా అన్సారి, అమృత వర్షిణి, కిరణ్ దాసరి కమిటీ సభ్యులుగా యశ్వంత్, సుర్జిత్, అజయ్, అభిలాష్, అనిల్, నవదీప్ తదితరులు ఎన్నికయ్యారు.

6,7 తేదీల్లో తెలుగు సాహితీ మహోత్సవం

సినీనటుడు బ్రహ్మానందంకు జీవిత సాఫల్య పురస్కారం

ఆహ్వాన పత్రిక ఆవిష్కరణలో డాక్టర్ సాంబశివరావు, ఇతర ప్రముఖులు

తెనాలి: పట్టణానికి చెందిన బొల్లిముంత శివరామ కృష్ణ ఫౌండేషన ఆధ్వర్యంలో ఈనెల 6,7 తేదీల్లో తెనాలిలో తెలుగు సాహితీ, సాంస్కృతిక మహోత్సవాన్ని నిర్వహించనున్నారు. రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి సౌజన్యంతో జరిగే ఈ వేడుకల ఆహ్వానపత్రికను సోమవారం ఇక్కడి ఎన్జీఓ కళ్యాణ మండపంలో విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ చందు సాంబశివరావు ఆవిష్కరించి, వివరాలను తెలియజేశారు. కొత్తపేటలోని తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో జరిగే ఉత్సవాల్లో భాగంగా తొలిరోజున 'తెలుగుభాష–సాహిత్యం–వ్యక్తిత్వ వికాసం' అంశంపై సదస్సు, అనంతరం ఉభయ తెలుగు రాష్ట్రాల కవులు 200 మందితో జాతీయస్థాయి కవి సమ్మేళనం ఉంటాయి. 11 నంది అవార్డులు పొందిన ఎం.సైదారావుచే జుగల్‌బందీ, విజయవాడ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ బృందంచే 'భువన విజయం'నాటకం ఉంటాయని తెలిపారు. 7వ తేదీ ఉదయం నుంచి సాయంత్రం వరకు తెనాలి కూచిపూడి కళాకారిణులు దాదాపు 500 మందితో మహానాట్య సమ్మేళనం, విభిన్న రంగాల్లో చేతివృత్తుల్లో కొనసాగుతున్న శ్రామిక యోధులు, కళారంగ ప్రముఖులకు చిరుసత్కారం ఉంటాయని వివరించారు. 7వ తేదీ ముగింపు సభలో ప్రముఖ సినీనటుడు బ్రహ్మానందకు బొల్లిముంత శివరామకృష్ణ జీవిత సాఫల్య పురస్కారాన్ని రూ.లక్ష నగదుతో బహూకరిస్తారు. ముందురోజున గుమ్మడి గోపాలకృష్ణకు విశిష్ట రంగస్థల కళాపురస్కారం, ప్రజాసాహితీ సంపాదకుడు కొత్తపల్లి రవిబాబుకు సాహితీ సత్కారాన్ని రూ.25 వేల చొప్పున నగదుతో అందజేస్తారు. కార్యక్రమంలో ఫౌండేషన్ కార్యదర్శి చందు సుబ్బారావు, మైత్రీ హాస్పటల్స్ అధినేత డాక్టర్ ఆలపాటి కృష్ణసందీప్, వీజీకే ఫౌండేషన్ కార్యదర్శి తుమ్మల కిశోర్‌బాబు, మొవ్వా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

HOUSE FOR SALE

కొలనుకొండ, జయభేరి క్యాపిటల్ సమీపంలో 1000 Sq. Yards గజాల site గల 10,000+Sq. Feet విల్లా అమ్మకము నకు కలదు. నో బ్రోకర్స్. ✆ 99662 28370

SERVICES

GOLD FINANCE

బంగారం కొనబడును. బ్యాంకులలో ఇతర ప్రైవేటుసంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారాం మా డబ్బుతో విడిపించి అధిక ధరకు కొనబడును ✆ 8790741166

WANTED

పంజాబ్ నేషనల్ బ్యాంక్ మెట్‌లైఫ్‌లో సేల్స్ మేనేజర్స్, డిస్ట్రిబ్యూషన్ మేనేజర్స్, అడ్వైజర్స్ కావలెను. ఆన్‌రోల్ 30k శాలరీ ఇన్సెంటివ్+ కమీషన్ P/T స్త్రీ/పు 9949839400, 9032592584

చిలకలూరిపేట పరిధిలోని రియల్‌ఎస్టేట్ కంపెనీలో వర్క్ చేయుటకు యువతీ యువకులు కావలెను. ఆకర్షణీయమైన జీతం. 7097972927, 7032609961

గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజి నందు కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేయుటకు పురుషులు కావలెను. జీతము: 12,000/– నుండి 15,000 – వరకు ఇవ్వబడును. విద్యా అర్హతలు: ఏదీ డిగ్రీ, 55 wpm typing speed, M.S Office Skills వయస్సు: 22సంవత్సర ములపైన ఉండవలెను. వివరముల కొరకు సంప్రదించగలరు. 8978480429

గుంటూరు మాస్టర్‌మైండ్స్ కాలేజి నందు క్యాంపస్ ఇన్‌ఛార్జ్‌స్, క్లాసు ఇన్‌ఛార్జ్‌స్‌గా పని చేయుటకు పురుషులు కావలెను. జీతము: 14,000/– నుండి 21000/– వరకు ఇవ్వబడును. విద్యార్హతలు: ఇంటర్ నుండి పి.జి వరకు వయస్సు: 22సంవత్సరాలు నుండి 45సంవత్సరాలు వరకు ఉండవలెను. గుంటూరు లోకల్ వ్యక్తి అయి ఉండాలి సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 8978480429

గుంటూరు వాసవి క్లాత్ మార్కెట్ దగ్గరలో షాపులో పనిచేయుటకు వర్కర్స్ స్త్రీలు/ పురుషులు కావలెను. 25సం॥లు. సంప్ర॥ 9989929196

పిడుగురాళ్ళ, వినుకొండ, మాచర్ల, గురజాల డెలివరీ బాయ్స్ అండ్ గుంటూరు లో లేడీ టెలికాలర్స్ కావలెను. మంచి శాలరీ. సంప్ర॥ 8340855728, 7730997214

వంట మాస్టర్లు భార్యభర్తలు వెంటనే కావలెను. వసతి సౌకర్యం కలదు. వరంగల్ సిటీ లోని ప్రైవేటు మెడికల్ కాలేజిలో వంట చేయుటకు సంప్ర: 9390809999, 9849235255.

గుంటూరు మాస్టర్ మైండ్స్ కాలేజి నందు హాస్టల్ ఇన్‌చార్జ్‌స్, వార్డెన్స్‌గా పనిచేయుటకు స్త్రీలు పురుషులు కావలెను. జీతము: 10,000/– నుండి 14000/– వరకు ఇవ్వబడును. (ఉచిత భోజనము వసతి కల్పించబడును) విద్యార్హతలు: ఇంటర్ మరియు డిగ్రీ, వయస్సు: 22 సంవత్సరములపైన ఉండవలెను. వివరముల కొరకు సంప్రదించగలరు. ఫోన్ నెంబర్ 8978480435

గుంటూరులో ప్రముఖ కంపెనీలో పని చేయుటకు మేనేజర్, అకౌంటెంట్, ఫీల్డ్, సూపర్‌వైజర్ అండ్ అసిస్టెంట్స్ కావలెను. మేల్ అండ్ ఫిమేల్. 9177999199, 9063999499

ఉద్యోగ అవకాశం డిగ్రీ పూర్తిచేసిన వారికి ఫీల్డ్ వర్క్ (Field Work) కోసం వయస్సు: 30 సంవత్సరాల లోపు వారు సంప్ర॥ +91 8800629648. RSJ Inspection Service Ltd

త్రివేణి హోంకేర్. హైదరాబాద్‌లో వృద్ధుల ను పేషెంట్లను చూసుటకు వర్కర్స్/నర్సులు కావలెను. ఫ్రీ వసతి భోజనం. జీ : 18K-20K. Ph: 9640400073, 9160900024

సాక్షి క్లాసిఫైడ్స్

గుంటూరు ప్యాక్ రూ. 475/- మాత్రమే

ప్రతి అదనపు లైను రూ.100/- మాత్రమే

ప్రతి 3 ప్రకటనలకు 2 ప్రకటనలు ఉచితం

ప్రతి ప్రకటనపై G.S.T. 5% అదనం

గుంటూరు

7075167663

7075167541

గమనిక

ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం

- జిల్లా ఎస్పీకి మొరపెట్టుకున్న బాధితురాలు
- పోలీసు పీజీఆర్ఎస్‌కు వెల్లువెత్తిన అర్జీలు

సమస్య ఆలకిస్తున్న జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

నగరంపాలెం: ఉద్యోగం పేరుతో తనను మోసగించారని ఓ బాధితురాలు వాపోయింది. జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో పలువురు సమస్యలను జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ దృష్టికి తెచ్చారు. ఎస్పీ అర్జీల స్వీకరించి, వారి బాధలను ఆలకించారు. సంబంధిత ఎస్‌హెచ్‌ఓలతో జిల్లా ఎస్పీ ఫోన్‌లో మాట్లాడారు. ప్రజా సమస్యలను వేగంగా, చట్టబద్ధంగా పరిష్కరించాలని ఆదేశించారు. ఒకసారి వచ్చిన అర్జీలు పునరావృతం కాకుండా పూర్తిస్థాయిలో విచారించి పరిష్కారం చూపాలని సూచించారు. జిల్లా ఏఎస్పీ (పరిపాలన) జీవీ రమణ మూర్తి, డీఎస్పీలు శ్రీనివాసరెడ్డి (మహిళా పీఎస్), బెల్లం శ్రీనివాసరావు (ట్రాఫిక్), మధుసూదనరావు (సీసీఎస్)లు కూడా అర్జీలు స్వీకరించారు.

ఇద్దరు పిల్లలకు ఉద్యోగాలని..

తెలిసిన వారి ద్వారా ప్రొద్దుటూరుకు చెందిన ఒకరు పరిచమయ్యారు. నా ఇద్దరు పిల్లలకు ఓ ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మబలికాడు. తొలుత కుమారునికి ఉద్యోగం ఇప్పించేందుకు ఓ ఇంటర్వ్యూ చేయించాడు. అయితే ఇంటర్వ్యూలో ఉత్తీర్ణత కాలేదని, ఈసారి మరో కంపెనీలో ఉద్యోగాలు ఇప్పిస్తానని బదులిచ్చాడు. దీంతో అతనికి దఫాల వారీగా రూ.5.55 లక్షలు చెల్లించాం. నెలలు గడిచినా ఉద్యోగాలు ఇప్పించలేదు. ఈ విషయమై అడిగితే దాటవేస్తున్నాడు. మోసగించిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నా.

– పి.శాంతిస్వప్న, కొత్తపేట

ఇల్లు ఖాళీ చేయాలంటూ దౌర్జన్యం

నాకు సంగడిగుంట జెండాచెట్టు వద్ద రెండు గదుల ఇల్లు ఉంది. ఓ ఇంట్లో నాయనమ్మతో కలిసి ఉంటున్నాం. అయితే సొంత బంధువులే ఇల్లు ఖాళీ చేయమని బెదిరిస్తున్నారు. కొద్ది నెలలు క్రితం ఇంటివద్దకు వచ్చి మాపై దాడికి పాల్పడ్డారు. ఈ విషయమై స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశాం. పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి సదరు వ్యక్తులకు సర్దిచెప్పి పంపించారు. అప్పటి నుంచి ఇంటి వద్దకు రాలేదు. వాళ్లు మళ్లీ వచ్చి ఇల్లు ఖాళీ చేయాలని బెదిరిస్తున్నారు. నా తల్లి హనుమయమ్మ, తండ్రి బీసీ నేత వైవీ సురేష్ కొద్ది కాలం క్రితం మరణించారు. ఇల్లు మా అమ్మ పేరుపై ఉంది. సంబంధంలేని వ్యక్తులు వచ్చి ఇల్లు ఖాళీ చేయాలని నానాయాగీ చేస్తున్నారు. న్యాయం చేయగలరు.

– వై.అమృతవల్లి, నాయనమ్మ భ్రమరాంబ, సంగడిగుంట

8న జిల్లా క్రాస్ కంట్రీ పోటీలకు ఎంపికలు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): అథ్లెటిక్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో ఈనెల 8వ తేదీన బీఆర్ స్టేడియంలో జిల్లా క్రాస్ కంట్రీ పోటీలకు ఎంపికలు జరుగుతాయని సంఘం కార్యదర్శి జీవీఎస్ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ –16, 18, 20, బాలబాలికలు, పురుషులు, మహిళల విభాగాల్లో జరుగుతాయన్నారు. ఎంపికైన జట్టు త్వరలో కాకినాడలో జరగనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈనెల 8వ తేదీ ఉదయం 7 గంటలకు బీఆర్ స్టేడియంలో తమ వయసు ధ్రువీకరణ పత్రంతో పాటు ఆధార్ కార్డును తీసుకొని రిపోర్టు చేయాలని కోరారు.

నకిలీ బంగారంతో మోసం

నగరంపాలెం(గుంటూరు వెస్ట్): నకిలీ బంగారం పేరుతో మోసగించారని బాధితుడు సోమవారం కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గుంటూరు నెహ్రూనగర్ 2వ లైనుకు చెందిన సురేష్ సెలూన్ దుకాణం నిర్వహించేవాడు. కొద్దినెలల క్రితం కర్ణాటక నుంచి ఓ వ్యక్తి ఫోన్ చేసి ఇల్లు తవ్వే క్రమంలో బంగారం బయటపడిందని, తక్కువ ధరకే ఇప్పిస్తానని నమ్మబలికాడు. దీంతో సురేష్ కొద్దినెలల క్రితం కర్ణాటక వెళ్లి బంగారం తెచ్చుకుని తనిఖీ చేయగా నిజమైనదని తేలింది. దీంతో మళ్లీ సురేష్‌కు ఫోన్ రాగా, రూ.7 లక్షలు ఇచ్చి బంగారం తీసుకున్నాడు.అయితే అది నకిలీదని తేలింది. దీంతో బాధితుడు సురేష్ కొత్తపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అనారోగ్యంతో పోలీస్ జాగిలం రెమో మృతి



నగరంపాలెం: అనారోగ్యంతో చికిత్స పొందుతున్న పోలీస్ జాగిలం రెమో ఆదివారం రాత్రి మృతిచెందింది. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) సమీపంలోని ఖాళీ ప్రదేశంలో రెమోకు పోలీస్ గౌరవ లాంఛనాలతో నివాళులర్పించి, అంత్యక్రియలు నిర్వహించారు. జిల్లా పోలీస్ విభాగానికి విశిష్ట సేవలందించిన రెమో మరణంపై జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ సంతాపం వ్యక్తం చేశారు. రెమో జిల్లా భద్రతా విభాగంలో 2014 ఏప్రిల్ 29న విధుల్లో చేరి, సుమారు 12 ఏళ్ల క్రమశిక్షణ, నిబద్ధతతో సేవలు అందించినట్లు పలువురు కొనియాడారు. నివాళులర్పించిన వారిలో జిల్లా ఏఎస్పీ (ఏఆర్) హనుమంతు, ఆర్ఐలు, ఆర్ఎస్ఐలు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన రాష్ట్రస్థాయి స్కూల్ గేమ్స్ క్రికెట్ పోటీలు

విజేతలతో పీఈటీలు, ఆర్గనైజర్లు

అండర్ –14 బాలుర విభాగంలో విజేతగా నిలిచిన పశ్చిమ గోదావరి జిల్లా జట్టు

గుంటూరు రూరల్: రాష్ట్రస్థాయి 69వ స్కూల్ గేమ్స్ అండర్–14 బాలుర క్రికెట్ పోటీలలో పశ్చిమగోదావరి జట్టు విజేతగా నిలిచింది. ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్స్‌లో కర్నూలు జట్టుపై విజయం సాధించింది. గత మూడురోజులుగా రూరల్ మండలంలోని దాసుపాలెం గ్రామం లోగల గ్రౌండ్‌లో జరుగుతున్న పోటీల్లో భాగంగా చివరిరోజు సోమవారం తొలుత జరిగిన సెమీ ఫైనల్స్‌లో గుంటూరుపై కర్నూలు విజయం సాధించింది. అదే విధంగా అనంతపురంపై పశ్చిమగోదావరి విజయం సాధించింది. 3వ స్థానంలో గుంటూరు, 4వ స్థానంలో అనంతపురం జట్లు నిలిచాయి. అనంతరం జరిగిన ఫైనల్స్‌లో కర్నూల్‌ను పశ్చిమ గోదావరి ఓడించి విజేతగా నిలిచింది. స్కూల్ గేమ్స్ రాష్ట్రస్థాయి అబ్జర్వర్ బంగారు రాజు, దిలీప్ చక్రవర్తిలు పర్యవేక్షించారు. విజేతగా నిలిచిన పశ్చిమగోదావరి జట్టును పెదకాకాని జిల్లా పరిషత్ హైస్కూల్ హెచ్ఎం కె.భాస్కరరావు అభినందించారు. ఉప్పలపాడు జెడ్పీ హైస్కూల్ హెచ్ఎం మైనేనీ నాగేశ్వరరావు, గుంటూరు జిల్లా స్కూల్ గేమ్స్ సెక్రటరీ సిహెచ్ గోపి, సుమేధ స్కూల్ డైరెక్టర్ ఎం.చంద్రశేఖర్‌రెడ్డి, ఆంధ్ర క్రికెటర్ అసోసియేషన్ త్రిమెన్ కమిటీ సెలక్టర్ సుధాకర్, ఏపీ పీఈటీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బత్తుల కరిముల్లాచౌదరి, గుంటూరు జిల్లా అధ్యక్షుడు యార్లగడ్డ శ్రీనివాస్, ఆంధ్రప్రదేశ్ దేశీయ ఆయుర్వేద సంఘం జనరల్ సెక్రెటరీ డాక్టర్ నామాల శ్రీనివాసరావు, టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రెటరీ భూపాల్ రెడ్డి. తదితరులు పాల్గొన్నారు.

గంజాయి విక్రయించే ఇద్దరు యువకులు అరెస్ట్

మాట్లాడుతున్న తూర్పు డీఎస్పీ అబ్దుల్ అజీజ్, పక్కన సీఐ వెంకటప్రసాద్

నగరంపాలెం: గంజాయి విక్రయించే ఇద్దరు యువకులను పాత గుంటూరు పోలీసులు అరెస్ట్ చేశారు. తూర్పు సబ్ డివిజనల్ కార్యాలయంలో సోమవారం కేసు వివరాలను తూర్పు డీఎస్పీ అబ్దుల్ అజీజ్ తెలిపారు. రెండు రోజుల కిందట కాకాని రోడ్డులోని ఓ ఖాళీ స్థలంలో గంజాయి కార్యకలాపాలు నిర్వహిస్తున్నారనే సమాచారంతో పాతగుంటూరు పీఎస్ సీఐ వెంకటప్రసాద్ సిబ్బందితో ఆకస్మిక సోదాలు చేశారు. ఈ క్రమంలో అడవితక్కెళ్లపాడు టిడ్కో గృహసముదాయంలో ఉంటున్న మహంకాళి శివమణికంత, నెహ్రూనగర్ ఒకటో వీధికి చెందిన భేటి బద్రినారాయణలను అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ మేరకు వారిద్దర్ని అరెస్ట్ చేసి, 1,160 గ్రాముల గంజాయి, మోటారుసైకిల్ స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ చెప్పారు. స్నేహితులైన ఇద్దరు గంజాయికి బానిసయ్యారు. మార్టూరు క్వారీ వద్ద ఉంటున్న ఒడిశాకు చెందిన కార్మికుడు మంగల్ పాండే అలియాస్ మాము వద్ద గంజాయి కొనుగోలు చేసినట్లు దర్యాప్తులో వెల్లడైందని అన్నారు. చిన్న ప్యాకెట్లగా తయారుచేసి ఎక్కువ ధరకు విక్రయించేవారని తెలిపారు.

క్లుప్తంగా

పాఠశాల అభివృద్ధి పనుల పరిశీలన

ఫిరంగిపురం: ఫిరంగిపురం మండలం ఆరోగ్యనగర్‌లోని ఎంపీపీ పాఠశాలలో దాతల సహకారంతో అభివృద్ధి పనులు నిర్వహించారు. పాఠశాలలో నిర్వహించిన పనులను సోమవారం ఎంఈవోలు షేక్ మహబూబ్ సుభానీ, రవికాంత్‌లు పరిశీలించారు. పాఠశాల హెచ్ఎం పి.ప్రసాద్ దాతల సహకారంతో పాఠశాల అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమని పేర్కొన్నారు.

డిజిటల్ లెర్నింగ్ రిసోర్స్ సెంటర్ ప్రారంభం

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధి వడ్డేశ్వరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం డిజిటల్ లెర్నింగ్ రిసోర్స్ సెంటర్‌ను ప్రారంభించారు. కార్యక్రమానికి పాఠశాల మౌలిక వసతుల అభివృద్ధి కల్పన కార్పొరేషన్ చైర్మన్ కె.రాజశేఖర్ ప్రత్యేక అతిథిగా విచ్చేసి రిసోర్స్ సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు సమయపాలనను అలవర్చుకోవాలని సూచించారు. డిజిటల్ లెర్నింగ్ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని పేర్కొన్నారు. అనంతరం రాజశేఖర్‌ను పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు కాకుమాను జోజప్ప, ఉపాధ్యాయులు రమాదేవి, విజయకుమారి, కె.ఉమాదేవి, అనిలా సుల్తానా, ఎం.లలిత, సుబ్బలక్ష్మి, చావా శ్రీనివాసరావు, పాఠశాల కమిటీ చైర్మన్ బషీరున్, గ్రామస్తులు కాట్రగడ్డ మధు తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు రోడ్డుపాలు!

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధి నులకపేట పంప్ హౌస్ నుంచి పలు ప్రాంతాలకు సరఫరా అయ్యే సురక్షిత తాగునీటి పైపులైను సోమవారం పగిలిపోయింది. దీంతో తాగునీరు నులకపేట మాతాశ్రీ ఆశ్రమం ఎదురు రోడ్డులో వృథాగా రోడ్డుపై ప్రవహిస్తోంది. ఈ రహదారిలో ప్రతిరోజు భారీ వాహనాలు తిరగడం వల్ల పైపులపై ఒత్తిడి పడి పగులుతున్నట్లు స్థానిక సిబ్బంది తెలిపారు. తాగునీరు వృథా కాకుండా తక్షణం చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

డాక్టర్ హరిప్రసాదరావుకు ఘన నివాళి

తెనాలిరూరల్: పట్టణానికి చెందిన ప్రముఖ వైద్యులు డాక్టర్ గోనెని హరిప్రసాదరావు 101వ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక బోస్‌రోడ్డులోని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) తెనాలి శాఖ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఐఎంఏ ప్రతినిధులతో పాటు పలువురు వైద్యులు పాల్గొన్నారు. డాక్టర్ గోనెని హరిప్రసాదరావు చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. వైద్య వృత్తిలో ఆయన అందించిన సేవలను వారు స్మరించుకున్నారు. డాక్టర్ గోనెని హరిప్రసాదరావు ఆదర్శనీయులైన వైద్యులన్నారు. వైద్య వృత్తిలో ఆయన చిరస్మరణీయమైన సేవలు అందించడంతో పాటు ఐఎంఏ అభివృద్ధికి ఎంతో కృషి చేశారని కొనియాడారు. ఐఎంఏ తెనాలి శాఖ ప్రధాన కార్యదర్శి డాక్టర్ కోటేశ్వరప్రసాద్, ఉపాధ్యక్షుడు డాక్టర్ గవిని రవిశంకరరావు, కోశాధికారి డాక్టర్ అభిషేక్, డాక్టర్ కొమ్మినేని రమేష్‌బాబు, డాక్టర్ కె. అనిల్ కుమార్, డాక్టర్ జి. నరసింహారావు, డాక్టర్ ఎం వి సత్యనారాయణ, డాక్టర్ శేషగిరిరావు, డాక్టర్ జి. సాంబశివరావు, డాక్టర్ విశ్వమోహనరావు, డాక్టర్ కోటినాగయ్య, డాక్టర్ నిషాంత్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి కంప్యూటర్లు, టీవీ వితరణ

తెనాలిఅర్బన్: కర్ణాటకకు చెందిన శిక్షణ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శాఖాగ్రంథాలయానికి రెండు కంప్యూటర్లు, ఒక టీవీ, ఒక మొబైల్‌ను సోమవారం ఉచితంగా ఇచ్చారు. వీటిని ఆలపాటి కాపీశేఖరం అధ్యక్షుడు, గ్రంథాలయ కమిటీ కార్యదర్శి డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వదం సంస్థ నిర్వాహకులను గ్రంథాలయానికి తోడ్పాటును అందించడం అభినందనీయమన్నారు. సంస్థ ప్రతినిధి బుజ్జిబాబు మాట్లాడుతూ డెల్ కంపెనీ సహకారంతో ఉమ్మడి ఆరు జిల్లాల్లో 200 లైబ్రరీలకు ఇదే విధంగా కంప్యూటర్, టీవీ, మొబైల్‌లను అందజేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో రికార్డు అసిస్టెంట్ ఎల్.లావణ్య సుధ, కె.పూర్ణచంద్రరావు, పలువురు పుస్తక పఠనప్రియులు పాల్గొన్నారు.

ప్రైవేటీకరణ ఆపే వరకూ పోరాటం!

మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి

పూర్తయిన సంతకాల పత్రాలను వేమారెడ్డికి అందజేస్తున్న 23వ వార్డు నాయకులు

తాడికొండలో మాట్లాడుతున్న వనమా బాల వజ్రబాబు

మంగళగిరి టౌన్: ప్రభుత్వ మెడికల్ కాలేజీల ప్రైవేటీకరణ ప్రయత్నాన్ని ఆపే వరకూ పోరాటం ఆగదని వైఎస్సార్ సీపీ మంగళగిరి నియోజకవర్గ సమన్వయకర్త దొంతిరెడ్డి వేమారెడ్డి అన్నారు. మంగళగిరి మండల పరిధి ఆత్మకూరు నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో కోటి సంతకాల ప్రజా ఉద్యమంలో భాగంగా సేకరించిన ప్రతులను వేమారెడ్డికి పార్టీ నాయకులు సోమవారం అందజేశారు. మంగళగిరి పట్టణ పరిధి 23వ వార్డులో వార్డు అధ్యక్షులు దేశమాల ప్రభాకర్ ఆధ్వర్యంలో జరిగిన సంతకాల సేకరణ ఆదివారంతో పూర్తయిన సందర్భంగా ఆ ప్రతులను వార్డు నాయకులు వేమారెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా వేమారెడ్డి మాట్లాడారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రభుత్వ మెడికల్ కాలేజీలను పెత్తందారులకు కట్టబెట్టేందుకే ప్రైవేటీకరణ జపం చేస్తున్నారని విమర్శించారు. ప్రైవేటీకరణను ప్రజలు ముక్తకంఠంతో ఖండిస్తున్నారని అన్నారు.

ఉద్యమంలా సంతకాల సేకరణ..

కోటి సంతకాల కార్యక్రమం ఉద్యమం ముందుకు సాగుతోందని వేమారెడ్డి పేర్కొన్నారు. ప్రతి పేదవాడికి వైద్యం, వైద్యవిద్య అందాలంటే కోటి సంతకాలతో చంద్రబాబు సర్కార్‌కు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ప్రైవేటీకరణ వల్ల జరిగే నష్టాలను ఇంటింటికి వెళ్లి వివరించడంతో ప్రజలు గ్రహించి ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా స్వచ్ఛందంగా సంతకాలు చేస్తున్నారని గుర్తుచేశారు. ప్రజా సమస్యలను తెలుసుకుని వాటి పరిష్కారానికి ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు ప్రజాస్వామ్య బద్ధంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు ఆకురాతి రాజేష్, పట్టణ ఎస్సీ సెల్ అధ్యక్షులు మాతంగిబాబు, 23వ వార్డు నాయకులు దాసరి ఉదయ్‌కుమార్, రత్నరాజు, మేకల రవి, బేతపూడి మల్లేశ్వరరావు, మాతంగి నాగరాజు, ఎలీషా, ఏసుమణి, ఎస్.సామ్రాజ్యం, అన్నపూర్ణ, చక్రవర్తి, ఇస్సాకు, బి.సామ్రాజ్యం, ఏట్ల బాబు తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి పనిచేసిన వారిని గుర్తించాలి..

తాడికొండ: గ్రామాల్లో పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారిని గుర్తించి పూర్వ వైభవం తీసుకొచ్చేలా పనిచేయాలని తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జి వనమా బాల వజ్రబాబు అన్నారు. సోమవారం తాడికొండ అడ్డరోడ్డులోని మండల పార్టీ కార్యాలయంలో ముఖ్య నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. గ్రామాల స్థాయిని బట్టి 2 నుంచి 3 గ్రామాలకు క్లస్టర్ ఇన్‌చార్జిలను ఏర్పాటు చేశామని.. వారు సంస్థాగత నిర్మాణం కోసం పనిచేయాలని అన్నారు. గ్రామాల్లో పార్టీ ప్రారంభం నుంచి కష్టపడి పనిచేసి వేర్వేరు కారణాల వల్ల దూరంగా ఉంటున్న వారిని గుర్తించి పార్టీలో చురుగ్గా పనిచేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎవరికి ఏ అవసరమైనా తనతో పాటు మండల పార్టీ అధ్యక్షులు అందుబాటులో ఉంటారని.. పార్టీ బలోపేతానికి కష్టపడి పనిచేయాలని వనమా పేర్కొన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు వంగా పోలారెడ్డి, మండల ఉపాధ్యక్షుడు నల్లిబోయిన శ్రీనివాసరావు, నియోజకవర్గ రైతు విభాగం అధ్యక్షుడు మల్లంపాటి రాఘవరెడ్డి, వివిధ విభాగాల నాయకులు బొంతా శ్రీకాంత్, దమ్మాటి మోహనరావు, బాకి వెంకటస్వామి, షేక్ బాజీ, బోడపాటి ధర్మరాజు, చిలకా రవి, లోకేష్ రెడ్డి, షేక్ మీర్జావలి, శ్రీకాంత్ రెడ్డి, షేక్ ఖలీల్, పులి రమేష్, జాన్సన్, రహంతుల్లా, ఖలీమ్ తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు ఆస్తులు అప్‌లోడ్ చేయాలి

తెనాలిటౌన్: వక్ఫ్ బోర్డు ఆస్తులను ఉమ్మీద్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని ఏపీ వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ మొహమ్మద్ ఇస్మాయిల్ బేగ్ సంబంధిత ముతవల్లీలకు విజ్ఞప్తి చేశారు. ఏపీ స్టేట్ వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ మొహమ్మద్ ఇస్మాయిల్ బేగ్ సోమవారం ఆటోనగర్‌లోని తన కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. కేంద్రప్రభుత్వ ఆదేశానుసారం ఈనెల 5వ తేదీలోగా వక్ఫ్ ఆస్తులన్నింటినీ ఉమ్మీద్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉందని తెలిపారు. తెనాలి ప్రాంతంలోని వక్ఫ్ ఆస్తులను వివరించారు. ఆయా ఆస్తుల పరిరక్షణ నిమిత్తం ఎవరైతే ముతవల్లీలుగా వ్యవహరిస్తున్నారో వారంతా వాటిని ఉమ్మీద్ పోర్టల్‌లో అప్‌లోడ్ అయినదీ లేనిదీ తెలుసుకుని, లేనివాటిని అప్‌లోడ్ చేయాలని సూచించారు.

ఎన్‌జీవోస్ అసోసియేషన్ బలోపేతానికి కృషి

తెనాలిటౌన్: ఏపీ ఎన్‌జీవోస్ అసోసియేషన్ తెనాలి తాలూకా యూనిట్ బలోపేతానికి తన శక్తివంచన లేకుండా కృషి చేస్తానని నూతన అధ్యక్షుడు వి.భిక్షాలు పేర్కొన్నారు. స్థానిక కొత్తపేటలోని పెన్షనర్స్ హాల్‌లో సోమవారం ఆయన పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులను కలిసి మాట్లాడారు. అసోసియేషన్ బలోపేతానికి సహకరించాలని, అభివృద్ధిలో భాగస్వాములు కావాలని విజ్ఞప్తి చేశారు. ఉద్యోగుల సమస్యలపై రాజీలేని పోరాటం చేయాలని సూచించారు. అందరినీ కలుపుకొని అసోసియేషన్ అభివృద్ధికి తోడ్పడాలని తెలిపారు. కార్యక్రమంలో పెన్షనర్స్ అసోసియేషన్ నాయకులు పాల్గొన్నారు.

ఖాళీ జాగా.. వేసెయ్ పాగా!!

- ప్రభుత్వ భూమిని సైతం వదలని కబ్జాదారులు
- స్థలంలో విద్యుత్ మీటరు బిగింపు

ఖాళీ స్థలంలో విద్యుత్ స్తంభానికి బిగించిన విద్యుత్ మీటరు

స్థలాన్ని పరిశీలిస్తున్న ఐలా కమిషనర్ రహీమ్

మంగళగిరి టౌన్: అమరావతి రాజధాని ప్రాంతం ఖాళీ స్థలం కనిపిస్తే కబ్జానే అనే చందంగా మారింది. విలువైన ప్రభుత్వ స్థలాన్ని సైతం కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్న ఘటనలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధి యర్రబాలెం గ్రామంలో ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏపీఐఐసీ) రక్షణలో ఉండాల్సిన భూమిని కబ్జా చేసేందుకు పలువురు యత్నిస్తున్న ఘటన చోటుచేసుకుంది. యర్రబాలెం గ్రామం పారిశ్రామిక వాడలోని సర్వే నంబరు 703/1లో సుమారు రూ.40 లక్షలు విలువ చేసే 4 సెంట్ల స్థలంలో ఏపీఐఐసీ అధికారులు కొన్నేళ్ల క్రితం తాగునీటి మోటరు షెడ్ నిర్మించారు. కాలక్రమేణా మోటారు షెడ్డు నిరుపయోగంగా మారడంతో ఎవరూ పట్టించుకోలేదు. షెడ్డు స్థలంలో ముళ్లచెట్లు పెరిగిపోయాయి. ఈ క్రమంలో ఎంటీఎంసీ అధికారులు ఖాళీ స్థలాల్లో పెరిగిన మొక్కలు, చెట్లను తొలగించి శుభ్రం చేయించారు. అప్పుడే కబ్జారాయుళ్ల కన్ను ఆ ఖాళీ స్థలంపై పడింది. ఆ స్థలంలో కూరగాయల విక్రయ దుకాణం పేరుతో కబ్జా చేసేందుకు రంగం సిద్ధం చేసుకున్నారు. రెండు రోజుల క్రితం ఖాళీ స్థలంలో ఉన్న విద్యుత్ స్తంభానికి విద్యుత్‌మీటరు బిగించి భూమిపూజ కూడా చేశారని స్థానికులు చెవులు కొరుక్కున్నారు. విషయం తెలుసుకున్న గుంటూరు జోన్ ఇండస్ట్రియల్ ఏరియా లోకల్ అథారిటీ (ఐలా) కమిషనర్ రహీమ్ సోమవారం తన సిబ్బందితో కబ్జాకు గురైన స్థలాన్ని పరిశీలించారు. విద్యుత్‌మీటరును తొలగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై మంగళగిరి విద్యుత్‌శాఖ ఎ.డి.ఇ. సురేష్‌బాబును వివరణ కోరగా ఐలా అధికారులు ఫోన్ చేసి తమ దృష్టికి తీసుకువచ్చారని.. అప్పటి వరకు తమకు తెలియదని చెప్పారు. విద్యుత్‌మీటరు ఎవరు బిగించారో విచారిస్తామని వివరణ ఇచ్చారు.

ఘనంగా ప్రారంభమైన శ్రీహనుమత్ వ్రతాలు

తొలిరోజు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్న భక్తులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధి సీతానగరం శ్రీమద్వీరాంజనేయ సమేత శ్రీ కోదండరామ స్వామి వార్ల దేవస్థానంలో శ్రీ హనుమత్ వ్రత కార్యక్రములు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ధర్మకర్తల మండలి సభ్యులు బి.రాధాకృష్ణ(గాంధీ) మాట్లాడుతూ.. డిసెంబర్ 1 నుంచి 3వ తేదీ వరకూ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని.. ఇందులో భాగంగా సోమవారం ఉదయం 9 గంటలకు విశ్వక్సేనారాధన, పుణ్యాహవాచన, స్వామివార్ల అభిషేకం, మంత్రపుష్పం కార్యక్రమాలు వైభవంగా నిర్వహించామని తెలిపారు. 2వ రోజు మంగళవారం ఉదయం 9 గంటలకు విశ్వక్సేనారాధన, పుణ్యాహవాచన, మన్యుసూక్త సహిత హనుమత్ హోమం, అర్చన, మంత్రపుష్పం కార్యక్రమాలు ఉంటాయన్నారు. సాయంత్రం 6.30 గంటల నుంచి 8 గంటల వరకు మన్యుసూక్త సహిత హనుమత్ హోమం, అర్చన, మంత్రపుష్పం కార్యక్రమాలు నిర్వహించనున్నామని తెలిపారు. 3వ తేదీ ఉదయం 7 గంటలకు విశ్వక్సేనారాధన, పుణ్యాహవాచన, మన్యుసూక్త సహిత హనుమత్ హోం, లక్ష నాగవల్లీ దళార్చన, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వినియోగం.. సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు హనుమత్ వ్రతం, 8.15 గంటలకు పూర్ణాహుతి హారతి, మంత్రపుష్పం, తీర్థ ప్రసాద వినియోగం జరగనున్నాయని పేర్కొన్నారు. రాత్రి 8.30 గంటలకు అన్నప్రసాద వితరణ జరుగుతుందని వివరించారు. కార్యక్రమంలో అర్చకులు బృందావనం శ్రీనివాసాచార్యులు, అగ్నిహోత్రం సత్యకుమార్, శంకరమంచి సుప్రకాష్ శర్మ తదితరులు పాల్గొన్నారు.

ఎయిడ్స్ నియంత్రణపై అవగాహన ఉండాలి

కొలనుకొండ ర్యాలీలో పాల్గొన్న విద్యార్థులు

మేరికపూడి సబ్‌సెంటర్లో ప్రజలకు వివరిస్తున్న ఆరోగ్య సిబ్బంది

మానవహారంగా ఆర్‌సీజేసీ, సెయింట్ జేవియర్ ఫార్మసీ కళాశాల విద్యార్థులు

పెదపరిమిలో ర్యాలీ నిర్వహిస్తున్న గుడ్ షెపర్డ్ సంస్థ సభ్యులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ పరిధి కొలనుకొండ గ్రామంలోని ఎంపీయూపీ స్కూల్‌లో ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా గుడ్ షెపర్డ్ సిస్టర్స్ సంస్థ చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో పాఠశాల విద్యార్థులతో సోమవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎన్ఎం జి.లక్ష్మి మాట్లాడుతూ.. హెచ్ఐవీ వ్యాధికి పూర్తి చికిత్స అందుబాటులో లేకపోయినా వైరస్ కట్టడి సాధ్యమైందని తెలిపారు. సకాలంలో పరీక్షలు, క్రమం తప్పకుండా చికిత్స చేయించుకుంటే హెచ్ఐవీ ఉన్నవారు పూర్తిగా సాధారణ జీవితాన్ని గడపగలరని వివరించారు. కార్యక్రమంలో గుడ్ షెపర్డ్ సిబ్బంది అత్తోట పోతురాజు, సుశీల, ఆశా వర్కర్ యోగిత, పూర్ణ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ఫిరంగిపురం: ఎయిడ్స్ రహిత సమాజం కోసం కృషి చేయాలని కమ్యూనిటీ హెల్త్ అధికారి లింగరాజు యాదవ్ అన్నారు. మండలంలోని మేరికపూడి సబ్‌సెంటర్లో సోమవారం ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా ప్రజలకు నియంత్రణపై అవగాహన కల్పించారు. ఎయిడ్స్ నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఎన్ఎం అరుణ, ఆశాలు రమణ, అనూష పాల్గొన్నారు. మండల కేంద్రంలోని దీనాపూర్ క్యాంపస్‌లో ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినోత్సవం సందర్భంగా ఆర్‌సీజేసీ కళాశాలలో ఆర్‌సీజేసీ, సెయింట్ జేవియర్ ఫార్మసీ కళాశాల విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. ఎయిడ్స్ వ్యాధి గురించి ప్రజలకు అవగాహన అవసరమని తెలిపారు. అనంతరం విద్యార్థులు మానవహారంగా ఏర్పడ్డారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ ఎండీ సుదర్శన్, ఫార్మసీ ప్రిన్సిపల్ డి.జీవన్‌మణిబాబు, పీఎస్ఐ నవీన్‌నాయక్, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

తాడికొండ: ఎయిడ్స్ నిర్మూలనకు అందరూ కలిసి పనిచేయాలని గుడ్ షెపర్డ్ సంస్థ చైల్డ్ ప్రొటెక్షన్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ అనీల్‌కుమార్ అన్నారు. ప్రపంచ ఎయిడ్స్ డేను పురస్కరించుకుని తుళ్లూరు మండలం పెదపరిమి గ్రామం ఇమ్మానియేలు హరిజన వాడ స్కూల్ విద్యార్థులతో ప్రపంచ ఎయిడ్స్ డే అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అనీల్‌కుమార్, పాఠశాల హెచ్ఎం శశిరేఖ మాట్లాడుతూ.. ఎయిడ్స్ వ్యాధికి పూర్తి చికిత్స అందుబాటులో లేకపోయినా వైరస్‌పై కట్టడి సాధ్యమైందని వివరించారు. అనంతరం చిన్నారులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో గుడ్ షెపర్డ్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

బ్రిడ్జి నిర్మించి ఆదుకోండి

పరిష్కార వేదికలో బాధితుల వేదన

గుంటూరు జిల్లా కలెక్టర్‌కు అర్జీ అందిస్తున్న మేడికొండూరు ప్రజలు

మేడికొండూరు: అభివృద్ధికి ఆమడ దూరంలో, ఆపదలో అనాథలుగా మారుతున్న తమ గోడును ఆలకించాలంటూ మేడికొండూరు మండల ప్రజలు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌ను వేడుకున్నారు. మేడికొండూరు గ్రామ పంచాయతీ పరిధిలోని ఎడ్లపాడు వెంకట్రావు కాలనీ (చెంచు కాలనీ) వాసులు ఆమ్ ఆద్మీ పార్టీ తాడికొండ నియోజకవర్గం అసెంబ్లీ కోఆర్డినేటర్ రాచపూడి వెంకట నరసింహారావు సోమవారం గుంటూరులో కలెక్టర్‌ను కలిసి తమ సమస్యలను విన్నవించారు. మేడికొండూరు నుంచి గుంటూరు వెళ్లే ప్రధాన రహదారికి ఆనుకుని ఉన్న ఈ కాలనీలో సుమారు 500 నిరుపేద కుటుంబాలు నివాసం ఉంటున్నారని అన్నారు. కాగా మెయిన్ రోడ్డుకు కాలనీకి మధ్యలో పెద్ద మురుగు కాలువ ప్రవహిస్తోందని.. వర్షాకాలంలో కాలనీ ప్రజల పరిస్థితి అగమ్యగోచరంగా మారుతోందని అర్జీలో పేర్కొన్నారు. కనీసం తాగడానికి నీరు, తినడానికి ఆహార పదార్థాలు కూడా అందక పస్తులు ఉండాల్సి వచ్చిందని కన్నీటి పర్యంతమయ్యారు. పిల్లలు, వృద్ధులు ఆసుపత్రులకు వెళ్లాలన్నా, పనులకు వెళ్లాలన్నా ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని కాలువ దాటాల్సి వస్తోందని వాపోయారు. సమస్యకు శాశ్వత పరిష్కారంగా కాలనీ ముఖద్వారం వద్ద కాలువపై పటిష్టమైన బ్రిడ్జిని (వంతెన) నిర్మించాలని వారు కలెక్టర్‌ను కోరారు. సానుకూలంగా స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

రహదారి వెంట ఆక్రమణల తొలగింపు

ఆక్రమణలను తొలగిస్తున్న సీఐ సాంబశివరావు, సిబ్బంది



వ్యాపారులను హెచ్చరిస్తున్న సీఐ రాముల నాయక్

తెనాలి రూరల్: పట్టణ చెంచుపేటలో తెనాలి–గుంటూరు రహదారి వెంట ఉన్న ఆక్రమణలను పోలీసులు సోమవారం తొలగించారు. ఈ మార్గంలోని కొన్ని షాపులు రోడ్డుపై వరకు ఆక్రమించి ఉండటంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతుండటంపై ఫిర్యాదులు వస్తున్నట్లు త్రీ టౌన్ సీఐ సాంబశివరావు తెలిపారు. టిఫిన్ బండ్లు, బిర్యానీ బండ్లు, ఇతర నిర్వాహకులు రోడ్లను ఆక్రమిస్తున్నారని, వెంటనే ఆక్రమణలను తొలగించాలని వారికి సూచించారు. ఇప్పటికే ఆక్రమణలను తొలగించాలని 15 రోజుల కిందట పోలీసులు ఆదేశించినా వ్యాపారులు తొలగించలేదు. పోలీసులు క్రేన్ తెప్పించి సైన్ బోర్డులు, ఇతర కట్టడాలు, దుకాణాలు, బడ్డీ కొట్లను తొలగించారు. స్వచ్ఛందంగా వ్యాపారులే ఆక్రమణలను తొలగించాలని, లేని పక్షంలో చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు.

ఐతానగర్ రోడ్డులో..

టూ టౌన్ సీఐ రాముల నాయక్ ఆధ్వర్యంలో పట్టణ రజకచెరువు సెంటర్ నుండి ఐతానగర్ వరకు వెళ్లే మార్గంలో ఆక్రమణలను పోలీసులు సోమవార రాత్రి తొలగించారు. రోడ్డు ఆక్రమించి ఏర్పాటు చేసిన సైన్ బోర్డులు, ఇతర తాత్కాలిక దుకాణాలను తొలగించారు. మంగళవారం నాటికి వ్యాపారులే స్వచ్ఛందంగా ఆక్రమణలను తొలగించాలని సీఐ హెచ్చరించారు.

రోడ్లు, కాలువలు నిర్మించాలి

తెనాలిఅర్బన్: చెంచుపేట ఇందిరానగర్‌లోని రోడ్డు అధ్వానంగా ఉందని, దానిని నిర్మించాలని ఆ ప్రాంతవాసులు మున్సిపల్ కమిషనర్ జె.ఆర్. అప్పలనాయుడును కోరారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. 9వవార్డు నాజర్‌పేటలో మురుగు కాల్వలు నిర్మించాలని ఆ ప్రాంతవాసులు కోరుతూ వినతిపత్రం ఇచ్చారు. వీటన్నింటినీ పరిశీలించి చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంఈ పి.శ్రీకాంత్, ఏసీపీ వాణి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

లబ్ధిదారులకు పింఛన్ల పంపిణీ

లబ్ధిదారులకు పింఛను అందజేస్తున్న ఎంపీడీవో శ్రీనివాసరావు

దుగ్గిరాల: మండలంలో సామాజిక పింఛన్ల పంపిణీ సోమవారం సాయంత్రానికి 95 శాతం పూర్తి చేసినట్లు ఎంపీడీవో ఎ.శ్రీనివాసరావు తెలిపారు. దుగ్గిరాల మండల గ్రామాల్లో ఉదయం నుంచి పింఛన్ల పంపిణీని పంచాయతీ సిబ్బంది చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ.. మండలంలో 95 శాతం పింఛన్ల పంపిణీని పూర్తి చేశామని పేర్కొన్నారు. ఈనెలలో నూతనంగా పింఛను తీసుకున్న లబ్ధిదారుల వివరాలను తెలిపారు. వారి ఇళ్లకు వెళ్లి పింఛను అందించామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పసుపు యార్డు చైర్‌పర్సన్ ఉన్నం ఝాన్సీరాణి, వి.కృష్ణ ప్రసాద్, పి.హర్షవర్ధన్, చిరంజీవి, జున్ను ఖాన్ తదితరలు పాల్గొన్నారు.

అయ్యప్ప మాలధారులకు సద్ది

అన్నదానం చేస్తున్న నిర్వాహకులు

తెనాలిటౌన్: శ్రీలలిత అయ్యప్ప స్వామి సేవాసమితి ఆధ్వర్యంలో మాలధారులైన అయ్యప్ప స్వాములకు నెలరోజుల అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానిక నాజరుపేటలోని శ్రీ సీతారామాంజనేయస్వామి ఆలయంలో అయ్యప్ప స్వాములకు 30 రోజుల అన్నదాన కార్యక్రమాన్ని కుంభ రవితేజ సోమవారం చేపట్టారు. ఈ అన్నదాన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గురుస్వామి మైలా సాంబయ్య, భారతీయ జనతా మజ్దూర్ సెల్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మానవ హక్కుల జాతీయ నాయకులు పల్నాటి నాగరాజు, హెచ్ఆర్ఏజే గుంటూరు జిల్లా లీగల్ సెక్రటరీ కొమ్ము అబ్రహం లింకన్, తాడిబోయిన కృష్ణ పాల్గొన్నారు.

గుంటూరు-దుగ్గిరాల ఆర్టీసీ సర్వీస్‌ను పునరుద్ధరించాలి

దుగ్గిరాల: గుంటూరు–దుగ్గిరాల ఆర్టీసీ బస్సు సర్వీస్‌ను పునరుద్ధరించాలని వైఎస్సార్ సీపీ మైనార్టీ విభాగం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సుభానీ డిమాండ్ చేశారు. దుగ్గిరాలలో సోమవారం మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో గుంటూరు నుంచి రెండు పూటలా దుగ్గిరాల నుంచి నందివెలుగు మీదుగా గుంటూరు వెళ్లే బస్సుతో పాటు, మంచికలపూడి, కంఠంరాజుకొండూరు మీదగా రెండు బస్సు సర్వీస్‌ను నడిపేవారని పేర్కొన్నారు. వాటిని రద్దు చేయడం ద్వారా ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. గ్రీవెన్స్‌లో సైతం ఫిర్యాదు చేశామని.. ఆర్టీసీ అధికారులు స్పందించి బస్సు సర్వీస్‌ను పునరుద్ధరించాలని ఆయన కోరారు.

క్లుప్తంగా...

తిరుమలలో జనసేన గొడుగు

తిరుమల: తిరుమలలో వర్షం కురవడంతో సోమవారం ఓ భక్తుడు జనసేన పార్టీకి సంబంధించిన గొడుగును శ్రీవారి ఆలయం ముందు వేసుకుని వెళ్లడం విమర్శలకు దారి తీసింది. తిరుమలలో రాజకీయ నాయకుల బొమ్మలు కానీ గుర్తులకు కానీ అనుమతి లేదు. ఎలాంటి ప్రచారాలకు తావు లేకుండా కఠినమైన నిబంధనలు అమలులో ఉన్నాయి. ఈ తరుణంలో జనసేన పార్టీ గొడుగును చూసిన భక్తులు మండిపడుతున్నారు.

పన్నుతో జన్మించిన పసికందు

నూజివీడు: ఏలూరు జిల్లా నూజివీడులోని ప్రైవేటు ఆసుపత్రిలో 6 రోజుల క్రితం పసిబిడ్డ జన్మించగా, పుట్టుకతోనే ముందు భాగంలో పన్ను ఉంది. దీంతో వైద్యులు పట్టణానికి చెందిన దంత వైద్యుడు దేవిశెట్టి దినేష్‌బాబును సంప్రదించారు. ఆయన ఆదివారం పన్నును తొలగించారు. అనంతరం మాట్లాడుతూ 6 నెలల తరువాత రావాల్సిన పాల పళ్లు జన్యుపరమైన వ్యత్యాసాల వల్ల అరుదుగా పుట్టుకతోనే వచ్చినట్లు చెప్పారు. పన్ను కోరగా ఉండటంతో ఇబ్బంది అవుతుందనే ఉద్దేశంతో పాప పుట్టిన ఆరో రోజున పన్నును తొలగించామని తెలిపారు.

చంద్రబాబు సర్కార్‌లో ఏరులై పారుతున్న మద్యం

- టీడీపీ నేతలు వీధికో బెల్టు షాపు పెట్టారు
- దీనిపై చంద్రబాబును పవన్ ప్రశ్నించాలి
- ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు సువర్ణరాజు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ఏ గ్రామానికి వెళ్లినా మద్యం ఏరులై పారుతోందని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి సువర్ణరాజు సోమవారం ఒక ప్రకటనలో ఆందోళన వ్యక్తం చేశారు. చంద్రబాబు ప్రభుత్వం గతంకంటే ఎక్కువ మద్యం దుకాణాలకు అనుమతులు ఇవ్వడమే కాకుండా మద్యం విక్రయించే సమయాన్ని కూడా పెంచిందన్నారు. ఇది చాలదన్నట్టు ప్రతి గ్రామంలో, ప్రతి సందులో టీడీపీ నేతలు బెల్టు షాపులు నిర్వహిస్తూ బడుగు, బహుజనుల బిడ్డలను మద్యానికి బానిసలుగా చేస్తున్నారని పేర్కొన్నారు. 24 గంటలూ పల్లెల్లో మద్యం లభిస్తుండటంతో పేద, బడుగు వర్గాల ప్రజలు మద్యానికి బానిసలై ఆరోగ్యాన్ని పాడుచేసుకుంటున్నారన్నారు. గతంలో 10 శాతం మద్యానికి ఖర్చు పెడితే ఇప్పుడు ఆదాయంలో 30 నుంచి 40 శాతం ఖర్చు పెడుతున్నారని పేర్కొన్నారు. దీనివల్ల శాంతిభద్రతలు అదుపు తప్పడమే కాకుండా భార్యాభర్తల మధ్య విభేదాలు ఏర్పడి కుటుంబాలు ఛిన్నాభిన్నమవుతున్నాయన్నారు. ఇంత జరుగుతున్నా డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ కనీసం బెల్టు షాపుల నిర్వహణ, మద్యం అమ్మకాలపై మాట్లాడకపోవడం దారుణమన్నారు. వీటిపై ప్రభుత్వం, అధికారులు స్పందించకపోతే పోరాటం చేస్తామని హెచ్చరించారు.

పిఠాపురం సీహెచ్‌సీలో సెక్యూరిటీ గార్డే వైద్యుడు

వైద్యం, పోస్టుమార్టం చేస్తున్న సెక్యూరిటీ గార్డు

భయాందోళనలకు గురవుతున్న రోగులు

పిఠాపురం: కాకినాడ జిల్లా పిఠాపురం కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సీహెచ్‌సీ) వైద్యులు రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. గేటు బయట కాపలా కాయాల్సిన సెక్యూరిటీ గార్డుతో రోగులకు వైద్యం చేయిస్తున్నారు. ఇటీవల ఈ సీహెచ్‌సీలో వైద్యుల నిర్లక్ష్యంతో ఒక నిండు గర్భిణి ప్రాణాలు పోయాయంటూ బాధితులు ఆందోళన చేశారు. దీనిపై విచారణ జరిపి, ఆస్పత్రి సూపరింటెండెంట్‌ను సరెండర్ చేసినా... ఆస్పత్రి వర్గాల్లో ఏ మార్పూ కనిపించడం లేదు. వైద్యులు కబుర్లతో కాలక్షేపం చేస్తుంటే... కాపలా కాయాల్సిన సెక్యూరిటీ గార్డు వైద్య సేవలు అందిస్తున్నాడు. అంతేకాకుండా వైద్యులు, శిక్షణ పొందిన తోటీలు చేయాల్సిన పోస్టుమార్టం ప్రక్రియను కూడా ఆ సెక్యూరిటీ గార్డుతోనే చేయిస్తున్నారు. ముఖ్యంగా రాత్రివేళ గాయాలు, ఇతర అనారోగ్య సమస్యలతో వస్తే వైద్యులు అందుబాటులో ఉండటం లేదు. ఆ సమయంలో సెక్యూరిటీ గార్డే వైద్యసేవలు అందిస్తున్నారు. గాయాలకు కుట్లు వేయడం వంటివి చేస్తున్నారు. దీంతో రోగులు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ప్రాతినిధ్యం వహిస్తున్న పిఠాపురంలో వేలాది మంది రోగులకు వైద్యసేవలు అందించాల్సిన ఆస్పత్రిలో ఇటువంటి సంఘటనలు చోటు చేసుకోవడం తీవ్ర చర్చనీయాంశంగా మారింది. సీఎం చంద్రబాబు పాలనలో రాష్ట్రంలో దిగజారిన ప్రభుత్వ వైద్యసేవలకు ఈ ఆస్పత్రి ఒక నిదర్శనమని పలువురు విమర్శిస్తున్నారు. ఈ విషయంపై ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ కీర్తిప్రియను 'సాక్షి' వివరణ కోరగా... తమ ఆస్పత్రిలో తోటీలు లేనందున సెక్యూరిటీ గార్డుతో పోస్టుమార్టం విధులు చేయిస్తున్నట్లు తెలిపారు.

ఆస్పత్రిలో వైద్య సేవలందిస్తున్న సెక్యూరిటీ గార్డు



భలే భలే...దశకంఠ బొప్పాయి

సాధారణంగా బొప్పాయి చెట్టుకు రెండు మూడు కొమ్మలే వస్తాయి. కానీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా బి.దొడ్డవరం గ్రామానికి చెందిన బొరుసు సూర్యనారాయణ ఇంటి పెరట్లోని ఓ బొప్పాయి చెట్టుకు 10 తలలు ఉండటం విశేషం. 300కు పైగా కాయలతో ఈ చెట్టు చూపరులను విశేషంగా ఆకట్టుకుంటోంది. ప్రధాన చెట్టుకు 9 కొమ్మలు వచ్చాయి. ప్రతి కొమ్మకు 10–20 వరకూ కాయలు కాశాయి. ప్రధాన చెట్టు 100కు పైగా కాయలతో నిండుగా కనిపిస్తోంది. ఇది దేశవాళీ రకానికి చెందిన చెట్టు అని, ఏవిధమైన ఎరువులు, పురుగు మందులూ వాడలేదని సూర్యనా రాయణ తెలిపారు.

– మామిడికుదురు

'లాంఛనాలను' బట్టి అంచనాలు

నష్టపరిహారం అంచనాలో అక్రమాలు

- కూటమి నాయకులతో ఏపీఐఐసీ అధికారి కుమ్మక్కు
- నిర్వాసితుల జాబితాలో స్థానికేతరులు
- కమీషన్ల ఆశ చూపిస్తే అధికంగా సిఫార్సు
- తహసీల్దార్ కార్యాలయం వద్ద బాధితుల ఆందోళన

ఆందోళన చేస్తున్న బాధితులు

నక్కపల్లి: బల్క్ డ్రగ్ పార్క్, ఆర్సెలార్ మిట్టల్ స్టీల్ ప్లాంట్ కోసం నివాస ప్రాంతాలు త్యాగం చేసిన నిర్వాసితులకు చెల్లించాల్సిన నష్టపరిహారం విషయంలో ప్రభుత్వం అన్యాయం చేస్తోంది. సేకరిస్తున్న భూముల్లో తొలగించేందుకు గుర్తించిన ఇళ్లకు నష్టపరిహారం అంచనా వేయడంలో ఏపీఐఐసీ సిబ్బంది చేతివాటం ప్రదర్శిస్తున్నారు. టీడీపీ నాయకులు సూచించిన వారికి, లాంఛనాలు(కమీషన్లు) అందించే వారికి అధికంగానూ, మిగిలిన వారికి తక్కువగానూ నష్టపరిహారాన్ని అంచనా వేస్తున్నారంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ వ్యవహారంపై విచారణ జరిపి, న్యాయం చేయాలని కోరుతూ సోమవారం బాధితులంతా వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ, సీపీఎం జిల్లా కార్యవర్గసభ్యులు ఎం.అప్పలరాజు, చందనాడ ఎంపీటీసీ గంటా తిరుపతిరావు, రైతు నాయకుడు తళ్ల భార్గవ్‌ల ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. తహసీల్దార్ ఆర్.నరసింహమూర్తికి వినతి పత్రం ఇచ్చారు.

నిర్వాసిత జాబితాలో స్థానికేతరులు

చందనాడ పంచాయతీ తమ్మయ్యపేటలో సర్వే నెం. 90/9, 90/10లలో సుమారు 12 ఎకరాల విస్తీర్ణంలో 70 ఇళ్లు ఉన్నాయి. ఈ 12 ఎకరాలను ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ కోసం సేకరిస్తోంది. ఇందులో ఉన్న నిర్మాణాలకు నష్టపరిహారం చెల్లించాల్సి ఉంది. ఇళ్లతోపాటు, రైతులకు చెందిన పశువుల షెడ్లు కూడా ఉన్నాయి. ఇళ్లకు చదరపు అడుగుకు రూ.750 చొప్పున నష్టపరిహారం చెల్లించడానికి నిర్ణయించింది. ఏపీఐఐసీ, ఆర్‌అండ్‌బీ అధికారులు నిర్మాణాలకు విస్తీర్ణాన్ని బట్టి నష్టపరిహారం అంచనాలు తయారు చేస్తున్నారు. ఆర్‌సీసీ శ్లాబ్ ఇళ్లకు తక్కువగా, షెడ్లు, పెంకుటిళ్లకు అధికంగా అంచనాలు తయారు చేసి, నష్టపరిహారం కోసం సిఫార్సు చేస్తున్నారని బాధితులు చెబుతున్నారు. ఎన్యూమరేషన్‌లో దయ అనే ఏపీఐఐసీ అధికారి చేతివాటం ప్రదర్శిస్తున్నారని, సదరు అధికారి కూటమి నాయకులు సూచించిన వారికి, కమీషన్లు ఆశ చూపించిన వారికి అధికంగా నష్టపరిహారం సిఫార్సు చేశారని పేర్కొన్నారు. ఈ సర్వే నంబర్లలో 70 మంది మాత్రమే ఇళ్లు నిర్మించుకుని ఎప్పటినుంచో కాపురాలు చేస్తుంటే దాదాపు 50 మంది స్థానికేతరులను అదనంగా నిర్వాసితుల జాబితాల్లో చేర్చారని విమర్శిస్తున్నారు. అనర్హులు, స్థానికేతరుల జాబితాను తహసీల్దార్‌కు అందించారు.

వివరాల నమోదులో పక్షపాతం

ఆరు సెంట్ల విస్తీర్ణంలో రెండు ఆర్‌సీసీ శ్లాబ్ ఇళ్లు కలిగిన దొరబాబు అనే నిర్వాసితుడికి కేవలం రూ.6 లక్షల నష్టపరిహారం సిఫార్సు చేసి, రెండు సెంట్ల స్థలంలో వేరొకరి రేకుల షెడ్డుకు రూ.5 లక్షల పరిహారానికి సిఫార్సు చేశారని బాధితులు పేర్కొన్నారు. ఒకే ఇంటికి సంబంధించి ఇద్దరు నివసిస్తుంటే ఒకరికి అదనంగా, మరొకరికి తక్కువగా పరిహారం చెల్లించేందుకు సిఫార్సు చేసినట్లు వివరించారు. తాము ఇచ్చిన ఫిర్యాదులపై బహిరంగ విచారణ జరిపి, బాధ్యులైన వారిపై చర్యలు తీసుకునేవరకు నష్టపరిహారం తీసుకోబోమని, ఇళ్లను కూడా ఖాళీ చేసేది లేదని స్పష్టం చేశారు. ఈ ఫిర్యాదులపై విచారణ జరిపిస్తామని, డీఈ స్థాయి అధికారి నేతృత్వంలో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి ఎన్యూమరేషన్ చేయిస్తామని తహసీల్దార్ హామీ ఇచ్చారు.

ఉరేసుకుని ఐఏఎస్ కుమార్తె ఆత్మహత్య

అదనపు కట్నం కోసం వేధింపులు \ కేసు నమోదు చేసిన పోలీసులు

మాధురి సాహితి బాయి (ఫైల్)

తాడేపల్లి రూరల్/నంద్యాల: మంగళగిరి–తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలో ఉంటున్న ఓ ఐఏఎస్ కుమార్తె భర్త వేధింపులు తాళలేక పుట్టింట్లోనే ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఐఏఎస్ అధికారి, ఏపీ ఎస్సీ కార్పొరేషన్ సెక్రటరీ చిన్న రాముడు తాడేపల్లిలోని నవోదయ కాలనీలో నివాసం ఉంటున్నారు. 8 నెలల క్రితం ఆయన కుమార్తె మాధురి సాహితి బాయి (27) ఇన్‌స్టాగ్రామ్ పరిచయమైన నంద్యాల జిల్లా బేతంచర్ల మండలం బుగ్గనపల్లి తండాకు చెందిన రాజేష్‌నాయుడిని ప్రేమించి, పెళ్లి చేసుకుంది. పెద్ద మనసుతో చిన్న రాముడు కుటుంబం ఈ పెళ్లి అంగీకరించింది. కొన్ని నెలలుగా ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో రెండు నెలల క్రితం మాధురి తల్లిదండ్రుల వద్దకు చేరుకుంది. ఈ క్రమంలో ఆదివారం మాధురి బెడ్‌రూమ్‌లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటనపై తాడేపల్లి పోలీసులు కేసు నమోదు చేసి మాధురి మృతదేహాన్ని ఎయిమ్స్‌కు తరలించారు. అనంతరం చిన్న రాముడు మీడియాతో మాట్లాడుతూ కొన్ని నెలలుగా అదనపు కట్నం కోసం రాజేష్ వేధిస్తున్నట్టు తన కుమార్తె చెప్పిందన్నారు. భర్తతో విడిపోయి రెండు నెలలుగా తమవద్దే ఉంటోందని, మానసికంగా బాధపడుతోందని చెప్పారు. తన కుమార్తె మృతికి రాజేష్ నాయుడే కారణమని వాపోయారు. అత్తింటి వారు ఇబ్బందులకు గురిచేస్తున్నారని, ఉండలేకపోతున్నానని, వచ్చి తీసుకెళ్లమని మాధురి చెప్పిందని, కూతుర్ని తీసుకువచ్చేందుకు రాజేష్‌నాయుడు ఇంటికి వెళ్లగా, అక్కడ వారు గొడవ చేశారన్నారు. స్థానిక పోలీసుల సహాయంతో మాధురి ఇష్టప్రకారం తాడేపల్లికి తీసుకొచ్చామని చెప్పారు. తమ కుమార్తె మృతికి కారణమైన రాజేష్‌నాయుడిని చట్టప్రకారం శిక్షించాలని చిన్నరాముడు దంపతులు మీడియా ముందు ఆవేదన వ్యక్తం చేశారు. ఇదిలా ఉండగా మాధురిని చంపి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నారని, ఆమె గర్భవతిగా ఉందని, మరో పెళ్లి చేసుకోవాలని ఒత్తిడి చేస్తున్నట్లు తనకు మెసేజ్ చేసిందని భర్త రాజేష్‌నాయుడు ఆరోపిస్తున్నాడు. తన భార్య ఉరివేసుకొని చనిపోయేంత పిరికిది కాదనీ, వారి తల్లిదండ్రులే చంపేసి ఉంటారని చెబుతున్నాడు. తన భార్య మృతదేహాన్ని అప్పగిస్తే, అంత్యక్రియలు తానే చేసుకుంటానని, మృతిపై సమగ్ర విచారణ చేసి న్యాయం చేయాలని, తాను వెళ్లేంత వరకు పోస్టుమార్టం జరగకుండా చూడాలని కోరుతున్నాడు. తన భార్య తల్లిదండ్రుల నుంచి ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని నంద్యాల ఎస్పీ సునీల్ షెరాన్‌కు వాల్మీకి సంఘం నాయకులతో కలిసి రాజేష్ నాయుడు వినతి పత్రం అందజేశారు.

'తవ్వండి.. తోలండి.. మనల్ని ఎవడ్రా ఆపేది'

ఏలూరు ఏజెన్సీలో రెచ్చిపోతున్న జనసేన నేతలు • పట్టించుకోని అధికారులు

కాల్వ గట్టును జేసీబీతో తవ్వి టిప్పర్లలో తరలిస్తున్న గ్రావెల్

బుట్టాయగూడెం: ఏలూరు జిల్లా ఏజెన్సీ ప్రాంతంలో జనసేన నేతలు రెచ్చిపోతున్నారు. 'మనల్ని ఎవడ్రా ఆపేది' అంటూ మన్యంలోని కొండలు, గుట్టల్ని తవ్వేస్తూ.. గ్రావెల్, మట్టిని మైదాన ప్రాంతాలకు అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. టిప్పర్ రూ.5 వేల చొప్పున విక్రయాలు జరుపుతున్నారు. రాత్రి, పగలు అనే తేడా లేకుండా జేసీబీలతో తవ్వి టిప్పర్లలో తరలిస్తున్నారు. వీరి చర్యల వల్ల ఏజెన్సీలోని కొండలు, గుట్టలు కరిగిపోతున్నాయి. చివరకు పంట కాలువ గట్లు, పరిసర ప్రాంతాలను కూడా వదలటం లేదు. మట్టి, గ్రావెల్ తవ్వకాలు జరుపుతూ పగలు, రాత్రి టిప్పర్లలో తరలిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అధికారుల సహకారంతోనే తవ్వకాలు సాగుతున్నాయా అని గిరిజనులు ప్రశ్నిస్తున్నారు. బుట్టాయగూడెం మండలం నూతిరామన్నపాలెం సమీపంలోని కొండను నిబంధనలకు విరుద్ధంగా ఇటీవల జేసీబీతో తవ్వి తరలించారు. తాజాగా సోమవారం బుట్టాయగూడెం శివారు బూసరాజుపల్లి సమీపంలోని చింతలపూడి ఎత్తిపోతల పథకం కాలువ గట్టును జేసీబీతో తవ్వి గ్రావెల్, మట్టిని తరలించడం ప్రారంభించారు. స్థానికులు ఫిర్యాదు చేయడంతో ఇరిగేషన్ ఏఈ అక్కడికి చేరుకుని తవ్వకాలను అడ్డుకున్నారు. అక్రమంగా మట్టి తవ్వకాలపై తహసీల్దార్ కార్యాలయానికి, పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఇరిగేషన్ డీఈ ఎం.నాగరాజు తెలిపారు. అయినా అక్రమ తవ్వకాలు చేస్తున్న వారిపై అధికారులు చర్యలు తీసుకుంటారో లేదో వేచి చూడాలని గిరిజన సంఘాల నేతలు అంటున్నారు.

ప్రభుత్వ ఆస్పత్రి అంటూ పేరు పెడితే సరిపోతుందా?

ప్రభుత్వ వైద్య కళాశాలల పరిరక్షణ కమిటీ నేతల విమర్శ

మాట్లాడుతున్న డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు

గుంటూరు మెడికల్: పబ్లిక్–ప్రైవేట్ భాగస్వామ్యం (పీపీపీ) విధానంలో నిర్మించి, నిర్వహించే వైద్య కళాశాలకు 'ప్రభుత్వ ఆస్పత్రి' అనే పేరు పెట్టాలని ఇటీవల రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాన్ని ప్రభుత్వ మెడికల్ కళాశాలల పరిరక్షణ కమిటీ తీవ్రంగా విమర్శించింది. ఈ నిర్ణయం మసిపూసి మారేడు కాయ చేయడం లాంటిదేనని కమిటీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సోమవారం గుంటూరులోని జనచైతన్య వేదిక హాలులో జరిగిన మీడియా సమావేశంలో ఆలా వెంకటేశ్వర్లుసహా కమిటీ కో–కన్వీనర్, శాసన మండలి మాజీ సభ్యుడు కె.ఎస్. లక్ష్మణరావు, కో–కన్వీనర్ వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, జనచైతన్య వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి. ధనుంజయ రెడ్డి పాల్గొని ప్రసంగించారు. 'ప్రభుత్వ ఆస్పత్రి' అంటూ పేరు పెడితే సరిపోతుందా అంటూ వక్తలు ఈ సందర్భంగా ప్రశ్నించారు. పేదలకు పీపీపీ విధానంలో ఏ మాత్రం ప్రయోజనాలు ఉండబోవన్నారు. ఈ సమస్యపై రాష్ట్ర వ్యాప్తంగా ఎంపిక చేసిన 100 మంది మేధావులతో విజ్ఞాపన పత్రాన్ని రూపొందించి రాష్ట్ర గవర్నర్ దృష్టికి తీసుకుని వెళ్తామన్నారు. సమావేశంలో ఆంధ్రప్రదేశ్ పూర్వ ఫార్మసీ కౌన్సిల్ అధ్యక్షుడు అన్నపు రెడ్డి విజయభాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

ఆంధ్రప్రదేశ్ అటవీ అభివృద్ధి సంస్థ
రీజనల్ కార్యాలయము, ఫారెస్ట్ కాంప్లెక్స్,గవర్నమెంట్ ఆర్ట్స్ కాలేజి ఎదురుగా, రాజమండ్రి-533103. ఫోన్: 0883-2475791
జీడిమామిడి తోటలలోని ఫలసాయం అమ్మకము
రాజమండ్రి ప్రాంతీయ కార్యాలయ పరిధిలో గల రాజమండ్రి మరియు ఏలూరు డివిజన్లలో 1188.15 హెక్టార్ల విస్తీర్ణములోగల (11 యూనిట్లు) జీడిమామిడి తోటల నుండి (01) సం॥ అనగా 2026 సీజనుకు ఫలసాయము పొందుహక్కును వేలం మరియు టెండర్ల ద్వారా పై అడ్రస్ నందు తేది: 11.12.2025న అమ్మబడును. సీల్డు టెండర్లు మధ్యాహ్నం 01.00 గం॥వరకు స్వీకరించబడును. తదుపరి మధ్యాహ్నం 2.00 గం॥ నుండి ప్రతి యూనిట్‌కు వేలం నిర్వహించబడును, వేలం అయిన వెంటనే సదరు యూనిట్‌కు స్వీకరించబడిన టెండర్లు తెరువబడును. అవసరమయిన ఎడల టెండరులో పాల్గొన్నవారితో సంప్రదింపులు జరుపబడును. పైనుదహరించిన తేదీన అమ్ముడుపోగా మిగిలిన యూనిట్లు మరలా తేది: 29.12.2025, 08.01.2026 మరియు 22.01.2026 తేదీలలో పై విధముగానే అమ్మబడును. ఇతర వివరములు, మార్పులు, చేర్పులకై మా వెబ్‌సైట్ www.apfdcl.com సందర్శించగలరు.
సం/- ఎస్.శ్రీకంఠనాథ రెడ్డి, IFS, రీజనల్ మేనేజర్, రాజమండ్రి
DIPR RO No.4616PP/CL/ADVT/1/1/2021-22, Dt: 01.12.2025

समुद्री उत्पाद निर्यात विकास प्राधिकरण
THE MARINE PRODUCTS EXPORT DEVELOPMENT AUTHORITY
(वाणिज्य एवं उद्योग मंत्रालय, भारत सरकार)
(Ministry of Commerce and Industry, Government of India)
एमपीईडीए हाउस, पनम्पिल्ली एवेन्यू / MPEDA House, Panampilly Avenue
कोच्चि/Kochi - 682036, केरल / Kerala.
(दूरभाष / Tel: 0484-2311901) ईमेल / Email : ho@mpeda.gov.in
वेबसाइट / Website: www.mpeda.gov.in
प्रयोगशाला प्रशिक्षु (रसायन) / LAB TRAINEES (CHEMICAL)
समुद्री उत्पाद निर्यात विकास प्राधिकरण, अनुसूचित जाती/जनजाती समुदाय के योग्य उम्मीदवारों के लिए 08.12.2025 को एमपीईडीए गुणवत्ता नियंत्रण प्रयोगशाला, भीमावरम में प्रयोगशाला प्रशिक्षु (रासायनिक) के चयन हेतु वॉक-इन-इंटरव्यू आयोजित करने का प्रस्ताव रखता है। विस्तृत अधिसूचना के लिए, कृपया एमपीईडीए वेबसाइट (नोटिफिकेशन – अवसर – ओपनिंग लिस्ट) देखें।
MPEDA proposes to conduct a Walk-In-Interview for the selection of Lab Trainees (Chemical) at MPEDA Quality Control Laboratory, Bhimavaram on 08.12.2025 for qualified candidates belonging to SC/ST community. For detailed notification, please visit MPEDA website (Notification – Opportunities - Opening List).
हस्ता/- / Sd/-
उप निदेशक (कार्मिक) / Deputy Director (Pers)

'సుప్రీం'లో చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి మళ్లీ ఊరట

అరెస్టు నుంచి రక్షణ జనవరి 19 వరకు పొడిగింపు

- కౌంటర్ దాఖలుకు ఏపీ ప్రభుత్వానికి రెండు నెలల గడువు ఇస్తామన్న కోర్టు
- రెండు వారాలు సరిపోతుందన్న ఏపీ సర్కారు
- అయినప్పటికీ విచారణను జనవరికి వాయిదా వేసిన ధర్మాసనం

సాక్షి, న్యూఢిల్లీ: వైఎస్సార్‌సీపీ యువనేత చెవిరెడ్డి మోహిత్‌రెడ్డికి సుప్రీంకోర్టులో మరోసారి ఊరట లభించింది. ఏపీ లిక్కర్ కేసులో ఆయనపై ఎలాంటి తొందరపాటు చర్యలు తీసుకోవద్దని గతంలో ఇచ్చిన మధ్యంతర రక్షణ ఉత్తర్వులు జనవరి 19 వరకు పొడిగించింది. ఈ కేసుకు సంబంధించి సోమవారం జరిగిన విచారణలో ఏపీ ప్రభుత్వం తరపున వాదనలు వినిపించిన న్యాయవాది.. కేసును త్వరగా తేల్చాలని, ఎక్కువ గడువు ఇవ్వొద్దని కోరినప్పటికీ, ధర్మాసనం విచారణను జనవరికి వాయిదా వేసింది.

రెండునెలల గడువు వద్దే వద్దు..

జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం ఎదుట సోమవారం ఈ కేసు విచారణకు వచ్చింది. కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేసేందుకు కొంత సమయం కావాలని ఏపీ ప్రభుత్వ న్యాయవాది కోర్టును అభ్యర్థించారు. దీనికి స్పందించిన ధర్మాసనం.. కౌంటర్ దాఖలు చేయడానికి 'రెండు నెలల సమయం' ఇస్తామని ప్రతిపాదించింది. ప్రభుత్వ న్యాయవాది వెంటనే జోక్యం చేసుకుని.. 'మై లార్డ్స్.. మాకు రెండు నెలల సమయం వద్దు. కేవలం రెండు వారాలు చాలు. ఈ కేసులో పిటిషనర్ (మోహిత్‌రెడ్డి) ఇప్పటికే అరెస్టు నుంచి రక్షణ పొందుతున్నారు. ఎక్కువ రోజులు వాయిదా వేస్తే అది దర్యాప్తుపై ప్రభావం చూపుతుంది. కాబట్టి కౌంటర్ దాఖలు చేయడానికి మాకు రెండు వారాల సమయం చాలు' అని కోర్టును కోరారు. అంతేగాక.. సీనియర్ న్యాయవాది సిద్ధార్థ లూథ్రా ఈ కేసులో ప్రభుత్వం తరపున వాదనలు వినిపిస్తున్నారని, ఆయన అందుబాటులో లేనందున తదుపరి తేదీని నిర్ణయించాలని కోరారు. దీంతో ధర్మాసనం తదుపరి విచారణను వచ్చే ఏడాది జనవరి 19కి వాయిదా వేసింది. అప్పటివరకూ మోహిత్‌రెడ్డిని అరెస్టుచేయడానికి వీల్లేకుండా ఉన్న మధ్యంతర రక్షణ కొనసాగనుంది.

లొంగకపోతే బిల్లులు రాకుండా చేస్తా..!

దళిత సర్పంచికి కార్యదర్శి లైంగిక వేధింపులు

ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు

వేమూరు(మూల్పూరు): దళిత సర్పంచ్ అయిన తనను పంచాయతీ కార్యదర్శి కె. సాంబశివరావు మానసిక, లైంగిక వేధింపులకు గురిచేస్తున్నాడని బాపట్ల జిల్లా అమర్తలూరు మండలం మూల్పూరు గ్రామ సర్పంచ్ జయశ్రీ ఆవేదన వ్యక్తం చేశారు. ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆందోళన వెలిబుచ్చారు. 'పనులు తీర్మానం చేయాలన్నా, బిల్లులు పెట్టాలన్నా తనకు లొంగిపోయి సహకరించాలని కార్యదర్శి వేధిస్తున్నాడు. అక్టోబరు 13న జిల్లా కలెక్టరు, ఎస్పీకి స్పందనలో అర్జీ పెట్టుకున్నా. డిప్యూటీ ఎంపీడీవో జొన్నలగడ్డ వినయబాబు పంచాయతీకి వెళ్లి తూతూ మంత్రంగా విచారణ చేశారు. ఇక ఎస్పీకి పెట్టుకున్న అర్జీకి సంబంధించి చుండూరు సీఐ శ్రీనివాసరావు నన్నే పిలిపించి.. కార్యదర్శికి సహకరించి పనులు చేసుకోవాలి.. అంటూ చెప్పి పంపించారు' అని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఇక ఎంపీడీవో మహిళ అయి కూడా సాటి మహిళ బాధను అర్థం చేసుకోలేకపోతోందని తెలిపారు. అక్టోబరు 31వ తేదీన జిల్లా కలెక్టరుకు మళ్లీ ఫిర్యాదు చేసినా ఫలితం లేదన్నారు.

ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మా అన్న

'నాపై జిల్లా కలెక్టర్, ఎస్పీకి ఫిర్యాదు చేశావుగా, ఎమ్మెల్యే నక్కా ఆనందబాబు మా అన్న. నీవు ఎంత మంది అధికారులకు ఫిర్యాదు చేసినా ఏమీ చేయలేవు. నాకు కూటమి ప్రభుత్వం అండ ఉంది. నీకు బిల్లులు రాకుండా చేస్తా. నేను చెప్పినట్లుగా చేయాల్సిందే'' అని కార్యదర్శి తన బెదిరింపులను కొనసాగిస్తున్నారని ఆమె విచారం వ్యక్తం చేశారు.

నాదనీరాజనం వేదికపై గీతా పారాయణం

తిరుమల: గీతా జయంతి సందర్భంగా తిరుమలలోని శ్రీవారి ఆలయం ఎదురుగా ఉన్న నాదనీరాజనం వేదికపై ధర్మగిరి వేద విజ్ఞాన పీఠం ఆధ్వర్యంలో 50 మంది వేద పండితులు భగవద్గీతలోని 18 అధ్యాయాలలోని 700 శ్లోకాలను పారాయణం చేశారు. ఈ కార్యక్రమం ధర్మగిరి వేద విజ్ఞాన పీఠం ప్రిన్సిపాల్ శివ సుబ్రహ్మణ్య శాస్త్రి ఆధ్వర్యంలో జరిగింది.

మరోసారి భూ సమీకరణ చేయడం తగదు: సీపీఎం

బాబురావు

లక్ష్మీపురం(గుంటూరు ఈస్ట్): రాష్ట్రానికి కావాల్సింది కార్పొరేట్ రాజధాని కాదని, ప్రజా రాజధాని నిర్మాణం చేయాలని, ముందుగా రాజధాని కోసం ఇచ్చిన భూములను అభివృద్ధి చేయకుండా మరోసారి భూ సేకరణ తగదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు సి.హెచ్.బాబూరావు అన్నారు. గుంటూరులో సోమవారం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు పాశం రామారావు అధ్యక్షతన జిల్లా కమిటీ, మండల, పట్టణ కార్యదర్శుల సమావేశం జరిగింది. ఇందులో బాబూరావు మాట్లాడుతూ..అమరావతి విషయంలో టీడీపీ ప్రభుత్వం మాట తప్పుతోందన్నారు. నాడు ప్రపంచ స్థాయి రాజధాని అని ఊరించి, నేడు రెండో దశ భూములు ఇవ్వకపోతే మునిసిపాలిటీగా మిగిలిపోతుందని చంద్రబాబు ప్రకటించడం శోచనీయమన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్ అని చెప్పే చంద్రబాబు, పవన్‌కళ్యాణ్‌లు అమరావతికి నిధుల కోసం కేంద్రాన్ని ఎందుకు నిలదీయడం లేదని ప్రశ్నించారు.

విద్యుదాఘాతంతో ఇద్దరు దుర్మరణం

మరో ముగ్గురికి గాయాలు

క్రిస్మస్ స్టార్ ఏర్పాటు చేస్తుండగా ఘటన

విజయకుమార్, దేవయ్య (ఫైల్)

త్రిపురాంతకం: క్రిస్మస్ నెల సందర్భంగా స్టార్ ఏర్పాటు చేసేందుకు రోడ్డు పక్కన స్తంభం నిలబెట్టే క్రమంలో ఐదుగురు వ్యక్తులు విద్యుదాఘాతానికి గురయ్యారు. వారిలో ఇద్దరు అక్కడికక్కడే మరణించగా.. మరో ముగ్గురు ప్రాణాలతో బయటపడ్డారు. ప్రకాశం జిల్లా త్రిపురాంతకం మండలం కొత్త అన్నసముద్రంలో సోమవారం ఈ ఘటన చోటుచేసుకుంది. గ్రామంలో క్రిస్మస్ స్టార్ ఏర్పాటు చేసేందుకు స్తంభం పాతుతుండగా.. ఆ స్తంభానికి విద్యుత్ తీగలు తగలడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. పి.విజయ్‌కుమార్ (46), వి.దేవయ్య (49) అక్కడికక్కడే ప్రాణాలు వదిలారు. విజయ్‌కుమార్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. దేవయ్యకు భార్య, కుమార్తె ఉన్నారు. మరో ముగ్గురు విద్యుత్ షాక్‌కు గురై గాయపడ్డారు.

సాక్షి ఫ్యామిలీ
గుంటూరు
మంగళవారం ॥ 2-12-2025

కలర్ వాక్ గురించి విన్నారా? హెల్త్ ఇన్ఫర్మేషన్ కంపెనీ హార్వర్డ్ హెల్త్ ప్రకారం 'కలర్ వాక్' అనేది మానసిక ఆరోగ్యానికి, జ్ఞాపకశక్తికి ఉపకరించే విధానం. వీధుల్లో షాపింగ్ కోసం వెళుతున్నప్పుడు గానీ, మార్నింగ్, ఈవెనింగ్ వాక్‌లోగాని ఒక రంగును ఎంచుకొని నడవాలి. దారిలో ఆ రంగు వస్తువులు, బోర్డ్‌లు... మొదలైన వాటిని చూస్తూ వెళ్లాలి. ఉదా: ఎరుపును ఎంచుకుంటే పోస్ట్‌బాక్స్, టమాట... మొదలైనవి. ఈ కలర్ వాక్‌ను 'వాకింగ్ మెడిటేషన్' అంటున్నారు.

న్యూస్‌మేకర్

'అందరూ ఉద్యోగాలు చేస్తే ఊరిని ఎవరు ఉద్ధరిస్తారు' అని ప్రశ్నించుకుంది **సాక్షి రావత్.** అందుకే బీటెక్ చేసి ఉద్యోగం చేయకుండా 22 ఏళ్ల వయసులో తన ఊరికి సర్పంచ్‌గా ఎన్నికైంది. 'ఉత్తరాంచల్' మొత్తానికి ఈ వయసులో సర్పంచ్ అయిన వాళ్లు లేరు. 'చదువుకుంటున్నవాళ్లు రాజకీయాల్లోకి వస్తే ఊరు బాగుపడుతుంది' అంటున్న సాక్షి రావత్ పరిచయం.

సాక్షి రావత్

ఉద్యోగం కన్న ఊరు మిన్న

పల్లెలో పుట్టి పెరిగిన యువత చదువు పూర్తి కాగానే పట్టణాలకు చేరి ఉపాధి వెతుక్కుంటారు. ఆ తర్వాత ఏ పండగకో, సెలవులకో ఊరికి వచ్చి, ఊరి వారిని పలకరించి, ఇంట్లో వారితో గడిపి తిరిగి పట్టణాలకు చేరుకుంటారు. అనేక సందర్భాల్లో జరుగుతున్నది ఇదే. ఉద్యోగ, ఉపాధి మార్గాల అన్వేషణలో యువత పట్టణాలకు చేరుతుండటంతో పల్లెలు బోసిపోతున్నాయి. అటువంటి చోట కొత్త అంకురమై నిలిచారు 22ఏళ్ల సాక్షి రావత్. ఉత్తరాఖండ్‌లోని పౌరీ గర్వాల్ జిల్లా 'కుయీ' గ్రామానికి ఈమె అతి చిన్నవయసులో గ్రామ ప్రధాన్ (సర్పంచి)గా మారారు. దేశంలో ఈ ఘనత సాధించిన వ్యక్తుల్లో ఒకరిగా వార్తల్లో నిలిచారు.

బాల్యం నుంచే సామాజిక అవగాహన

ఉత్తరాఖండ్ పౌరీ గఢ్‌వాల్ జిల్లాలో యువత లక్ష్యం ఒక్కటే... ముంబయి, ఢిల్లీ, అహ్మదాబాద్ వంటి నగరాలకు వలస వెళ్లి ఏదైనా ఉద్యోగం తెచ్చుకోవడం. అక్కడ ఉంటూ ఊరికి అతిథుల్లా మారిపోవడం. ఈ పరిస్థితిని చిన్ననాటి నుంచి గమనిస్తోంది సాక్షి. ఆమె ఆ గ్రామంలో పుట్టి పెరిగింది. చిన్ననాటి నుంచి సామాజిక అంశాలను అర్థం చేసుకోవడం, దానిగురించి చర్చించడం, ఇతరులకు చేతనైన సాయం అందించడం ఆమెకు అలవడింది. అందుకు ఆమె కుటుంబం ఏనాడూ అడ్డు చెప్పలేదు. ఈ క్రమంలో బీటెక్ బయో టెక్నాలజీ పూర్తి చేసిన ఆమెకు మరేదో నగరానికి వెళ్లి ఉద్యోగం చేయాలని అనిపించలేదు. తను పుట్టి పెరిగిన ఊరికి తనవంతుగా ఏదైనా చేయాలని అనుకుంది.

యువత రాజకీయాల్లోకి రావాలంటూ..

పల్లెల్లో ఉపాధిమార్గాలు తక్కువగా ఉంటాయి. ముఖ్యంగా చదువుకున్న వారికి అక్కడ దొరికే ఉద్యోగాలు దాదాపు శూన్యం. దీంతో వారంతా దూరంగా వెళ్లి బతకాల్సి వస్తోంది. దీనికితోడు స్థానికంగా మహిళలకు ఉపాధి లేక కుటుంబాలు పేదరికంతో మగ్గిపోతున్నాయి. ఈ పరిస్థితిలో మార్పు తేవాలంటే యువత రాజకీయాల్లోకి రావడం అవసరం అని సాక్షి భావించింది. అందుకు తొలి అడుగు తనదే కావాలని నిశ్చయించుకుంది. 21 ఏళ్లు దాటిన వ్యక్తులు పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేయవచ్చన్న నిబంధనను అనుసరించి పోటీ చేసింది. చదువుకున్న అమ్మాయి. పైగా చిన్ననాటి నుంచి తోటివారి కోసం పాటు పడే తత్వం, ఊరి బాగు కోసం ఆలోచించే యుక్తి ఉన్న అభ్యర్థి కావడంతో అందరూ కలిసి సాక్షిని గెలిపించారు. తమ ఊరికి నాయకురాలిగా ఎన్నుకున్నారు.

ఇది కొత్త ప్రయాణం కాదు

'ఇది ఇవాళ కొత్తగా మొదలైన ప్రయాణం కాదు. ఎన్నో ఏళ్లుగా నాలో నాటుకున్న భావన. నా ఊరికి ఏదైనా చేయాలి. నా ఊరి పరిస్థితులను మార్చాలి' అంటున్నారు సాక్షి రావత్. స్థానికంగా యువతకు ఉపాధి కల్పించడం, మహిళల ఉపాధి అవకాశాలు పెంచడం, విద్యార్థులకు విద్యాబోధన సౌకర్యాలు పెంచడంపై దృష్టి సారిస్తానని అంటున్నారు. తను చదివిన బయో టెక్నాలజీ అనుభవంతో రైతులతో కలిసి వ్యవసాయ పద్ధతుల్లో నూతన రీతుల్ని ప్రవేశపెట్టాలని ఉందని అంటున్నారు. 'సొంత ఊరిని, కన్నతల్లిని విడిచిపెట్టడం ఎక్కడో దూరంగా బతకడం ఎవరికైనా కష్టమైన విషయమే. మా ఊళ్లో ఈ పరిస్థితి ఎన్నో ఏళ్లుగా కొనసాగుతోంది. దానికి అడ్డుకట్ట వేయాలన్నదే నా ప్రణాళిక. అందుకు తగ్గ ఆలోచనలు నాకున్నాయి. దీంతోపాటు ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయడం, వారి సమస్యలు తీర్చడం, ఆదాయ మార్గాలు పెంచడంపై దృష్టి నిలుపుతాను' అని నమ్మకంగా చెప్పున్నారు సాక్షి.

> తను చదివిన బయో టెక్నాలజీ అనుభవంతో రైతులతో కలిసి వ్యవసాయ పద్ధతుల్లో నూతన రీతుల్ని ప్రవేశపెట్టాలని ఉందని అంటున్నారు సాక్షి రావత్.

● ట్రెండ్

ఇన్‌స్టాగ్రామ్ పేరెంటింగ్

పేరెంటింగ్‌కు సంబంధించి ఇప్పుడు సరికొత్త ట్రెండ్... ఇన్‌స్టాగ్రామ్ పేరెంటింగ్. కొందరికి నచ్చినా, నచ్చకపోయినా ఇన్‌స్టాగ్రామ్ అనధికారికంగా కొత్త పేరెంటింగ్ మాన్యువల్‌గా మారింది. పేరెంటింగ్‌కు సంబంధించిన సలహాల కోసం పెద్దలు, ఇరుగుపొరుగువారు, వైద్యులు, పుస్తకాల మీద ఆధారపడడం అనేది ఒక విధానం. దీనికి భిన్నంగా ఆన్‌లైన్ దారిలో వెళ్లడమే ఇన్‌స్టాగ్రామ్ పేరెంటింగ్.

శిశువుకు పాలివ్వడం నుంచి పిల్లలను స్కూలుకు పంపడం వరకు పేరెంటింగ్‌కు సంబంధించి ఆన్‌లైన్‌లో ఎన్నో వీడియోలు ఉన్నాయి. మనసులోని సందేహాన్ని టైప్ చేస్తే చాలు సెకన్ల వ్యవధిలో వందలాది వీడియోలు పరిష్కారాన్ని కనుగొనడంలో సహాయపడతాయి.

ఇన్‌స్టాగ్రామ్ పేరెంటింగ్ ప్రత్యేకత ఏమిటంటే అది 24/7 అందుబాటులో ఉంటుంది.

బేబీఫుడ్, రెండు సంవత్సరాల పిల్లలకు కలర్‌ఫుల్ ప్లేట్స్, సూటబుల్ డయపర్స్... మొదలైన ఎన్నో విభాగాల ఇన్‌స్టాగ్రామ్‌లు ఉన్నాయి.

'గతంలో పేరెంటింగ్‌కు సంబంధించి సందేహాలు, సమస్యలు, సవాళ్లు కుటుంబ పరిధిలోనే ఉండేవి. ఇప్పుడు మాత్రం పేరెంట్స్ తమ అనుభవాలను షేర్ చేసుకోవడానికి సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్ ఉపయోగపడుతున్నాయి. ఒకప్పుడు పెద్ద కుటుంబాలు ఉండేవి కాబట్టి సలహాల కోసం ఇతరుల మీద ఆధారపడే అవసరం ఉండేది కాదు. సోషల్ మీడియా విస్తృతస్థాయిలో పేరెంటింగ్ విధానాలను పరిచయం చేయడంతో, చిన్న కుటుంబాల వారు పేరెంటింగ్‌కు సంబంధించిన సలహాల కోసం సోషల్‌మీడియాపై ఆధారపడుతున్నారు.

ట్రెండ్ సంగతి ఎలా ఉన్నా, నిజంగా ఇన్‌స్టాగ్రామ్ పేరెంటింగ్ తల్లిదండ్రులకు సహాయపడుతుందా? లేక ఒత్తిడిని పెంచుతుందా?

'కంటెంట్‌లో కొంత భాగం పరిశోధన ఆధారితమైనప్పటికీ, ఎక్కువ శాతం ట్రెండ్ ఆధారితమైనది. పేరెంటింగ్‌కు సంబంధించి సలహాలు, సూచనలు త్వరగా తెలుసుకునే అవకాశం ఉన్నప్పటికీ ప్రొఫెషనల్, పర్సనలైజ్‌డ్ మెడికల్, ఫ్యామిలీ గైడెన్స్‌కు ఇన్‌స్టాగ్రామ్ పేరెంటింగ్ సమానం కాదు. ఇన్‌స్టాగ్రామ్ రీల్ శిశువు చరిత్ర, స్వభావం, ఆహార అలవాట్లు, ఆరోగ్య అవసరాలు తల్లిదండ్రుల మానసిక పరిస్థితులను అంచనా వేయదు' అంటున్నారు నిపుణులు.

కిచెన్ టిప్స్

సింక్ క్లీనింగ్ సహజంగా...

సింక్ క్లీనింగ్‌కోసం రసాయనాలతో కూడిన లిక్విడ్ వాష్‌లు, డిటర్జెంట్‌లకు బదులు నేచురల్‌గా తయారు చేసిన పదార్థాలతో క్లీన్ చేయడమే మంచిది. అందుకోసం.. బేకింగ్ సోడా, వెనిగర్, ఆలివ్ నూనె, నిమ్మ లేదా నారింజ తొక్కలు.. మొదలైనవి ఉపయోగించి కూడా సులభంగా ఎలా క్లీన్ చేయచ్చో చూద్దాం...

ముందుగా సింక్‌లో ఎలాంటి చెత్తా లేకుండా చూసుకోవాలి.

ఇప్పుడు కొద్దిగా బేకింగ్ సోడా వేసి ఒక మెత్తటి స్పాంజ్ సాయంతో సింక్ అంతా రుద్ది, ఆ తర్వాత వెనిగర్‌తో కడగాలి.

తర్వాత వాటర్‌తో క్లీన్ చేసి నిమ్మ లేదా నారింజ తొక్కలతో సింక్ మొత్తాన్ని రుద్దాలి.

ఆ తర్వాత నీళ్లతో మళ్లీ శుభ్రం చేసి, ఆరిన తర్వాత మెత్తటి బట్టపై ఆలివ్ ఆయిల్ వేసి సింక్ మొత్తం తుడవాలి. ఇలా చేయడం వల్ల సింక్ నుంచి ఫ్రెష్‌స్మెల్‌తో పాటు కొత్తదానిలా మెరిసిపోతుంది.

● సోషల్ మీడియా

జయ హో

మన సైనికులు తీవ్రమైన వాతావరణంలో సరిహద్దులలో విధులు నిర్వహిస్తుంటారు. ఎత్తైన ప్రాంతాలలో, ప్రాణాంతకమైన మంచు తుఫానులు, హింస పెట్టే గాలులను భరిస్తూ విధులు నిర్వహిస్తుంటారు.

ప్రతికూల పరిస్థితుల్లోనూ ఆనందాన్ని వెదుక్కుంటారు. దీనికి తాజా ఉదాహరణ... ఆర్మీ తన అధికారిక ఇన్‌స్టాగ్రామ్ పేజీలో షేర్ చేసిన వీడియో.

ఈ వైరల్ వీడియోలో...

మంచుతో కప్పబడిన ప్రాంతంలో సైనికులు క్రికెట్ ఆడుతుంటారు. మంచుముద్దలను క్రికెట్ బాల్స్‌గా ఉపయోగించి ఎంజాయ్ చేస్తుంటారు. ఎముకలు కొరికే చలిలో కూడా సైనికుల క్రీడానందం నెటిజనులను ఆకట్టుకుంది.

పులిలాంటి చలి కూడా వీరి సంతోషం ముందు తోక ముడవక తప్పదు కదా! ఈ వీడియో క్లిప్ నాలుగు మిలియన్‌లకు పైగా వ్యూస్‌తో దూసుకుపోతోంది.

'జయ హో' అన్నారు ప్రముఖ నటుడు అనుపమ్ ఖేర్.

'ఆ సైనికులు ఎవరూ మనకు తెలియదు. అలాంటి వారు మన కోసం ప్రాణాలను పణంగా పెట్టి దేశసరిహద్దుల్లో కాపలా కాస్తున్నారు. వారి గురించి ప్రార్థించడమే మనం చేయగలిగింది' అని ఒక నెటిజనుడు స్పందించాడు.

బులియన్ (బంగారం 10 గ్రా.: వెండి కిలో) డిసెంబర్ 1న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,28,710	1,32,450	1,30,480	1,32,450	1,27,900	1,31,670
బంగారం (22 క్యారెట్లు)	1,15,110	1,19,600	1,19,600	1,23,190	1,17,670	1,20,700
వెండి	1,75,000	1,78,700	1,96,000	1,78,700	1,75,000	1,96,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

సాగుబడి
అనూరాధ కార్తె: డిసెంబర్ 2 వరకు
జ్యేష్ఠ కార్తె : 3 నుంచి

హైడ్రోపోనిక్ ఆహారోత్పత్తి కేంద్రాల్లో మోనోసైటోజీన్స్ బ్యాక్టీరియా వల్ల లిస్టెరియోసిస్ అనే వ్యాధి సోకుతున్నట్లు అమెరికాలో గుర్తించారు. ఏటా 1,600 కేసులు నమోదవుతున్నాయి. 260 మంది చనిపోతున్నారు కూడా. గర్భిణీ స్త్రీలు, వృద్ధులు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న వ్యక్తులు అత్యధికంగా దీని బారినపడుతున్నారు. అందువల్ల ఎల్. మోనోసైటోజీన్స్ ఆహార భద్రతకు, ప్రజారోగ్యానికి ముప్పుగా మారింది.

హైడ్రోపోనిక్స్ ద్రావణాల్లో పీహెచ్ 5 ఉంటే సేఫ్!

సాధారణ వ్యవసాయంలో మట్టి ద్వారా వ్యాపించే తెగుళ్లు హైడ్రోపోనిక్ పద్ధతిలో సాగయ్యే పంటలకు సోకవు. అయితే, మట్టికి బదులు వాడే సబ్‌స్ట్రేట్‌లు, విత్తనాలు, నీరు, పోషక ద్రావణాల్లో ఎల్. మోనోసైటోజీన్స్ వంటి క్రిములు పెరుగుతాయి. అమెరికాలోని లూసియానా స్టేట్ యూనివర్సిటీ(ఎస్‌ఎస్‌యూ) ఎస్‌ఎస్‌యూ స్కూల్ ఆఫ్ న్యూట్రిషన్ అండ్ ఫుడ్ సైన్సెస్ ప్రొఫెసర్, ఫుడ్ ఇన్నోవేషన్ ఇన్‌స్టిట్యూట్ తాత్కాలిక సంచాలకులు డాక్టర్ అచ్యుత్ అధికారి నేతృత్వంలోని పరిశోధకుల బృందం పరిశోధనలు చేసింది. టమాటా, లెట్యూస్, స్ట్రాబెర్రీ పంటలను పెంచే పోషక ద్రావణాలలో ఎల్. మోనోసైటోజీన్ క్రిములు పెరుగుదల తీరుపై డాక్టర్ అచ్యుత్ బృందం చేసిన తాజా అధ్యయనంలో తేలిందేమంటే.. పోషక ద్రావణం ఉదజని సూచిక (పీహెచ్)లో మార్పులు ఈ క్రిముల పెరుగుదలకు, తగ్గుదలకు దోహదం చేస్తున్నాయి. పీహెచ్ 5 గల డిస్టిల్డ్ వాటర్‌లో ఎల్. మోనోసైటోజీన్ క్రిములు 72 గంటల్లో నశించాయి. లెట్యూస్, స్ట్రాబెర్రీ పంటకు వాడే ద్రావణాలలో పీహెచ్ 6 ఉన్న దశలో ఈ క్రిములు బాగా పెరిగాయి. అయితే, టమాటా పోషక ద్రావణం అన్ని పీహెచ్ స్థాయిల్లో ఎల్. మోనోసైటోజీన్ క్రిముల పెరుగుదల పరిమితంగా ఉంది. ఈ క్రిములను చంపటానికి రసాయనిక క్రిమిసంహారకాలను వాడితే, మేలు చేసే సూక్ష్మజీవులు కూడా చనిపోతాయి. కాబట్టి రసాయన రహిత పద్ధతిపై పరిశోధకులు దృష్టి సారించారు. యూవీ-సీ కాంతి ఎల్. మోనోసైటోజీన్ క్రిములను గణనీయంగా తగ్గించినట్లు వెల్లడైంది. హైడ్రోపోనిక్ సాగు నానాటికీ విస్తరిస్తున్న నేపథ్యంలో డా. అచ్యుత్ పరిశోధనలు ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి.

వరి పొలాల్లో ఐదంచెల సాగు!

– తరకటూరులో ప్రదర్శనా క్షేత్రం



మాగాణి పొలంలో ఏడాది పొడవునా ఉద్యాన పంటలు పండించుకునేలా మార్చుకోవచ్చా? చుట్టూ వరి పొలాల మధ్య ఐదంచెల ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో పండ్లు, పసుపు, కూరగాయల సాగు సాధ్యమేనా? ఏడాదికి ఎకరంలో రూ. 3 లక్షల ఆదాయం పొందగలమా? ఈ మూడూ సాధ్యమేనని రుజువు చేస్తున్నారు సుభాష్ పాలేకర్ కృషి పద్ధతి ప్రచారకులు విజయరామ్. కృష్ణా జిల్లా గూడూరు మండలం తరకటూరులోని సొంత పొలాన్ని ఆయన ప్రదర్శనా క్షేత్రంగా రూపుదిద్దారు. తెలంగాణ, ఏపీలో ఆసక్తి గల రైతులు ముందుగా పేర్లు రిజిస్టర్ చేసుకొని, డిసెంబర్ 15 నుంచి స్వయంగా వచ్చి చూసి, నేర్చుకోవచ్చని **విజయరామ్** తెలిపారు. ఒక్కో రోజున నిర్దేశిత కొన్ని జిల్లాల రైతులను మాత్రమే అనుమతిస్తారు. డిసెంబర్ 15 (సోమ): ఆదిలాబాద్, నిజామాబాద్ , కరీంనగర్. 17(బుధ): వరంగల్, ఖమ్మం, నల్గొండ. 19(శుక్ర): మెదక్, రంగారెడ్డి, హైదరాబాద్, మహబూబ్ నగర్. 21(ఆది): శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం. 23(మంగళ): తూగో, పగో. 25(గురు): కృష్ణా, గుంటూరు. 27(శని): ప్రకాశం, నెల్లూరు. 29(సోమ): కడప, కర్నూలు. 31(బుధ): చిత్తూరు, అనంతపురం. ఇతర వివరాలకు.. 63091 11427.



పంటలకు అడవి జంతువుల వల్ల, వరి పంటకు నీటి ముంపు వల్ల కలిగే పంట నష్టాల నుంచి రైతులకు ఉపశమనం కలిగించడానికి 2026 ఖరీఫ్ నుంచి బీమా సదుపాయం కల్పించాలని కేంద్ర వ్యవసాయ రైతు సంక్షేమ మంత్రిత్వ శాఖ నిర్ణయించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో కోతులు, అడవి పందులు, ఏనుగులు, దుప్పులు, కృష్ణజింకల వంటి అడవి జంతువుల వల్ల కూరగాయలు, పండ్లు, వరి, పత్తి వంటి పంటలకు కూడా చాలా ప్రాంతాల్లో తీరని నష్టం జరుగుతున్న విషయం తెలిసిందే. అయితే, వీటి ప్రభావంపై రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో ఎటువంటి అధికారిక శాస్త్రీయ సర్వేలు ఇప్పటివరకు జరగకపోవటం వల్ల ఆధారపడదగిన గణాంకాలేవీ అందుబాటులో లేవు.

అడవి జంతువులతో పంట నష్టానికి

బీమా రక్షణ!

- **కోతులు, అడవి పందులు, ఏనుగులు, దుప్పలు, కృష్ణజింకల వల్ల పంటలు నష్టపోయే రైతులకు ఉపశమనం**
- **వరి పంటకు నీటి ముంపు రక్షణ బీమా పునరుద్ధరణ**
- **2026 ఖరీఫ్ నుంచి అమల్లోకి తేనున్న కేంద్రం**
- **రాష్ట్ర ప్రభుత్వాలు ఏయే జంతువుల వల్ల నష్టం జరుగుతోందో నోటిఫై చేసి, బీమాను అమలు చెయ్యాల్సి ఉంటుంది**

ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై) పథకం కింద ఈ బీమా సదుపాయం అందుబాటులోకి రానుంది. కేంద్ర వ్యవసాయ రైతు సంక్షేమ శాఖ సవరించిన నియమ నిబంధనల ప్రకారం అడవి జంతువుల దాడి కారణంగా పంట నష్టపోయే రైతులను ఆదుకునేందుకు వచ్చే ఖరీఫ్ నుంచి బీమా పరిహారం చెల్లిస్తారు. అడవి జంతువుల దాడిని 'స్థానిక ప్రమాదం'గా గుర్తించి పీఎంఎఫ్‌బీవై కింద ఐదో యాడ్-ఆన్ కవర్‌గా చేర్చుతారు. రాష్ట్ర ప్రభుత్వాలు పంట నష్టానికి కారణమవుతున్న అడవి జంతువుల జాబితాను ప్రకటిస్తాయి. గతంలో జరిగిన పంట నష్టాల గణాంకాల ఆధారంగా ఈ బీమా వర్తించే జిల్లాలు లేదా బీమా యూనిట్లను గుర్తిస్తాయి. జియోట్యాగ్ చేసిన ఛాయాచిత్రాలను పంట బీమా యాప్‌లోకి 72 గంటల్లోపు నష్టాలను రెతులు అప్‌లోడ్ చేయడం ద్వారా నివేదించాల్సి ఉంటుంది.

అటవీ జంతువుల వల్ల రైతులకు పంట నష్టం జరుగుతోందని, దీనికి పరిష్కారం వెతకాలని అనేక రాష్ట్రాల నుంచి వచ్చిన దీర్ఘకాలిక అభ్యర్థనల మేరకు కేంద్రం ఈ నిర్ణయాలు తీసుకుంది. ఆకస్మికంగా స్థానికంగా జరిగే తీవ్రమైన పంట నష్టం నుంచి రైతులకు రక్షణ కల్పించటమే ప్రభుత్వ లక్ష్యం. దేశవ్యాప్తంగా అమలు చేయడానికి శాస్త్రీయ, పారదర్శక, కార్యాచరణపరంగా సాధ్యమయ్యే విధివిధానాలు సిద్ధమయ్యాయి. వీటిని 2026 ఖరీఫ్ పంట కాలం నుంచి అమల్లోకి వస్తాయి.

దేశవ్యాప్త దీర్ఘకాలిక సమస్య

మన దేశం అంతటా రైతులు ఏనుగులు, అడవి పందులు, నీల్‌గాయ్, జింకలు, కోతులు వంటి వన్యప్రాణుల దాడుల కారణంగా చాలా సంవత్సరాలుగా పంట నష్టాలను ఎదుర్కొంటున్నారు. అడవులు, వన్యప్రాణులు సంచరించే ప్రాంతాలు, కొండల సమీపంలో ఉన్న ప్రాంతాల్లో ఈ సమస్య సర్వసాధారణం. ఇప్పటివరకు, ఇటువంటి నష్టాలు పంట బీమా పరిధిలోకి రాకపోవడంతో రైతులు పరిహారం పొందలేకపోయారు. అదేవిధంగా, వరద పీడిత, తీర ప్రాంత రాష్ట్రాల్లోని వరి రైతులు భారీ వర్షాలు, వరదల వల్ల పదేపదే నష్టపోతున్నారు. మునిగిపోయిన పంటలను అంచనా వేయడంలో ఇబ్బంది కారణంగా 2018లో వరి ముంపునకు బీమా సదుపాయం తొలగించారు. అయితే, ప్రతి ఏటా వరదలకు గురయ్యే జిల్లాల్లోని రైతులకు బీమా రక్షణ అందకుండా పోయింది.

ఈ సవాళ్లను పరిగణనలోకి తీసుకొని కేంద్రం ఒక నిపుణుల కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ సిఫార్సుల మేరకు బీమా సదుపాయం కల్పించాలని కేంద్ర వ్యవసాయం-రైతు సంక్షేమ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తాజాగా నిర్ణయించారు. ఈ ముఖ్యమైన నిర్ణయంతో స్థానికంగా పంట నష్టం వాటిల్లిన రైతులు ఇప్పుడు పీఎంఎఫ్‌బీవై కింద సాంకేతికత ఆధారిత క్లెయిమ్ ద్వారా సకాలంలో పరిహారం పొందబోతున్నారు.

మానవ-వన్యప్రాణుల సంఘర్షణ ఎక్కువగా ఉన్న ఒడిశా, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కర్ణాటక, కేరళ, తమిళనాడు, ఉత్తరాఖండ్, అస్సాం, మేఘాలయ, మణిపూర్, మిజోరాం, త్రిపుర, సిక్కిం, హిమాచల్‌ప్రదేశ్‌తో పాటు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలలోని రైతులకు బీమా సదుపాయం గణనీయంగా ప్రయోజనం చేకూరుస్తుందని భావిస్తున్నారు.

ముంపు నుంచి వరి పంటకు స్థానిక విపత్తుగా బీమా రక్షణను తిరిగి ప్రవేశపెట్టడం వల్ల తరచూ వరదల పాలయ్యే తీరప్రాంత, తదితర రాష్ట్రాలలోని రైతులకు ప్రయోజనం చేకూరుతుంది. మన దేశ పంటల బీమా వ్యవస్థను ఈ కొత్త సవరణలు మరింత బలోపేతం చేస్తాయి.

రెండు రాష్ట్రాల్లో శాస్త్రీయ సర్వే చెయ్యాలి

విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ వైద్యుల వాసుదేవరావు సూచన

పంటలకు అడవి జంతువుల వల్ల బీమా సదుపాయాన్ని సరిగ్గా అమలు చెయ్యాలన్నా గణాంకాలు అవసరం. ఏయే జంతువుల వల్ల ఎంత మేరకు నష్టం జరుగుతోందో రాష్ట్ర ప్రభుత్వాలు ముందు తెలుసుకోవాలి. శాస్త్రీయ పద్ధతుల్లో సమగ్ర సర్వే ద్వారా గణాంకాలు సేకరించిన తర్వాత స్వల్పకాలిక, దీర్ఘకాలిక చర్యలు చేపట్టాలని విశ్రాంత శాస్త్రవేత్త డాక్టర్ వైద్యుల వాసుదేవరావు సూచిస్తున్నారు. ప్రొ.జయశంకర్ తెలంగాణ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో అఖిల భారత సకశేరుక చీడల యాజమాన్య విభాగం అధిపతిగా, ప్రధాన శాస్త్రవేత్తగా దీర్ఘకాలం పరిశోధనలు చేసి ఉద్యోగ విరమణ చేశారు. 'సాక్షి సాగుబడి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో ముఖ్యాంశాలు:

వచ్చే ఖరీఫ్ నుంచి బీమా సదుపాయం కల్పించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది కదా. రైతులకు ఉపశమనం కలుగుతుందంటారా?

కేంద్ర మార్గదర్శకాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వాలు బీమాను అమలు చేస్తే రైతులకు ప్రయోజనం కలుగుతుంది. అయితే, ఇది ఒక్క రోజులో పరిష్కారం అయ్యే సమస్య కాదు. జటిలమైనది. ఏమి చెయ్యాలన్నా ముందు అధికారికంగా గణాంకాలు సేకరించాలి. పైపై అంచనాల ఆధారంగా కాకుండా ఉన్నత స్థాయి నిపుణుల కమిటీ ఆధ్వర్యంలో శాస్త్రీయ సర్వే ఆధారంగా స్వల్పకాలిక, దీర్ఘకాలిక చర్యలు చేపట్టాలి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వాలు ఈ దిశగా చర్యలు తీసుకోవాలి.

ఈ కమిటీలో ఎవరెవరు ఉండాలి?

వ్యవసాయ, ఉద్యాన, పశు విశ్వవిద్యాలయాల నిపుణులతో పాటు వ్యవసాయ, ఉద్యాన, పశుసంవర్థక శాఖ అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులతో ఉన్నత స్థాయి కమిటీ ఏర్పాటు చేసి ప్రామాణిక పద్ధతుల్లో సర్వే జరపాలి. ఏయే అడవి జంతువుల వల్ల ఏయే పంటలకు ఏయే దశల్లో ఎంత మేరకు పంట నష్టం జరుగుతున్నది? అనే గణాంకాలను ప్రాజెక్ట్ మోడ్‌లో పక్కాగా సేకరించాలి. ఏయే ప్రాంతాల్లో సమస్య ఏ(ఎక్కువ, మధ్యస్థం, తక్కువ) స్థాయిలో ఉందో గుర్తించాలి. తదనుగుణంగా స్వల్పకాలిక, దీర్ఘకాలిక చర్యలు తీసుకోవాలి.

తెలుగు రాష్ట్రాల్లో అడవి జంతువుల వల్ల పంటలకు నష్టం ఎంత మేరకు జరుగుతోందని మీరనుకుంటున్నారు?

ఆంధ్రప్రదేశ్‌లో చాలా ప్రాంతాలతో పాటు తెలంగాణలో 90% పంట పొలాలకు కోతుల సమస్య ఉంది. కోతులను వన్యప్రాణుల జాబితా నుంచి తొలగించారు. కాబట్టి, వీటికి కుటుంబ నియంత్రణ చేయించవచ్చు. కోతులన్నిటినీ పట్టుకొని ఆపరేషన్ చెయ్యలేం కాబట్టి, ఆహారంలో మందు కలిపి పెట్టి మేటింగ్ కంట్రోల్ చెయ్యాలి. 50% పొలాలకు అడవి పందుల సమస్య ఉంటుంది. వీటితో పాటు గద్వాల్, మహబూబ్‌నగర్, ఆదిలాబాద్, నాగర్‌కర్నూలు జిల్లాల్లో కృష్ణజింకల సమస్య ఉంది.

ఆంధ్రప్రదేశ్‌లో కోతులు, అడవి పందులు, కృష్ణజింకలు, దుప్పులతో పాటు చిత్తూరు జిల్లాలో అదనంగా ఏనుగుల సమస్య కూడా ఉంది. పంటలకే కాదు, గ్రామాలు, పట్టణాల్లో ప్రజలకు కూడా కోతుల సమస్య ఉంది. ఒక పార్టీ ఎన్నికల వాగ్దానం చెయ్యాల్సి వచ్చిందంటే ఈ సమస్య తీవ్రతకు అద్దం పడుతోంది. శాస్త్రీయ సర్వే ఎంత త్వరగా, సమగ్రంగా చేస్తే.. సమస్య పరిష్కారం దిశగా అంత వేగంగా అడుగులు పడతాయి.

ఏ రాష్ట్రంలో అయినా ఇలాంటి సర్వే జరిగిందా?

హిమాచల్ ప్రదేశ్ ప్రభుత్వం సమగ్ర సర్వే చేసింది. కోతులకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేసి వాటి సంఖ్యను తగ్గించగలిగారు.

అడవి జంతువుల నుంచి పంటలను కాపాడుకోవటంలో సాంకేతిక సాధనాలు ఎంతవరకు ఉపయోగకరం?

ఎన్ని సాంకేతిక ఉపకరణాలను రూపొందించినా కొంత మేరకు ప్రభావం చూపుతాయి. కానీ, పూర్తిగా సమస్యను పరిష్కరించలేవు.

సుహాస్

రజత పతకాలు గెలిచిన స్విమ్మర్లు సుహాస్ ప్రీతమ్, కశిష్

సాక్షి, హైదరాబాద్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌జీఎఫ్‌ఐ) జాతీయ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ స్విమ్మర్లు రెండు రజత పతకాలు సాధించారు. ఢిల్లీలో జరుగుతున్న ఈ పోటీల్లో అండర్‌-19 బాలుర విభాగంలో మైలారి సుహాస్ ప్రీతమ్... అండర్‌-14 బాలుర విభాగంలో అద్దూరి కశిష్ శ్రీవాస్తవ రజత పతకాలు సొంతం చేసుకున్నారు. 100 మీటర్ల బటర్‌ఫ్లయ్ ఫైనల్ రేసును సుహాస్ ప్రీతమ్ 57.32 సెకన్లలో ముగించి రెండో స్థానాన్ని దక్కించుకున్నాడు. చింతన్ శెట్టి (కర్ణాటక; 56.52 సెకన్లు) స్వర్ణ పతకం, శ్రీవర్ధన్ రాజారామ్ (మహారాష్ట్ర; 57.65 సెకన్లు) కాంస్య పతకం గెలిచారు. 200 మీటర్ల బ్రెస్ట్‌స్ట్రోక్ ఈవెంట్ ఫైనల్ రేసును కశిష్ శ్రీవాస్తవ 2 నిమిషాల 43.11 సెకన్లలో ముగించి రెండో స్థానాన్ని సంపాదించాడు. గణప చేతన్ నాగరాజా (కర్ణాటక; 2ని:36.04 సెకన్లు) స్వర్ణ పతకం, సౌరవ్ పుతెల్ (ఒడిశా; 2ని:43.94 సెకన్లు) కాంస్య పతకం కైవసం చేసుకున్నారు.

కశిష్

భారీ విజయంతో భారత్ బోణీ

తొలి మ్యాచ్‌లో 13-0తో నమీబియాపై గెలుపు

హీనా బానో

సాంటియాగో (చిలీ): జూనియర్ మహిళల ప్రపంచ కప్ హాకీ టోర్నమెంట్‌లో భారత జట్టు భారీ విజయంతో శుభారంభం చేసింది. సోమవారం జరిగిన గ్రూప్ 'సి' తొలి లీగ్ మ్యాచ్‌లో జ్యోతి సింగ్ సారథ్యంలోని భారత జట్టు 13–0 గోల్స్ తేడాతో నమీబియా జట్టుపై ఘనవిజయం సాధించింది. భారత్ తరఫున హీనా బానో (35వ, 35వ, 45వ నిమిషాల్లో), కనిక సివాచ్ (12వ, 30వ, 45వ నిమిషాల్లో) మూడు గోల్స్ చొప్పున సాధించారు. సాక్షి రాణా (10వ, 23వ నిమిషాల్లో) రెండు గోల్స్ చేసింది. బినిమా ధన్ (14వ నిమిషంలో), సోనమ్ (14వ నిమిషంలో), సాక్షి శుక్లా (27వ నిమిషంలో), ఇషిక (36వ నిమిషంలో), మనీషా (60వ నిమిషంలో) ఒక్కో గోల్ సాధించారు. మ్యాచ్ మొత్తంలో భారత్‌కు 11 పెనాల్టీ కార్నర్‌లు లభించగా... నమీబియాకు ఒక్క పెనాల్టీ కార్నర్ కూడా రాలేదు. భారత్ 11 పెనాల్టీ కార్నర్‌లలో ఐదింటిని మాత్రమే సద్వినియోగం చేసుకుంది. అన్నింటిని లక్ష్యానికి చేరిస్తే విజయం అంతరం మరింత భారీగా ఉండేది. గ్రూప్ 'సి'లోని మరో మ్యాచ్‌లో జర్మనీ 7–1తో ఐర్లాండ్‌ను ఓడించింది. రేపు జరిగే రెండో లీగ్ మ్యాచ్‌లో జర్మనీతో భారత్ తలపడుతుంది.

'కోహ్లి భవిష్యత్తుపై చర్చ అనవసరం'

బ్యాటింగ్ కోచ్ సితాన్షు స్పష్టీకరణ

కోహ్లి

సితాన్షు

రాంచీ: భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లి మరో అద్భుత ఇన్నింగ్స్‌తో ఆదివారం తనపై వస్తున్న విమర్శలకు సమాధానమిచ్చాడు. గత కొంత కాలంగా జట్టులో కోహ్లి స్థానంపై, 2027 వరల్డ్ కప్ వరకు ఆడటంపై చర్చ జరుగుతున్న నేపథ్యంలో ప్రతీ మ్యాచ్‌లోనూ అతని ప్రదర్శనపై అందరి దృష్టి నిలుస్తోంది. అయితే ఈ విషయాన్ని భారత బ్యాటింగ్ కోచ్ సితాన్షు కొటక్ ఖండించాడు. కోహ్లి భవిష్యత్తు అనేది అసలు చర్చించాల్సిన అంశమే కాదని అతను స్పష్టం చేశాడు. ఇంత బాగా బ్యాటింగ్ చేస్తున్న సమయంలో ఇంకేం ఆశిస్తామని కొటక్ వ్యాఖ్యానించాడు. 'కోహ్లి గురించి ఈ తరహాలో ఆలోచించాల్సిన అవసరం ఏముందో నాకు అర్థం కావడం లేదు. అతను చాలా గొప్పగా ఆడుతున్నాడు. అసలు అతని భవిష్యత్తుపై మాట్లాడాల్సిన అవసరం ఏముంది. అతని ఆట, ఫిట్‌నెస్ చూస్తే మరో చర్చకు తావు లేదు. కోహ్లి బ్యాటింగ్ అసాధారణంగా ఉంది. ఈ జోరు ఇలాగే కొనసాగితే మరో విషయం గురించి ఆలోచించాల్సిన అవసరం లేదు. కోహ్లి, రోహిత్ ఇద్దరూ జట్టు విజయంలో తమ పాత్ర పోషిస్తున్నారు. వారిద్దరికీ ఎంతో అనుభవం ఉంది. అది జట్టుకు చాలా ఉపయోగపడుతుంది. జట్టు విజయంలో వారి భాగస్వామ్యం కూడా కీలకంగా మారింది' అని కొటక్ భారత్ బ్యాటర్లపై తన అభిప్రాయాన్ని వెల్లడించాడు. మంచు ప్రభావం కారణంగా తమ బౌలర్లను పట్టు చిక్కలేదని, అందుకే దక్షిణాఫ్రికా కూడా భారీగా పరుగులు సాధించి విజయానికి చేరువగా రాగలిగిందని విశ్లేషించిన కొటక్...ఆరంభంలో వికెట్లు తీసి ప్రత్యర్థిని కట్టడి చేసిన హర్షిత్ రాణాపై ప్రత్యేకంగా ప్రశంసించాడు.

హార్దిక్ పాండ్యా X అభిషేక్ శర్మ

- నేడు ఉప్పల్ స్టేడియంలో మ్యాచ్
- ముస్తాక్ అలీ ట్రోఫీలో పంజాబ్‌తో బరోడా 'ఢీ'
- గాయం నుంచి కోలుకున్న పాండ్యా
- ఉదయం 11 గంటల నుంచి జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

హార్దిక్ పాండ్యా

సాక్షి, హైదరాబాద్: భారత ఆల్‌రౌండర్ హార్దిక్ పాండ్యా ఎట్టకేలకు మ్యాచ్ బరిలోకి దిగుతున్నాడు. దేశవాళీ టి20 క్రికెట్ టోర్నీ సయ్యద్ ముస్తాక్ అలీ ట్రోఫీలో భాగంగా నేడు పంజాబ్‌తో జరిగే మ్యాచ్‌లో బరోడా తరఫున హార్దిక్ ఆడనున్నాడు. ఉప్పల్‌లోని రాజీవ్‌గాంధీ స్టేడియంలో ఉదయం 11 గంటల నుంచి ఈ మ్యాచ్ జరుగుతుంది. దుబాయ్‌లో జరిగిన ఆసియా కప్ టి20 టోర్నీలో గాయపడిన హార్దిక్ ఇప్పుడు పూర్తిగా కోలుకున్నాడు. సెప్టెంబర్ 26న అతను చివరిసారిగా మ్యాచ్ (శ్రీలంకతో) ఆడాడు. ఈ మ్యాచ్‌లో కండరాల గాయంతో తప్పుకున్న పాండ్యా కొంత విశ్రాంతి తర్వాత బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ)కు చేరుకున్నాడు. అక్టోబర్ 15 నుంచి మధ్యలో మూడు రోజుల దీపావళి సెలవు మినహా నవంబర్ 29 వరకు అక్కడే ఉండి పూర్తిగా కోలుకునే వరకు రీహాబిలిటేషన్ కొనసాగించాడు. మ్యాచ్ ఆడేందుకు పాండ్యా సోమవారం హైదరాబాద్‌కు చేరుకున్నాడు. హార్దిక్ ఇప్పుడు అటు బ్యాటింగ్, ఇటు బౌలింగ్ చేసేందుకు మ్యాచ్ ఫిట్‌గా మారాడని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సీఓఈ) సర్టిఫికెట్ ఇచ్చింది. 'దాదాపు నలభై రోజుల పాటు సీఓఈ బయటకు కూడా పోకుండా పాండ్యా పూర్తి స్థాయి రీహాబిలిటేషన్‌లో పాల్గొన్నాడు. ఈ క్రమంలో అతను రిటర్న్ టు ప్లే ప్రోటోకాల్స్‌ను అన్ని విధాలా పాటించాడు. ఇప్పుడు మ్యాచ్ ఆడటమే మిగిలింది' అని సీఓఈ ప్రతినిధి ఒకరు వెల్లడించారు.

ప్రజ్ఞాన్ ఓజా సమక్షంలో...

నిజానికి ముందుగా అనుకున్న షెడ్యూల్ ప్రకారం పాండ్యా డిసెంబర్ 4న గుజరాత్‌తో జరిగే మ్యాచ్‌లో ఆడాల్సి ఉంది. అయితే బీసీసీఐ సెలక్టర్, హైదరాబాద్‌కే చెందిన ప్రజ్ఞాన్ ఓజా ముస్తాక్ అలీ ట్రోఫీ మ్యాచ్‌లను ప్రత్యక్షంగా తిలకిస్తున్నాడు. ఈ నేపథ్యంలో కనీసం రెండు మ్యాచ్‌లలో హార్దిక్ ఆట, ఫిట్‌నెస్‌ను పరీక్షించాలని సెలక్టర్లు భావించారు. దాంతో నేడు, గురువారం జరిగే రెండు మ్యాచ్‌లు హార్దిక్ ఆడతాడు. దక్షిణాఫ్రికాతో జరిగే ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్ కోసం జట్టును ఎంపిక చేయనున్న నేపథ్యంలో అతని ప్రదర్శన కీలకం కానుంది.

అభిషేక్ శర్మ

అభిషేక్ మళ్లీ చెలరేగేనా!

భారత ఆటగాడు, సన్‌రైజర్స్ హైదరాబాద్ టీమ్ సభ్యుడు అభిషేక్ శర్మ మరోసారి తన టి20 మెరుపులను ప్రదర్శించేందుకు సిద్ధమయ్యాడు. ఆదివారం జింఖానా మైదానంలో బెంగాల్‌తో జరిగిన మ్యాచ్‌లో 42 బంతుల్లోనే 8 ఫోర్లు, 16 సిక్స్‌లతో 148 పరుగులు బాదిన అభిషేక్ ఇప్పుడు తనకు అచ్చొచ్చిన ఉప్పల్ మైదానంలో ఎలా ఆడతాడనేది ఆసక్తికరం. గత పోరులో 12 బంతుల్లోనే హాఫ్ సెంచరీని అందుకున్న అతను 32 బంతుల్లో సెంచరీ పూర్తి చేశాడు. హార్దిక్, కెప్టెన్ కృనాల్ పాండ్యా మినహా పెద్ద అనుభవం లేని బరోడా బౌలింగ్ అతడిని ఏమాత్రం నిలువరించగలదో చూడాలి.

భారత మహిళల హాకీ జట్టు చీఫ్ కోచ్ హరేంద్ర రాజీనామా

న్యూఢిల్లీ: భారత సీనియర్ మహిళల హాకీ జట్టు చీఫ్ కోచ్ పదవి నుంచి హరేంద్ర సింగ్ తప్పుకున్నాడు. వ్యక్తిగత కారణాలతో తాను రాజీనామా చేస్తున్నట్లు అతను సోమవారం ప్రకటించాడు. గత ఏడాది ఏప్రిల్‌లో హరేంద్ర బాధ్యతలు తీసుకున్న తర్వాత భారత మహిళల బృందం ఆసియా చాంపియన్స్ ట్రోఫీలో విజేతగా నిలిచింది. అయితే ఎఫ్‌ఐహెచ్ ప్రొ లీగ్ 2024–25 సీజన్‌లో ఆఖరి స్థానంతో సరిపెట్టుకొని దిగువ స్థాయికి పడిపోయింది. ఆడిన 16 మ్యాచ్‌లలో 2 మాత్రమే గెలిచిన జట్టు తర్వాతి సీజన్‌కు అర్హత సాధించడంలో విఫలమైంది. 'భారత మహిళల హాకీ జట్టుకు శిక్షణ ఇవ్వడం నా కెరీర్‌లో చెప్పుకోదగ్గ విశేషంగా నిలిచిపోతుంది. అయితే వ్యక్తిగత కారణాలతో నేను తప్పుకోవాల్సి వస్తోంది. భవిష్యత్తులో మన జట్టు మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుంటున్నా' అని హరేంద్ర పేర్కొన్నాడు. అయితే బయటకు వ్యక్తిగత కారణం అని చెబుతున్నా... ప్రదర్శన బాగా లేకపోవడంతో రాజీనామా చేయాలని హాకీ ఇండియా (హెచ్‌ఐ)నే కోరినట్లు సమాచారం. 'హరేంద్ర అడిగిన ప్రతీ సౌకర్యాలు హెచ్‌ఐ కల్పించింది. అతని ఏ అభ్యర్థననూ కాదనలేదు. కానీ టీమ్ ప్రదర్శన మాత్రం పేలవంగా ఉంది. ఫిట్‌నెస్‌పరంగా చూసిన ప్రధాన జట్టులో 13 మంది ఆటగాళ్లు గాయాలపాలయ్యారు. పైగా అతని వ్యవహార శైలి, మహిళా ప్లేయర్ల పట్ల అతని కఠిన వైఖరిపై కూడా చాలా ఫిర్యాదులు వచ్చాయి' అని హెచ్‌ఐ అధికారి ఒకరు వెల్లడించారు. హరేంద్ర రాజీనామాను ఆమోదించామని ప్రకటించిన హెచ్‌ఐ అధ్యక్షుడు దిలీప్ టిర్కీ త్వరలోనే కొత్త కోచ్‌ను ఎంపిక చేస్తామన్నారు.

మెరిసిన మనిక

చెంగ్డూ (చైనా): అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ సమాఖ్య మిక్స్‌డ్ ప్రపంచకప్ టోర్నమెంట్‌లో భారత్‌కు వరుసగా రెండో పరాజయం ఎదురైంది. అయితే మహిళల సింగిల్స్‌లో భారత స్టార్ మనిక బత్రా, పురుషుల సింగిల్స్‌లో భారత నంబర్‌వన్ మానవ్ ఠక్కర్ తమకంటే మెరుగైన ర్యాంక్ ఉన్న ప్లేయర్లపై సంచలన విజయాలు సాధించడం గమనార్హం. తొలి మ్యాచ్‌లో క్రొయేషియా చేతిలో 6–8తో ఓడిపోయిన భారత్... జపాన్‌తో జరిగిన రెండో మ్యాచ్‌లో 4–8తో పరాజయం పాలైంది. మహిళల సింగిల్స్‌లో 8వ ర్యాంకర్ ఇటో మిమా (జపాన్)తో జరిగిన మ్యాచ్‌లో 53వ ర్యాంకర్ మనిక 9–11, 11–8, 11–8తో... పురుషుల సింగిల్స్‌లో 8వ ర్యాంకర్ సొరా మత్సుషిమా (జపాన్)తో జరిగిన మ్యాచ్‌లో 35వ ర్యాంకర్ మానవ్ 11–9, 4–11, 11–6తో గెలిచారు. అయితే మిక్స్‌డ్ డబుల్స్‌లో యశస్విని–ఆకాశ్; మహిళల డబుల్స్‌లో యశస్విని–దియా జోడీలు ఓడిపోవడంతో భారత్‌కు ఓటమి తప్పలేదు.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా

రవితేజ, ఆషికా రంగనాథ్

బాగున్నావే రసగుల్లా...

రవితేజ హీరోగా కిశోర్ తిరుమల దర్శకత్వంలో రూపొందిన సినిమా 'భర్త మహాశయులకు విజ్ఞప్తి'. ఆషికా రంగనాథ్, డింపుల్ హయతి హీరోయిన్లుగా నటించారు. జీ స్టూడియోస్ సమర్పణలో ఎస్ఎల్‌వీ సినిమాస్ పతాకంపై సుధాకర్ చెరుకూరి నిర్మించిన ఈ సినిమా వచ్చే సంక్రాంతికి రిలీజ్ కానుంది. తాజాగా ఈ చిత్రంలోని 'బెల్లా బెల్లా..' సాంగ్ లాంచ్ ఈవెంట్‌ని నిర్వహించారు చిత్రయూనిట్. 'బెల్లా బెల్లా ఇసాబెల్లా బాగున్నావే రసగుల్లా... ఎల్లా ఎల్లా స్పైసీ ఇల్లా నింపేసావే నిలువెల్లా...' అంటూ సాగే ఈ పాటను భీమ్స్ సిసిరోలియో స్వరపరచగా, సురేష్ గంగుల లిరిక్స్ అందించారు. నకాష్ అజీజ్–రోహిణీ పాడారు. ఈ సాంగ్‌లాంచ్ ఈవెంట్‌లో కిశోర్ తిరుమల మాట్లాడుతూ–''సంక్రాంతికి మా సినిమాని థియేటర్స్‌లో చూసి ఎంజాయ్ చేయండి'' అని చెప్పారు. ''మంచి ఎంటర్‌టైన్‌మెంట్ ఉన్న సినిమా ఇది. రవితేజగారి ఎనర్జీని మ్యాచ్ చేయడం అంత ఈజీ కాదు'' అని పేర్కొన్నారు ఆషికా రంగనాథ్. ''ఈ చిత్రంలో బాలామణి అనే పాత్ర చేశాను. రవితేజగారి ఎనర్జీని మరోసారి సంక్రాంతికి చూడబోతున్నాం'' అని డింపుల్ హయతి అన్నారు.

ఫిబ్రవరిలో యుఫోరియా

భూమిక

ప్రముఖ దర్శకుడు గుణశేఖర్ తెరకెక్కించిన తాజా చిత్రం 'యుఫోరియా'. భూమిక చావ్లా, గౌతమ్ వాసుదేవ మీనన్, సారా అర్జున్, నాజర్, రోహిత్, విఘ్నేష్ గవిరెడ్డి, లిఖిత యలమంచలి కీలక పాత్రలు పోషించారు. రాగిణి గుణ సమర్పణలో గుణ హ్యాండ్ మేడ్ ఫిల్మ్స్ బ్యానర్‌పై నీలిమ గుణ, యుక్తా గుణ నిర్మించారు. ఈ సినిమాని క్రిస్మస్ కానుకగా ఈ నెల 25న విడుదల చేయనున్నట్లు నిర్మాతలు తొలుత ప్రకటించారు. అయితే తాజాగా 2026 ఫిబ్రవరి 6న రిలీజ్ చేయనున్నట్లు చిత్రయూనిట్ పేర్కొంది. ''నేటి యువతకి, కుటుంబ ప్రేక్షకులకు కనెక్ట్ అయ్యేలా వైవిధ్యమైన కాన్సెప్ట్‌తో గుణశేఖర్ 'యుఫోరియా' తీశారు. మా సినిమాని ఈ నెల 25న విడుదల చేయాలనుకున్నాం. అయితే ఈ క్రిస్మస్‌కి అనుకోకుండా చాలా సినిమాలు రిలీజ్‌లకు సిద్ధమయ్యాయి. ఈ బాక్సాఫీస్ రద్దీని తగ్గించటానికి, 'యుఫోరియా' మూవీకి మంచి రిలీజ్ డేట్ అవసరమని భావించి, 2026 ఫిబ్రవరి 6న విడుదల చేయబోతున్నాం. మా చిత్రం ద్వారా ప్రేక్షకులను ఆలోచింప చేసేలా, గొప్ప అనుభూతిని అందించాలి అనేది మా ఆలోచన'' అని చిత్రయూనిట్ తెలిపింది. ఈ చిత్రానికి సంగీతం: కాల భైరవ, కెమెరా: ప్రవీణ్ కె పోతన్.

అఖండ 2 అంతకుమించి ఉంటుంది

- రామ్ ఆచంట, గోపీ ఆచంట



''అఖండ 2: తాండవం' సినిమా మొదలు పెట్టినప్పటి నుంచి భారతదేశం అంతా విడుదల చేయాలని భావించాం. అయితే పాన్ ఇండియా కోసం ప్రత్యేకంగా కథలో ఎలాంటి మార్పులు చేయలేదు. ఇది పాన్ ఇండియా కంటెంట్ అయినప్పటికీ సినిమా మాత్రం గ్లోబల్‌గా అందరికీ కనెక్ట్ అయ్యేలా ఉంటుంది. బాలయ్య, బోయపాటిగారి నుంచి ప్రేక్షకులు ఏం ఆశిస్తారో అంతకుమించి 'అఖండ 2' ఉంటుంది'' అని నిర్మాతలు రామ్ ఆచంట, గోపీ ఆచంట తెలిపారు. బాలకృష్ణ, సంయుక్తా మీనన్ జంటగా నటించిన చిత్రం 'అఖండ 2: తాండవం'. బోయపాటి శ్రీను దర్శకత్వం వహించారు. ఎం. తేజస్విని సమర్పణలో 14 రీల్స్ ప్లస్ బ్యానర్‌పై రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మించిన ఈ సినిమా ఈ నెల 5న విడుదల కానుంది. ఈ నేపథ్యంలో రామ్ ఆచంట, గోపీ ఆచంట విలేకరులతో మాట్లాడుతూ– ''బాలకృష్ణగారితో మేము చేసిన 'లెజెండ్' పెద్ద విజయాన్ని సాధించింది. ఆ తర్వాత వేరే కథ అనుకున్నప్పటికీ 'అఖండ 2'ని ముందుకు తీసుకెళ్లాం. బాలయ్యగారితో పనిచేయడం చాలా ఎగ్జైటింగ్‌గా ఉంది. బోయపాటిగారు అహర్నిశలు కష్టపడి కుంభమేళా సన్నివేశాలని అద్భుతంగా తీర్చిదిద్దారు. ఈ సినిమా క్లైమాక్స్‌ని కాశ్మీర్లో చేయాల్సింది. ఆ సమయంలో పెహల్గాం దాడి జరగడంతో షూటింగ్ అనుమతి రాలేదు. ఈ కారణంగా జార్జియాలో మైనస్ డిగ్రీ చలిలో చిత్రీకరించాం. మా సినిమా 2డీ, 3 డీలో ఒకేసారి రిలీజ్ అవుతోంది. మా సినిమాకి ప్రజెంటర్ తేజస్విని ప్రమోషన్‌కి సంబంధించి మంచి సజెషన్స్ ఇచ్చారు. సంయుక్తది హీరోయిన్ క్యారెక్టర్‌లా కాకుండా ఈ కథలో ఒక ముఖ్యమైన పాత్రలానే ఉంటుంది. 'అఖండ'లో ఉన్న పూర్ణగారి పాత్ర 'అఖండ 2'లోనూ కంటిన్యూ అవుతుంది. తమన్‌గారి మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ఆడియన్స్‌ని మెస్మరైజ్ చేస్తాయి. 'అఖండ 3' చేసే అవకాశం ఉంది. ఆది పినిశెట్టిగారు అద్భుతమైన పెర్ఫార్మర్. ఇందులో ఆయన పాత్ర చాలా చక్కగా వచ్చింది. తన పాత్రకి 200శాతం న్యాయం చేశారాయన. 'టైసన్ నాయుడు' సినిమాని ఒకటి రెండు నెలల్లో రిలీజ్ చేస్తాం. ప్రస్తుతం కొత్త డైరెక్టర్, కొత్త ఆర్టిస్టులతో రెండు ప్రాజెక్ట్స్ చేస్తున్నాం. అలాగే ఒక పెద్ద సినిమా చర్చల్లో ఉంది'' అని చెప్పారు.

చదువుకోవడానికి లండన్ వెళితే...

ఆనంద్, నాగవంశీ, వైష్ణవి, ఆదిత్య హాసన్

'బేబీ' వంటి బ్లాక్‌బస్టర్ సినిమా తర్వాత ఆనంద్ దేవరకొండ, వైష్ణవీ చైతన్య జోడీగా నటిస్తున్న తాజా సినిమాకి 'ఎపిక్: ఫస్ట్ సెమిస్టర్' అనే టైటిల్ ఖరారైంది. ఆదిత్య హాసన్ దర్శకత్వంలో శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. హైదరాబాద్‌లో నిర్వహించిన ఈ సినిమా టైటిల్ గ్లింప్స్ లాంచ్ ఈవెంట్‌లో ఆనంద్ దేవరకొండ మాట్లాడుతూ–''తల్లిదండ్రుల ఒత్తిడి వల్ల ఓ కుర్రాడు చదువుకోవడానికి లండన్ వెళితే అక్కడ ఏం జరిగింది? అన్నదే ఈ చిత్ర కథ. తెలుగులో పూర్తిస్థాయిలో రొమాంటిక్ కామెడీ సినిమాలు పెద్దగా రావడం లేదు. ఆ లోటును మా సినిమా భర్తీ చేసేలా ఉంటుంది'' అని చెప్పారు. ''ఇదొక మధ్యతరగతి యువకుడి ప్రేమకథ'' అన్నారు ఆదిత్యా హాసన్. ''జీవితంలో మనం దాటి వచ్చిన చిన్న చిన్న అందమైన జ్ఞాపకాలను గుర్తుచేసేలా ఈ సినిమా ఉంటుంది'' అని తెలిపారు వైష్ణవీ చైతన్య. ''ఈ సినిమాకు 'ఎపిక్: ఫస్ట్ సెమిస్టర్' అనే టైటిల్ ఎందుకు పెట్టామంటే.. దీనికి కొనసాగింపు కూడా ఉంటుంది'' అని చెప్పారు నిర్మాత నాగవంశీ. ఈ సినిమాకు సంగీతం:హేషమ్ అబ్దుల్ వహాబ్, సహ–నిర్మాతలు: వెంకట్ ఉప్పుటూరి, వీఎంఆర్.

తెరపైకి శాంతారామ్ బయోపిక్

సిద్ధాంత్

ప్రముఖ దర్శక–నిర్మాత, నటుడు, స్క్రీన్ రైటర్, ఎడిటర్ వి.శాంతారామ్ జీవితం వెండితెరపైకి రానుంది. 'వి.శాంతారామ్: ది రెబల్ ఆఫ్ ఇండియన్ సినిమా' టైటిల్‌తో ఈ బయోపిక్ రానుంది. సిద్ధాంత్ చతుర్వేది ఆయన పాత్రలో నటించనున్నారు. ఈ సినిమాని సోమవారం ప్రకటించి, ఫస్ట్‌లుక్‌ను రిలీజ్ చేశారు. అభిజీత్ శిరీష్ దేశ్‌పాండే దర్శకత్వం వహించనున్న ఈ సినిమాను రాహుల్ కిరణ్ శాంతారామ్, సుభాష్ కాలే, సరితా అశ్విన్ వర్దే నిర్మించనున్నారు. ''శాంతారామ్‌గారి బయోపిక్‌లో నటించడం అనేది నా జీవితంలో లభించిన గొప్ప గౌరవంగా భావిస్తున్నాను'' అని చెప్పారు సిద్ధాంత్. ''శాంతారామ్‌గారు చేసిన ప్రయోగాలు, ధైర్యం వల్లే ఈ రోజు సినిమా ఇంత గొప్పగా తెరపై కనిపిస్తోంది. ఈ కథకు దర్శకుడిగా న్యాయం చేయగలనని భావిస్తున్నాను'' అన్నారు అభిజీత్.

దేశం కోసం


సత్యప్రకాశ్, హరివర్మన్, రాజశేఖర్

హరివర్మన్ హీరోగా గోపీ వర్మ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా 'దేశం కోసం మనలో ఒక్కడు'. నటరాజన్ అండ్ కృష్ణమల్ సమర్పణలో టి. గోపీవర్మ ఫిలిమ్స్ పతాకంపై రాజశేఖర్ మదనపల్లి నిర్మిస్తున్న ఈ సినిమా హైదరాబాద్‌లో ఆరంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి కొరియోగ్రాఫర్ గణేష్ మాస్టర్ కెమెరా స్విచ్చాన్ చేయగా, నటుడు సత్యప్రకాశ్ ముఖ్య అతిథిగా హాజరై క్లాప్ ఇచ్చారు. ఈ సందర్భంగా గోపీవర్మ మాట్లాడుతూ–''దేశభక్తికి సంబంధించిన సినిమాలను నిర్మించే నిర్మాతలు అరుదు. నన్ను నమ్మి ఈ అవకాశం ఇచ్చిన రాజశేఖర్‌గారికి ధన్యవాదాలు. మా చిత్రం అన్ని వర్గాల ప్రేక్షకులకు నచ్చుతుంది'' అని తెలిపారు.

కొరియన్ ఫిల్మ్ ఫెస్టివల్ ఆరంభం

యూ ఇన్ షిక్, సురేశ్, లిమ్ సాంగ్ వూ

హైదరాబాద్‌లో కొరియన్ ఫిల్మ్ ఫెస్టివల్ సోమవారం ఆరంభం అయింది. న్యూఢిల్లీలోని కొరియా రిపబ్లిక్ రాయబార కార్యాలయం, కొరియన్ ఫిల్మ్ కౌన్సిల్ భాగస్వామ్యంతో హైదరాబాద్‌లోని కొరియా గౌరవ కాన్సులేట్ జనరల్ మూడవ కొరియన్ ఫిల్మ్ ఫెస్టివల్‌ను ప్రారంభించారు. పలు కొరియన్ సినిమాలను ప్రదర్శించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్టాల్స్‌లో ఫేస్ పెయింటింగ్, హాంబోక్ ట్రైయల్స్, కొరియన్ కాలిగ్రఫీ, కొరియన్ నాట్స్, థీమ్ ఫోటో జోన్లతో కొరియన్ సంస్కృతిని ఎక్స్‌పీరియన్స్ చేసే ప్రత్యేక ఆకర్షణలు ఉన్నాయి. ప్రముఖ కొరియన్ దర్శకుడు, నిర్మాత యూ ఇన్ షిక్ మాట్లాడుతూ–''ఇండియాకి రావడం ఇదే మొదటిసారి. హైదరాబాద్ బిర్యానీ సూపర్‌గా ఉంది. భవిష్యత్తులో ఇండియన్, తెలుగు ఆడియన్స్ కోసం సినిమాలు నిర్మిస్తాను'' అని తెలిపారు. కొరియా గౌరవ కాన్సుల్ జనరల్ సురేశ్ చుక్కపల్లి, కొరియన్ యాక్టింగ్ అంబాసిడర్ లిమ్ సాంగ్ వూ మాట్లాడారు.

క్రైమ్ డ్రామా

హీనా సోని, వెంకటేశ్, అపర్ణ

వెంకటేశ్ పెద్దపాలెం హీరోగా, అపర్ణ మల్లిక్, హీనా సోని హీరోయిన్లుగా నటించిన యాక్షన్, క్రైమ్ డ్రామా చిత్రం 'వన్ బై ఫోర్'. 'బాహుబలి' పళని దర్శకత్వంలో రంజన రాజేశ్ గుంజల్, రోహిత్ రాందాస్ గుంజల్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 12న రిలీజ్ కానుంది. ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌లో వెంకటేశ్ పెద్దపాలెం మాట్లాడుతూ– ''నాది మదనపల్లి అని గర్వంగా చెప్పుకుంటున్నాను. టంగ్ స్లిప్ అనే పాయింట్‌తో ఈ క్రైమ్ డ్రామా సినిమా తీశాం'' అన్నారు. ''తెలుగులో సినిమా ప్రేమికులు ఎక్కువగా ఉంటారు. అందుకే ఇక్కడ సినిమాలు నిర్మిస్తున్నాం'' అన్నారు రంజన రాజేష్. ''మా సినిమా బాగా వచ్చింది'' అని రోహిత్ రాందాస్, దర్శకుడు పళని తెలిపారు. అపర్ణ మల్లిక్, హీనా సోని, కొరియోగ్రాఫర్ సాగర్ వేలూరు మాట్లాడారు.

సాక్షి బిజినెస్
మంగళవారం
2-12-2025

స్టాక్ మార్కెట్లు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
65	27
85,642	26,176

విదేశీ సూచీలు

నాస్‌డాక్	23,328	▽	37
డోజోన్స్	47,450	▽	222
ఎఫ్‌టీఎస్ఈ 100	9,709	▽	12
డాక్స్	23,581	▽	256
షాంఘై	3,914	△	25
నికాయ్	49,303	▽	951

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ.లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బిఐ	89.00	90.02
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బిఐ	116.90	109.88
€	యూరో	ఎస్‌బిఐ	102.40	105.20
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బిఐ	59.87	58.27
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బిఐ	57.43	59.71
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	66.81	70.53
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	23.00	24.49
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.49	24.75
¥	చైనా యువాన్	థామస్‌కుక్	11.78	13.61

రికార్డు స్థాయి నుంచి రివర్స్..

జీవితకాల గరిష్టాల వద్ద అమ్మకాలు ● స్వల్పలాభాలతో ముగిసిన సూచీలు

ముంబై: జీవితకాల గరిష్ట స్థాయి నమోదు తర్వాత లాభాల స్వీకరణతో స్టాక్ సూచీలు సోమవారం స్వల్పనష్టాలతో ముగిశాయి. విదేశీ ఇన్వెస్టర్ల విక్రయాలు ఒత్తిడి పెంచాయి. ఫలితంగా సెన్సెక్స్ 65 పాయింట్లు నష్టపోయి 85,642 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 27 పాయింట్లు కోల్పోయి 26,176 వద్ద నిలిచింది. దేశీయ సెప్టెంబర్ జీడీపీ వృద్ధి అంచనాలకు మించి 8.2% నమోదుతో స్టాక్ సూచీలు ఉదయం ఉత్సాహంగా మొదలయ్యాయి. ఒక దశలో సెన్సెక్స్ 452 పాయింట్లు బలపడి 86,159 వద్ద జీవితకాల గరిష్టాన్ని నమోదు చేసింది. నిఫ్టీ సైతం123 పాయింట్లు బలపడి 26,326 వద్ద సరికొత్త రికార్డు స్థాయిని లిఖించింది. ఆ వెంటనే కీలక రంగాల్లో లాభాల స్వీకరణ మొదలైంది. మరోవైపు అంచనాలకు మించి జీడీపీ వృద్ధి నమోదుతో ఆర్‌బీఐ వడ్డీరేట్ల కోతపై అనుమానాలు రేకెత్తాయి. ఫారెక్స్ మార్కెట్లో రూపాయి క్షీణత, నవంబర్‌లో జీఎస్‌టీ వసూళ్లు స్వల్పంగా తగ్గడం సెంటిమెంట్‌ను దెబ్బతీశాయి. ఫలితంగా ఆరంభ లాభాలు కోల్పోయిన సూచీలు స్వల్ప నష్టాలతో గట్టెక్కాయి. డాలర్ మారకంలో రూపాయి విలువ 8 పైసలు బలహీనపడి 89.53 వద్ద స్థిరపడింది. ఆసియాలో చైనా, హాంగ్‌కాంగ్ సూచీలు లాభపడగా, కొరియా, జపాన్ సూచీలు నష్టపోయాయి. యూరప్ మార్కెట్లు 0.50%- 1% పతనమయ్యాయి. అమెరికా స్టాక్ సూచీలు అరశాతం నష్టాల్లో ట్రేడవుతున్నాయి.

- ➜ నవంబర్‌లో వాహన అమ్మకాలు 26% వృద్ధితో టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ షేరు 2% పెరిగి రూ.364 వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో 2.50% లాభపడి రూ.365 వద్ద గరిష్టాన్ని తాకింది.
- ➜ రంగాల వారీగా బీఎస్ఈ ఇండెక్సుల్లో రియల్టీ 1%, కన్జూమర్ డ్యూరబుల్స్, సర్వీసెస్ సూచీలు అర శాతం, టెలికమ్యూనికేషన్, ఎఫ్ఎంసీజీ, చమురు సూచీలు 0.10 శాతం పతనమయ్యాయి. మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు వరుసగా 0.19%, 0.05 శాతం నష్టపోయాయి. ఆటో, మెటల్, ఐటీ, కన్జూమర్ డిస్క్రెషనరీ షేర్లకు డిమాండ్ లభించింది.

ఆగని పసిడి పరుగు

ఢిల్లీలో రూ.1,33,200 ● ఒకే రోజు రూ.3,040 పెరుగుదల

న్యూఢిల్లీ: బంగారం, వెండి ధరలు మరోసారి భగ్గుమన్నాయి. ఢిల్లీ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత పసిడి ధర సోమవారం 10 గ్రాములకు రూ.3,040 పెరిగి రూ.1,33,200కు చేరింది. ఇటీవలే నమోదైన జీవితకాల గరిష్ట ధర రూ.1,34,800కు చేరువైంది. మరో రూ.600కు పైగా పెరిగితే పసిడి ధరల్లో కొత్త రికార్డు నమోదు కానుంది. ప్రస్తుతం వివాహాల సీజన్ నడుస్తుండడంతో డిమాండ్ స్థిరంగా కొనసాగుతున్నట్టు, ఇది ధరలకు మద్దతునిస్తున్నట్టు విశ్లేషకులు భావిస్తున్నారు. మరోవైపు వెండి ధర సైతం వరుసగా ఐదో రోజు ర్యాలీ చేసింది. కిలోకి రూ.5,800 పెరిగి రూ.1,77,000కు చేరుకుంది. అంతర్జాతీయ మార్కెట్లో బంగారం ధర ఔన్స్‌కు 42 డాలర్లు ఎగసి (ఒక శాతం) 4,262.52 డాలర్ల స్థాయిని అందుకుంది. వెండి ధర (స్పాట్ మార్కెట్) ఔన్స్‌కి 3 శాతానికిపైగా ర్యాలీ చేసి 59 డాలర్లకు చేరింది. గత వారం రోజుల్లోనే వెండి ధర 16.7 శాతం పెరగడం గమనార్హం. అంతేకాదు 2025లో వెండి ధర రెట్టింపైంది. 2024 డిసెంబర్ 31న ఔన్స్ ధర 28.97 డాలర్ల వద్ద ఉంది. ''యూఎస్ డాలర్ బలహీనపడడం, యూఎస్ ఫెడ్ వచ్చే వారంలో వడ్డీ రేట్లు తగ్గిస్తుందన్న అంచనాలు పెరగడం, సెంట్రల్ బ్యాంకుల నుంచి పసిడి కొనుగోళ్లు బలంగా కొనసాగుతుండడం ధరలను మరింత గరిష్టాల దిశగా నడిపిస్తోంది''అని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ కమోడిటీ విభాగం సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు.

హై స్పీడ్‌లో ఆటో సేల్స్

న్యూఢిల్లీ: పండుగ సీజన్ తర్వాత కూడా డిమాండ్ కొనసాగడంతో దిగ్గజ ఆటో కంపెనీలు మారుతీ సుజుకీ, టాటా మోటార్స్, మహీంద్రా అండ్ మహీంద్రా కంపెనీలు తమ వాహన విక్రయాల్లో వృద్ధి నమోదు చేశాయి.

నవంబర్‌లో కంపెనీల వాహన విక్రయాలు (ఎగుమతులు కలుపుకొని)...

కంపెనీ	2025	2024	వృద్ధి/క్షీణత (శాతాల్లో)
మారుతీ	2,29,021	1,81,531	26
హ్యుందాయ్	66,840	61,252	9
ఎంఅండ్ఎం	92,670	79,083	15
టాటా మోటార్స్	59,199	47,117	22
టయోటా కిర్లోస్కర్	33,752	26,323	28
స్కోడా ఆటో	5,491	--	--
కియా ఇండియా	25,489	20,600	24
ఫోర్స్ మోటార్స్	2,883	1,885	53
హీరో మోటోకార్ప్	6,04,490	4,59,805	31
సుజుకీ మోటార్‌సైకిల్	1,22,300	94,370	30
రాయల్ ఎన్‌ఫీల్డ్	1,00,670	82,257	22

మొబైల్స్‌లో 'సంచార్ సాథీ' తప్పనిసరి

- కొత్త హ్యాండ్‌సెట్స్‌లో ప్రీ-ఇన్‌స్టాల్ చేయాల్సిందే
- తయారీ సంస్థలకు డాట్ ఆదేశం
- 90 రోజుల గడువు

న్యూఢిల్లీ: మోసపూరిత కాల్స్ మొదలైన వాటిపై ఫిర్యాదు చేసేందుకు ఉపయోగపడే సంచార్ సాథీ యాప్‌ను కొత్త హ్యాండ్‌సెట్స్‌లో ముందుగానే ఇన్‌స్టాల్ చేయాలంటూ మొబైల్ ఫోన్ల తయారీ సంస్థలు, దిగుమతిదారులను టెలికం శాఖ (డాట్) ఆదేశించింది. ఇందుకు 90 రోజుల గడువు విధించింది. ఆ తర్వాత నుంచి తయారయ్యే ఫోన్లలో తప్పనిసరిగా సంచార్ సాథీ ప్రీ-ఇన్‌స్టాల్ చేయాల్సిందేనని నవంబర్ 28న జారీ చేసిన ఆదేశాల్లో పేర్కొంది. దీని ప్రకారం మొబైల్ ఫోన్‌లో సంచార్ సాథీ యాప్ చూడగానే కనిపించేలా, ఉపయోగించుకునే విధంగా ఉండాలి. దాన్ని డిజేబుల్ చేయకూడదు. పరిమితుల్లాంటివేవీ ఉండకూడదు.

ఇప్పుడున్న ఫోన్లనూ అప్‌డేట్ చేయాలి ..

ఇప్పటికే భారత్‌లో తయారైనవి, విక్రేతల దగ్గర ఉన్నవాటికి సంబంధించి తయారీ సంస్థలు, దిగుమతిదారులు సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ ద్వారా యాప్‌ను అందించాల్సి ఉంటుందని డాట్ పేర్కొంది. ఈ ఆదేశాల అమలు తీరుతెన్నుల గురించి, ఉత్తర్వులు వెలువడిన 120 రోజుల్లో అన్ని సంస్థలు, దిగుమతిదారులు కాంప్లయెన్స్ రిపోర్టును సమర్పించాల్సి ఉంటుందని తెలిపింది. ప్రస్తుతం యాపిల్, శాంసంగ్, గూగుల్, వివో, ఒప్పో, షావోమీలాంటి దిగ్గజాలు భారత్‌లో హ్యాండ్‌సెట్స్‌ని తయారు చేస్తున్నాయి. ఐఎంఈఐ (ఇంటర్నేషనల్ మొబైల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ నంబర్) దుర్వినియోగంపై సందేహాలుంటే ఫిర్యాదు చేసేందుకు, మొబైల్ డివైజ్‌లలోని ఐఎంఈఐలు సిసలైనవేనని నిర్ధారించుకునేందుకు సంచార్ సాథీ ఉపయోగపడుతుంది. 15 అంకెల ఐఎంఈఐ నంబరు సహా మొబైల్ ఫోన్‌ని గుర్తించేందుకు ఉపయోగపడే దేన్నైనా మార్చివేయడాన్ని నాన్-బెయిలబుల్ నేరంగా పరిగణిస్తారు. ఇందుకు రూ. 50 లక్షల వరకు జరిమానా, మూడేళ్ల వరకు జైలుశిక్షలాంటివి ఉంటాయి.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

తయారీపై 'టారిఫ్‌ల' ప్రభావం	ఎల్ఐసీ స్టాక్స్ కొనుగోళ్లపై సలహాలివ్వం: నిర్మలా సీతారామన్

జీఎస్‌టీ వసూళ్లు డీలా

- నవంబర్‌లో రూ.1,70,276 కోట్లు
- 0.7 శాతం వృద్ధికి పరిమితం

న్యూఢిల్లీ: వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) ఆదాయం ఏడాది కనిష్టానికి పడిపోయింది. నవంబర్‌లో రూ.1,70,276 కోట్లు జీఎస్‌టీ రూపంలో వసూలైంది. 2024 నవంబర్‌లో ఆదాయం రూ.1.69 లక్షల కోట్లతో పోల్చి చూస్తే 0.7 శాతం వృద్ధి నమోదైంది. అక్టోబర్‌లో మాత్రం స్థూల జీఎస్‌టీ వసూళ్లు అంతక్రితం ఏడాది ఇదే నెలతో (రూ.1.87 లక్షల కోట్లు) పోల్చి చూస్తే 4.6 శాతం అధికంగా రూ.1.95 లక్షల కోట్ల స్థాయిలో ఉండడం తెలిసిందే. జీఎస్‌టీలో శ్లాబులను కుదించడంతోపాటు, 375 వరకు ఉత్పత్తులను తక్కువ పన్ను శ్లాబులోకి మార్చడం తెలిసిందే. కొత్త రేట్లు సెప్టెంబర్ 22 నుంచి అమల్లోకి వచ్చాయి. అయితే అక్టోబర్‌లో మెరుగైన ఆదాయానికి పండుగల సమయంలో కొనుగోళ్లు దోహదపడినట్టు, నవంబర్ నెల గణాంకాల్లో రేట్ల సవరణ ప్రభావం కనిపించినట్టు విశ్లేషకులు భావిస్తున్నారు. ఇక ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి నవంబర్ వరకు జీఎస్‌టీ వసూళ్లు క్రితం ఆర్థిక సంవత్సరం ఇదే కాలంతో పోల్చి చూస్తే 8.9 శాతం పెరిగి రూ.14,75,488 కోట్లుగా ఉన్నాయి. రిఫండ్‌లు 4 శాతం తగ్గి రూ.18,196 కోట్లుగా ఉన్నాయి. రిఫండ్‌లను మినహాయించి చూస్తే నికర జీఎస్‌టీ ఆదాయం రూ.1.52 లక్షల కోట్లుగా ఉన్నట్టు తెలుస్తోంది.

13 నెలల కనిష్టానికి పారిశ్రామిక వృద్ధి

న్యూఢిల్లీ: దేశ పారిశ్రామిక రంగం పనితీరు జోరు అక్టోబర్‌లో నిదానించింది. 13 నెలల కనిష్ట స్థాయిలో 0.4 శాతంగా నమోదైంది. విద్యుత్, మైనింగ్, తయారీ రంగాల్లో పనితీరు మందగించింది.

- ➤ పారిశ్రామికోత్పత్తి సూచీ (ఐఐపీ) 2024 అక్టోబర్‌లో 3.7 శాతం వృద్ధిని చూడడం గమనార్హం.
- ➤ ఈ ఏడాది సెప్టెంబర్ నెల పారిశ్రామికోత్పత్తి వృద్ధి రేటును గతంలో ప్రకటించిన 4 శాతం నుంచి 4.6శాతానికి సవరిస్తున్నట్టు జాతీయ గణాంక కార్యాలయం (ఎన్ఎస్ఓ) ప్రకటించింది.
- ➤ పారిశ్రామికోత్పత్తిలో భాగమైన తయారీరంగం అక్టోబర్‌లో 1.8 శాతం వృద్ధిని నమోదు చేసింది. 2024 అక్టోబర్‌లో వృద్ధి 4.4 శాతం కంటే తక్కువ.
- ➤ మైనింగ్ రంగంలో ఉత్పత్తి 1.8 శాతం తగ్గింది. క్రితం ఏడాది అక్టోబర్‌లో 0.9 శాతం వృద్ధి చెందింది.
- ➤ విద్యుదుత్పత్తి సైతం 6.9% తగ్గింది. క్రితం ఏడాది ఇదే నెలలో 2% వృద్ధిని చూడడం గమనార్హం.
- ➤ క్యాపిటల్ గూడ్స్‌లో ఉత్పత్తి 2.4 శాతం పెరిగింది. కన్స్యూమర్ డ్యూరబుల్స్‌లో ఉత్పత్తి 0.5 శాతం తగ్గింది. క్రితం ఏడాది ఇదే నెలలో 5.5 శాతం వృద్ధి చెందడం గమనించొచ్చు.
- ➤ కన్స్యూమర్ నాన్ డ్యూరబుల్స్‌లో ఉత్పత్తి 4.4 శాతం తగ్గింది.
- ➤ ఇన్‌ఫ్రా/కన్‌స్ట్రక్షన్ గూడ్స్‌లో 7.1 శాతం వృద్ధి నమోదైంది.
- ➤ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్ నుంచి అక్టోబర్ వరకు దేశ పారిశ్రామికోత్పత్తి వృద్ధి 2.7 శాతానికి పరిమితమైంది. క్రితం ఏడాది ఇదే కాలంలో 4 శాతంగా ఉంది.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన
ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం: ఇండియన్ హిస్టరీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం: ఇంగ్లిష్
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం: డిజాస్టర్ మేనేజ్‌మెంట్ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం: రీజనింగ్

విద్య, ఉద్యోగ సమాచారం

యూసీఎస్ఎల్, కర్ణాటకలో 16 డిప్లొమా ఇంజనీరింగ్ ట్రెయినీ పోస్టులు

కర్ణాటకలోని ఉడుపి కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్(యూసీఎస్ఎల్).. వివిధ విభాగాల్లో డిప్లొమా ఇంజనీరింగ్ ట్రెయినీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 16.
- » **పోస్టుల వివరాలు:** డిప్లొమా ఇంజనీరింగ్ ట్రెయినీ(మెకానికల్)-12, డిప్లొమా ఇంజనీరింగ్ ట్రెయినీ(ఎలక్ట్రికల్)-04.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా(మెకానికల్ /ఎలక్ట్రికల్)లో ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు పని అనుభవం ఉండాలి.
- » **వయసు:**18.12.2025 నాటికి 25ఏళ్లు ఉండాలి.
- » **వేతనం:** నెలకు రూ.55,104.
- » **ఎంపిక విధానం:** రాతపరీక్ష ఆధారంగా.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 18.12.2025
- » **వెబ్‌సైట్:** https://udupicsl.com

రైట్స్ లిమిటెడ్‌లో 17 కన్సల్టెంట్ పోస్టులు

గుర్గావ్‌లోని రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామిక్ సర్వీస్(రైట్స్) ఒప్పంద ప్రాతిపదికన వివిధ విభాగాల్లో ఇండివిడ్యువల్ కన్సల్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 17.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిప్లొమా, బీటెక్‌లో ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు పని అనుభవం ఉండాలి.
- » **వయసు:** 62 ఏళ్లు మించకూడదు.
- » **వేతనం:** నెలకు పోస్టును అనుసరించి రూ.60,000 నుంచి రూ.2,55,000.
- » **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 08.12.2025
- » **వెబ్‌సైట్:** https://www.rites.com

గెయిల్ న్యూఢిల్లీలో సీనియర్ ఇంజనీర్ పోస్టులు

న్యూఢిల్లీలోని గ్యాస్ అథారిటీ ఆఫ్ ఇండియా లిమిటెడ్(గెయిల్) దేశవ్యాప్తంగా ఉన్న గెయిల్ వర్క్ సెంటర్లు/యూనిట్‌లలో వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 29.
- » **పోస్టుల వివరాలు:** చీఫ్ మేనేజర్(లా)-01, సీనియర్ ఆఫీసర్-13, సీనియర్ ఇంజనీర్-13, ఆఫీసర్-02.
- » **విభాగాలు:** ఎఫ్-ఎ, గెయిల్‌టెల్, ఎలక్ట్రికల్, బాయిలర్, మెకానికల్, ఇన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్, అఫీషియల్ లాంగ్వేజ్, మార్కెటింగ్, హెచ్‌ఆర్, లా, మెడికల్ సర్వీసెస్, సివిల్.
- » **అర్హత:** లా డిగ్రీ, సీఏ, సీఎంఏ, సంబంధిత విభాగంలో బ్యాచిలర్ డిగ్రీ, డిప్లొమా,ఎంబీఏ, బీఏ, బీఎస్సీ, ఎంబీబీఎస్,పీజీ ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
- » **వేతనం:** నెలకు చీఫ్ మేనేజర్‌కు రూ.90,000 నుంచి రూ.2,40,000, సీనియర్ మేనేజర్, సీనియర్ ఇంజనీర్‌కు రూ.60,000 నుంచి రూ.1,80,000, ఆఫీసర్‌కు రూ.50,000 నుంచి రూ.1,60,000.
- » **ఎంపిక విధానం:** షార్ట్‌లిస్టింగ్,గ్రూప్ డిస్కషన్, స్కిల్ టెస్ట్, ఇంటర్వ్యూ, పీఈటీ ఆధారంగా.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 24.11.2025.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 23.12.2025
- » **వెబ్‌సైట్:** https://gailonline.com

యూసీఐఎల్, జార్ఖండ్‌లో 107 పోస్టులు

జార్ఖండ్‌లోని యురేనియం కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్(యూసీఐఎల్) రెగ్యులర్ ప్రాతిపదికన మైనింగ్ మేట్, వైండింగ్ ఇంజన్ డ్రైవర్, బాయిలర్ ఆపరేటర్ కమ్ కంప్రెసర్ అటెండెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 107.
- » **పోస్టుల వివరాలు:** మైనింగ్ మేట్(సి)-95, వైండింగ్ ఇంజన్ డ్రైవర్(బి)-09, బాయిలర్-కమ్-కంప్రెసర్ అటెండెంట్(ఏ)-03.
- » **అర్హత:** పోస్టును అనుసరించి పదో తరగతి ఉత్తీర్ణులవ్వాలి. దీనితోపాటు డీజీఎంఎస్ జారీ చేసిన వైండింగ్ ఇంజన్ డ్రైవర్ కాంపిటెన్సీ, మైనింగ్ మేట్/ఫోర్‌మెన్ సర్టిఫికేట్‌తో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
- » **వయసు:** మైనింగ్ మేట్‌కు 40 ఏళ్లు, వైండింగ్ ఇంజన్ డ్రైవర్‌కు 32 ఏళ్లు, బాయిలర్ కమ్ కంప్రెసర్ అటెండెంట్‌కు 30 ఏళ్లు మించకూడదు.
- » **వేతనం:** నెలకు మైనింగ్ మేట్‌కు రూ.29,190 నుంచి రూ.45,480, వైండింగ్ ఇంజన్ డ్రైవర్(బి)కు రూ.28,790 నుంచి రూ.44,850, బాయిలర్ కమ్ కంప్రెసర్ అటెండెంట్‌కు రూ.28,390 నుంచి రూ.44,230.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 01.12.2025.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 31.12.2025.
- » **వెబ్‌సైట్:** https://ucil.gov.in

ఇస్రో తిరువనంతపురంలో వివిధ ఉద్యోగాలు

తిరువనంతపురం(కేరళ)లోని ఇండియన్ స్పేస్ రీసెర్చ్ ఆర్గనైజేషన్(ఇస్రో)-విక్రమ్ సారాభాయ్ స్పేస్ సెంటర్(వీఎస్ఎస్‌సీ) వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 05.
- » **పోస్టుల వివరాలు:** మెడికల్ ఆఫీసర్-01, డెంటల్ సర్జన్-04.
- » **అర్హత:** పోస్టును అనుసరించి ఎంబీబీఎస్, బీడీఎస్ ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు ఉద్యోగానుభవం, మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ అయి ఉండాలి. **వయసు:** 70 ఏళ్లు మించకూడదు.
- » **ఎంపిక విధానం:**షార్ట్‌లిస్ట్, ఇంటర్వ్యూ ద్వారా.
- » **దరఖాస్తు విధానం:** ఈమెయిల్ ద్వారా.
- » **ఈమెయిల్:** hsshelp@vssc.gov.in
- » **దరఖాస్తులకు చివరితేది:** 07.12.2025.
- » **వెబ్‌సైట్:** https://www.vssc.gov.in

రైట్స్ లిమిటెడ్, గుర్గావ్‌లో 200 అసిస్టెంట్ మేనేజర్ పోస్టులు

గుర్గావ్‌లోని రైల్ ఇండియా టెక్నికల్ అండ్ ఎకనామిక్ సర్వీస్ లిమిటెడ్(రైట్స్) నార్త్, ఈస్ట్, వెస్ట్, సౌత్ జోన్‌లలో వివిధ విభాగాల్లో అసిస్టెంట్ మేనేజర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 400.
- » **విభాగాలు:** సివిల్, ఎలక్ట్రికల్, సిగ్నల్ అండ్ టెలీ కమ్యూనికేషన్, మెకానికల్, మెటలర్జీ, కెమికల్, ఐటీ, ఫుడ్ టెక్నాలజీ, ఫార్మ.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ(సివిల్, ఎలక్ట్రానిక్స్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్, ఐటీ, మెటలర్జీ)లో ఉత్తీర్ణులవ్వాలి. దీనితో పాటు పని అనుభవం ఉండాలి. **వయసు:** 40 ఏళ్లు ఉండాలి.
- » **వేతనం:** నెలకు రూ.42,478.
- » **ఎంపిక విధానం:** రాతపరీక్ష,ఇంటర్వ్యూ ద్వారా.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 26.11.2025.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 25.12.2025.
- » **రాతపరీక్ష తేది:** 11.01.2026.
- » **పరీక్ష కేంద్రాలు:** ఢిల్లీ/గురుగ్రామ్, ముంబై, బెంగళూరు, కోల్‌కతా, భువనేశ్వర్, హైదరాబాద్, బిలాయ్, చెన్నై, పాట్నా, లక్నో.
- » **వెబ్‌సైట్:** www.rites.com

సెంట్రల్ స్కూల్స్‌లో కొలువుల పిలుపు

కేంద్ర ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పనిచేసే కేంద్రీయ విద్యాలయ సంఘటన్(కేవీఎస్), నవోదయ విద్యాలయ సమితి(ఎన్‌వీఎస్) విద్యాలయాల్లో టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడింది. పీఆర్‌టీ, టీజీటీ, పీజీటీ, ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్, లైబ్రేరియన్, మ్యూజిక్ టీచర్, బోధనేతర సిబ్బంది తదితర పోస్టులకు ఎంపిక ప్రక్రియ చేపట్టనుంది. ఈ నియామక ప్రక్రియను సీబీఎస్ఈ నిర్వహిస్తుంది. ఈ నేపథ్యంలో.. కేవీఎస్, ఎన్‌వీఎస్‌ల్లో పోస్టులు, దరఖాస్తుకు అర్హతలు, ఎంపిక విధానం తదితర వివరాలు..

- » కేంద్రీయ, నవోదయ విద్యాలయాల్లో ఉద్యోగాలు
- » 14,967 టీచింగ్, నాన్ టీచింగ్ పోస్టులకు నోటిఫికేషన్
- » టైర్1,2 పరీక్షలు, ఇంటర్వ్యూ, స్కిల్ టెస్టులతో ఎంపిక
- » నెలకు రూ.60వేల నుంచి రూ.90వేల వరకు వేతనం

మొత్తం పోస్టుల సంఖ్య: 14,967

పోస్టుల వివరాలు

అసిస్టెంట్ కమిషనర్-17, ప్రిన్సిపల్-227, వైస్ ప్రిన్సిపల్-58, పీజీటీ-2,996, టీజీటీ-6,215, పీఆర్‌టీ-2,684, పీఆర్‌టీ(సంగీతం)-187, స్పెషల్ ఎడ్యుకేటర్ (పీఆర్‌టీ)-494, లైబ్రేరియన్-147, కేవీఎస్ నాన్‌టీచింగ్ పోస్టులు-1,155, ఎన్‌వీఎస్ నాన్ టీచింగ్ పోస్టులు-787.

పోస్టులు-అర్హతలు

- ✦ **అసిస్టెంట్ కమిషనర్: అర్హత:** 50 శాతం మార్కులతో మాస్టర్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. బీఈడీ/ఇంటిగ్రేటెడ్ బీఈడీ, ఎంఈడీ చేసి ఉండాలి. మూడేళ్లు పనిచేసి ఉండాలి. హిందీ,ఇంగ్లిష్-కంప్యూటర్ నాలెడ్జ్ కలిగి ఉండాలి. **వయసు:** కేవీఎస్-50 ఏళ్ల వరకు, ఎన్‌వీఎస్-45 ఏళ్ల వరకు ఉండాలి.
- ✦ **ప్రిన్సిపల్: అర్హత:** 50 శాతం మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. బీఈడీ/ఇంటిగ్రేటెడ్ బీఈడీ, ఎంఈడీ చేసి ఉండాలి. ప్రిన్సిపల్‌గా మూడేళ్లు పనిచేసి ఉండాలి. హిందీ, ఇంగ్లిష్-కంప్యూటర్ నాలెడ్జ్ కలిగి ఉండాలి. **వయసు:** 35 నుంచి 50 ఏళ్ల వరకు ఉండాలి.
- ✦ **వైస్ ప్రిన్సిపల్: అర్హత:** 50 శాతం మార్కులతో మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. బీఈడీ/ఇంటిగ్రేటెడ్ బీఈడీ చేసి ఉండాలి. ఆరేళ్లు పీజీటీగా అనుభవం ఉండాలి. హిందీ/ఇంగ్లిష్ వచ్చి ఉండాలి. **వయసు:** 35 నుంచి 50 ఏళ్ల వరకు ఉండాలి.
- ✦ **పీజీటీ: అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో 50 శాతం మార్కులతో పీజీ ఉత్తీర్ణులవ్వాలి. బీఈడీ/ఇంటిగ్రేటెడ్ బీఈడీ, ఎంఈడీ చేసి ఉండాలి. ఇంగ్లిష్, హిందీ బోధించే సామర్థ్యం ఉండాలి. **వయసు:** 40 ఏళ్ల వరకు ఉండాలి.
- ✦ **టీజీటీ: అర్హత:** 50 శాతం మార్కులతో గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులవ్వాలి. బీఈడీ/ఇంటిగ్రేటెడ్ బీఈడీ, ఎంఈడీ చేసి ఉండాలి. సీటెట్(పేపర్-2)లో అర్హత సాధించి ఉండాలి. ఇంగ్లిష్, హిందీ బోధించే సామర్థ్యం ఉండాలి. వయసు: 35 ఏళ్ల వరకు ఉండాలి.
- ✦ **ప్రైమరీ టీచర్: అర్హత:** 50 శాతం మార్కులతో 12వ తరగతి + రెండేళ్ల డీ.ఈఐ.ఈడీ/బీ.ఈఐ.ఈడీ ఉత్తీర్ణులవ్వాలి. సీటెట్(పేపర్-1)లో అర్హత సాధించి ఉండాలి. ఇంగ్లిష్, హిందీ కమ్యూనికేషన్ సామర్థ్యం ఉండాలి.
- ✦ **పీఆర్‌టీ(సంగీతం):అర్హత:** సీనియర్ సెకండరీ ఉత్తీర్ణులవ్వాలి+సంగీతంలో డిగ్రీ/డిప్లొమా ఉత్తీర్ణులవ్వాలి.ఇంగ్లిష్,హిందీలో నైపుణ్యం ఉండాలి.
- ✦ **స్పెషల్ ఎడ్యుకేటర్(పీఆర్‌టీ):** ఆర్‌సీఐ ఆమోదించిన అర్హతలు ఉండాలి. సీటెట్ అర్హత కలిగి ఉండాలి. ఆర్‌సీఐ రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా ఉండాలి.
- ✦ **లైబ్రేరియన్: అర్హత:** బీ.లైబ్రరీ/బీ.ఎల్.ఐ.ఎస్‌సీ ఉత్తీర్ణులవ్వాలి. కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండాలి.
- ✦ **కేవీఎస్ నాన్ టీచింగ్ పోస్టులు:** అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, ఫైనాన్స్ ఆఫీసర్, అసిస్టెంట్ ఇంజనీర్, అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్, జూనియర్ ట్రాన్స్‌లేటర్, సీనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్, జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్, స్టెనోగ్రాఫర్ గ్రేడ్-1-2. అర్హత: పోస్టును బట్టి 12వ తరగతి/గ్రాడ్యుయేషన్/టైపింగ్/టెక్నికల్ డిప్లొమాలు ఉత్తీర్ణులవ్వాలి.
- ✦ **ఎన్‌వీఎస్ నాన్‌టీచింగ్ పోస్టులు:** జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్, ల్యాబ్ అటెండెంట్, మల్టీ టాస్కింగ్ స్టాఫ్. **అర్హత:** పోస్టును బట్టి 10వ తరగతి/12వ తరగతి/గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణులవ్వాలి.

ఎంపిక విధానం

టైర్1, టైర్ 2, నైపుణ్య పరీక్ష(టైపింగ్/స్టెనోగ్రఫీ/ట్రాన్స్‌లేషన్-పోస్టును అనుసరించి), ఇంటర్వ్యూ(ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్, కొన్ని కేటగిరీల పీజీటీ) సర్టిఫికేట్‌ల పరిశీలన, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.

టైర్ 1 పరీక్ష

ఎన్‌వీఎస్‌లో మల్టీ టాస్కింగ్ పోస్టులకు తప్ప మిగతా అన్ని ఉద్యోగాలకు తొలి దశలో ప్రిలిమినరీ పరీక్ష టైర్ 1 నిర్వహిస్తారు. ఇది 100 ప్రశ్నలు-300 మార్కులకు ఉంటుంది. ఈ పరీక్ష సమయం రెండు గంటలు. ఇందులో జనరల్ రీజనింగ్ 20 ప్రశ్నలు-60 మార్కులకు, న్యూమరికల్ ఎబిలిటీ 20 ప్రశ్నలు-60 మార్కులకు, బేసిక్ కంప్యూటర్ లిటరసీ 20 ప్రశ్నలు-60 మార్కులకు, జనరల్ నాలెడ్జ్ 20 ప్రశ్నలు-60 మార్కులకు, లాంగ్వేజ్ కాంపిటెన్సీ టెస్ట్(ఇంగ్లిష్) 10 ప్రశ్నలు-30 మార్కులకు, లాంగ్వేజ్ కాంపిటెన్సీ టెస్ట్ (మరో భారతీయ భాష) 10 ప్రశ్నలు-30 మార్కులకు ఉంటాయి. నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు తగ్గిస్తారు. ఓఎంఆర్ షీట్‌పై సమాధానాలు గుర్తించాలి. పీఆర్‌టీ, టీజీటీ, పీజీటీకి సిలబస్ అంశాలు కామన్‌గా ఉంటాయి. కాని పరీక్షలో ప్రశ్నల క్లిష్టత పీఆర్‌టీకి ఇంటర్మీడియెట్ స్థాయిలో, టీజీటీకి డిగ్రీ స్థాయిలో, పీజీటీకి పోస్ట్‌గ్రాడ్యుయేషన్ స్థాయిలో ఉంటాయి.

టైర్ 2 ఇలా

టైర్1 పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా దరఖాస్తు చేసుకున్న ఆయా విభాగాల పోస్టులను అనుసరించి ఒక్కో పోస్టుకు 12 మందిని చొప్పున టైర్ 2 పరీక్షకు ఎంపిక చేస్తారు. ఈ పరీక్షను పోస్టు, సబ్జెక్టుల వారీగా నిర్వహిస్తారు. దరఖాస్తు చేసుకున్న పోస్టుకు సంబంధించిన సబ్జెక్టుల్లో అభ్యర్థి పరిజ్ఞానాన్ని పరీక్షిస్తారు.

ఈ పరీక్ష వ్యవధి రెండున్న గంటలు. ఇందులో 60 ఆబ్జెక్టివ్ ప్రశ్నలు,10 డిస్క్రిప్టివ్ ప్రశ్నలు ఉంటాయి. ఆబ్జెక్టివ్ ప్రశ్నలకు ఒక మార్కు చొప్పున, డిస్క్రిప్టివ్ ప్రశ్నలకు నాలుగు మార్కుల చొప్పున కేటాయిస్తారు. ఇలా మొత్తంగా 100 మార్కులకు పరీక్ష జరుగుతుంది. ఇందులో ఆబ్జెక్టివ్ ప్రశ్నలకు ఓఎంఆర్ షీట్‌పై సమాధానాలు గుర్తించాలి. అలాగే డిస్క్రిప్టివ్ ప్రశ్నలకు పేపర్‌పై పెన్నుతో సమాధానాలు రాయాలి. ఆబ్జెక్టివ్ ప్రశ్నల్లో నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి పొరపాటు సమాధానానికి 1/4 వంతు మార్కు తగ్గిస్తారు.

ఇంటర్వ్యూ

టైర్ 2లో సాధించిన ప్రతిభ ఆధారంగా ఒక్కో పోస్టుకు ముగ్గురిని చొప్పున ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. స్కిల్ టెస్ట్ అవసరమైన పోస్టులకు ఒక్కో పోస్టుకు ఐదుగురిని చొప్పున ఎంపిక చేస్తారు.

ముఖ్య సమాచారం

- ✦ **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- ✦ **దరఖాస్తులకు చివరి తేదీ:** 2025, డిసెంబర్ 4
- ✦ **పరీక్ష తేదీలు:** తర్వాత ప్రకటిస్తారు.
- ✦ **వెబ్‌సైట్:**https://kvsangathan.nic.in
  https://navodaya.gov.in

క్లుప్తంగా...

మహిళా క్రికెటర్ కరుణకుమారికి ఘనస్వాగతం

సాక్షి, అమరావతి: ఇటీవల శ్రీలంకలోని కొలంబోలో జరిగిన టీ–20 మహిళల క్రికెట్ వరల్డ్ కప్ పోటీల్లో 42 పరుగులు చేసి భారత జట్టు విజయంలో కీలకపాత్ర పోషించిన పి.కరుణకుమారికి సోమవారం గన్నవరం విమానాశ్రయంలో ఘన స్వాగతం లభించింది. ఉదయం ఎయిర్‌పోర్టుకు చేరుకున్న ఆమెకు శాప్ చైర్మన్ ఎ. రవినాయుడు, ఎండీ భరణితో పాటు పలువురు క్రీడాకారులు స్వాగతం పలికారు.

మత్స్య యూనివర్సిటీలో 14 పోస్టుల కొనసాగింపు

సాక్షి, అమరావతి: వైఎస్ జగన్ హయాంలో ఏపీ మత్స్య యూనివర్సిటీలో భర్తీ చేసిన పోస్టులను తాత్కాలిక ప్రాతిపదికన 2026 జూన్ 22వతేదీ వరకు కొనసాగిస్తూ మత్స్యశాఖ స్పెషల్ సీఎస్ బుడితి రాజశేఖర్ సోమవారం ఉత్తర్వులిచ్చారు. 2021లో ఏర్పాటైన ఈ వర్సిటీ కోసం వైఎస్ జగన్ ప్రభుత్వం 14 పోస్టులను మంజూరు చేసింది. స్పెషల్ ఆఫీసర్, ఓఎస్‌డీలతో పాటు ఇద్దరేసి చొప్పున సీనియర్ అసిస్టెంట్‌లు, ఆఫీస్ సబార్డినేట్స్, నలుగురు జూనియర్ అసిస్టెంట్స్/డేటా ఎంట్రీ ఆపరేటర్లతో పాటు ఒక్కొక్కరు చొప్పున సీనియర్ కన్సల్టెంట్, టెక్నికల్ అసిస్టెంట్, డ్రైవర్, స్వీపర్లను నియమించింది. మత్స్యశాఖ స్పెషల్ సీఎస్ ఎక్స్ అఫీషియో స్పెషల్ ఆఫీసర్‌గా వ్యవహరిస్తుండగా, ఓఎస్‌డీని డిప్యుటేషన్‌పై నియమించింది. కన్సల్టెన్సీ ప్రాతిపదికన సీనియర్ అసిస్టెంట్స్, సీనియర్ కన్సల్టెంట్లను నియమించగా, మిగిలిన పోస్టులను ఆప్కాస్ ద్వారా నియమించింది. ఈ పోస్టులను తాత్కాలిక ప్రాతిపదికన నియమించడం లేదా, జూన్ 22 వరకు వీరిని కొనసాగించేలా సోమవారం ఉత్తర్వులిచ్చారు.

వాటర్‌టెక్ 'కిక్ ఔట్ ది ఆర్డినరీ' టీవీ క్యాంపెయిన్

సాక్షి, హైదరాబాద్: పాలిమర్ బాత్‌వేర్, ప్లంబింగ్ సొల్యూషన్స్‌లో ప్రముఖ పేరున్న వాటర్‌టెక్ ఇండియా 'కిక్ ఔట్ ది ఆర్డినరీ'అనే దేశవ్యాప్త టీవీ ప్రచారాన్ని ప్రారంభించింది. ఈ ప్రచారంలో వాటర్‌టెక్ పాలిమర్ ట్యాప్‌ల ప్రత్యేకతను తెలియజేసింది. ఈ ట్యాప్‌లను దిగుమతి చేసుకున్న పీఓఎం మెటీరియల్‌తో, అధునాతన టెక్నాలజీతో రూపొందించినట్టు వెల్లడించింది. అంతేకాక ఇవి సూపర్‌సీల్ టెక్నాలజీని కలిగి ఉంటాయంది. 100 శాతం వాటర్ లీక్–ప్రూఫ్ పనితీరు, దీర్ఘకాలిక మన్నికను ఇస్తాయని పేర్కొంది. ఎగ్జిక్యూటివ్ చైర్మన్ మాథ్యూ జాబ్ మాట్లాడుతూ 'భారతీయ ఇళ్లలో నీటి అనుభవాన్ని మార్చాలనే మా లక్ష్యంలో ఈ ప్రచారం ఒక ముఖ్యమైన అడుగు. మా కుళాయిలు నిజమైన ఇంజనీరింగ్, సాంకేతికత పనితీరును అందిస్తూ లీకేజీ, వృధాను తొలగిస్తాయి'అని తెలిపారు.

ఏపీ ఇన్ పార్లమెంట్

రాజ్యసభ

'సీమ' అరటి రైతులను ఆదుకోండి

జీరో అవర్‌లో వైఎస్సార్‌సీపీ ఎంపీ పిల్లి సుభాష్ చంద్రబోస్ విజ్ఞప్తి

సాక్షి, న్యూఢిల్లీ: రాయలసీమ ప్రాంతంలో.. ముఖ్యంగా వైఎస్సార్ కడప జిల్లాలో అరటి రైతులు తీవ్రసంక్షోభంలో ఉన్నారని, ధరలు భారీగా పతనం కావడంతో దిక్కుతోచనిస్థితిలో ఉన్నారని వైఎస్సార్‌సీపీ ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్ ఆవేదన వ్యక్తం చేశారు. రాజ్యసభ జీరో అవర్‌లో ఆయన ఈ అంశాన్ని ప్రస్తావించారు. వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇటీవల పులివెందుల ప్రాంతంలో అరటి రైతుల కష్టాలను స్వయంగా పరిశీలించారని, ఆయన సూచన మేరకు ఈ విషయాన్ని కేంద్రం దృష్టికి తీసుకొస్తున్నానని చెప్పారు. కరవు ప్రాంతమైనప్పటికీ రైతులు ఆధునిక టిష్యూ కల్చర్ (జీ9/కావెండిష్ రకం) ఎకరాకు 60–70 టన్నుల వరకు దిగుబడి సాధిస్తున్నారన్నారు. ప్రధాన సాగు ప్రాంతమైన పులివెందులలో ఇటీవల వరకు టన్ను రూ.22 వేలు పలికిన అరటి ధర నెలరోజుల్లోనే టన్ను రూ.8 వేలకు పడిపోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. మంచి దిగుబడి వచ్చినా గిట్టుబాటుధర లేక పోవడంతో పంటను అమ్ముకోలేక రైతులు ఇబ్బంది పడుతున్నారని చెప్పారు. గెలలు చెట్ల మీదే పండి కుళ్లిపోతున్నాయని, కొన్నింటిని పారవేస్తున్నారని తెలిపారు. మరోవైపు వర్షాభావ పరిస్థితులు, కరవు కారణంగా 2025 ఖరీఫ్ సీజన్‌లో సాగు గణనీయంగా తగ్గిపోయిందన్నారు. వైఎస్సార్ కడప జిల్లాలో సాధారణ సాగుతో పోలిస్తే 19–35 శాతం మాత్రమే సాగు జరిగిందని చెప్పారు. ధరలు పడిపోయిన నేపథ్యంలో రైతులు నష్టపోకుండా ఉండేందుకు ముంబై, కోల్‌కతా వంటి ప్రాంతాలకు రైలుమార్గం ద్వారా అరటిని తరలించాలని సీఎం ఆదేశించారని, అయితే ఇంతటి తీవ్రమైన సంక్షోభంలో ఉన్న రైతులకు ఇది ఏమాత్రం సరిపోదని తెలిపారు. కేవలం అధిక దిగుబడినిచ్చే టిష్యూ కల్చర్ పద్ధతులను ప్రోత్సహిస్తే సరిపోదని, మార్కెట్ కుప్పకూలినప్పుడు, ప్రకృతి సహకరించనప్పుడు రైతులకు స్థిరమైన ఆదాయం లభించేలా భరోసా కల్పించాల్సిన అవసరం ఉందని చెప్పారు. కేంద్ర వ్యవసాయశాఖ తక్షణమే స్పందించి రాయలసీమ అరటి రైతులను ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

కడప విమానాశ్రయానికి రూ.606.4 కోట్లు

వైఎస్సార్‌సీపీ ఎంపీ మేడా రఘునాథరెడ్డి ప్రశ్నకు కేంద్రం జవాబు

వైఎస్సార్ కడప జిల్లాలోని కడప విమానాశ్రయానికి ఉడాన్ పథకం కింద 2024–25లో రూ.606.4 కోట్లు కేటాయించినట్లు కేంద్ర పౌరవిమానయాన శాఖ సహాయమంత్రి మురళీధర్ మోహల్ తెలిపారు. ఈ నిధులను పలు అభివృద్ధి కార్యక్రమాలకు ఖర్చుచేసినట్లు చెప్పారు. రాజ్యసభలో సోమవారం వైఎస్సార్‌సీపీ ఎంపీ మేడా రఘునాథరెడ్డి ప్రశ్నకు ఆయన జవాబిచ్చారు. ఈ విమానాశ్రయాన్ని 2017 మార్చి 30న రూ.99.36 కోట్లతో రీజనల్ కనెక్టివిటీ స్కీం కింద గుర్తించినట్లు తెలిపారు. ప్రస్తుతం కడప నుంచి చెన్నై, విజయవాడ, హైదరాబాద్‌కు ఇండిగో విమానాలు రాకపోకలు సాగిస్తున్నట్లు చెప్పారు.

జీపీఎస్ స్పూఫింగ్ నిజమే

ఇటీవల ఢిల్లీ విమానాశ్రయంలో జీపీఎస్ స్పూఫింగ్ జరిగినమాట వాస్తవమేనని కేంద్ర పౌరవిమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ ఎస్.నిరంజన్‌రెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. ఢిల్లీ విమానాశ్రయంలో ఈ స్పూఫింగ్‌కు గురైనట్లు చెప్పారు. దేశంలో 15 విమానాశ్రయాలు ఉడాన్ పథకం కింద పనిచేయడంలేదని కేంద్ర పౌరవిమానయాన శాఖ సహాయ మంత్రి మురళీధర్ మోహల్ నిరంజన్‌రెడ్డి మరో ప్రశ్నకు జవాబిచ్చారు. పరిశ్రమలకు సకాలంలో ఆర్థిక సహాయాన్ని చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు నిరంజన్‌రెడ్డి ప్రశ్నకు ఆ శాఖ సహాయ మంత్రి శోభ కరన్‌దాల్జే చెప్పారు. దేశంలో సింగిల్ స్క్రీన్‌లు తగ్గుతున్నాయని, వాటి నిర్మాణం, పునరుద్ధరణ కోసం సింగిల్ విండో క్లియరెన్స్ ఇవ్వాలని నిరంజన్‌రెడ్డి జీరో అవర్‌లో కోరారు. థియేటర్ ఫుడ్, బేవరేజెస్ ధరలపై నియంత్రణ తేవాలన్నారు.

విశాఖ మెట్రోకు ప్రతిపాదనలు

రాష్ట్ర ప్రభుత్వం విశాఖలో సమాన భాగస్వామ్య నమూన కింద 46.23 కిమీ మెట్రో రైలు ప్రాజెక్టు కోసం సవరించిన ప్రతిపాదనలను సమర్పించినట్లు కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ సహాయ మంత్రి టోకాన్ సాహు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ గొల్ల బాబురావు ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. మెట్రో రైలు విధానం–2017 ప్రకారం అంచనా అవసరం, సాధ్యాసాధ్యాలు, వనరుల లభ్యతపై ఆమోదం ఆధారపడి ఉంటుందని చెప్పారు. అందువల్ల మంజూరు కోసం ఎటువంటి సమయం పేర్కొనలేమని తెలిపారు.

లోక్‌సభ

విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం వద్దు

లోక్‌సభలో వైఎస్సార్‌సీపీ ఎంపీ గురుమూర్తి

సాక్షి, న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లోని వసతి గృహాల్లో వరుసగా ఫుడ్‌పాయిజనింగ్ ఘటనలు జరుగుతున్నా రాష్ట్ర ప్రభుత్వం ఏమాత్రం స్పందించడం లేదని వైఎస్సార్‌సీపీ ఎంపీ డాక్టర్ మద్దిల గురుమూర్తి చెప్పారు. విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడొద్దని చంద్రబాబు ప్రభుత్వాన్ని సోమవారం లోక్‌సభలో కోరారు. నాయుడుపేట, సత్యవేడు, శ్రీకాళహస్తితో పాటు రాష్ట్రంలో జరిగిన పలు సంఘటనలు తనను తీవ్రంగా కలచివేశాయన్నారు. ప్రభుత్వ వసతి గృహాలు, పాఠశాలల్లో పరిశుభ్రత లోపం, పాడైన ఆర్‌వో ప్లాంట్లు, శుభ్రం చేయని నీటిట్యాంకులు, వంటగది అపరిశుభ్రతవల్ల విద్యార్థులు అనారోగ్యానికి గురవుతున్న నేపథ్యంలో ఈ సమస్యపై కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయం వంటి వివరాలు తెలపాలని కోరారు. దీనికి కేంద్ర విద్యా శాఖ సహాయమంత్రి జయంత్ చౌదరి జవాబిస్తూ.. ఇటీవల కొన్ని పాఠశాలల్లో నీరు, ఆహారం కలుషితం కావడం వల్ల విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని, వారందరికీ చికిత్సచేసి డిశ్చార్జ్ చేసినట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపిందని చెప్పారు.

రాష్ట్రంలో 22 పీఎంకేకేలు

నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు ఏపీలో 22 ప్రధానమంత్రి కౌశల్ కేంద్రాలు (పీఎంకేకేలు) ఏర్పాటు చేసినట్లు కేంద్ర విద్యాశాఖ సహాయమంత్రి జయంత్ చౌదరి తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. వీటి ద్వారా 2022–25 మధ్య 12,091 మంది శిక్షణ పొందారన్నారు.

మడ అడవుల అభివృద్ధికి రూ.13.077 కోట్లు

రాష్ట్రంలో మడ అడవుల అభివృద్ధి కోసం రూ.13.077 కోట్లు విడుదల చేసినట్లు కేంద్ర పర్యావరణ, అటవీశాఖ సహాయ మంత్రి కీర్తివర్ధన్ సింగ్ తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ తనూజారాణి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. మడ అడవులను ప్రోత్సహించడానికి, పునరుద్ధరించడానికి, తీరప్రాంత పర్యావరణ వ్యవస్థల స్థితిస్థాపకతను పెంచడానికి మాంగ్రోవ్ ఇనిషియేటివ్ ఫర్ షోర్‌లైన్ హాబిటాట్స్, టాంజిబుల్ ఇన్‌కమ్స్ ప్రారంభించినట్లు చెప్పారు.

ప్రభుత్వ బడుల్లో భారీగా తగ్గిన విద్యార్థుల సంఖ్య..

ఏపీలో చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల సంఖ్య భారీగా తగ్గిందని కేంద్ర విద్యాశాఖ సహాయమంత్రి జయంత్ చౌదరి చెప్పారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి ప్రశ్నకు మంత్రి జవాబిస్తూ.. యూనిఫైడ్ డిస్ట్రిక్ట్ ఇన్ఫర్మేషన్ సిస్టమ్ ఫర్ ఎడ్యుకేషన్ ప్లస్ సమాచారం ప్రకారం.. 2024–25లో 1–8 తరగతుల విద్యార్థుల నమోదు తగ్గినట్లు చెప్పారు. 2022–23లో 31,71,466 మంది బడికి రాగా.. 2024–25లో 26,15,935 మంది మాత్రమే హాజరైనట్లు తెలిపారు. 2022–23 కంటే 2024–25లో 5,55,531 మంది తగ్గిపోయారని చెప్పారు.

ఒక్కటైన సమంత-రాజ్ నిడిమోరు

కోయంబత్తూరులోని ఈశా యోగా సెంటర్‌లో 'భూత శుద్ధి వివాహం'

సినిమా డెస్క్: కొంతకాలంగా డేటింగ్‌లో ఉన్నారన్న వార్తలకు తెరదించుతూ ప్రముఖ హీరోయిన్ సమంత రుత్ ప్రభు, దర్శక నిర్మాత రాజ్ నిడిమోరు వివాహ బంధంలోకి అడుగు పెట్టారు. కోయంబత్తూరులోని ఈశా యోగా సెంటర్‌లో ఉన్న లింగభైరవి దేవి సన్నిధిలో సోమవారం యోగ సంప్రదాయం ప్రకారం 'భూత శుద్ధి వివాహం' ద్వారా ఒక్కటయ్యారు. ఇరు కుటుంబాల సభ్యులు, అత్యంత సన్నిహితుల సమక్షంలో ఈ పెళ్లి జరిగింది. ఈ మేరకు ఈశా ఫౌండేషన్ ఓ ప్రకటన విడుదల చేసింది. ఆలోచనలు, భావోద్వేగాలు లేదా భౌతికతకు అతీతంగా దంపతుల మధ్య లోతైన బంధాన్ని ఏర్పరచడానికి రూపొందించిన విశిష్టమైన పవిత్ర ప్రక్రియే ఈ భూత శుద్ధి వివాహమని సంస్థ పేర్కొంది. మరోవైపు తమ పెళ్లి ఫొటోలను సమంత సోషల్ మీడియాలో షేర్ చేయగా పలువురు సినీ ప్రముఖులు, అభిమానులు శుభాకాంక్షలు తెలిపారు.

స్నేహం నుంచి పెళ్లి వరకు..

'ది ఫ్యామిలీ మ్యాన్–2', 'సిటాడెల్: హనీ బన్నీ' వెబ్‌సిరీస్‌లలో కీలకపాత్ర పోషించిన సమంతతో కలిసి పనిచేస్తున్న సమయంలోనే ఆమెతో రాజ్‌కు స్నేహం ఏర్పడింది. ఆ తర్వాత సమంత 'ట్రాలాలా మూవీంగ్ పిక్చర్స్' అనే నిర్మాణ సంస్థను ప్రారంభించి తొలి చిత్రంగా 'శుభం' అనే చిత్రాన్ని నిర్మించగా ఈ చిత్రానికి రాజ్ ఓ ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్‌గా వ్యవహరించారు. అలాగే 'ఓ బేబీ' సినిమా తర్వాత దర్శకురాలు నందినీరెడ్డితో కలిసి సమంత ప్రస్తుతం నిర్మిస్తున్న 'మా ఇంటి బంగారం' సినిమాకు కూడా రాజ్ ఓ నిర్మాతగా ఉన్నారు. వరల్డ్ పికిల్ బాల్ లీగ్‌లో చెన్నై టీమ్‌ని సమంత కొనుగోలు చేయగా అప్పుడు కూడా సమంతతో రాజ్ ఉన్నారు. గత నెలలో తన పెర్ఫ్యూమ్ బ్రాండ్ లాంచ్‌లో వీరిరువురి ఫోటోలు వైరల్‌గా మారాయి. అయితే, వీరి వివాహంపై రాజ్ మాజీ భార్య శ్యామాలి దే ఇన్‌స్టా వేదికగా స్పందిస్తూ.. 'తెగించిన వ్యక్తులు దానికి తగినట్లుగానే వ్యవహరిస్తారు' అంటూ పోస్ట్ చేశారు.

పవన్ హైదరాబాద్ వదిలి వెళ్లిపోవాలి

కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూర్ వెంకట్ మండిపాటు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణపై ఏపీ డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు ఉన్న అక్కసు రాజోలులో ఆయన వ్యాఖ్యలతో బయటపడిందని, ఈ ప్రాంతంపై ఇంత అక్కసు ఉన్నప్పుడు హైదరాబాద్‌ను వదిలిపెట్టి ఏపీకి వెళ్లిపోవాలని కాంగ్రెస్ ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్రావు వ్యాఖ్యానించారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. సినిమాలు, షూటింగ్‌లు చేసుకోవడానికి, సినిమాలు నడిపించడానికి, అభివృద్ధి చెందడానికి మాత్రం తెలంగాణ కావాల్సి వచ్చిందా అని నిలదీశారు. తెలంగాణ ప్రజలను, ఈ ప్రాంతాన్ని అగౌరవ పరిచేలా వ్యాఖ్యలు చేసిన పవన్‌కళ్యాణ్ వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. లేదంటే తెలంగాణ వదిలి ఏపీలోనే ఉండాలని సూచించారు. పవన్ కల్యాణ్ తన వైఖరి మార్చుకోకపోతే ఆయన సినిమాలు తెలంగాణలో ఆడవని, ఇప్పటి వరకు ఆదరించిన యువత, ప్రజలు తెలంగాణ నుంచి తరిమికొట్టే పరిస్థితి ఉంటుందని హెచ్చరించారు.

10 YEAR WARRANTY | BAJAJ SECURE • AMC • ROAD SIDE ASSISTANCE | 72198 21111 | SHRIRAM Finance | BAJAJ AUTO CREDIT | L&T Finance | TATA CAPITAL Two Wheeler Loans

*నియమాలు మరియు నిబంధనలు వర్తిస్తాయి. నవంబర్ 25, 2025 నుంచి డిసెంబర్ 15, 2025 వరకు హాట్–ట్రిక్ పొదుపులు వర్తిస్తాయి. పేర్కొన్న మొత్తం పొదుపులు అంటే 100% జీఎస్‌టీ లాభం (ఎక్స్ షోరూమ్ ధర మరియు వర్తించే విధంగా ఫలితంగా వచ్చే ఆర్‌టీఓ పన్ను), సున్న ప్రాసెసింగ్ ఫీ మరియు ఒక సంవత్సరం సొంత హాని బీమా (ఓడి) యొక్క పూర్తి మొత్తం పొదుపులు. ఋణసదుపాయం అందించేవారి/ బీమా తీయువారి పైన ఆధారపడి స్వీవరాల ప్రకారం సున్న పిఎఫ్ మరియు ఓడిలో మార్పు ఉండవచ్చు. ఋణసదుపాయం అందించేవారి విచక్షణ మేరకు ఋణసదుపాయం ఉంటుంది. స్టంట్స్‌ని నిపుణులద్వారా, నియంత్రణ మరియు కల్పించబడిన వాతావరణంలో సాధారణ ప్రజానీకం ప్రజా రోడ్లకు దూరంగా వృత్తి నైపుణ్యంగలవారి పర్యవేక్షణలో కొనసాగించడం జరిగింది. ఈ స్టంట్స్‌ని నకలు చేసే ప్రయత్నం చెయ్యకండి మరియు ఎల్లప్పుడు ట్రాఫిక్ మరియు భద్రత నియమాలను పాటించండి.

Authorised Dealers For Bajaj Auto Ltd.: Guntur SRI SIDDHI VINAYAKA BAJAJ 9100961204, 9121008788 • KOTHAPETA 9100559456, 9100551152 • Tenali VARAHI BAJAJ 9959234569, 08644226778.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP)., EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801.
Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

ట్రంప్ దెబ్బకు కుయ్యో రొయ్యో..!

లక్ష టన్నులు కోల్డ్ స్టోరేజ్‌లోనే..

విశాఖ కంటైనర్ టెర్మినల్

ట్రంప్ దెబ్బకి.. రొయ్య గడ్డకడుతోంది. కోల్డ్ స్టోరేజ్‌లోనే కాలం సాగిస్తోంది. సముద్ర ఉత్పత్తులు కంటైనర్ ఎక్కించేందుకు వ్యాపారులూ గజగజమంటున్నారు. అగ్రరాజ్యం విధించిన సుంకాల ప్రభావం భారత్‌పై కనిపించబోదని కేంద్రం.. ప్రత్యామ్నాయ మార్గాలు అన్వేషించామంటూ రాష్ట్ర ప్రభుత్వం బీరాలు పలుకుతున్నా... క్షేత్రస్థాయిలో మాత్రం తిరోగమనం స్పష్టంగా కనిపిస్తోంది. అమెరికా పన్ను టారిఫ్‌ల దెబ్బకు విశాఖలోని కంటైనర్ కార్గో ఎగుమతులు గణనీయంగా తగ్గుముఖం పట్టాయి. గత ఆరు నెలలుగా దాదాపు 20 నుంచి 30 శాతం వరకూ ఎగుమతులు క్షీణించాయి. పన్ను టారిఫ్‌ల వ్యవహారం ఓ కొలిక్కి రాకుంటే ఈ వ్యత్యాసం భవిష్యత్తులో గణనీయంగా పెరిగే అవకాశం ఉందని ఎగుమతిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- ఇంకా కోలుకోని సముద్ర ఉత్పత్తుల ఎగుమతి
- ప్రత్యామ్నాయ మార్గాలపై పట్టించుకోని చంద్రబాబు ప్రభుత్వం
- 6 నెలల్లో రూ. వేల కోట్ల టర్నోవర్‌పై ప్రతికూల ప్రభావం
- కంటైనర్ టెర్మినల్ నుంచి గతంలో నెలకు 4000 కంటైనర్ల సీఫుడ్ ఎగుమతులు
- అమెరికా ప్రభావంతో 3000 కంటైనర్లకు పడిపోయిన ఎక్స్‌పోర్ట్స్
- జూన్ నుంచి 30 శాతం వరకు తగ్గిన ఎగుమతులు

సాక్షి, విశాఖపట్నం: మెరైన్ ఉత్పత్తుల ఎగుమతుల్లో అగ్రగామిగా ఉండే విశాఖపట్నం.. ఇప్పుడు అమెరికా విధించిన సుంకాల దెబ్బ నుంచి ఇంకా కోలుకోలేకపోతోంది. అమెరికా పన్నుల ప్రభావం భారత్‌పై ఏ మాత్రం ఉండదని కేంద్ర ప్రభుత్వం ప్రకటనలు గుప్పిస్తున్నా వాస్తవ పరిస్థితుల్లో ప్రతికూల ప్రభావం ఉంటోంది. ప్రపంచ చేపల ఉత్పత్తిలో భారత్ రెండో స్థానంలో ఉంది. ఇందులో 75 శాతం అంతర్గత మత్స్య, ఆక్వా కల్చర్ సంపద కాగా 25 శాతం వరకూ సముద్ర రంగం నుంచి ఉత్పత్తి అవుతున్నాయి. వీటి ద్వారా వచ్చే ఆదాయంలో 66 శాతం వాటా రొయ్యలదే కావడం విశేషం. దేశంలో ముఖ్యంగా విశాఖ నుంచి ఎగుమతయ్యే రొయ్యలకు విదేశాల్లో భారీగా గిరాకీ ఉంది. దాని తర్వాత స్థానంలో ట్యూనా చేపల ఎగుమతులున్నాయి. విశాఖ సముద్ర జలాల్లో దొరికే ట్యూనా చేపలు దాదాపు అన్ని దేశాలకు ఎగుమతులు ఇక్కడి నుంచే జరుగుతున్నాయి. అమెరికా ఈ ఏడాది మొదట్లో మన ఎగుమతులపై 25 శాతం సుంకాలు విధించడం వల్ల రొయ్యలు, ఇతర సముద్ర ఉత్పత్తుల ఎగుమతులు, ధరలపై తీవ్ర ప్రభావం చూపుతోంది. విశాఖ నుంచి ఎగుమతయ్యే సముద్ర ఉత్పత్తుల్లో 52 శాతం వరకూ మార్కెట్ అమెరికాలోనే జరుగుతోంది. ట్రంప్ సుంకాల పెంపు ఇక్కడ ఎగుమతిదారులకు ఇబ్బందికరంగా మారింది. ఫలితంగా సీఫుడ్ ఎక్స్‌పోర్ట్స్ గణనీయంగా పడిపోయాయి.

కోల్డ్ స్టోరేజ్‌లోనే రొయ్యలు..!

రాష్ట్రంలోని దాదాపు 45 రొయ్యల ఉత్పత్తుల ఎగుమతి సంస్థలుండగా.. విశాఖ జిల్లాలో 10కిపైగా ఉన్నాయి. ఒక్కో దేశానికి ఒక్కో రకం ప్యాకేజీ విధానాన్ని అమలు చేస్తుంటారు. అమెరికా సంయుక్త రాష్ట్రాలకు పంపించేందుకు దాదాపు లక్ష టన్నుల వరకూ ప్యాకేజీలు చేసి కోల్డ్ స్టోరేజ్‌లోనే మూలుగుతున్నాయి. వీటి ప్యాకింగ్ మార్చి.. ఇతర దేశాలు, రాష్ట్రాలకు ఎగుమతి చేసేందుకు తలప్రాణం తోకకొస్తోందని వ్యాపారులు లబోదిబోమంటున్నారు. అమెరికా సుంకాల ప్రభావం మత్స్యరంగంపై ప్రతికూల ప్రభావం చూపించకుండా కొత్త మార్కెట్ల విస్తరణపై దృష్టిసారించామని కేంద్రం చెబుతున్నా.. ఆ పరిస్థితులు ఎక్కడా క్షేత్ర స్థాయిలో కనిపించడం లేదని వాణిజ్య వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. స్థానిక మార్కెట్‌లో ఆశించిన ఫలితాలు కనిపించడం లేదని తలలు పట్టుకుంటున్నారు.

కోల్డ్ స్టోరేజీల్లో సముద్ర ఎగుమతులు

ఆరు నెలలుగా అథఃపాతాళానికి..

విశాఖ నుంచి ఆరు నెలలుగా సముద్ర ఎగుమతులు దిగజారుతూ వస్తున్నాయి. సముద్ర ఉత్పత్తుల ఎగుమతి అభివృద్ధి అథారిటీ (ఎంపెడా) నివేదికల ప్రకారం సీఫుడ్ ఎక్స్‌పోర్ట్స్‌లో దేశంలోనే విశాఖపట్నం ఏకంగా 26.36 శాతం వాటాని కలిగి ఉంది. విశాఖ నుంచి ఎక్కువగా అమెరికా, చైనా, యూఏఈ, రిపబ్లిక్ ఆఫ్ కొరియా, ఇటలీ, వియత్నాం, జపాన్, కెనడా దేశాలకు ఎగుమతులు జరుగుతున్నాయి. విశాఖపట్నం కంటైనర్ టెర్మినల్ ప్రైవేట్ లిమిటెడ్(వీసీటీపీఎల్) ఆధ్వర్యంలో కంటైనర్ కార్గో ఎగుమతులు జరుగుతుంటాయి. విశాఖపట్నం పోర్టులో 32 బెర్త్‌లు ఉండగా.. గంగవరం పోర్టులో 9 బెర్తులున్నాయి. ఇందులో మొత్తం 23 బెర్త్‌ల ద్వారా కార్గో కంటైనర్ ఎగుమతులు జరుగుతున్నాయి. ఏటా ఇక్కడి నుంచి సుమారు రూ.17 వేల కోట్ల విలువైన 2.70 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తులు ఎగుమతి అవుతుంటాయి. ప్రతి నెలా ఇక్కడి నుంచి 4000 రిఫ్రాజినేటెడ్ కంటైనర్స్(సీఫుడ్) ఎగుమతులు జరుగుతుంటాయి. ఒక్కో కంటైనర్ ద్వారా 30 టన్నుల సీఫుడ్ ఎక్స్‌పోర్ట్స్ జరుగుతుంటాయి. అంటే నెలకు లక్షా 20 వేల టన్నుల సముద్ర ఉత్పత్తులు ఎగుమతులు జరుగుతుండేవి. అమెరికా సుంకాల ప్రభావంతో దాదాపు 30 శాతం వరకూ ఈ ఎగుమతులు క్షీణించాయి. జూన్ నెల నుంచి నవంబర్ వరకూ చూస్తే.. ప్రతి నెలా 2000 నుంచి 3000 కంటైనర్లకు మించడం లేదని వాణిజ్య వర్గాలు చెబుతున్నాయి. వచ్చే నెల బుకింగ్స్ కూడా 20 నుంచి 30 శాతం కంటే దిగువకే ఉన్నాయని పోర్టు వర్గాలు వెల్లడిస్తున్నాయి. ఫలితంగా గడిచిన 6 నెలల్లో వేల కోట్ల టర్నోవర్‌కు బ్రేక్ పడిందని పోర్టు వర్గాలు చెబుతున్నాయి.

సెలవు రోజుల్లో 'పది' యాక్షన్ ప్లాన్ వద్దు

సాక్షి, అమరావతి : పదో తరగతి విద్యార్థుల ఉత్తీర్ణత పెంపు కోసం అమలు చేస్తున్న 100 రోజుల యాక్షన్ ప్లాన్ సెలవు రోజుల్లో లేకుండా చూడాలని, సాయంత్రం స్టడీ నిర్వహించి, మరుసటి రోజు ఉదయం పరీక్ష నిర్వహించేలా ప్లాన్ మార్చాలని ప్రగతిశీల రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లెక్కల జమాల్ రెడ్డి డిమాండ్ చేశారు. విద్యార్థులు గ్రామీణ ప్రాంతాల నుంచి 3 కి.మీ పైగా దూరంలోని హైస్కూళ్లకు వస్తుంటారని, సాయంత్రం వేళల్లో వాహన సౌకర్యం లేక ఇబ్బందులు ఏర్పడతాయన్నారు. ఈ క్రమంలో బాలికల రక్షణ జాగ్రత్తలు చూడాల్సిన బాధ్యత ఉన్న నేపథ్యంలో విద్యార్థులను సాయంత్రం త్వరగా ఇంటికి పంపాల్సి ఉంటుందన్నారు. అధికారులు విడుదల చేసిన యాక్షన్ ప్లాన్ అమలుపై సమీక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. పదో తరగతి ఉత్తీర్ణత శాతం పెంపుపై అధికారుల ఏకపక్ష నిర్ణయాలను పిల్లలు, ఉపాధ్యాయులపై బలవంతంగా రుద్దడం సరికాదన్నార్సు. ఈ కమ్రంలో సెలవు రోజుల్లో తరగతులను రద్దు చేయాలని, సాయంత్రం వేళల్లో ప్రత్యేక శిక్షణలో భాగంగా నిర్వహించే పరీక్షలను మరుసటి రోజు ఉదయం ఉండేలా మార్పులు చేయాలని సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు.

బీసీ హాస్టళ్లలో పోస్టులు భర్తీ చేయండి

సాక్షి, అమరావతి : రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ బీసీ హాస్టళ్లలో ఖాళీగా ఉన్న 384 గ్రేడ్–2 పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయమై సోమవారం ఆయన వెలగపూడిలోని రాష్ట్ర సచివాలయంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్‌ను కలిసి వినతిపత్రం అందించారు. రాష్ట్రంలోని మొత్తం 1,110 బీసీ హాస్టళ్లలో 743 బాలుర, 367 బాలికల హాస్టళ్లను అరకొర సౌకర్యాలతోనే నిర్వహిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీ హాస్టళ్లలో మౌలిక వసతులతోపాటు అద్దె భవనాల్లో ఉన్న వాటికి కూడా సొంత భవనాలు నిర్మించాలని కోరారు.

క్లుప్తంగా...

ఓపెన్ స్కూల్ తత్కాల్ ప్రవేశాలకు అవకాశం

సాక్షి, అమరావతి : దూర విద్య విధానంలో పదో తరగతి, ఇంటర్మీడియట్ కోర్సులు చదవాలనుకునే అభ్యర్థులకు స్పాట్ అడ్మిషన్లు కల్పిస్తున్నట్టు ఓపెన్ స్కూల్ డైరెక్టర్ నరసింహారావు ఓ ప్రకటనలో తెలిపారు. 2025–26 విద్యా సంవత్సరానికి సంబంధించి మంగళవారం నుంచి ఈ నెల 6వ తేదీ వరకు రిజిస్ట్రేషన్లు చేసుకోవచ్చని, తత్కాల్ అడ్మిషన్ల కింద రూ.600 ఫీజును ఈ నెల 10వ తేదీలోగా చెల్లించాలన్నారు.

ముగిసిన అనిల్‌చోక్రా మొదటి రోజు కస్టడీ

విజయవాడలీగల్: మద్యం అక్రమ కేసులో బ్లాక్ మనీని వైట్ మనీగా మార్చడంలో కీలకంగా వ్యవహరించారనే అభియోగంపై అరెస్టయ్యి, విజయవాడ జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న ఏ–49 అనిల్ చోక్రాను మూడు రోజులపాటు కస్టడీకి అనుమతిస్తూ న్యాయమూర్తి ఆదేశాలు జారీ చేశారు. మూడు రోజుల కస్టడీలో భాగంగా మొదటి రోజు విచారణ సోమవారం జరిగింది. ఉదయం విజయవాడ జిల్లా జైలు నుంచి ప్రభుత్వాస్పత్రిలో అనిల్ చోక్రాకు వైద్యపరీక్షల అనంతరం విజయవాడ సిట్ కార్యాలయానికి తరలించారు. విచారణ అనంతరం సాయంత్రం తిరిగి జైలు అధికారులకు అప్పగించారు.

ఆర్టీసీ స్థలాల లీజు ప్రతిపాదన విరమించుకోవాలి

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య

సాక్షి, అమరావతి : రాష్ట్రంలో ప్రజా రవాణా సంస్థ అయిన ఏపీఎస్ ఆర్టీసీకి చెందిన విలువైన భూములు, భవనాలు, డిపోలు వంటి స్థిరాస్తులను కార్పొరేట్ కంపెనీలకు నామమాత్రపు లీజు, తనఖాకు ఇవ్వాలనే ప్రతిపాదనను విరమించుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబుకు రాసిన లేఖను సోమవారం ఆయన మీడియాకు విడుదల చేశారు. రాష్ట్రంలో 1,500 కిలోమీటర్ల స్టేట్ హైవేల నిర్మాణం, మరమ్మతుల కోసం రూ.22,826 కోట్ల నిధుల సేకరణకు ఆర్టీసీ ఆస్తులను తనఖా పెట్టేందుకు రోడ్లు భవనాల శాఖ ప్రతిపాదించడం సరికాదన్నారు. తగిన నిధులు కేటాయించి, రాష్ట్రంలో రహదారుల మరమ్మతులు చేపడతామని ఎన్నికల్లో ఇచ్చిన హామీ నిలబెట్టుకోవాలన్నారు. ఆర్టీసీ ఆస్తులు లీజు, తనఖా పెట్టి నిధులు సేకరించి రోడ్డు వేస్తామనే ప్రతిపాదన విరమించుకోవాలన్నారు.

వక్ఫ్ ఆస్తుల అప్‌లోడ్‌ను త్వరగా పూర్తి చేయండి

వక్ఫ్ బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్

సాక్షి, అమరావతి: వక్ఫ్ ఆస్తులను ఉమీద్ పోర్టల్‌లో నమోదుకు డిసెంబర్ 5తో గడువు ముగుస్తున్నందునా అప్‌లోడ్ ప్రక్రియను వేగంగా పూర్తి చేయాలని రాష్ట్ర వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్ సూచించారు. ఈ మేరకు సోమవారం ఆయన ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న మస్జిద్‌లు, దర్గాలు, అషూర్‌ఖానాలు, కబర్‌స్తాన్‌లతోసహా అన్ని వక్ఫ్ సంస్థల నిర్వాహకులు ఆన్‌లైన్ నమోదుకు చర్యలు తీసుకోవాలన్నారు. గడువు ముగిసిన తర్వాత అప్‌లోడ్ చేసేందుకు లీగల్, అడ్మినిస్ట్రేటివ్ సమస్యలు ఎదురవుతాయన్నారు. ఏ సంస్థ కూడా ఆలస్యం చేయకుండా వెంటనే అవసరమైన పత్రాలు సిద్ధం చేసి అప్‌లోడ్ చేయాలన్నారు.

ఐపీఎస్ పీవీ సునీల్ కుమార్‌ను విధుల నుంచి తొలగించండి

కేంద్రానికి డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు లేఖ

సాక్షి, అమరావతి : డీజీ ర్యాంకులో ఉన్న సీనియర్ ఐపీఎస్ అధికారి పీవీ సునీల్ కుమార్‌ను పోలీసు విధుల నుంచి తొలగించాలని డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు ఆయన కేంద్ర డిపార్ట్‌మెంట్ ఆఫ్ పర్సనల్–ట్రైనింగ్ (డీవోపీటీ)కు సోమవారం లేఖ రాశారు. అఖిల భారత సర్వీసు నిబంధనలకు విరుద్ధంగా పీవీ సునీల్ కుమార్ వ్యవహరిస్తున్నారని ఆయన ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు.

విజిలెన్స్ కమిషనర్ కార్యదర్శిగా భాస్కర్

సాక్షి ,అమరావతి: పాఠశాల విద్యా శాఖ అదనపు కార్యదర్శి ఎం.భాస్కర్‌కు ఏపీ విజిలెన్స్ కమిషనర్ కార్యదర్శిగా ప్రభుత్వం పూర్తి అదనపు బాధ్యతలను అప్పగించింది. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు.

సెంట్రల్ లైబ్రరీ నిర్మాణానికి నిపుణుల కమిటీ ఏర్పాటు

సాక్షి, అమరావతి: స్టేట్ సెంట్రల్ లైబ్రరీ నిర్మాణానికి ఆర్కిటెక్చరల్ కన్సల్టెంట్ ఎంపికను సకాలంలో పూర్తి చేసేందుకుగాను నిపుణుల కమిటీని నియమిస్తూ విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్ సోమవారం ఉత్తర్వులిచ్చారు. అమరావతిలో నిర్మించే లైబ్రరీకి స్వీకరించిన డిజైన్ ప్రతిపాదనలను సకాలంలో ఎంపిక చేసి దాని నిర్మాణంపైనా ఈ కమిటీ నిర్ణయం తీసుకుంటుందని ఉత్తర్వుల్లో ప్రభుత్వం పేర్కొంది. విద్యా శాఖ కార్యదర్శి చైర్‌పర్సన్‌గా వ్యవహరించనున్న ఈ కమిటీలో సభ్యులుగా పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్, ఏపీ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఈడబ్ల్యుఐడీసీ) ఎండీ, చీఫ్ ఇంజినీర్, సమగ్ర శిక్ష చీఫ్ ఇంజినీర్, స్కూల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ అండ్ ప్లానింగ్ నుంచి ఒకరు ఉంటారు. పబ్లిక్ లైబ్రరీస్ డైరెక్టర్ మెంబర్ కన్వీనర్‌గా వ్యవహరించనున్నారు.

ఆగిన అన్వేషణ

చుక్కల శివలింగం పక్కన ఇద్దరు వ్యక్తులు

యుగాల నాటి ఆది మానవుని ఆనవాళ్లు లభ్యమైనా..

ఒకరోజుతో ముగిసిన అధ్యయనం

క్రీస్తు పూర్వం 2,500 సంవత్సరం నాటివిగా గుర్తింపు

నివేదిక సిద్ధం చేసినా కదలిక లేదు

మదనపల్లె: అన్నమయ్య జిల్లా సిద్దవటం అటవీ రేంజి పరిధిలోని శ్రీ లంకమల్లేశ్వర అభయారణ్యంలో వెలుగుచూసిన ఇనుపయుగ మానవుల నివాస ఆనవాళ్లపై పూర్తి స్థాయి అధ్యయనం మరుగునపడింది. కేవలం ఒకరోజు నిర్వహించిన సర్వేతోనే ఇది ఆగిపోవడం మూలంగా చరిత్రలో మానవుని సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానం.. ఇలా ఎన్నో అంశాలను వెలికితీయడంతో నిర్లక్ష్యం కనిపిస్తోంది. ఈఏడాది మార్చి ఒకటిన ఇక్కడి ఆది మానవుని ఆనవాళ్లను గుర్తించి ప్రాముఖ్యత కలిగిన, చారిత్రిక ప్రదేశమని పేర్కొన్న పురావస్తుశాఖ తర్వాత దీని విషయాన్ని విస్మరించింది. లంకమల ఇప్పుడు యుగయుగాలకు చెందిన మానవుల మనుగడ జాడలపై చరిత్రకారుల్లో ఆసక్తి రేపుతోంది. ఎన్ని యుగాలైనా చెరిగిపోని చిత్రలేఖనం ద్వారా ఇనుప యుగపు ఆదిమానవులు ఆనవాళ్లు ఎన్నో కొత్త విషయాలకు, కొత్త అధ్యయనాలకు లంకమల అభయారణ్యం వేదిక ఉన్నప్పటికి లోతైన అధ్యయం లేకపోవడం నిరాశకు గురిచేస్తోంది. క్రీస్తుపూర్వం 2,500 సంవత్సరాల నుంచి క్రీస్తుశకం 2వ శతాబ్దం వరకు ఆది మానవులు లంకమలలోని రోళ్లబోడు బీటుకు చెందిన బండిగాని సెల ప్రాంతంలో నివసించినట్లు భారతీయ పురావస్తుశాఖ నిర్వహించిన పరిశీలన స్పష్టం చేసింది. లభ్యమైన జంతువులు, మనుషుల ఆకారంతో ఉన్న రేఖాగణిత చిత్రాల ఆధారంగా నాటి కాలాన్ని అంచనా వేశారు. ఎరుపు, తెలుపు, ఆకుపచ్చ రంగులో చిత్రాలను పురావస్తుశాఖ గుర్తించింది. అయితే తొలిసారిగా లంకమలలో నలుపు రంగ తో కలిగిన చిత్రాలు కనిపించడం వాటిని సహజసిద్ధంగా లభించే ముడిరంగులతో గీశా రని స్పష్టమైంది.

బొగ్గులు పరిశీలన

ఇనుపయుగ మానవుడు జాడ గుర్తించిన చోటనే బొగ్గులను గుర్తించారు.ఈ బొగ్గులు ఏ కాలం నాటివి అన్నదానిపై ప్రత్యేక పరిశీలన జరపాల్సి ఉందని పురావస్తుశాఖ అసిస్టెంట్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏసుబాబు ఆదివారం చెప్పారు.ఇనుపయుగ మానవ కాలంలో నివాస ప్రాంతాలు లేవు. సంచార జాతులుగా ఉన్న వీళ్ల నీటి లభ్యత కలిగిన ప్రాంతాల్లో సంచరిస్తూ జీవించేవాళ్లు. వీరు ఆహారం కోసం జంతువులను వేటాడి వాటిని కాల్చుకుని తిని ఉండాలంటే ఈ బొగ్గులు అవే ఉండవని ఆయన అభిప్రాయాన్ని వ్యక్తంచేస్తున్నాడు ప్రత్యేక పరిశీలన, అధ్యయనం చేయాల్సి ఉందని చెప్పారు.

నల్లరంగు చిత్రం విశేషం

లంకమలలో వెలుగులోకి వచ్చిన ఇనుపయుగ మానవుడి ఆనవాళ్లలో నల్లరంగు చిత్రాలు పురావస్తుశాఖ అధికారులను ఆశ్చర్యానికి గురిచేశాయి. నల్లరంగు చిత్రాలు ఎక్కడ కూడా కనిపించినట్లు ఆధారాలు లేవని పురావస్తుశాఖ చెబుతోంది. ఇక్కడ నల్లరంగుతో మనిషి చిత్రం ఉండటం అప్పటి కాలానుగుణ పరిస్థితులపై అధ్యయనానికి సిద్ధం కావాల్సిన అవసరం ఉందని చెబుతున్నారు.

లభ్యమైన కాలిన బొగ్గు

ప్రపంచానికి సందేశం

లంకమలలో గుర్తించిన ఆది మానవుని ఆనవాళ్లు సాధారణ విషయం కాదు. అక్కడ శోధిస్తే ఇంకెన్నో గుహలు, ఆధారాలు వెలుగు చూసే అవకాశం ఉంది. దీనికి సంబంధించి జరిపిన పరిశోధనపై పురావస్తుశాఖకు నివేదిక పంపాం. తదుపరి చర్యలు తీసుకోవాల్సి ఉంది. లంకమల ప్రపంచానికి కొత్త విషయాలు తెలిపే ప్రదేశంగా మారే అవకాశం లేకపోలేదు.

–డాక్టర్ యేసుబాబు, పురావస్తుశాఖ అసిస్టెంట్ సూపరిండెంట్

రెండు యుగాలను కలిపిందా !

బండిగాని సెల అభయారణ్యంలో బండలపై ఇనుపయుగ మానవులకు ఆనవాళ్లుగా నిర్ధారించే ఎరుపు రంగులో గీసిన చిత్రాల్లో తాబేలు, జింక. దుప్పి, లేదా కణితి బొమ్మలు ఎరుపురంగులో ఉన్నాయి. అలాగే తొలి చరిత్ర యుగపు ఆనవాళ్లుగా తెలుపురంగులో ఆవు, కుందేలు, చుక్కల్లో శివలింగ ఆకారం, గుర్రం పై స్వారీ చేస్తున్న వ్యక్తి, పక్కనే బరిసెతో వ్యక్తి చిత్రాలు ఉన్నాయి. గుర్రంపై రాజు, సైన్యం, ఖడ్గం వంటి ఆయుధాలు, ఆవులు, ఆవులు కాసే వారు ఇలా నాగరిక మానవుని జీవన ప్రమాణ అంశాలుగా నాటి ఆది మానవుల ఆహార, వ్యవహారాలు ప్రపంచానికి గుర్తుగా నాలుగు కాళ్ల అడవి జంతువులైన కణితి లేదా దుప్పి, నక్క, గేదె, ఆవు తదితర గుర్తులు ఉన్నాయి. మరోబండపైన యుద్ధం చేస్తున్నట్లుగా చేతుల్లో రాతి గుండులాంటి ఆయుధం, కుడిచేతిలో కర్ర లాంటి ఆయుధం పట్టుకున్నట్లు ఉన్నాయి. ఇద్దరి నడుముకు కత్తులు ధరించినట్లు ఉంది. చఎక్కలుగా శివలింగం పక్కనే ఊరేగింపుగా వెళ్తున్నట్టు. చేతిలో దీపాలు లాంటివి పెట్టుక ని ఉండొచ్చు. ఇలాంటి చిత్రలేఖన అనవాళ్లు రెండు యుగాలకు మధ్య సంబంధాలను సూచిస్తున్నట్టు పురావస్తుశాఖ ఇప్పటికే గుర్తించింది.

రాతిబండపై ఎరుపు, తెలుపు రంగుల్లో గీసిన చిత్రాలు

నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందారనడం సరికాదు

- ఆరోపణలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

సాక్షి, అమరావతి: గ్రామ పశుసంవర్ధక శాఖ సహాయకులు (ఏహెచ్ఏ) నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందారంటూ ఏపీ వెటర్నరీ కౌన్సిల్ చైర్మన్ పీవీ లక్ష్మయ్య చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదని ఏహెచ్ఏల సంఘం రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు కేవీ రాజేష్‌బాబు స్పష్టం చేశారు. ఇందుకు బాధ్యులైన వారిపై శాఖాపరంగా చర్యలు తీసుకోవాలని కోరుతూ పశుసంవర్ధక శాఖ డైరెక్టర్ డాక్టర్ టి.దామోదర నాయుడుకు సోమవారం వినతిపత్రం అందజేశారు. జిల్లా సెలక్షన్ కమిటీ (డీఎస్సీ), పశుసంవర్ధక శాఖ సంయుక్తంగా నిర్వహించిన రాత పరీక్షలో ఉత్తీర్ణత పొందడమే కాదు, నిర్దేశిత జీవో ఆధారంగా ఉన్నతాధికారుల పర్యవేక్షణలో పూర్తి పారదర్శకంగా జరిగిన సర్టిఫికెట్ వెరిఫికేషన్ వంటి ప్రక్రియల ద్వారా ఎంపిక చేశారన్నారు. పైగా ప్రతీ ఉద్యోగికి రెండేళ్ల పాటు ప్రొబేషన్ డిక్లరేషన్‌కై నాలుగు నెలల ట్రెనింగ్ పూర్తిచేసిన తర్వాత వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీ ఆధ్వర్యంలో అర్హత పరీక్ష నిర్వహించి ఆర్ఏహెచ్‌టీసీ (రీజనల్ యానిమల్ హజ్బెండరీ ట్రెనింగ్ సెంటర్)లో పశువులకు మెరుగైన వైద్యసేవలందించేందుకు ప్రత్యేక శిక్షణ కూడా పొందారన్నారు. ఆధారాలు లేని ఆరోపణల వల్ల క్షేత్ర స్థాయిలో పనిచేస్తున్న ఏహెచ్ఏలపై తీవ్ర ప్రభావం చూపుతుందని, వారు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారని చెప్పారు. ఇటువంటి తప్పుడు ఆరోపణల వల్ల సహోద్యోగుల ముందు అభద్రతాభావంతో పనిచేయాల్సి వస్తుందన్నారు. తక్షణమే ఈ వ్యాఖ్యలను వెటర్నరీ కౌన్సిల్ చైర్మన్ వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సచివాలయాల ఉద్యోగులకు బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి

- రోజూ రెండు విడతలు నమోదు చేయాల్సిందే
- ఆదేశాలు జారీ చేసిన గ్రామ, వార్డు సచివాలయాల శాఖ కార్యదర్శి

సాక్షి, అమరావతి : గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులకు రోజుకు రెండు విడతలు బయోమెట్రిక్ హాజరు తప్పనిసరి చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు గ్రామ, వార్డు సచివాలయాల శాఖ కార్యదర్శి కాటంనేని భాస్కర్ ఆదేశాలు జారీ చేశారు. పని దినాల్లో ఉద్యోగులు విధులకు హాజరైన వెంటనే ఒకసారి, సచివాలయం నుంచి తిరిగి వెళ్లే సమయంలో రెండోసారి హాజరు నమోదు చేయాలని సూచించారు. ఎవరికీ రోజు వారీ బయో మెట్రిక్ హాజరు నుంచి మినహాయింపు లేదని స్పష్టం చేశారు. గ్రామ సచివాలయాల్లో పనిచేసే డిజిటల్ అసిస్టెంట్లు, వార్డు సచివాలయాల్లో పనిచేసే వార్డ్ డేటా ప్రాసెసింగ్ కార్యదర్శి కార్యాలయ సమయాల్లో ఆయా సచివాలయాల్లో తప్పక అందుబాటులో ఉండాలని చెప్పారు. ఫీల్డు వర్కు విధులకు హాజరయ్యే సిబ్బంది ఆ వివరాలను సంబంధిత రిజిస్టర్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు. డివిజనల్ డెవలప్‌మెంట్ అధికారులు (డీఎల్‌డీవో) గ్రామ, వార్డు సచివాలయాలను ఆకస్మిక తనిఖీ చేయడం ద్వారా ఉద్యోగుల హాజరు నమోదును పర్యవేక్షించాలని సూచించారు.

పండుగల సీజన్‌లో ఆలయాలపై ప్రత్యేక దృష్టి

- అధికారులకు సీఎస్ ఆదేశాలు

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని ప్రైవేటు ఆలయాల్లో భక్తుల రద్దీ పట్ల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. విజయానంద్ అధికారులను ఆదేశించారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్‌లో ఆ సంస్థ కార్యకలాపాలు, పీపుల్స్ పర్సెప్షన్‌పై ఆయన సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోయే రోజుల్లో వరుసగా పండగలు, ప్రత్యేక పర్వదినాలు వస్తున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో అన్ని ఆలయాల్లోనూ భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని చెప్పారు. జిల్లాల్లో అధికారులు ప్రైవేటు ఆలయాలను కూడా ప్రత్యేకంగా పర్యవేక్షించాలని ఆదేశాలు ఇచ్చారు. తద్వారా ఆలయాల వద్ద ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగడానికి ఆస్కారం లేకుండా నిరోధించాలని సూచించారు. కాగా రబీ సీజన్‌కు ఎరువుల కొరత లేకుండా అధికారులు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా వ్యవహరించాలని విజయానంద్ వ్యవసాయశాఖ అధికారులకు సూచించారు.

పీపీఏ సీఈవోగా యోగేష్ పైథాంకర్

సాక్షి, అమరావతి: పోలవరం ప్రాజెక్టు అథారిటీ(పీపీఏ) ముఖ్య కార్యనిర్వహణ అధికారి(సీఈవో)గా యోగేష్ పైథాంకర్‌ను కేంద్ర జల్ శక్తి శాఖ నియమించింది. పీపీఏ సీఈవోగా పనిచేస్తోన్న అతుల్ జైన్ ఆదివారం పదవీ విరమణ చేశారు. దీంతో కేంద్ర జలసంఘం (సీడబ్ల్యూసీ) సభ్యుడిగా ఉన్న యోగేష్‌ను పీపీఏ సీఈవోగా నియమిస్తూ కేంద్ర జల్ శక్తి శాఖ సోమవారం ఉత్తర్వులిచ్చింది.

'ఉపాధి' ఉసురు తీస్తున్న ప్రభుత్వం

వ్యవసాయ కార్మిక సంఘం మండిపాటు

సాక్షి, అమరావతి : గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రోజురోజుకూ నిర్వీర్యం చేస్తున్నాయని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం దుయ్యబట్టింది. రాష్ట్రంలో ఇప్పటికే సుమారు 18.74 లక్షల మంది ఉపాధి జాబ్ కార్డులను తొలగించిందని ఆ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కారణంతో గ్రామీణ ప్రాంతాల్లో పనులు లేక, మరింతగా వలసలు పెరిగే ప్రమాదం ఉందని.. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీని మరింత నిర్వీర్యం చేయడానికి రెండు పూటల పని, ఫేస్ యాప్ నాలుగు గంటలకు ఒకసారి మస్టర్ వేయాలని కొత్త నిబంధన విధించిందని తప్పుపట్టారు. ఈ కొత్త విధానాన్ని పైలెట్ ప్రాజెక్టుగా అమలు చేయడానికి రాష్ట్రంలో పార్వతీపురం మన్యం జిల్లాను ఎంపిక చేయడం ఆ జిల్లాలో పేదల ఉపాధిని దెబ్బ తీస్తుందన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలకు ఏర్పాట్లు చేయండి

పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు

సాక్షి, అమరావతి: విద్యార్థుల్లో నైపుణ్యతను వెలికి తీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు ఏర్పాటు చేయాలని పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు.. రీజనల్ జాయింట్ డైరెక్టర్లు, జిల్లా విద్యాశాఖాధికారులను ఆదేశించారు. ఎస్‌సీఈఆర్టీ మార్గదర్శకాల మేరకు రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శిని–2026లో ఏడు గ్రూపు ప్రాజెక్టులు, రెండు వ్యక్తిగత, రెండు టీచర్ ప్రాజెక్టులను ఎంపిక చేయాల్సి ఉందన్నారు. ఈ ప్రదర్శనలో పాల్గొనేందుకు వీలుగా ఏడు అంశాలలో విద్యార్థుల నుంచి వైజ్ఞానిక ప్రదర్శనలను ఎంపిక చేయాలని సూచించారు. వ్యక్తిగత, ఉపాధ్యాయ కేటగిరిలో రెండు ప్రాజెక్టులను ఎంపిక చేయాలన్నారు.8వ తేదీన పాఠశాల స్థాయిలోనూ, 10వ తేదీన మండల స్థాయిలోనూ, 12న జిల్లా స్థాయిలోనూ వైజ్ఞానిక ప్రదర్శనలు నిర్వహించేలా ఏర్పాట్లు చేసుకోవాలన్నారు.

గిరిజన విద్యా సంస్థల్లో సౌకర్యాలకు రూ.29.99 కోట్లు

సాక్షి, అమరావతి : గిరిజన సంక్షేమ విద్యా సంస్థల్లో సౌకర్యాలకు రూ.29.99 కోట్లు ఖర్చు పెట్టేందుకు ప్రభుత్వం పరిపాలన అనుమతి ఇచ్చింది. ఈ మేరకు గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి ఎంఎం నాయక్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కొత్తగా మరుగుదొడ్ల నిర్మాణం, ఆర్వో ప్లాంట్లు ఏర్పాటు వంటి పనులు చేపట్టనున్నారు.

హెల్త్ మాట

'వింటరు' కదా?

చలికాలంలో కొన్ని ఆరోగ్య సమస్యలు సాధారణంగా కాస్తంత ఎక్కువగా కనిపిస్తుంటాయి. ఉదాహరణకు ఈ సీజన్‌లో కీళ్లకు సంబంధించిన నొప్పులు పెరుగుతుంటాయి. కండరాల నొప్పులు కనిపిస్తుంటాయి. ఇక ఒళ్లంతా పగుళ్లతో, ముఖం, పెదవులూ, మడమలపై పగుళ్లు కనిపిస్తూ బాధిస్తుంటాయి. ఇలా చర్మసంబంధిత సమస్యలూ వస్తాయి. ఇక వైరస్‌ల వ్యాప్తికి అనువైన కాలం కావడంతో జలుబుతో ముక్కు కారడం, ఊపిరితిత్తులకు సంబంధించిన సమస్యలు పెరగడమూ కనిపిస్తుంది. ఈ చలికాలంలో కనిపించే సాధారణ సమస్యలూ, వాటి పరిష్కారాలకు అనుసరించాల్సిన సూచనలేమిటో చూద్దాం...



డాక్టర్ వెంకట్ నాని కుమార్ .బి
సీనియర్ కన్సల్టెంట్
ఇంటర్నల్ మెడిసిన్

చలికాలంలో కండరాలూ, కీళ్లనొప్పులు పెరగడం ఎందుకంటే...

చలికాలంలో అన్నిటికంటే ఎక్కువగా బాధించే సమస్య కండరాలూ, కీళ్లనొప్పులు. పైగా మామూలుగానే ఈ సమస్యతో బాధపడేవాళ్లలో ఈ సీజన్‌లో ఆ బాధలు కాస్తంత ఎక్కువగా బాధిస్తూ వేధిస్తాయి. అందుకు కారణాలేమిటో తెలుసుకుందాం.

● ఈ సీజన్‌లో చలివల్ల చర్మం చాలా త్వరగా తన వేడిని కోల్పోతుంది. దాంతో చర్మం పైభాగంలో ఉండే రక్తనాళాలు కొద్దిగా కుంచించుకుపోతాయి. ఇలా కుంచించుకుపోవడాన్ని 'వాసో కన్‌స్ట్రిక్షన్' అంటారు. ఇలా కుంచించుకుపోవడంతో ఆ ప్రాంతాలకు రక్తప్రసరణ కూడా కాస్త తగ్గుతుంది. దాంతో చర్మంలోని నొప్పిని గ్రహించే భాగాలైన 'పెయిన్ సెన్సార్స్' మరింత ఎక్కువగా పని చేయాల్సి వస్తుంది. ఈ పెయిన్ సెన్సర్స్ ఈ సీజన్‌లో ఇంకాస్త చురుగ్గా పనిచేయాల్సిరావడంతో చిన్న దెబ్బకే ఎక్కువ నొప్పి తెలుస్తుంటుంది. అందుకే చలికాలంలో ఒంటికి గాయాలైతే... దెబ్బ చిన్నదే అయినా, నొప్పి తీవ్రత మాత్రం చాలా ఎక్కువగా ఉంటుంది. ఇది ఈ సీజన్‌లో కండరాలూ, కీళ్ల నొప్పులు పెరగడానికి దోహదం చేసే ఒక అంశం.

● ఇక మరో అంశమేమిటంటే... చాలామందిలో ఈ సీజన్‌లో నొప్పిని భరించే సామర్థ్యం (పెయిన్ టాలరెన్స్) తగ్గుతుంది. అందుకే బాధితులు మామూలు రోజుల్లోని నొప్పులూ కూడా ఈ కాలంలో మరింత పెరిగినట్లుగా అనిపిస్తాయి.

● ఈ సీజన్‌లో చలికి కీళ్లు బిగుసుకుపోతుంటాయి. దాంతో వాటిలో మామూలుగా ఉండాల్సిన కదలికలు కూడా బాగా తగ్గిపోతాయి. కీళ్లలో ఈ కదలికల తగ్గదల కారణంగా మన రోజువారీ కార్యకలాపాల్లో భాగంగా చేసే ఒళ్లు కదల్చడం, నడక వంటివి తగ్గిపోవడంతో దేహానికి ఒనగూరే వ్యాయామమూ, శారీరక శ్రమ కూడా తగ్గుతాయి. ఈ కారణం చేత కూడా కీళ్ల నొప్పులు బాగా పెరిగిపోతాయి. సాధారణంగా ఎముకలకు అందాల్సిన పోషకాలు దేహపు కదలికల వల్లనే వాటికి అందుతుంటాయి. ఈ కదలికలు తగినంతగా లేకపోవడంతో కీళ్లూ, ఎముకలకు అందాల్సిన పోషకాలూ సరిగా అందవు.

● మామూలుగా ఇతర సీజన్‌లలో కంటే... వింటర్ సీజన్‌లో సూర్యుడు చాలా తక్కువ సేపు మాత్రమే ప్రకాశిస్తూ ఉంటాడు. అందుకే చలికాలంలో పగటి నిడివి బాగా తక్కువగా ఉండటం మనందరికీ తెలిసిన విషయమే. ఫలితంగా మన దేహాలు, చర్మం సూర్యరశ్మికి ఎక్స్‌పోజ్ అయ్యే వ్యవధి కూడా తగ్గుతుంది. అందుకే ఈ సీజన్‌లో మన ఎముకలకు అవసరమైన విటమిన్–డి పాళ్లూ తగ్గుతాయి. అంతేకాదు... ఈ కారణం వల్ల మరో అనర్థమూ పొంచి ఉంటుంది. అదేమిటంటే... ఏవైనా కారణాలతో ఈ సీజన్‌లో ఎముకలు ఫ్రాక్చర్ అయితే అవి అతుక్కోడానికి పట్టే వ్యవధి మిగతా కాలాలలో పోలిస్తే ఈ సీజన్‌లో మరింత ఎక్కువగా ఉంటుంది.

ఒళ్లూ, కండరాల నొప్పులు తగ్గుదల కోసం ఇవీ కొన్ని పరిష్కారాలూ, సూచనలు

● ఈ సీజన్‌లో వీలైనంత మేరకు గాయాలపాలు కాకుండా అలాగే వాహనాలు నడిపేటప్పుడు లేదా వ్యాయామాల సమయంలో దెబ్బలు తగలకుండా తమను తాము జాగ్రత్తగా రక్షించుకోవాలి. ఆరుబయట నడుస్తున్నప్పుడు తాకుడురాళ్లు / ఎదురురాళ్లు తగలకుండా పాదం అంతా కప్పి ఉంచేలా మంచి షూస్ ధరించాలి. వేళ్లు బయటకు కనపడేలా ఉండే పూర్తిగా కవర్ చేయని చెప్పులూ, స్లిప్పర్స్ ధరించినప్పుడు కాలివేళ్లకు ఎదురురాయి తగిలి, చిన్న దెబ్బ తగిలినా, జివ్వుమనడం, చాలా బాధగా అనిపించడం, నొప్పి బాగా తెలుస్తుండటం జరుగుతుంది. షూస్ వల్ల కాళ్ల నుంచి వేడిమి కోల్పోకుండా ఉండటంతో పాటు, పాదాలకూ, కాలివేళ్ల చివరలకు పూర్తి రక్షణ కలుగుతుంది. అలాగే... వ్యాయామం చేస్తున్నప్పుడు మోకాళ్లకు ధరించే నీ–ప్యాడ్స్, నీ క్యాప్స్ వంటివి ధరించడం వల్ల గాయాలను / దెబ్బలను వీలైనంతగా నివారించుకోవచ్చు.

● ఆరుబయట చలిగా ఉన్నప్పుడు దేహానికి తగినంత వేడిని ఇచ్చేలా ఫుల్ స్లీవ్స్ ఉండే దుస్తులూ, ఊలు దుస్తులూ, ఉన్ని దుస్తుల వంటివి ధరించాలి. ఇవి దేహం నుంచి ఉష్ణోగ్రత బయటకు వెళ్లనివ్వకుండా దేహం వెచ్చగా ఉండేలా చూస్తాయి. అలాగే చేతులకు గ్లౌవ్స్ వేసుకోవడం, కాళ్లకు సాక్స్ ధరించడం వంటి జాగ్రత్తలూ మేలు చేస్తాయి. ఆర్థరైటిస్ నొప్పులతో బాధపడేవారు మోకాళ్ల, మోచేతుల వద్ద మరింత మందంగా ఉండే దుస్తులు వేసుకోవడం మంచిది.

● ఈ సీజన్‌లో ఆరుబయట కాకుండా వీలైనంత మేరకు ఇన్‌డోర్ ఎక్సర్‌సైజులు చేయాలి. ఈ వ్యాయామాల ఫలితంగా ఈ సీజన్‌లో మామూలుగానే కాస్తంత మందకొడిగా జరిగే రక్త సరఫరా ఉత్తేజితమై నార్మల్ స్థాయికి వస్తుంది. దాంతో నొప్పిని తెలిపే సెన్సర్స్ కూడా మామూలుగానే పనిచేస్తాయి. ఫలితంగా నొప్పి తగ్గుతుంది.

● చాలామంది చలి కారణంగా నీళ్లు తక్కువగా తాగుతుంటారు. కాఫీ, టీ వంటి పానియాలను ఎక్కువగా తాగుతారు. దళసరిగా ఉండే మందపాటి దుస్తులు, స్వెటర్లు ధరిస్తారు. దాంతో మనకు తెలియకుండానే చెమట రూపంలో నీటిని కోల్పోతాం. వాటిని భర్తీ చేసేంతగా నీళ్లు తాగం. ఇలా నీరు తక్కువ తాగడం, చెమట కారణంగా మనకు తెలియకుండానే దేహం డీహైడ్రేషన్‌కు లోనయ్యే ముప్పు పొంచి ఉంటుంది. ఈ కారణాలన్నింటి వల్ల శరీరంలో నీళ్లు, లవణాల మోతాదులు బాగా తగ్గిపోతాయి. అందుకే ఈ సీజన్‌లో తరచూ నీళ్లు తాగుతూ డీహైడ్రేషన్‌కు లోనుకాకుండా జాగ్రత్తలు తీసుకుంటూ ఉండాలి.

● డాక్టర్‌లు విటమిన్–డి సప్లిమెంట్స్ వాడాలని సూచించినవారు ఆ మేరకు వాటిని వాడాలి. సాధారణంగా ఆస్టియో ఆర్థరైటిస్ బాధితులకు ఈ సీజన్‌లో వారి నొప్పుల బాధలు మరింత పెరుగుతాయి. అందుకే ఆస్టియో ఆర్థరైటిస్ బాధితులు ఈ సీజన్‌లో తమ డాక్టర్ సలహా మేరకు విటమిన్–డి సప్లిమెంట్లు తప్పక వాడాల్సిందే.

చలికాలంలో ఈ సూచనలూ, జాగ్రత్తలతో కీళ్ల, కండరాల నొప్పులను చాలావరకు నివారించుకోవచ్చు. తమ ఒళ్లునొప్పుల వంటి బాధల నుంచి చాలావరకు రక్షణ పొందవచ్చు.

ఈ సూచనలు పాటించాక కూడా కండరాల నొప్పులూ, కీళ్ల నొప్పులూ, ఒళ్లు నొప్పులూ తగ్గకపోతే ఒకసారి డాక్టర్‌ను కలిసి తగిన పరీక్షలు, వాటి ఫలితాలను బట్టి తగిన చికిత్స తీసుకోవడం చాలా అవసరం.

జలుబూ... ఇతర వైరల్ జ్వరాలు

మనలో జలుబు రావడానికి రెండువందల రకాలకు వైరస్‌లు కారణమవుతాయి. ఈ రెండు వందలకు పైగా వైరస్‌లనూ, వాటిలో కనిపించే కొన్ని సమాన లక్షణాలను బట్టి గ్రూపులుగా విభజిస్తే... అందులో ఆరు రకాల గ్రూపులతో జలుబు వస్తుంటుందన్నది వైద్య నిపుణుల మాట. ఆ వైరస్‌లు ఏమిటంటే... 1) ఇన్‌ఫ్లుయెంజా, 2) పారాఇన్‌ఫ్లుయెంజా, 3) రైనోవైరస్, 4) ఎడినో వైరస్, 5) హ్యూమన్ రెస్పిరేటరీ సిన్సీషియల్ వైరస్ 6) బీఎఫ్–7 వేరియెంట్ అనేవి. గత కొన్నేళ్ల కిందట ప్రపంచవ్యాప్తంగా ప్రజలందరినీ బాధించిన కరోనా వైరస్ కూడా ఈ బీఎఫ్ వేరియెంట్ కిందకే వస్తుంది. కాకపోతే ఇప్పుడు కరోనా వైరస్ మునపటి తీవ్రత కోల్పోయిన కారణంగా అప్పుడప్పుడు అక్కడక్కడా కనిపిస్తున్నప్పటికీ జలుబులో ఉండే మామూలు లక్షణాలనే ప్రదర్శిస్తోంది.

లక్షణాలు... జలుబు వచ్చినప్పుడు కొద్దిపాటి జ్వరం, ఒళ్లునొప్పులు, తలనొప్పి, గొంతునొప్పి, గొంతులో గరగర, ముక్కు నుంచి లేదా ముక్కుతో పాటు కళ్ల నుంచి నీరు కారుతుండటం వంటి లక్షణాలు కనిపిస్తాయి. సాధారణంగా వైరస్ సోకిన 5 నుంచి 7 రోజుల్లో ఈ లక్షణాలన్నీ తగ్గిపోతాయి. అయితే అరుదుగా కొన్ని సార్లు మాత్రం ఈ వైరస్‌లు ఊపిరితిత్తుల్లోకి ప్రవేశించి నిమోనియా అనే ప్రమాకరమైన కండిషన్‌కు కారణమవుతాయి. మామూలు నిమోనియాతో పోలిస్తే... ఇలా ఒక వైరస్ కారణంగా వచ్చే సెకండరీ నిమోనియా మరింత ప్రమాదకారిగా పరిణమిస్తుంది.

జలుబుగానీ లేదా ఇతరత్రా వైరస్‌ల వల్లగానీ సమస్య శ్వాసవ్యవస్థలోని పైభాగంలో అంటే అప్పర్ రెస్పిరేటరీ ట్రాక్ట్‌లో ఉంటే... అది చాలావరకు దానంతట అదే తగ్గిపోతుంది. కానీ ఒకవేళ పైన పేర్కొన్న వైరస్‌లు శ్వాస వ్యవస్థలో మరికాస్త లోతుకు వెళ్లి... అక్కడి కింది భాగాలకు అంటే... లోయర్ రెస్పిరేటరీ ట్రాక్ట్ వరకు వ్యాపిస్తే అది నిమోనియాకు దారితీస్తుంది. అప్పుడు సమస్య ఇంకాస్త తీవ్రమవుతుంది. కొన్నిసార్లు ముక్కు, శ్వాసకోశ వ్యవస్థల్లోని సన్నని ఎపిథీలియల్ పొర దెబ్బతినడం వల్ల అక్కడికి బ్యాక్టీరియా చేరి సైనుసైటిస్, ఫ్యారింజైటిస్ వంటి ఇతర సమస్యలూ వచ్చే అవకాశాలూ ఉంటాయి.

నివారణ... ● మంచి పుష్టికరమైన సమతుల ఆహారం తీసుకుంటూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. ఈ సీజన్‌లో ద్రవాహారాలు ఎక్కువగా తీసుకుంటూ ఉండాలి. ఈ జాగ్రత్తల వల్ల వ్యాధి నిరోధకశక్తి పెరిగి ఇమ్యూన్ వ్యవస్థ మరింత బలోపేతమవుతుంది. దీనివల్ల జలుబుతో పాటు... ఇతరత్రా జబ్బులనుంచీ దేహానికి మంచి రక్షణ దొరుకుతుంది ● జలుబు వచ్చినవారు నేరుగా ఇతర వ్యక్తులపై తుమ్మడం, దగ్గడం చేయకూడదు. తుమ్మే సమయంలో లేదా దగ్గేటప్పుడు చేతిరుమాళ్లు, టిష్యూపేపర్లు వంటివాటిని అడ్డు పెట్టుకోవడం అవసరం. అవి లేనప్పుడు కనీసం మోచేతి మడతలో తుమ్మడం, దగ్గడం చేయాలి. ఇక తరచూ చేతులు కడుక్కోవడం లేదా శానిటైజ్ చేసుకోవడం, ఇతరులనుంచి భౌతిక దూరాన్ని పాటించడం, గుంపుల్లోకి (క్రౌడ్స్‌లోకి) వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవడం వంటి జాగ్రత్తలతో ఈ సీజన్‌లో జలుబు మాత్రమే కాకుండా అనేక ఇతర వైరస్‌ల కారణంగా వచ్చే వైరస్ జబ్బులను నివారించుకోవచ్చు.

చికిత్స

● జలుబు లేదా జలుబు వంటి వైరస్‌లతో వచ్చే సమస్యలన్నీ తమంతట తామే (సెల్ఫ్ లిమిటింగ్) సమస్యలు. వీటికి చికిత్స అందుబాటులో లేదు. కేవలం ఉపశమనం కోసమే లక్షణాలను బట్టి (సింప్టమ్యాటిక్ ట్రీట్‌మెంట్‌గా) కొన్ని మందులు ఇస్తుంటారు. లక్షణాలను తగ్గించడం కోసం జ్వరానికి పారాసిటమాల్, ముక్కులు పట్టేసినప్పుడు నాసల్ డీ-కంజెస్టెంట్స్ వంటి వాటిని డాక్టర్లు సూచిస్తారు. వాటితో తగినంత ఉపశమనం కలుగుతుంది.

● గొంతునొప్పి, గొంతులో గరగర ఉన్నవారు లోజెంజెస్ వాడవచ్చు. అలాగే గోరువెచ్చని నీటిలో ఉప్పు వేసి గరగరా పుక్కిలించడం (థ్రోట్ గార్గలింగ్) చేయవచ్చు.

● జలుబు, దాని వల్ల వచ్చే జ్వరం తగ్గిపోయాక కూడా చాలామందిలో నీరసం, నిస్సత్తువ, అలసట వంటివి కనిపిస్తూ ఉంటాయి. దాన్నే 'పోస్ట్ పైరెక్సియల్ డెబిలిటీ' అంటారు. ఇది తగ్గడానికి అన్ని రకాల పోషకాలు పుష్కలంగా ఉండే పుష్టికరమైన సమతులాహారం ; జింక్ వంటి న్యూట్రియెంట్స్‌తో పాటు విటమిన్-సి పుష్కలంగా ఉండే ఆహారాలు తీసుకోవాలి.

● చల్లగా ఉండే వాతావరణం కారణంగా చాలామంది చలికాలంలో ఎక్కువగా నీళ్లు తాగరు. జలుబు చేసినప్పుడు నీళ్లు, ద్రవాహారాలు ఎక్కువగా తీసుకోవాలి. దాంతో వ్యాధినిరోధక శక్తి పెరిగి... దేహానికి జలుబును ఎదుర్కొనే సామర్థ్యం కలుగుతుంది.

ఆస్తమా వంటి సీజనల్ సమస్యలు...

ఇక ఈ సీజన్‌లోని చలి వాతావరణంలో ఆస్తమా వంటి సీజనల్ సమస్యలూ పెచ్చరిల్లుతాయి. మందకొడి వాతావరణంలోని అలర్జెన్స్ వల్ల ఊపిరితిత్తుల్లోకి గాలి తీసుకుపోయే గాలిగొట్టాలు కుంచించుకుపోవడం వల్ల ఈ సమస్య కనిపిస్తుంది. అందుకే ఈ సీజన్‌లో మనకు సరిపడని అలర్జెన్స్ నుంచి దూరంగా ఉంటూ ఆస్తమా వంటి ఊపిరితిత్తుల సమస్యను నివారించుకోవాలి. తమకు ఈ సమస్య ఉందని తెలిసినవారు ఇన్‌హేలర్స్ వంటి ఫస్ట్‌లైన్ చికిత్సలతో సమస్య తీవ్రతరం కాకుండా నివారించుకోవాలి. అప్పటికీ తగ్గకపోతే డాక్టర్‌ను సంప్రదించి... ఊపిరితిత్తుల్లోని గాలిగొట్టాలను వెడల్పు చేసే బ్రాంకోడయలేటర్ల వంటి మందులు, ఇన్‌హేలర్లు వాడటం మంచిది.

చలి... చర్మ సమస్యలూ, జాగ్రత్తలు

శీతకాలంలోని చల్లటి వాతావరణంలో చలి ప్రభావం నేరుగా చర్మం మీదే పడుతుంది. అందుకే ఆ చలి బాధను మొదట అనుభవించేది చర్మమే. పైగా ఈ సీజన్‌లో వాతావరణంలో తేమ బాగా తగ్గిపోవడంతో... దాన్ని మళ్లీ భర్తీ చేయడానికి మన చర్మం నుంచే తేమను అప్పుడున్న వాతావరణం లాగేస్తుంటుంది. ఈ కారణంగానే ఈ సీజన్‌లో చర్మం పొడిబారిపోయి కనిపిస్తుంటుంది. ఫలితంగా ఈ సీజన్‌లో చర్మంపై గోటితో గీరగానే గీతలు పడుతుంటాయి. అంతేకాదు.. ఈ సీజన్‌లో ఇతర అలర్జీలతో పాటు చర్మ–అలర్జీలూ పెరుగుతాయి. ఫలితంగా చర్మం పగలడం, కాళ్లు పగుళ్లు ప్రస్ఫుటంగా కనిపించే ఎగ్జిమా వంటి కేసులు పెరుగుతాయి. అందువల్ల మరీ ముఖ్యంగా మడమలు పగలడం కూడా ఈ సీజన్‌లోనే చాలా ఎక్కువ. ఇలా మడమల పగుళ్లు కనిపించడమన్నది యువతులు, మహిళల్లో మరికాస్త ఎక్కువ.

ఎగ్జిమా : కాళ్లూ, చేతులు పగుళ్లబారి కనిపించడం ఎగ్జిమా తాలూకు ప్రధాన లక్షణం. ఈ సీజన్‌లో చలి కారణంగా పెరిగిపోయి కనిపించే కేసుల్లో ఎగ్జిమానే ఎక్కువ. అందుకే దాని నివారణ, చికిత్సల గురించి తెలుసుకుందాం.

నివారణ, చికిత్స : ఎగ్జిమా నివారణ/చికిత్సలు ఇవి... ● దురద అంతగా లేనివారు సువాసన లేని, మామూలు హైపో అలర్జిక్ మాయిశ్చరైజర్స్ రాసుకుంటూ చర్మాన్ని సంరక్షించుకోవాలి. ● ఒకవేళ దురద ఎక్కువగా ఉంటే డాక్టర్ సలహా మేరకు వాటిని తగ్గించే పూత మందులు (టాపికల్ మెడిసిన్స్) వాడాలి.

హౌజ్‌వైఫ్ డర్మటైటిస్ : పేరునుబట్టి ఇది గృహిణులకు మాత్రమే వచ్చే సమస్యగా అనిపించవచ్చు గానీ అది నిజం కాదు. కొన్నిసార్లు మధ్యవయస్కులతో పాటు, యువతుల్లోనూ కనిపిస్తుంది. అంటే ఇరవై నుంచి నలభై ఏళ్ల వయసులో ఉన్న మహిళలకు 'హౌజ్‌వైఫ్ డర్మటైటిస్' ముప్పు ఎక్కువ. ఈ వయసు మహిళలు... తాము ముఖం కడుక్కోవడానికి వాడే సబ్బులు, బట్టలు ఉతకడం కోసం వాడే డిటర్జెంటు సబ్బులు, పౌడర్లు; అలాగే కొన్ని సందర్భాల్లో వారు ముఖానికి పసుపు, కుంకుమ రాసుకోవడం కారణంగా ముఖం బాగా పొడిబారిపోవడం వంటి సమస్యలు కనిపిస్తాయి. ఫలితంగా చర్మంపై పగుళ్లు, దురదలు వస్తాయి. ఈ సమస్యనే 'హౌజ్‌వైఫ్ డర్మటైటిస్' అంటారు.

నివారణ : ● తమకు అలర్జీ కలిగించే అన్ని రకాల పదార్థాలను గుర్తించి, వాటి నుంచి దూరంగా ఉండటం. ● మడమలు పగలినవారు శాల్సిలిక్ యాసిడ్ ఉండే కాంబినేషన్ క్రీములు వాడటం వల్ల ఉపశమనం కలుగుతుంది. కాళ్లు పగిలిన వారు రాత్రి వేళ సాక్స్ ధరించి పడుకోవడం వల్ల మడమల పగుళ్లు చాలావరకు తగ్గుతాయి.

చలికాలంలో పూర్తిస్థాయి చర్మ సంరక్షణ కోసం...

● చలికాలంలో బాగా పొగలుగక్కే వేణ్ణీళ్లు మంచివి అని కొందరు పొరబడుతుంటారు. ఇది కేవలం అపోహ మాత్రమే. నిజానికి ఈ సీజన్‌లోని వాతావరణం మన చర్మం నుంచి తేమను లాగేస్తుంటుంది. ఫలితంగా వేడినీళ్లతో స్నానం చర్మాన్ని మరింత పొడిబార్చే ప్రమాదం ఉంది. అందుకే స్నానానికి గోరువెచ్చని నీళ్ల వాడటమే మేలు ● స్నానానికి అరగంట ముందు ఒంటికి ఆలివ్ లేదా కొబ్బరి నూనె పట్టించాలి. స్నానానికి మాయిశ్చరైజింగ్ సబ్బు వాడటం కూడా మంచిదే ● చల్లటి వాతావరణంలో దాహం వేయకపోవడంతో నీరు తాగడం తగ్గించడం సరికాదు. రోజూ కనీసం రెండు లీటర్ల నీటిని తాగడమే మంచిది ● అరచేతులు, పాదాలు పగిలినవాళ్లు పాదాలకూ సాక్స్, చేతులకూ కాటన్ గ్లౌజ్ ధరించడం మంచిది ● పెదవులు పగలకుండా పెట్రోలియమ్ జెల్లీగానీ లేదా లిప్ బామ్‌గానీ పెదవులపై తరచూ రాసుకుంటూ ఉండటం మంచిది ● చలికాలమే అయినప్పటికీ తగినంత ఎస్‌పీఎఫ్ ఉండే సన్‌స్క్రీన్ లోషన్‌ను రాసుకుంటూ ఉండటం మంచిది.

నిర్వహణ
యాసీన్

బిజినెస్ రీల్

ఐఐటీ హైదరాబాద్‌లో గ్రాన్యూల్స్ ఎక్సలెన్స్ సెంటర్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ఫార్మా సంస్థ గ్రాన్యూల్స్ ఇండియా తాజాగా ఐఐటీ హైదరాబాద్‌లోని టెక్నాలజీ రీసెర్చ్ పార్క్‌లో రెండు అధునాతన సెంటర్స్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ప్రారంభించింది. ఎసెలిస్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ పెప్టైడ్ డెవలప్‌మెంట్ అండ్ క్యారక్టరైజేషన్ మరియు గ్రాన్యూల్స్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ పార్టికల్ ఇంజినీరింగ్ వీటిలో ఉన్నాయి. కాస్మెటిక్, థెరప్యూటిక్, ఫార్మా పెప్టైడ్స్‌ని అభివృద్ధి చేసేందుకు ఎసెలిస్ సెంటర్ ఉపయోగపడనుంది. మెటీరియల్ సైన్స్, పాలీమార్ఫ్ పరిశోధనలను ముందుకు తీసుకెళ్లేందుకు పార్టికల్ ఇంజినీరింగ్ సెంటర్ తోడ్పడనుంది. తదుపరి తరం ఫార్మా ఉత్పత్తులను ఆవిష్కరించే దిశగా తమ సామర్థ్యాలను బలోపేతం చేసుకునేందుకు ఇవి ఉపయోగపడగలవని గ్రాన్యూల్స్ ఇండియా సీఎండీ కృష్ణప్రసాద్ చిగురుపాటి తెలిపారు.

ఎగుమతులకు టారిఫ్‌ల సెగ

- 5 నెలల్లో 28.5 శాతం డౌన్
- అమెరికాకు ఎక్స్‌పోర్ట్స్‌పై జీటీఆర్‌ఐ నివేదిక

న్యూఢిల్లీ: అగ్రరాజ్యం అమెరికా విధించిన భారీ టారిఫ్‌ల దెబ్బతో ఆ దేశానికి భారత్ ఎగుమతులు గత 5 నెలల్లో గణనీయంగా క్షీణించాయి. అతి పెద్ద మార్కెట్‌కి ఎక్స్‌పోర్ట్స్ 28.5 శాతం తగ్గిపోయాయి. జీటీఆర్‌ఐ నివేదిక ప్రకారం గతేడాది మే–అక్టోబర్ మధ్య కాలంతో పోలిస్తే ఈసారి ఎగుమతులు 8.83 బిలియన్ డాలర్ల నుంచి 6.31 బిలియన్ డాలర్లకు తగ్గాయి. భారత్ ఎగుమతులపై అమెరికా టారిఫ్‌లు ఏప్రిల్ 2న 10 శాతంతో మొదలుపెట్టి ఆగస్టు నాటికి 50 శాతానికి చేరాయి. దీంతో అమెరికా వాణిజ్య భాగస్వాముల్లో అత్యధిక టారిఫ్‌లు వర్తిస్తున్న దేశాల్లో ఒకటిగా భారత్ నిల్చింది. మరోవైపు పొరుగు దేశం చైనాపై టారిఫ్‌లు 30 శాతంగానే ఉండగా జపాన్‌పై కేవలం 15 శాతంగా ఉన్నాయి. తాజా గణాంకాలు పరిశీలిస్తే టారిఫ్‌ల నుంచి మినహాయింపు ఉన్న స్మార్ట్‌ఫోన్లు, ఫార్మా, పెట్రోలియం ఉత్పత్తుల వాటా అక్టోబర్ ఎగుమతుల్లో 40.3 శాతం స్థాయిలో ఉన్నప్పటికి విలువపరంగా మే నెల నాటి 3.42 బిలియన్ డాలర్లతో పోలిస్తే 2.54 బిలియన్ డాలర్లకు (25.8 శాతం) పడిపోయింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

2-12-2025	
విశాఖ	630-00
చిత్తూరు	663-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	640-00
విజయవాడ	665-00
రిటైల్ ధర (డజను)	90.00
హైదరాబాద్	640-00
వరంగల్	642-00
రిటైల్ ధర	7.00

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ULTRACEMCO	12,013.00	3.56
TMPV	363.5	1.88
MARUTI	16,125.00	1.42
BEL	417	1.28
EICHERMOT	7,135.00	1.16

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
MAXHEALTH	1,131.80	-2.67
INDIGO	5,772.50	-2.19
BAJFINANCE	1,019.80	-1.71
SUNPHARMA	1,809.00	-1.23
ADANIENT	2,259.90	-0.89

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	6,242
ఎన్‌ఎస్‌ఈ	85,216
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	1,04,527
ఎఫ్ఐఐ	- 1,171
డీఐఐ	+ 2,559

ముడిచమురు... (బ్యారెల్)

	రాత్రి 11.30కు	క్రితం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	59.46	$ 58.55
బ్రెంట్	63.27	$ 62.38

తయారీపై 'టారిఫ్‌ల' ప్రభావం

- నవంబర్‌లో 56.6కు పీఎంఐ పరిమితం
- అక్టోబర్‌లో ఇది 59.2 పాయింట్లు
- 9 నెలల కనిష్టానికి చేరిక

న్యూఢిల్లీ: తయారీ రంగం పనితీరు నవంబర్‌లో కొంత బలహీనపడింది. తొమ్మిది నెలల కనిష్ట స్థాయికి చేరింది. తయారీ రంగం పనితీరును సూచించే హెచ్ఎస్‌బీసీ ఇండియా తయారీ పర్చేజింగ్ మేనేజర్స్ ఇండెక్స్ (పీఎంఐ) 56.6 పాయింట్లకు పరిమితమైంది. అక్టోబర్‌లో ఇది 59.2 పాయింట్లుగా ఉండడం గమనార్హం. సాధారణంగా 50కు పైన నమోదైతే, విస్తరణగానే పరిగణిస్తుంటారు. అమెరికా టారిఫ్‌లు తయారీ కార్యకలాపాల విస్తరణను నిదానించేలా చేసినట్టు నవంబర్ నెల పీఎంఐ గణాంకాల ఆధారంగా తెలుస్తోందని హెచ్ఎస్‌బీసీ ఇండియా ముఖ్య ఆర్థిక వేత్త ప్రంజుల్ భండారీ తెలిపారు. అంతర్జాతీయంగా విక్రయాలు సానుకూలంగా ఉన్నట్టు కంపెనీలు చెబుతున్నప్పటికీ.. ఆఫ్రికా, ఆసియా, యూరప్, మధ్య ప్రాచ్యంలోని క్లయింట్లకు అమ్మకాల్లో వృద్ధి కొంత నిదానించినట్టు చెప్పారు. కొత్త ఎగుమతి ఆర్డర్లు రాక 13 నెలల కనిష్టానికి చేరినట్టు ప్రంజుల్ భండారీ తెలిపారు. వ్యాపార విశ్వాసం సైతం నవంబర్‌లో పడిపోయినట్టు చెప్పారు. టారిఫ్‌ల ప్రభావంపై పెరిగిన ఆందోళనలను తెలియజేస్తున్నట్టు పేర్కొన్నారు.

జీఎస్‌టీ కోత ఒక్కటీ చాలదు..

''జీఎస్‌టీ రేట్ల కోత ప్రభావం క్రమంగా ఆవిరవుతోంది. డిమాండ్‌పై టారిఫ్‌ల ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు ఇది చాలకపోవచ్చు''అని భండారీ అభిప్రాయపడ్డారు. నవంబర్‌లో తయారీ వ్యయాలు, విక్రయ ధరలు ఎనిమిది నెలల కనిష్ట స్థాయిలో పెరిగాయి. తగ్గిన ఆర్డర్లకు అనుగుణంగా నియామకాలు, కొనుగోళ్ల ప్రణాళికలను సంస్థలు సవరించుకుంటున్నట్టు హెచ్ఎస్‌బీసీ ఇండియా తయారీ రంగ పీఎంఐ సర్వేలో తెలిసింది. నియామకాలు 21 నెలల కనిష్ట స్థాయిలో పెరిగాయి. వచ్చే 12 నెలల కాలానికి తయారీ ఉత్పత్తిని పెంచుకుంటామన్న విశ్వాసం కంపెనీల్లో కనపించడగా, సానుకూల సెంటిమెంట్ మాత్రం మూడున్నరేళ్ల కనిష్టానికి పడిపోయింది. 400 తయారీ సంస్థలకు సంబంధించి పర్చేంజింగ్ మేనేజర్ల అభిప్రాయాల ఆధారంగా ఈ నివేదికను హెచ్ఎస్‌బీసీ ఇండియా విడుదల చేస్తుంటుంది.

ద్వితీయ శ్రేణి నగరాల్లో పెరిగిన ఇళ్ల అమ్మకాలు

- సెప్టెంబర్ క్వార్టర్‌లో 4% పెరిగి రూ.37,409 కోట్లకు
- స్థిరాస్తి సంస్థ ప్రాప్‌ఈక్విటీ నివేదిక

న్యూఢిల్లీ: దేశంలోని 15 ప్రధాన ద్వితీయ శ్రేణి నగరాల్లో ఇళ్ల అమ్మకాలు వార్షిక ప్రాతిపదికన జూలై-సెప్టెంబర్ త్రైమాసికంలో 4% పెరిగి రూ.37,409 కోట్లకు చేరినట్లు స్థిరాస్తి డేటా అనలిటిక్ సంస్థ ప్రాప్‌ఈక్విటీ నివేదిక తెలిపింది. వార్షిక ప్రాతిపదికన గృహ విక్రయాల సంఖ్య (వాల్యూమ్స్ పరంగా) 4% తగ్గి 39,201 యూనిట్లకు పరిమితమైనట్లు నివేదిక పేర్కొంది. ఇక కొత్తగా మార్కెట్‌లోకి వచ్చిన హౌసింగ్ యూనిట్ల సంఖ్య(కొత్త సప్లై) 10% క్షీణించి 28,721కు దిగివచ్చింది.

→ అహ్మదాబాద్, సూరత్, గాంధీ నగర్, వడోదర, జైపూర్, నాసిక్, నాగ్‌పూర్, మొహాలి, భువనేశ్వర్, లక్నో, భూపాల్, కొయంబత్తూర్, గోవా త్రివేండ్రం, కొచ్చి.... ఈ 15 నగరాల్లో అతిపెద్ద రియల్ ఎస్టేట్ మార్కెట్ అహ్మదాబాద్‌లో వార్షిక ప్రాతిపదికన ఇళ్ల అమ్మకాలు 6% తగ్గి 13,021 యూనిట్లకు పరిమితమయ్యాయి. సూరత్‌లో విక్రయాలు 8% క్షీణించి 4,936 యూనిట్లకు దిగివచ్చాయి. కొత్త ప్రాజెక్టుల ఆవిష్కరణ, అమ్మకాల్లో 60% గుజరాత్‌లోని ప్రధాన నగరాలైన అహ్మదాబాద్, సూరత్, గాంధీ నగర్, వడోదరల్లో నమోదయ్యాయి.

→ భారత ఆర్థిక వృద్ధిని పరుగులు పెట్టిస్తున్న ప్రధాన శక్తి కేంద్రాలుగా టైర్-2 నగరాలు ఎదుగుతున్నాయని ప్రాప్‌ఈక్విటీ ఫౌండర్, సీఈఓ సమీర్ జసుజా తెలిపారు. ఉద్యోగ అవకాశాల విస్తరణ, మౌలిక సదుపాయాల అభివృద్ధి, ప్రాంతాల మధ్య మెరుగుతున్న అనుసంధానం(కనెక్టివిటీ) అంశాలు రియల్ ఎస్టేట్ విభాగాల్లో డిమాండ్‌ను పెంచుతున్నాయని పేర్కొన్నారు.

→ సెప్టెంబర్ త్రైమాసికంలో కొత్త గృహ ప్రాజెక్టుల లాంచింగ్ క్షీణించడమనేది మందగమనానికి సంకేతంగా కాకుండా, రియల్ ఎస్టేట్ డెవలపర్లు తీసుకున్న వ్యూహాత్మక నిర్ణయమని స్టోన్‌క్రాఫ్ట్ గ్రూప్ వ్యవస్థాపకుడు కీర్తి చిలుకూరి తెలిపారు.

ఓలా ఎలక్ట్రిక్ యాప్ నుంచే వాహన సర్వీస్ బుకింగ్

న్యూఢిల్లీ: హైపర్‌సర్వీస్ ప్లాట్‌ఫాం కింద ఓలా ఎలక్ట్రిక్ కొత్తగా ఇన్–యాప్ సర్వీస్ అపాయింట్‌మెంట్ ఫీచరును ప్రవేశపెట్టింది. దీనితో కంపెనీ యాప్ ద్వారా యూజర్లు తమకు కావాల్సిన సర్వీస్ స్లాట్లను బుక్ చేసుకోవచ్చు. సర్వీస్ పరిస్థితిని ట్రాక్ చేసుకోవచ్చు. అలాగే సర్వీస్‌కి సంబంధించిన విషయాలన్నీ ఒకే చోట సమగ్రంగా చూసుకోవచ్చు. సంప్రదాయ సర్వీస్ బుకింగ్ విధానంలో ఎదురయ్యే సవాళ్లను తొలగించే విధంగా ఇది ఉంటుందని కంపెనీ తెలిపింది. సిసలైన, అత్యంత నాణ్యమైన విడిభాగాలు, ప్రామాణిక సర్వీస్ ప్రక్రియలు యూజర్లకు లభిస్తాయని పేర్కొంది. కస్టమర్లు, స్వతంత్ర గ్యారేజ్‌లు, ఫ్లీట్ ఆపరేటర్లకు కూడా తమ స్పేర్ పార్టులు, డయాగ్నోస్టిక్ సాధనాలు, శిక్షణ మొదలైనవి అందుబాటులో ఉండేలా ఓలా ఇటీవలే హైపర్‌సర్వీస్ ప్లాట్‌ఫాంని ఆవిష్కరించింది.

ఎల్‌ఐసీ స్టాక్స్ కొనుగోళ్లపై సలహాలివ్వం

- నిబంధనలమేరకే అదానీ గ్రూప్‌లో పెట్టుబడులు
- ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టీకరణ

న్యూఢిల్లీ: బీమా రంగ పీఎస్‌యూ దిగ్గజం ఎల్‌ఐసీ స్టాక్ మార్కెట్ పెట్టుబడులపై తమ శాఖ ఎలాంటి సలహాలివ్వదని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ స్పష్టం చేశారు. అలాగే ఈ విషయంలో మార్గనిర్దేశం సైతం చేయదని తెలియజేశారు. అదానీ గ్రూప్ కంపెనీలలో ప్రామాణిక నిర్వహణా సంబంధ నిబంధనల (ఎస్‌వోపీ)మేరకే ఎల్‌ఐసీ వాటాల కొనుగోళ్లు చేపట్టినట్లు ఒక ప్రశ్నకుగాను లోక్‌సభకి ఇచ్చిన రాతపూర్వక సమాధానంలో పేర్కొన్నారు. టాప్ ర్యాంక్ బీమా దిగ్గజం అనేక సంవత్సరాలుగా ఆయా కంపెనీల ఆర్థిక మూలాలు (ఫండమెంటల్స్) ఆధారంగానే పెట్టుబడి నిర్ణయాలు తీసుకుంటున్నట్లు తెలియజేశారు. కంపెనీలపై పూర్తిస్థాయి పరిశీలన చేపట్టాక మాత్రమే స్టాక్స్ కొనుగోళ్లు చేపడుతుందని వివరించారు. వెరసి ఎస్‌వోపీల ప్రకారం తగిన పరిశీలనతోపాటు.. రిస్కులపై అధ్యయనం చేశాక అదానీ గ్రూప్‌లోని ఆరు కంపెనీలలో ఎల్‌ఐసీ ఇన్వెస్ట్ చేసినట్లు వెల్లడించారు. అదానీ గ్రూప్ కంపెనీల పుస్తక విలువ రూ. 38,659 కోట్లుకాగా.. సంబంధిత కంపెనీల రుణ పత్రాలలోనూ మరో రూ. 9,626 కోట్లవరకూ పెట్టుబడులు చేపట్టినట్లు తెలియజేశారు. ఎల్‌ఐసీ ఫండ్ చేపట్టే పెట్టుబడి నిర్ణయాలపై ఆర్థిక శాఖ ఎలాంటి సూచనలు లేదా సలహాలు ఇవ్వబోదని, స్టాక్ కొనుగోళ్లలో ఎలాంటి ప్రమేయం ఉండదని పేర్కొన్నారు.

చట్టాల ప్రకారమే ...

ఎల్‌ఐసీ ఇన్వెస్ట్‌మెంట్ నిర్ణయాలు ఎప్పటికప్పుడు 1938 బీమా చట్టం, ఐఆర్‌డీఏఐ నియంత్రణలు, ఆర్‌బీఐసహా.. సెబీ నిబంధనలకు అనుగుణంగా ఉంటాయని ఆర్థిక మంత్రి సీతారామన్ వివరించారు. అదానీ గ్రూప్‌లో ఎల్‌ఐసీ పెట్టుబడులకు వీలుగా ఆర్థిక శాఖ అధికారులు ఒక ప్రణాళికను రూపొందించినట్లు అక్టోబర్‌లో వాషింగ్టన్ పోస్ట్‌లోని ఒక నివేదిక ఆరోపించిన సంగతి తెలిసిందే. ఈ ఏడాది మొదట్లో రుణభారంతోపాటు.. యూఎస్‌లో నిశిత పరిశీలనను ఎదుర్కొంటున్న అదానీ గ్రూప్‌లో ఎల్‌ఐసీ పెట్టుబడులకు ఆర్థిక శాఖ అధికారులు ఒక ప్రణాళికను అమలు చేసినట్లు నివేదిక ఆరోపించింది. 2025 మే నెలలో అదానీ పోర్ట్స్ అండ్ సెజ్‌లో ఎల్‌ఐసీ 57 కోట్ల డాలర్లు (సుమారు రూ. 5,000 కోట్లు) ఇన్వెస్ట్ చేసినట్లు పేర్కొంది. ఈ నేపథ్యంలో ఆర్థిక మంత్రి సీతారామన్ వివరణకు ప్రాధాన్యత ఏర్పడింది. కాగా.. ఎస్‌వోపీలు, బోర్డు అనుమతులతో 2025 మేలో ఎల్‌ఐసీ.. అదానీ పోర్ట్స్ జారీ చేసిన ఎన్‌సీడీలలో రూ. 5,000 కోట్లు ఇన్వెస్ట్ చేసినట్లు ఆర్థిక మంత్రి ప్రస్తావించారు. ఎన్ఎస్ఈ, బీఎస్‌ఈలలో లిస్టయిన టాప్–500 కంపెనీలలో ఎల్‌ఐసీ పెట్టుబడులు చేపట్టినట్లు ఈ సందర్భంగా తెలియజేశారు. ప్రస్తుతం పెట్టుబడుల్లో ప్రధాన వాటా భారీ కంపెనీలలోనే ఉన్నట్లు వెల్లడించారు. ఎన్ఎస్ఈ ప్రధాన ఇండెక్స్ నిఫ్టీ 50 కంపెనీలలో ఎల్‌ఐసీ పెట్టుబడుల పుస్తక విలువ 2025 సెప్టెంబర్ 30 కల్లా రూ. 4,30,777 కోట్లుగా పేర్కొన్నారు.

తొలి 6 నెలల్లో ఎఫ్‌డీఐల జోరు

ఏప్రిల్-సెప్టెంబర్‌లో 35.18 బిలియన్ డాలర్లు

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26) తొలి అర్ధభాగంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులు(ఎఫ్‌డీఐలు) వార్షిక ప్రాతిపదికన 18 శాతం ఎగశాయి. వెరసి ఏప్రిల్–సెప్టెంబర్‌లో 35.18 బిలియన్ డాలర్లను తాకాయి. యూఎస్ నుంచి పెట్టుబడులు రెట్టింపయ్యాయి. ప్రభుత్వ తాజా గణాంకాల ప్రకారం ఇవి 6.62 బిలియన్ డాలర్లకు చేరాయి. గతేడాది(2024–25) తొలి ఆరు నెలల్లో 29.79 బిలియన్ డాలర్ల ఎఫ్‌డీఐలు లభించాయి. ఈ ఏడాది జూన్–సెప్టెంబర్ కాలంలో ఇవి 21 శాతం జంప్ చేసి 16.55 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి. ఈక్విటీ పెట్టుబడులు, ఆర్జనను తిరిగి ఇన్వెస్ట్ చేయడం, ఇతర మూలధనంతో కలిపి మొత్తం ఎఫ్‌డీఐలు తొలి ఆరు నెలల్లో 50 బిలియన్ డాలర్లను తాకాయి. గతేడాది ఇదే కాలంలో ఇవి 42.3 బిలియన్ డాలర్లు మాత్రమే. యూఎస్ పెట్టుబడులు 2.57 బిలియన్ డాలర్లుగా నమోదయ్యాయి.

దేశాలవారీగా

ఎఫ్‌డీఐలలో ప్రధానంగా సింగపూర్ నుంచి అత్యధికస్థాయిలో 11.94 బిలియన్ డాలర్లు లభించాయి. తదుపరి ర్యాంకులో యూఎస్ నిలవగా.. మారిషస్ నుంచి 3.47 బిలియన్ డాలర్లు, యూఏఈ నుంచి 2.33 బి.డా, కేమన్ ఐలాండ్స్ నుంచి 1.83 బి.డా, నెదర్లాండ్స్ నుంచి 1.63 బి.డా, సైప్రస్ నుంచి 1.4 బి.డా, జపాన్ నుంచి 1.21 బి.డా చొప్పున నమోదయ్యాయి.

ఆరు నెలల గరిష్టానికి డీజిల్ విక్రయాలు

నవంబర్‌లో 8.55 మిలియన్ టన్నుల వినియోగం

న్యూఢిల్లీ: పండుగ సీజన్, జీఎస్‌టీ రేట్ల తగ్గింపు దన్నుతో ఎకానమీ పరుగులు తీసిన నేపథ్యంలో దేశీయంగా నవంబర్‌లో డీజిల్ అమ్మకాలు ఆరు నెలల గరిష్టానికి ఎగిశాయి. పెట్రోలియం ప్లానింగ్, అనాలిసిస్ సెల్ (పీపీఏసీ) డేటా ప్రకారం వార్షిక ప్రాతిపదికన 4.7 శాతం పెరిగి 8.55 మిలియన్ టన్నులుగా నమోదైంది. మే నెల తర్వాత ఇది అత్యధిక స్థాయి. జూన్‌లో వర్షాకాలం మొదలైనప్పటి నుంచి సెప్టెంబర్ వరకు తగ్గుముఖం పట్టిన అమ్మకాలు అక్టోబర్‌లో తిరిగి కొంత పుంజుకుని 6.79 మిలియన్ టన్నులకు చేరుకోగా, నవంబర్ లోనూ అదే ధోరణి కొనసాగింది. 2023 నవంబర్ నాటి 7.52 మిలియన్ టన్నులతో పోలిస్తే తాజాగా 13.61 శాతం, కోవిడ్ పూర్వం 2019తో పోలిస్తే వార్షికంగా 2 శాతం మేర డీజిల్ వినియోగం పెరిగింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఎనిమిది నెలల్లో డీజిల్ అమ్మకాలు వార్షికంగా 2.76 శాతం పెరిగి 61.85 మిలియన్ టన్నులుగా నమోదయ్యాయి. మరోవైపు, నవంబర్లో పెట్రోల్ వినియోగం 2.19 శాతం పెరిగి 3.5 మిలియన్ టన్నులుగా నమోదైంది. విమాన ఇంధనం వినియోగం 4.7 శాతం పెరిగి 7,83,000 టన్నులకు, ఎల్‌పీజీ విక్రయాలు 7.62 శాతం వృద్ధితో 3 మిలియన్ టన్నులకు చేరాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి ఎనిమిది నెలల్లో పెట్రోల్ డిమాండ్ 6.25 శాతం పెరిగి 28.35 మిలియన్ టన్నులకు చేరింది.



భారత వృద్ధి రేటు అంచనాలు పెంచిన క్రిసిల్

- 2025–26 గానూ 7 శాతానికి పెంపు
- మునుపటి అంచనా 6.5 శాతమే

కోల్‌కతా: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం (2025–26)లో భారత వృద్ధి రేటు అంచనాను ఏడుశాతానికి పెంచుతున్నట్లు ప్రముఖ రేటింగ్ సంస్థ క్రిసిల్ తెలిపింది. అంతకుముందు 6.5% వృద్ధిని అంచనా వేసింది. 2025–26 ప్రథమార్ధంలో దేశీయ వృద్ధి రేటు అంచనాలకు మించి 8% వృద్ధి సాధించిన నేపథ్యంలో వృద్ధి అవుట్‌లుక్‌ను అప్‌గ్రేడ్ చేసింది. భారత వాస్తవ జీడీపీ వృద్ధి రెండో త్రైమాసికంలో 8.2 శాతంగా నమోదై, అంచనాలను మించిందని క్రిసిల్ ఆర్థికవేత్త ధర్మకృతి జోషి తెలిపారు. ద్రవ్యోల్బణం దిగిరావడంతో నామినల్ జీడీపీ లేదా ప్రస్తుత ధరల వద్ద జీడీపీ వృద్ధి మోస్తారు స్థాయిలో 8.7%గా నమోదైంది. అమెరికా సుంకాల విధింపు ప్రభావంతో 2025–26 ద్వితీయార్ధంలో వృద్ధి 6.1 శాతానికి పరిమితం కావొచ్చని జోషి అంచనా వేశారు. ''ప్రైవేటు వినియోగం వాస్తవ జీడీపీ వృద్ధికి ప్రధాన ఇంధనంగా నిలిచింది. సప్లై దృష్టి కోణంలో తయారీ, సేవల రంగాల్లో వృద్ధి గణనీయంగా పెరిగింది. దేశంలో ఆహార ద్రవ్యోల్బణం తగ్గడంతో స్వచ్ఛంద వినియోగ వ్యయం ఊపందుకుంది. మూడో క్వార్టర్‌లో ఈ అనుకూల పరిస్థితులు కలిసొస్తాయి. ప్రభుత్వ పెట్టుబడుల్లో స్థిరత్వం కొనసాగే వీలుంది. ప్రైవేటు పెట్టుబడులు ఆలస్యమైనప్పటికీ.., క్రమంగా పెరగొచ్చు'' అని జోషి అభిప్రాయపడ్డారు.



మళ్లీ ఎఫ్‌పీఐల అమ్మకాలు

నవంబర్‌లో రూ. 3,765 కోట్లు వెనక్కి

ముంబై: అక్టోబర్‌లో అమ్మకాలు ఆపి కొనుగోళ్లకు ప్రాధాన్యత ఇచ్చిన విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు(ఎఫ్‌పీఐలు) నవంబర్‌లో తిరిగి అమ్మకాలవైపు మొగ్గు చూపారు. గ్లోబల్ టెక్నాలజీ స్టాక్స్‌లో అమ్మకాలు, ఇన్వెస్టర్లు హైరిస్క్ పెట్టుబడులనుంచి వెనక్కి మళ్లడం, దేశీయంగా ప్రైమరీ మార్కెట్లకు ప్రాధాన్యత పెరగడం వంటి అంశాలు ప్రభావం చూపినట్లు విశ్లేషకులు పేర్కొన్నారు. వెరసి అక్టోబర్‌లో రూ. 14,610 కోట్లు ఇన్వెస్ట్ చేసిన ఎఫ్‌పీఐలు నవంబర్‌లో నికరంగా రూ. 3,765 కోట్ల పెట్టుబడులు వెనక్కి తీసుకున్నారు. అంతకుముందు దేశీ స్టాక్స్‌లో సెప్టెంబర్‌లో రూ. 23,885 కోట్లు, ఆగస్ట్‌లో రూ. 34,990 కోట్లు, జూలైలో రూ. 17,700 కోట్లు చొప్పున అమ్మకాలు చేపట్టిన సంగతి తెలిసిందే. కాగా.. దేశీ ఇన్వెస్టర్ల భారీ పెట్టుబడులతో గత నెల 27న అటు సెన్సెక్స్, ఇటు నిఫ్టీ సరికొత్త గరిష్టాలకు చేరుకోవడం విశేషం! క్యూ2 జీడీపీ వృద్ధిపై అంచనాలు, పటిష్ట కార్పొరేట్ ఫలితాలు ఇందుకు తోడ్పాటునిచ్చినట్లు నిపుణులు తెలియజేశారు.

మీషో ఐపీవో @ రూ. 5,421 కోట్లు

- రేపు ప్రారంభం
- లిస్టులో మరో రెండు సంస్థలు

న్యూఢిల్లీ: ఈ-కామర్స్ దిగ్గజం మీషో ప్రతిపాదిత పబ్లిక్ ఇష్యూ (ఐపీవో) రేపు (డిసెంబర్ 3న) ప్రారంభమై 5న ముగుస్తుంది. దీని ద్వారా కంపెనీ రూ. 5,421 కోట్లు సమీకరించనుంది. ఇందుకు సంబంధించి ఒక్కో షేరు ధర శ్రేణి రూ. 105–111గా ఉంటుంది. దీని ప్రకారం మీషో వేల్యుయేషన్ గరిష్టంగా రూ. 50,096 కోట్లుగా ఉంటుంది. ఇష్యూలో భాగంగా కంపెనీ రూ. 4,250 కోట్ల విలువ చేసే షేర్లను తాజాగా జారీ చేయనుండగా, ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) విధానంలో రూ. 1,171 కోట్ల విలువ చేసే 10.55 కోట్ల షేర్లను విక్రయించనుంది.

యాంకర్ ఇన్వెస్టర్లకు డిసెంబర్ 2 బిడ్డింగ్ తేదీగా ఉంటుంది. డిసెంబర్ 12న స్టాక్ మార్కెట్లో లిస్టవుతుంది. ఐపీవో ద్వారా సమీకరించిన నిధులను క్లౌడ్ మౌలిక సదుపాయాలు, మార్కెటింగ్, బ్రాండ్ ప్రచారం, వేరే సంస్థల కొనుగోళ్లు, ఇతరత్రా కార్పొరేట్ అవసరాల కోసం కంపెనీ వినియోగించుకోనుంది. వినియోగదారులు, విక్రేతలు, లాజిస్టిక్స్ భాగస్వాములు, కంటెంట్ క్రియేటర్లను అనుసంధానించే ఈ-కామర్స్ ప్లాట్‌ఫాంగా మీషో కార్యకలాపాలు సాగిస్తోంది. ప్రతి రోజు కొనుగోలుదారులకు తక్కువ ధరల్లో ఉత్పత్తులను అందించడంపై ప్రధానంగా దృష్టి పెడుతున్నట్లు కంపెనీ ఎండీ విదిత్ ఆత్రే తెలిపారు. మీషో ఈ ఏడాది జూలైలో కాన్ఫిడెన్షియల్ విధానంలో సెబీకి ముసాయిదా పత్రాలు సమర్పించగా, ఐపీవోకి అక్టోబర్‌లో అనుమతులు లభించాయి. సెప్టెంబర్‌తో ముగిసిన ఆరు నెలల వ్యవధిలో కంపెనీ ఆదాయాలు రూ. 5,577 కోట్లకు చేరాయి. అంతక్రితం ఆర్థిక సంవత్సరం ప్రథమార్ధంలో ఇది రూ. 4,311 కోట్లుగా నమోదైంది.

పబ్లిక్ ఇష్యూ సన్నాహాల్లో ఓయో

ట్రావెల్ టెక్ ప్లాట్‌ఫాం ఓయో మాతృ సంస్థ పబ్లిక్ ఇష్యూ ద్వారా రూ. 6,650 కోట్లు సమీకరించేందుకు వాటాదారుల అనుమతిని పొందడం కోసం డిసెంబర్ 20న అసాధారణ సర్వ సభ్య సమావేశాన్ని నిర్వహించనుంది. ఇందుకు సంబంధించి షేర్‌హోల్డర్లకు ఇచ్చిన సమాచారం ప్రకారం అర్హులైన షేర్‌హోల్డర్లకు ప్రతి 19 ఈక్విటీ షేర్లకు గాను 1 ఈక్విటీ షేరును బోనస్‌గా జారీ చేసే ప్రతిపాదనపై ఓటింగ్ ఉంటుంది. దీనికి డిసెంబర్ 5 రికార్డు తేదీగా ఉంటుంది. బోనస్ ఇష్యూ, ఐపీవో సంబంధిత తదుపరి నిధుల అవసరాలరీత్యా అధీకృత మూలధనాన్ని రూ. 2,431 కోట్ల నుంచి రూ. 2,491 కోట్లకు పెంచుకునే ప్రతిపాదనపైనా షేర్‌హోల్డర్లు ఓటింగ్‌లో పాల్గొంటారు.

రూ. 922 కోట్ల ఈక్వస్ ఇష్యూ

కన్జూమర్ డ్యూరబుల్ గూడ్స్, ఏరోస్పేస్ భాగాల కాంట్రాక్ట్ తయారీ సంస్థ ఈక్వస్ ఐపీవో ద్వారా రూ. 922 కోట్లు సమీకరించనుంది. ఇది కూడా డిసెంబర్ 3న ప్రారంభమై 5న ముగుస్తుంది. ఇష్యూ ప్రకారం ఒక్కో షేరు ధర శ్రేణి రూ. 118–124గా ఉంటుంది. ఐపీవోలో భాగంగా రూ. 670 కోట్ల షేర్లను తాజాగా జారీ చేయనుండగా, ఓఎఫ్ఎస్ కింద రూ. 252 కోట్ల విలువ చేసే 2.03 కోట్ల షేర్లను విక్రయించనున్నారు. రెండు అనుబంధ సంస్థలైన ఏరోస్ట్రక్చర్స్ మాన్యుఫాక్చరింగ్ ఇండియా, ఈక్వస్ కన్జూమర్ ప్రోడక్ట్స్ తీసుకున్న రుణాలను తీర్చివేసేందుకు, మెషినరీ కొనుగోలుకు, ఇతర సంస్థల కొనుగోళ్లకు ఐపీవో నిధులను కంపెనీ ఉపయోగించుకోనుంది. ఐపీవో కోసం జూన్‌లో సెబీకి దరఖాస్తు చేసుకోగా సెప్టెంబర్‌లో అనుమతులు వచ్చాయి. ప్రధానంగా ఏరోస్పేస్ విభాగంలో కార్యకలాపాలు నిర్వహిస్తున్న ఈక్వస్ ఇతరత్రా కన్జూమర్ ఎలక్ట్రానిక్స్, ప్లాస్టిక్స్, కన్జూమర్ డ్యూరబుల్స్ మొదలైన విభాగాల్లోకి కూడా విస్తరించింది. ఇన్ఫీ నారాయణ మూర్తి ఫ్యామిలీ ఆఫీస్ అయిన కాటమారన్, ఎమిక్స్ క్యాపిటల్ మొదలైనవి ఇందులో ఇన్వెస్ట్ చేశాయి. ఎయిర్‌బస్, బోయింగ్, హనీవెల్ హాస్బ్రో, వండర్‌షెఫ్‌లాంటి సంస్థలు ఈక్వస్‌కి క్లయింట్లుగా ఉన్నాయి.

అదే బాటలో విద్యా వైర్స్ ..

వైండింగ్, కండక్టివిటీ ఉత్పత్తుల తయారీ సంస్థ విద్యా వైర్స్ తమ ఐపీవోకి సంబంధించి ఒక్కో షేరు ధర శ్రేణిని రూ. 48–52గా నిర్ణయించింది. దీని ప్రకారం కంపెనీ గరిష్ట విలువ రూ. 1,100 కోట్లుగా ఉంటుంది. ఈ ఇష్యూ ద్వారా విద్యా వైర్స్ రూ. 300 కోట్లు సమీకరిస్తోంది. ఐపీవో డిసెంబర్ 3న ప్రారంభమై 5న ముగుస్తుంది. ఇష్యూలో భాగంగా రూ. 274 కోట్ల షేర్లను తాజాగా జారీ చేయనుండగా రూ. 26 కోట్ల విలువ చేసే 50.01 లక్షల షేర్లను విక్రయించనున్నారు. ఇష్యూ ద్వారా సేకరించిన నిధులను కొత్త ప్రాజెక్టులను ఏర్పాటు చేసేందుకు, రుణాల చెల్లింపునకు, కార్పొరేట్ అవసరాలకు కంపెనీ వినియోగించుకోనుంది. విద్యా వైర్స్ ప్రధానంగా పేపర్ ఇన్సులేటెడ్ కాపర్ కండక్టర్లు, స్పెషలైజ్డ్ వైండింగ్ వైర్లు, పేపర్ ఇన్సులేటెడ్ కాపర్ కండక్టర్స్ మొదలైనవి ఉత్పత్తి చేస్తోంది. డిసెంబర్ 9న స్టాక్ మార్కెట్లో కంపెనీ షేర్లు లిస్టవుతాయి.

సీఓఈకి గిల్‌...

ముంబై: మెడ గాయంతో ఆటకు దూరమైన భారత టెస్టు, వన్డే కెప్టెన్‌ శుబ్‌మన్‌ గిల్‌ తన ఫిట్‌నెస్‌ స్థాయిని పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యాడు. ఇందు కోసం సోమవారం అతను సీఓఈకి వెళ్లాడు. ఇక్కడ అతనికి ప్రొటోకాల్‌ ప్రకారం వేర్వేరు ఫిట్‌నెస్‌ పరీక్షలు జరుగుతాయి. కోల్‌కతా టెస్టులో మెడ గాయంతో తప్పుకున్న తర్వాతి గిల్‌కు చికిత్స కొనసాగుతోంది. 'అతనికి వైద్యులు ఒక ప్రత్యేకమైన ఇంజక్షన్‌ ఇచ్చి 21 రోజుల పాటు విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఈ క్రమంలో గిల్‌ రీహాబిలిటేషన్‌ కూడా మొదలైంది. అతని మెడ భాగంలో కండరాల పటిష్టతకు పలు ఎక్సర్‌సైజ్‌లు సూచించారు. స్పోర్ట్స్‌ సైన్స్‌ టీమ్‌ ఇప్పుడు వీటన్నింటినీ పరీక్షిస్తుంది. ఆ తర్వాతే ట్రైనింగ్‌ మొదలవుతుంది. అప్పుడు కూడా బ్యాటింగ్‌ సమయంలో గిల్‌ శరీరం ఎలా సహకరిస్తుందో చూడాలి' అని సీఓఈ అధికారి ఒకరు సమాచారమిచ్చారు. అయితే ఓవరాల్‌గా చూస్తే టి20 జట్టు వైస్‌ కెప్టెన్‌ దక్షిణాఫ్రికాతో ఆడే అవకాశాలు తక్కువగానే ఉన్నాయి. పటిష్టమైన టి20 బృందం ఉంది కాబట్టి ఎలాంటి సంచలనాలు లేకుండానే జట్టు ఎంపిక కూడా పూర్తి కావచ్చు.

'బాద్‌షా' తేలేది అబుదాబిలోనే

- ఖతర్‌ గ్రాండ్‌ప్రిలో వెర్‌స్టాపెన్‌ గెలుపు
- రసవత్తరంగా ఫార్ములావన్‌ టైటిల్‌ సమరం
- ముక్కోణపు పోటీలో నోరిస్‌, ఆస్కార్‌ పియాస్ట్రి

దోహా: ఒక్క ఖతర్‌ గ్రాండ్‌ప్రి ఫలితం మొత్తం ఫార్ములావన్‌ సీజన్‌ రేసునే రసవత్తరంగా మార్చింది. ఈ సర్క్యూట్‌లో రెడ్‌బుల్‌ రేసింగ్‌ డ్రైవర్‌ మ్యాక్స్‌ వెర్‌స్టాపెన్‌ గెలిచి మెక్‌లారెన్‌ టీమ్‌ మొత్తానికి వచ్చే వారం దాకా కంటిమీద కునుకును దూరం చేశాడు. ఆ జట్టు ఇద్దరు డ్రైవర్లకు మధ్య మింగుడు పడని ప్రత్యర్థిగా నిలిచాడు. అగ్రస్థానంలో ఉన్న లాండో నోరిస్‌ (408 పాయింట్లు), మూడో స్థానంలో ఉన్న ఆస్కార్‌ పియాస్ట్రి (392)ల మధ్య వెర్‌స్టాపెన్‌ (396) రెండో స్థానానికి ఎగబాకాడు. దీంతో ఇక అబుదాబిలోనే అసలైన బాద్‌షా ఎవరో తేలనుంది. 18 ఏళ్లుగా సాగిపోతున్న డ్రైవర్స్‌ చాంపియన్‌షిప్‌ లెక్కను మార్చింది. అబుదాబి గ్రాండ్‌ ప్రి విజేత ఈ సీజన్‌ విజేతగా ఆవిర్భవించనున్నాడు. దీంతో 2010 తర్వాత ఆఖరి రేసులో చాంపియన్‌షిప్‌ను తేల్చనున్న సీజన్‌గా 2025 నిలిచిపోతోంది.

రెడ్‌బుల్‌ రంకెలు...

ఖతర్‌ గ్రాండ్‌ప్రి ఫార్ములావన్‌ రేసులో రెడ్‌బుల్‌ రేసింగ్‌ డ్రైవర్‌ వెర్‌స్టాపెన్‌ కారు జోరు పెంచింది. భారత కాలమానం ప్రకారం ఆదివారం అర్ధరాత్రి ముగిసిన రేసులో డచ్‌ రేసర్‌ విజేతగా నిలిచాడు. లొసెయిల్‌ సర్క్యూట్‌లోని 57 ల్యాప్‌ల రేసును వెర్‌స్టాపెన్‌ అందరికంటే ముందుగా 1 గంటా 24 నిమిషాల 38.241 సెకన్లలో పూర్తిచేశాడు. ఈ సీజన్‌లో రెడ్‌బుల్‌ డ్రైవర్‌కిది ఏడో టైటిల్‌. తద్వారా 396 పాయింట్లతో డ్రైవర్స్‌ చాంపియన్‌షిప్‌లో రెండో స్థానంలో నిలిచాడు. అగ్రస్థానంలో కొనసాగుతున్న నోరిస్‌ (మెక్‌లారెన్‌) ఖతర్‌లో నాలుగో స్థానంతో సరిపెట్టుకోవడమే రేసును అత్యంత ఆసక్తికరంగా మార్చింది. కేవలం 12 పాయింట్లే పొందిన బ్రిటన్‌ రేసర్‌ నోరిస్‌ 408 పాయింట్లతో టాప్‌లో ఉన్నాడు. ఇతనికి వెర్‌స్టాపెన్‌కు మధ్య 12 పాయింట్లే తేడాగా ఉంది. దీంతో అబుదాబిలోనూ వెర్‌స్టాపెన్‌ రయ్‌ రయ్‌మనిపిస్తే విజేతగా నిలిచే అవకాశముంది. నోరిస్‌ సహచరుడు ఆస్కార్‌ 392 పాయింట్లతో మూడో స్థానంలో ఉన్నాడు. ఖతర్‌లో ఇతనికి రెండో స్థానం దక్కింది.

32 ఫార్ములావన్‌లో ప్రస్తుతం 75వ సీజన్‌ నడుస్తోంది. ఇందులో 32 సార్లు చివరి రేసులో ప్రపంచ చాంపియన్‌ ఎవరో తేలింది.

9 చివరిరేసులో అప్పటి వరకు 'టాప్‌' ర్యాంక్‌లో ఉన్న డ్రైవర్‌ను వెనక్కినెట్టి మరో డ్రైవర్‌ విజేతగా అవతరించడం ఇప్పటి వరకు 9 సార్లు జరిగింది. ఆఖరిసారి 2010లో సెబాస్టియన్‌ వెటెల్‌ (రెడ్‌బుల్‌) ఇలా చేశాడు.

ఇటలీ టెన్నిస్‌ దిగ్గజం పిట్రాంజెలి కన్నుమూత



రోమ్‌: ఇటలీకి చెందిన అలనాటి టెన్నిస్‌ దిగ్గజం నికోలా పిట్రాంజెలి కన్నుమూశారు. 1950, 1960 దశకాల్లో టెన్నిస్‌లో రికార్డులు నెలకొల్పిన ఆయన సోమవారం తుదిశ్వాస విడిచారు. ఆయన వయస్సు 92 ఏళ్లు. ఇటాలియన్‌ టెన్నిస్‌ సమాఖ్య (ఐటీపీఎఫ్‌) ఆయన మృతి చెందినట్లు ప్రకటించింది కానీ... మృతికి గల కారణాల్ని వెల్లడించలేదు. అంతర్జాతీయ టెన్నిస్‌ 'హాల్‌ ఆఫ్‌ ఫేమ్‌'లో చోటు దక్కించుకున్న ఏకైక ఇటాలియన్‌ టెన్నిస్‌ ప్లేయర్‌ పిట్రాంజెలి మాత్రమే! ఆయన పూర్తిపేరు నికోలా కిరిన్‌స్కి పిట్రాంజెలి. 11 సెప్టెంబర్‌, 1933లో అప్పటి ఫ్రెంచ్‌ కాలనీగా పిలువబడే ట్యూనిస్‌లో జన్మించారు. ఆయన తండ్రి ఇటాలియన్‌ అయితే... తల్లి రష్యన్‌! ఆల్‌ టైమ్‌ గ్రేటెస్ట్‌ ఇటాలియన్‌ ప్లేయర్‌గా చరిత్రకెక్కిన నికోలా పేరిట 2006లో ఫారో ఇటాలికో స్టేడియాన్ని 'పిట్రాంజెలీ స్టేడియా'గా మార్చారు. ఇక్కడే యేటా ఇటాలియన్‌ ఓపెన్‌ జరుగుతుంది. 1957, 1961లలో పిట్రాంజెలి ఇటాలియన్‌ ఓపెన్‌ టైటిళ్లు గెలిచారు.

ఆయన ఘనతలివి...

ఒక గ్రాండ్‌స్లామ్‌ టెన్నిస్‌ టోర్నీ గెలిచిన తొలి ఇటలీ ప్లేయర్‌ పిట్రాంజెలి. 1959లో ఫ్రెంచ్‌ ఓపెన్‌ ట్రోఫీతో ఈ ఘనతకెక్కారు. మరుసటి ఏడాది ఈ టైటిల్‌ను నిలబెట్టుకున్నారు. ఇలా ఇటలీ ప్లేయర్‌ వరుస టైటిళ్ల రికార్డు దశాబ్దాల తరబడి చెక్కుచెదరలేదు. ప్రస్తుత ప్రపంచ రెండో ర్యాంకర్‌ యానిక్‌ సినెర్‌ ఆస్ట్రేలియన్‌ ఓపెన్‌ (2024, 2025) గెలుపొందడంతో అది కూడా ఈ ఏడాదే దిగ్గజం సరసన నిలిచాడు. పిట్రాంజెలి ఫ్రెంచ్‌ ఓపెన్‌లో (1961, 1964లలో) రెండు సార్లు రన్నరప్‌గా నిలిచారు. ఫ్రెంచ్‌ ఓపెన్‌ సింగిల్స్‌ గ్రాండ్‌స్లామ్‌ గెలిచిన 1959లోనే సహచరుడు ఒర్లాండో సిరోలాతో కలిసి పురుషుల డబుల్స్‌ కూడా సాధించారు. 1957లో ఆస్ట్రేలియన్‌ ఓపెన్‌లో క్వార్టర్స్‌ చేరిన నికోలా, 1960లో వింబుల్డన్‌లో సెమీస్‌ చేరారు.

'డేవిస్‌' కింగ్‌

వ్యక్తిగతంగా రెండు వరుస గ్రాండ్‌స్లామ్‌లు గెలిచిన నికోలా పిట్రాంజెలి దేశం తరపున ఆడే సుప్రసిద్ధ 'డేవిస్‌ కప్‌'లో కింగ్‌ అని చెప్పొచ్చు. ఇటలీ ఆడిన 66 డేవిస్‌ కప్‌ 'టై'లలో పాల్గొనడం విశేషం. ఇందులో సింగిల్స్‌, డబుల్స్‌ కలిపి మొత్తం 164 మ్యాచ్‌లాడారు. సింగిల్స్‌లో గెలుపోటముల రికార్డు 78–32 కాగా, డబుల్స్‌ రికార్డు 42–12 అద్భుతంగా ఉంది. ఒర్లాండో సిరోలాతో ఆయనది విజయవంతమైన జోడీ! డబుల్స్‌లో నెగ్గిన 42 మ్యాచ్‌ల్లో 34 సిరోలాతో కలిసి ఆడినవే! రెండుసార్లు ఇటలీని ఫైనల్‌కు తీసుకెళ్లిన పిట్రాంజెలి రన్నరప్‌తోనే సరిపెట్టుకున్నారు. ఈ రెండుసార్లు కూడా తుదిపోరులో ఆస్ట్రేలియా చేతిలోనే ఇటలీ ఓడింది. ఎట్టకేలకు కెప్టెన్‌గా (నాన్‌ప్లేయింగ్‌) 1976లో ఇటలీ డేవిస్‌ కప్‌ సాధించింది. అప్పుడు పిట్రాంజెలి హెడ్‌ కోచ్‌గా జట్టును నడిపించారు. ఆ తర్వాత సినెర్‌ వచ్చాకే 2023, 2024, 2025లలో ఇటలీ 'డేవిస్‌ కప్‌' గెలిచింది.

చాంప్స్‌ ప్రణవ్‌, నాగేశ్వరి

సాక్షి, హైదరాబాద్‌: తెలంగాణ రాష్ట్ర ర్యాంకింగ్‌ చెస్‌ టోర్నమెంట్‌లో అండర్‌–15 బాలురు విభాగంలో సూసర్ల ప్రణవ్‌, బాలికల విభాగంలో కె.నాగేశ్వరి విజేతలుగా నిలిచారు. హైదరాబాద్‌లోని లాల్‌బహదూర్‌ స్టేడియంలో జరిగిన ఈ టోర్నీలో నిర్ణీత ఐదు రౌండ్ల తర్వాత ప్రణవ్‌ ఐదు పాయింట్లు, నాగేశ్వరి నాలుగు పాయింట్లు స్కోరు చేశారు. అంతర్జాతీయ అర్బిటర్లు చంద్రమౌళి, శ్రీరామ్‌ విజేతలకు బహుమతులు అందజేశారు. వివిధ వయో విభాగాల విజేతల వివరాలు ఇలా ఉన్నాయి.

ఫలితాలు

అండర్‌–15 బాలురు: 1. సూసర్ల ప్రణవ్‌, 2. పడాల రిత్విక్‌, 3. సాగర్‌ సింగ్‌. **బాలికలు:** 1. కె.నాగేశ్వరి, 2. నలమోలు చర్విశ్రీ, 3. బి.అమృత.

అండర్‌–13 బాలురు: 1. ఊర్ల కెనిత్‌, 2. అక్షత్‌, 3. అద్భుత్‌ పాడి. **బాలికలు:** 1. అర్థం ప్రహ్నవి, 2. మాన్యశ్రీ గరిమెళ్ల లక్ష్మి, 3. సూర్యదేవర సునిష్క.

అండర్‌–11 బాలురు: 1. ఇషాన్‌ కుట్ల, 2. వుప్పాల జతిన్‌సాయి, 3. కనకమేడల పరమేశ్వర్‌. **బాలికలు:** 1. పోకూరి హన్మయి, 2. గిజ్జారి శాన్విక, 3. ఏడుకుళ్ల రిషిత.

అండర్‌–9 బాలురు: 1. భాస్వత సాహా, 2. కె.అర్జున్‌, 3. నక్కా శ్రీయాన్‌. **బాలికల:** 1. దన్నె మౌక్తికరామ్‌, 2. గడిపెల్లి అద్వైత, 3. చేతమోని ఆరాధ్యశ్రీ.

అండర్‌–7 బాలురు: 1. ఆరవ్‌ కుమార్‌, 2. చెరుకూరి అయాన్ష్‌, 3. ముంగి గ్రాహిత్‌ వివాన్‌. **బాలికలు:** 1. రినాయార వర్మ, 2. గంగుల నియారా, 3. చెబ్రోలు అభిజ్ఞ.

భారత ఫుట్‌బాల్‌పై రేపు కీలక సమావేశం

హాజరు కానున్న కేంద్ర క్రీడా మంత్రి

న్యూఢిల్లీ: అంతర్జాతీయ స్థాయిలో కనీస స్థాయి ప్రదర్శన లేక వరుస పరాజయాలతో పతనమవుతున్న భారత్‌ ఫుట్‌బాల్‌ జట్టు భవిష్యత్తుకు సంబంధించి బుధవారం కీలక సమావేశం జరగనుంది. దేశంలో ఫుట్‌బాల్‌తో సంబంధం ఉన్న వేర్వేరు సంఘాలు, కార్పొరేట్‌ సంస్థలు, భాగస్వాములు తదితరులతో కేంద్ర క్రీడా శాఖ మంత్రి మన్‌సుఖ్‌ మాండవియా భేటీ అవుతారు. ప్రస్తుత జాతీయ జట్టు పరిస్థితిని చక్కదిద్దడంతో పాటు ఇండియన్‌ సూపర్‌ లీగ్‌ (ఐఎస్‌ఎల్‌) నిర్వహణ ప్రధాన అజెండాగా ఈ సమావేశం సాగుతుంది. అఖిల భారత ఫుట్‌బాల్‌ సమాఖ్య (ఏఐఎఫ్‌ఎఫ్‌)తో జత కట్టి ఐఎస్‌ఎల్‌ నిర్వహించేందుకు కొత్త భాగస్వామి ఎవరూ లభించకపోవడంతో తాజా పరిస్థితి తలెత్తింది. ఇప్పటి వరకు ఐఎస్‌ఎల్‌ నిర్వహించిన ఫుట్‌బాల్‌ స్పోర్ట్స్‌ డెవలప్‌మెంట్‌ లిమిటెడ్‌ (ఎఫ్‌ఎస్‌డీఎల్‌)తో కొత్త కాంట్రాక్ట్‌ పునరుద్ధరించునే విషయంలో తలెత్తిన వివాదం కారణంగా గత కొంత కాలంగా అంతా డోలాయమానంగా మారింది. ఎఫ్‌ఎస్‌డీఎల్‌ ప్రతినిధులతో పాటు ఐఎస్‌ఎల్‌ క్లబ్‌లు, ఐ–లీగ్‌ క్లబ్‌లు, ప్రసారకర్తలు, ఓటీటీ ప్రతినిధులు, స్పాన్సరర్లతో రేపు ఆరు వేర్వేరు సమావేశాలు జరుగుతాయి. మంత్రి మన్‌సుఖ్‌ మాండవియా అన్ని వైపులనుంచి సూచనలు, సలహాలు, అభ్యర్థనలు తెలుసుకొని తదనంతరం సరైన పరిష్కారం కోసం ప్రయత్నించాలని భావిస్తున్నారు.

'గురి'పెట్టేందుకు పోటెత్తారు!

- జాతీయ షూటింగ్‌ చాంపియన్‌షిప్‌కు రికార్డుస్థాయిలో హాజరు
- అన్ని విభాగాల్లో కలిపి 16 వేలకుపైగా ఎంట్రీలు

న్యూఢిల్లీ: జాతీయ షూటింగ్‌ చాంపియన్‌షిప్‌లో పోటీపడేందుకు రికార్డు స్థాయిలో షూటర్లు పోటెత్తారు. సోమవారం ఈ ఈవెంట్‌ మొదలవగా... పిస్టల్‌, రైఫిల్‌, షాట్‌గన్‌ విభాగాల్లో లక్ష్యంపై గురిపెట్టేందుకు సుమారు 16వేల పైచిలుకు షూటర్లు అర్హత సాధించారు. గతంలో ఈ ఈవెంట్‌లో 13,500 పైచిలుకు షూటర్లు పాల్గొన్న రికార్డు ఉండగా... ఇప్పుడది తెరమరుగైంది. అయితే సోమవారం ఇక్కడి కర్ణి సింగ్‌ షూటింగ్‌ రేంజ్‌లో కేవలం షాట్‌గన్‌ పోటీలు మాత్రమే మొదలయ్యాయి. పిస్టల్‌, రైఫిల్‌ ఈవెంట్ల పోటీలు ఢిల్లీ, భోపాల్‌లలో ఈ నెల 11 నుంచి జరుగుతాయని నిర్వాహకులు వెల్లడించారు. వచ్చేనెల వరకు సుదీర్ఘంగా జరగనున్న ఈ పోటీలను ఏడు కేటగిరీల్లో నిర్వహిస్తున్నారు. 70 ఏళ్లు పైబడిన వారు 'సూపర్‌ మాస్టర్స్‌', 60 నుంచి 70 ఏళ్ల వారు 'సీనియర్‌ మాస్టర్స్‌', 45 నుంచి 60 ఏళ్ల వారు 'మాస్టర్స్‌', ఓపెన్‌ వారికి 'సీనియర్స్‌', 21 ఏళ్ల లోపు వారు 'జూనియర్స్‌', 19 ఏళ్ల లోపు వారు 'యూత్‌', 16 ఏళ్ల లోపు వారికి 'సబ్‌–యూత్‌' విభాగాల్లో పోటీలు జరుగుతాయి. ఈ ఏడాది జరిగిన ఎస్‌ఎస్‌సీసీ (నేషనల్స్‌), జోనల్‌ చాంపియన్‌షిప్‌, జీవీ మావ్లాంకర్‌ చాంపియన్‌షిప్‌, ఇండియా ఓపెన్‌, ఆలిండియా కుమార్‌ సురేంద్ర సింగ్‌ చాంపియన్‌షిప్‌లో సాధించిన క్వాలిఫయింగ్‌ మార్క్‌ (స్కోర్ల) ద్వారా ప్రస్తుత ఈవెంట్‌కు అర్హత పొందారని... రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలన్నీ కలిపి మొత్తం 40 జట్లు ఈ పోటీల్లో పాల్గొంటున్నాయని జాతీయ రైఫిల్‌ సంఘం (ఎన్‌ఆర్‌ఏఐ) ఒక ప్రకటనలో తెలిపింది.

సింగిల్స్‌ విజేతలు వరుణ్‌, వరుణి

తెలంగాణ రాష్ట్ర టీటీ చాంపియన్‌షిప్‌

సాక్షి, హైదరాబాద్‌: 'స్టాగ్‌' తెలంగాణ రాష్ట్ర, అంతరా జిల్లా టేబుల్‌ టెన్నిస్‌ (టీటీ) చాంపియన్‌షిప్‌లో పురుషుల సింగిల్స్‌ విభాగంలో వరుణ్‌ శంకర్‌... మహిళల సింగిల్స్‌ విభాగంలో వరుణి జైస్వాల్‌ విజేతలుగా అవతరించారు. తెలంగాణ టేబుల్‌ టెన్నిస్‌ సంఘం (టీఎస్‌టీటీఏ) ఆధ్వర్యంలో మొయినాబాద్‌లోని ఫైర్‌ఫాక్స్‌ స్పోర్ట్స్‌ రిసార్ట్స్‌లో ఈ టోర్నీ జరిగింది. పురుషుల సింగిల్స్‌ ఫైనల్లో సోమ్‌నాథ్‌ ఘోష్‌ టేబుల్‌ టెన్నిస్‌ అకాడమీ (ఎస్‌జీయూటీటీఏ)కి చెందిన వరుణ్‌ శంకర్‌ 11–7, 6–11, 12–10, 13–11, 11–6, 11–9తో అదే అకాడమీకి చెందిన సంతోష్‌ కుమార్‌ను ఓడించాడు. మహిళల సింగిల్స్‌ ఫైనల్లో గుజరాతి సేవా మండల్‌ (జీఎస్‌ఎం)కు చెందిన వరుణి జైస్వాల్‌ 11–5, 4–11, 11–6, 12–10, 11–6తో అదే అకాడమీకి చెందిన శ్రేష్టా రెడ్డిపై విజయం సాధించింది. అండర్‌–13 బాలుర సింగిల్స్‌ విభాగంలో వేదాంశ్‌ (ఓఎంజీఎస్‌), బాలికల సింగిల్స్‌ విభాగంలో బీవీ మహిమ కృష్ణ (ఆనంద్‌నగర్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌) టైటిల్స్‌ సాధించారు. ఫైనల్లో వేదాంశ్‌ 11–4, 7–11, 7–11, 11–9, 11–9తో అద్విక్‌ శివ (పీపీటీఏ)పై, మహిమ కృష్ణ 6–11, 7–11, 11–4, 11–7, 11–7తో అవంతిక (ఎస్‌పీఏఆర్‌ఎస్‌)పై గెలిచారు. అండర్‌–15 బాలుర సింగిల్స్‌ విభాగంలో యశస్విన్‌ (ఆనంద్‌నగర్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌), బాలికల సింగిల్స్‌ విభాగంలో శ్రీశాన్వి (ఎస్‌పీఏఆర్‌ఎస్‌) చాంపియన్స్‌గా నిలిచారు. ఫైనల్స్‌లో యశస్విన్‌ 11–4, 8–11, 11–7, 11–5తో హర్షిత్‌ (ఎస్‌జీయూటీటీఏ)పై, శ్రీశాన్వి 15–13, 12–10, 11–5తో వైష్ణవి (ఆనంద్‌నగర్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌)పై విజయం సాధించారు. అండర్‌–17 బాలుర సింగిల్స్‌ విభాగంలో దేవాంశ్‌ సింగ్‌ (లిటిల్‌ఫ్లవర్‌ హైస్కూల్‌, ఆబిడ్స్‌), బాలికల విభాగంలో శ్రీశాన్వి (ఎస్‌పీఏఆర్‌ఎస్‌) టైటిల్స్‌ హస్తగతం చేసుకున్నారు. ఫైనల్స్‌లో దేవాంశ్‌ సింగ్‌ 9–11, 11–5, 11–8, 3–11, 11–7తో ధర్మతేజ (లిటిల్‌ఫ్లవర్‌ హైస్కూల్‌, ఆబిడ్స్‌)పై, శ్రీశాన్వి 9–11, 11–5, 8–11, 11–9, 11–2తో గాయత్రి కృష్ణ (జీఎస్‌ఎం)పై గెలుపొందారు. అండర్‌–19 బాలుర సింగిల్స్‌ విభాగంలో ఆరుష్‌ రెడ్డి (ఎస్‌జీయూటీటీఏ), బాలికల విభాగంలో శ్రేష్ట (జీఎస్‌ఎం) టైటిల్స్‌ దక్కించుకున్నారు. ఫైనల్స్‌లో ఆరుష్‌ రెడ్డి 11–8, 11–9, 7–11, 11–9, 11–7తో శౌర్య రాజ్‌ (ఏవీఎస్‌సీ)పై, శ్రేష్ట 11–8, 7–11, 11–7, 11–6, 14–12తో అనియా ఆనంద్‌ (లిటిల్‌ ఫ్లవర్‌ హైస్కూల్‌, ఆబిడ్స్‌)పై విజయం సాధించారు. ఫైర్‌ఫాక్స్‌ స్పోర్ట్స్‌ రిసార్ట్స్‌ డైరెక్టర్‌ విజయ్‌ కుమార్‌ రాజు ముఖ్య అతిథిగా విచ్చేసి విజేతలకు ట్రోఫీలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌టీటీఏ సెక్రటరీ నాగేందర్‌ రెడ్డి, సీనియర్‌ ఉపాధ్యక్షుడు అమ్రుల్లా దస్తాని, ఉపాధ్యక్షుడు విజయ్‌ కుమార్‌, కోచ్‌లు కొరిడె శ్రీధర్‌, వేణుగోపాల్‌ తదితరులు పాల్గొన్నారు.

హాంకాంగ్‌లో వాంగ్ ఫుక్ కోర్టు అపార్టుమెంట్ సముదాయంలో బుధవారం సంభవించిన ఘోర అగ్ని ప్రమాదంలో చనిపోయిన పెద్దల కోసం పుష్పగుచ్ఛాలు, పిల్లల కోసం బొమ్మలు నివాళిగా ఉంచిన స్థానికులు

సెంట్రల్ లండన్‌లోని ఓ నర్సరీని బ్రిటన్ ప్రధాన మంత్రి కీర్ స్టార్మర్ సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన అమేలియా అనే మూడేళ్ల చిన్నారితో మాట్లాడారు.

నాగాలాండ్‌లోని దిమాపూర్ జిల్లా ఖిలిక్షు గ్రామంలో క్రిస్మస్ వేడుకల సన్నాహాల్లో భాగంగా అలంకరణ కోసం ఏర్పాటు చేసిన విద్యుద్దీపాలు

ఆయుధ విక్రయాలు పైపైకే!

టాప్-100 కంపెనీలకు లాభాల పంట

- ఏకంగా 679 బిలియన్ డాలర్ల ఆదాయం
- జాబితాలో మూడు భారత కంపెనీలు
- హెచ్‌ఏఎల్, బీఈ, ఎండీఎస్‌కు స్థానం
- వాటి ఆదాయం రూ.67 వేల కోట్లు
- ఎడాపెడా యుద్ధాలే ప్రధాన కారణం

స్టాక్‌హోం: 2024లో ప్రపంచవ్యాప్తంగా ఆయుధ కంపెనీల పంట పండింది. ఉక్రెయిన్ మొదలుకుని గాజా దాకా నిర్నిరోధంగా సాగుతున్న యుద్ధాలే ఇందుకు ప్రధాన కారణం. ప్రపంచంలోని టాప్-100 ఆయుధ కంపెనీల ఆదాయంలో గతేడాది 5.9 శాతం మేరకు నికర పెరుగుదల నమోదైంది. స్టాక్‌హోం అంతర్జాతీయ శాంతి పరిశోధన సంస్థ (ఎస్ఐపీఆర్ఐ-సిప్రీ) సోమవారం విడుదల చేసిన తాజా గణాంకాల్లో ఈ మేరకు పేర్కొంది. ''వాటి ఉమ్మడి ఆదాయం ఏకంగా 679 బిలియన్ డాలర్లుగా నమోదైంది. ఉక్రెయిన్, గాజా యుద్ధాలు, ప్రపంచవ్యాప్తంగా పలుచోట్ల ప్రాంతీయ ఉద్రిక్తలు పెచ్చరిల్లుతుండటం, దేశాలు పోటాపోటీగా ఆయుధ కొనుగోళ్లకు దిగుతుండటం, సైనిక వ్యయాన్ని ఎన్నడూ లేని స్థాయిలో అమాంతంగా పెంచేయడం దీనికి ప్రధాన కారణాలు''అని ఒక ప్రకటనలో తెలిపింది. ఈ టాప్-100లో మూడు భారత కంపెనీలుండటం విశేషం. హిందూస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) 44వ స్థానంలో, భారత్ ఎలక్ట్రానిక్స్ (బీఈ) 58, మడగావ్ డాక్ షిప్‌బిల్డర్స్ (ఎండీఎస్) 91వ స్థానంలో నిలిచాయి. వాటి ఉమ్మడి ఆదాయం 8.2 శాతం పెరిగి ఏకంగా రూ.67 వేల కోట్లు (750 కోట్ల డాలర్లు) దాటేసింది!

ఏడేళ్లలో తొలిసారి

ముఖ్యంగా ప్రపంచంలోని టాప్-5 ఆయుధ కంపెనీలు లాక్‌హీడ్ మార్టిన్ (అమెరికా), ఆర్‌టీఎక్స్ (అమెరికా), నార్త్‌రాప్ గ్రూమన్ కార్పొరేషన్ (అమెరికా), బీఏఈ సిస్టమ్స్ (బ్రిటన్), జనరల్ డైనమిక్స్ కార్పొరేషన్ (అమెరికా) అన్నింటి ఆదాయమూ గతేడాది పెరుగుదల నమోదు చేసింది. ఇలా జరగడం గత ఏడేళ్లలో ఇదే తొలిసారి కావడం విశేషం! ఒక్క అమెరికా కంపెనీల ఆదాయం 3.8 శాతం పెరిగి 334 బిలియన్ డాలర్లుగా నమోదైంది. జాబితాలోని 39 కంపెనీలకు గాను 30 కంపెనీలు ఆదాయాన్ని భారీగా పెంచేసుకున్నాయి. ''అమెరికా, యూరప్ అని మాత్రమే కాకుండా ప్రపంచమంతటా ఆయుధ విక్రయాలు పైపైకి దూసుకెళ్లాయి. ఒక్క ఆసియా-ఓషియానా ప్రాంతంలో మాత్రమే ఇందుకు ఏకైక మినహాయింపు. అక్కడ కూడా చైనా అంతర్గత సమస్యలే అందుకు దారితీశాయి''అని సిప్రి నివేదిక పేర్కొంది. అమెరికా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన అత్యాధునిక ఎఫ్-35 యుద్ధ విమాన ప్రాజెక్టు తదితరాలపై నెలకొన్న అయోమయం అక్కడి ప్రధాన ఆయుధ కంపెనీల్లో భవిష్యత్తు పట్ల అనిశ్చితికి దారి తీస్తోంది''అని సిప్రీ నివేదిక వివరించింది. టాప్-100లో యూరప్ నుంచి 26 కంపెనీలున్నాయి. వాటిలో 23 ఆదాయంలో భారీ పెరుగుదలను చవిచూశాయి. ''వాటి ఉమ్మడి ఆదాయం ఏకంగా 13 శాతం పెరిగి 151 బిలియన్ డాలర్ మార్కును దాటేసింది. ఉక్రెయిన్ యుద్ధం, ఆ దెబ్బకు రష్యా నుంచి తమకూ ముప్పు తప్పదేమోనని యూరప్ దేశాలు భారీగా ఆయుధ కొనుగోళ్లకు దిగడమే ఇందుకు కారణం'అని నివేదిక తెలిపింది.

రెండు రష్యా కంపెనీలు

టాప్-100 జాబితాలో రెండు రష్యా కంపెనీలు కూడా ఉండటం విశేషం. అవి రోస్టెక్, యునైటెడ్ షిప్ బిల్డింగ్ కార్పొరేషన్. వాటి ఉమ్మడి ఆదాయం 23 శాతం పెరిగి 31.2 బిలియన్ డాలర్లుగా నమోదైంది. అంతర్జాతీయంగా అగ్ర దేశాలన్నీ ఎడాపెడా నిషేధాలు, ఆంక్షలు విధించినా ఈ పరిణామం చోటుచేసుకోవడం విశేషమే. దేశీయ డిమాండే ఇందుకు కారణమని సిప్రీ వెల్లడించింది. టాప్-100లో మధ్యప్రాచ్యం నుంచి తొలిసారి 9 కంపెనీలు స్థానం దక్కించుకున్నాయి. అవన్నీ కలిసి 31 బిలియన్ డాలర్లు ఆర్జించాయి. 2023తో పోలిస్తే ఇది ఏకంగా 14 శాతం పెరుగుదల. ఇక టాప్-100లో చోటు దక్కిన మూడు ఇజ్రాయెల్ కంపెనీల ఉమ్మడి ఆదాయం 16 శాతం పెరిగి 16.2 బిలియన్ డాలర్లుగా తేలింది. అమెరికాకు చెందిన స్పేస్ ఎక్స్ కంపెనీ కూడా తొలిసారిగా ఈ జాబితాలో చేరింది. 2023తో పోలిస్తే దాని ఆదాయం రెట్టింపుకు పైగా పెరిగి 180 కోట్ల డాలర్లుగా నమోదైంది.

వాయు కాలుష్యంపై నిత్య సమీక్ష అవసరం

- శీతాకాలంలో మాత్రమే పట్టించుకోవడం కాదు
- సుప్రీంకోర్టు వ్యాఖ్యలు

న్యూఢిల్లీ: ఢిల్లీ– దేశ రాజధాని ప్రాంతం(ఎన్‌సీఆర్)పరిధిలో వాయు కాలుష్యం బెడద తీవ్ర రూపం దాల్చడంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. ఎంతో ముఖ్యమైన ఈ అంశంపై శీతాకాలంలో మాత్రమే నామమాత్రంగా విచారణ జరపడం కాకుండా, రోజువారీ సమీక్ష చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉందని స్పష్టం చేసింది. నెలలో రెండు పర్యాయాలు ఈ అంశంపై విచారణ చేపట్టి, స్వల్ప, దీర్ఘకాల ప్రాతిపదికన చేపట్టాల్సిన చర్యలపై ఆదేశాలు జారీ చేస్తామంది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చిల ధర్మాసనం సోమవారం ఈ అంశంపై విచారణ చేపట్టింది. పంటవ్యర్థాల దహనం అనవసరంగా రాజకీయ అంశంగానో ఇగోకు సంబంధించిన అంశంగానో మారరాదని పేర్కొంది. ఇందుకు ఎన్నో కారణాలున్నాయని తెలిపింది. సమస్య పరిష్కారానికి తక్షణం, దీర్ఘకాలంలో తీసుకోవాల్సిన చర్యలను సూచించాలంటూ కేంద్రానికి నోటీసులు పంపింది. తదుపరి విచారణను ఈ నెల 10వ తేదీకి వాయిదా వేసింది.

ఆ మహిళను దేశంలోకి రానివ్వండి: సుప్రీం

న్యూఢిల్లీ: ఈ ఏడాది ఆరంభంలో అక్రమంగా ఉంటున్నారంటూ ఓ గర్భిణీని, ఆమె సంతానాన్ని ఢిల్లీ అధికారులు బంగ్లాదేశ్‌లోకి పంపించిన విషయమై సుప్రీంకోర్టు స్పందించింది. మానవతా దృక్పథంతో ఆ మహిళను దేశంలోకి రానివ్వాలని, ఆమెపై నిఘా కొనసాగించాలని సూచించింది. బాధిత మహిళ సోనాలి ఖాతూన్ తండ్రి బోధు షేక్ వేసిన పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చిల ధర్మాసనం ఈ మేరకు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను ఆదేశించింది. స్పందించిన మెహతా..ఇందుకు సంబంధించిన ఆదేశాల జారీకి రెండు రోజుల సమయం ఇవ్వాలని కోరారు. ఆమె నిండు గర్భిణీ అయినందున బెంగాల్‌లోని మాల్దా మీదుగా బంగ్లాదేశ్ నుంచి రప్పించేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలని ధర్మాసనం కోరింది. తదుపరి విచారణను బుధవారానికి వాయిదా వేసింది. ఆలోగా అధికారులకు ఆదేశాలివ్వాలని తుషార్ మెహతాను ఆదేశించింది.

కార్ల కొనుగోలుపై దివ్యాంగులకు జీఎస్‌టీ రాయితీ

కేంద్రం సమాధానం కోరిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: దివ్యాంగులు కొనుగోలు చేసే కార్లపై జీఎస్టీ రాయితీ కల్పించాలంటూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు సోమవారం కేంద్రం, తదితరుల సమాధానం కోరింది. వందశాతం దివ్యాంగుడైన ఓ వ్యక్తి దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసం విచారణ చేపట్టింది. రైట్స్ ఆఫ్ పర్సన్స్ విత్ డిజబిలిటీస్ చట్టం–2016లోని సెక్షన్ 41 ప్రకారం దివ్యాంగులైన అందరికీ జీఎస్టీ తగ్గింపు నిబంధనలను వర్తింప జేయాలని పిటిషనర్ కోరారు. దీనిపై వివిధ హైకోర్టులు రకరకాలుగా తీర్పులిచ్చాయని పేర్కొన్నారు. దీనిపై స్పందించిన ధర్మాసనం నాలుగు వారాల్లోగా బదులివ్వాలని కేంద్రంతోపాటు జీఎస్టీ కౌన్సిల్‌కు నోటీసులు పంపించింది.

పాఠ్యాంశంగా భగవద్గీత

కేంద్రంతో చర్చిస్తా: కుమారస్వామి

శివమొగ్గ: పాఠ్యాంశాల్లో భగవద్గీతను చేర్చే అంశంపై కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో చర్చిస్తానని కేంద్ర మంత్రి హెచ్‌డీ కుమారస్వామి హామీ ఇచ్చారు. ఆదివారం ఇక్కడ జరిగిన శ్రీ భగవద్గీత అభియాన్ కార్యక్రమంలో భగవద్గీతను పాఠశాల పాఠ్యాంశాల్లో చేర్చాలని బీజేపీ నాయకుడు కె.ఎస్.ఈశ్వరప్ప చేసిన అభ్యర్థనకు ప్రతిస్పందనగా కుమారస్వామి ఈ వ్యాఖ్యలు చేశారని ఆయన కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఒక్క పాఠశాల స్థాయిలోనే కాదు.. కళాశాలల్లో, విశ్వవిద్యాల స్థాయిలోనూ గీత బోధను తప్పనిసరి చేసే విషయాన్ని కేంద్రం దృష్టికి తీసుకెళ్తానని మంత్రి చెప్పారని ప్రకటన పేర్కొంది. అంతేకాదు.. పాఠశాల స్థాయిలో రామాయణం, మహాభారతాలను బోధించాలని కూడా ఆయన సూచించారని వెల్లడించింది. సమాజంలో హింస, అశాంతిని తొలగించడానికి ఇతిహాసాలను బోధించడం అవసరమన్నారు. ఉడిపిలో జరిగిన ఒక కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇటీవల భగవద్గీత పారాయణం చేసిన విషయాన్ని ప్రస్తావించారు. పిల్లలకు చిన్నతనం నుంచే భగవద్గీతను నేర్పించాలని, రామాయణం, మహాభారతాల గురించి చెప్పాలని ఉద్ఘాటించారు.

ఏడాదిలో 10వేల మంది బంగ్లా చొరబాటుదారుల అరెస్ట్ : బీఎస్ఎఫ్

కోల్‌కత్తా: అక్రమంగా సరిహద్దు దాటేందుకు ప్రయత్నించిన 10వేల మందికి పైగా బంగ్లాదేశీయులను అరెస్టు చేసినట్లు బీఎస్ఎఫ్ సోమవారం తెలిపింది. ఈ ఏడాది కాలంలో 10,263 మంది బంగ్లాదేశీయులు సరిహద్దు గుండా చొరబడటానికి ప్రయత్నించారని, సున్నితమైన ఇండో–బంగ్లా సరిహద్దులో నిఘా పెంచడం వల్లే ఇది సాధ్యమైందని ఒక ప్రకటనలో తెలిపింది. బీఎస్ఎఫ్ ఏర్పడి ఆరు దశాబ్దాలు పూర్తి చేసుకున్న సందర్భంగా తూర్పు కమాండ్ 61వ వ్యవస్థాపక దినోత్సవాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా అన్ని ర్యాంకుల సిబ్బందికి, వారి కుటుంబాలకు శుభాకాంక్షలు తెలిపింది. విధి నిర్వహణలో ఇదే నిబద్ధతను కొనసాగించాలని బీఎస్ఎఫ్ కోరింది. ముఖ్యంగా బంగ్లాదేశ్‌లో ఘర్షణల సమయంలో బంగ్లాదేశీయులు భారత్‌లోకి ప్రవేశించకుండా ఉండేందుకు బీఎస్ఎఫ్ దళాలు ప్రత్యేక చర్యలు తీసుకున్నాయని తెలిపింది. అంతేకాదు.. గతేడాది కాలంలో సరిహద్దులో రూ.376.52 కోట్ల విలువైన మాదకద్రవ్యాలు, రూ.170.57 కోట్ల విలువైన నిషేధిత వస్తువులు, రూ.67.42 కోట్ల విలువైన 51.389 కిలోల బంగారం స్వాధీనం చేసుకున్నట్లు కూడా వెల్లడించింది.

మరో కేసులో హసీనాకు ఐదేళ్ల జైలు

ఢాకా: బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాకు జైలు శిక్షల పర్వం కొనసాగుతోంది. మరో భూ కుంభకోణం కేసులో ఆమెకు ఐదేళ్ల జైలు శిక్ష, ఆమె సోదరి షేక్ రెహానాకు ఏడేళ్ల జైలు శిక్ష, రెహానా కూతురు, బ్రిటిష్ ఎంపీ తులిప్ రిజ్వానా సిద్ధిక్‌కు రెండేళ్ల జైలు శిక్ష విధిస్తూ ఢాకాలోని అవినీతి నిరోధక ప్రత్యేక న్యాయస్థానం కోర్టు తీర్పు ఇచ్చింది. భూకేటాయింపుల వ్యవహారంలో అధికార దుర్వినియోగం జరిగిందని, ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లిందని పేర్కొంది. ఈ నేపథ్యంలో 17 మందిపై కేసు నమోదైంది. మిగిలిన 14 మంది నిందితులకు ఒక్కొక్కరికి ఐదేళ్ల జైలు శిక్ష విధించింది. అంతేకాదు.. 17 మంది జరిమానాగా లక్ష రూపాయలు చెల్లించాలని, లేని పక్షంలో ఒక్కొక్కరు మరో ఆరు నెలలపాటు అదనంగా శిక్ష అనుభవించాల్సి ఉంటుందని పేర్కొంది. కేసు తీర్పు సందర్భంగా ముగ్గురు నిందితుల్లో ఏ ఒక్కరూ కోర్టు గదిలో లేకపోవడం గమనార్హం. అవినీతి నిరోధక శాఖ దాఖలు చేసిన అవినీతి కేసుల్లో 78 ఏళ్ల హసీనాకు సంబంధించిన నాల్గో తీర్పు ఇది.

తాజా చర్చలు టర్నింగ్ పాయింట్

ఉక్రెయిన్‌లో శాంతి స్థాపనపై ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ వ్యాఖ్య

వాషింగ్టన్/పారిస్: అధ్యక్షుడు ట్రంప్ ప్రతిపాదిత 28 సూత్రాల శాంతి ప్రతిపాదనపై ఫ్లోరిడాలో చర్చలు ఫలప్రదంగా సాగుతున్నాయని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రుబియో ప్రకటించారు. రష్యాకు అనుకూలంగా ఉన్న కొన్ని అంశాలను మార్చుతూ తాజాగా ప్రతిపాదనలను సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. మరో వైపు, సోమవారం పారిస్‌కు చేరుకున్న ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీతో ఫ్రాన్స్ అధ్యక్షుడు మేక్రాన్ సుదీర్ఘ చర్చలు జరిపారు. తమ చర్చలు ఉక్రెయిన్‌లో శాంతి నెలకొల్పే విషయంలో టర్నింగ్ పాయింట్‌గా మారనున్నాయని మేక్రాన్ ప్రకటించారు. సార్వభౌమ దేశంగా ఉక్రెయిన్ ప్రాదేశిక ప్రాంతాల గురించి మాట్లాడాల్సింది ఆ దేశం మాత్రమేనని జెలెన్‌స్కీతో జరిగిన మీడియా సమావేశంలో మేక్రాన్ పేర్కొన్నారు. ఇక్కడ మేం శాంతి చర్చలు జరుపుతూంటే, రష్యా తన హత్యాకాండ, విధ్వంసం కొనసాగిస్తూనే ఉందని మేక్రాన్ ధ్వజమెత్తారు. శాంతి ఒప్పందం కుదిరేపక్షంలో ఉక్రెయిన్ భద్రతకు యూరప్ దేశాలు హామీగా ఉండేలా సంప్రదింపులు జరుపుతామన్నారు.

రుబయ్యా సయీద్ కిడ్నాప్ కేసు..

1989 నుంచి తప్పించుకు తిరుగుతున్న నిందితుడు అరెస్ట్

న్యూఢిల్లీ: 1989లో అప్పటి కేంద్ర హోం మంత్రి ముఫ్తీ మహ్మద్ సయీద్ కుమార్తె రుబయ్యా కిడ్నాప్ కేసులో కుట్రధారుగా భావిస్తున్న షఫత్ అహ్మద్ షంగ్లూను సీబీఐ సోమవారం అరెస్ట్ చేసింది. నిషేధిత జేకేఎల్ఎఫ్‌తో ప్రమేయమున్న ఈ కిడ్నాప్ ఘటన అప్పట్లో పెను సంచలనం సృష్టించింది. తాజాగా పట్టుబడిన షంగ్లూ జేకేఎల్ఎఫ్ చీఫ్ యాసిన్ మాలిక్‌కు సన్నిహితుడు. రుబయ్యా సయీద్ కిడ్నాప్‌కు షంగ్లూ, యాసిన్ మాలిక్ కలిసి కుట్ర పన్నారు. 35 ఏళ్లుగా ఇతడు తప్పించుకు తిరుగుతున్నాడు. వీరిపై రణబీర్ పీనల్ కోడ్‌తోపాటు 1989నాటి టాడా చట్టం కింద కేసులున్నాయని సీబీఐ తెలిపింది. షంగ్లూ తలపై రూ.10 లక్షల రివార్డు సైతం ఉందని పేర్కొంది. ఇతడిని జమ్మూలోని టాడా కోర్టులో హాజరు పరుస్తామని వెల్లడించింది. జేకేఎల్ఎఫ్ ఆర్థిక వ్యవహారాలన్నీ షంగ్లూ యాజమాన్యంలోనే సాగేవని అధికారులు చెప్పారు. శ్రీనగర్‌లోని నిషాత్ ప్రాంతంలోని తన నివాసంలో ఉన్న షంగ్లూను సీబీఐ, కశ్మీర్ పోలీసులు కలిసి అరెస్ట్ చేశారని వివరించారు. జేకేఎల్ఎఫ్ చీఫ్ యాసిన్ మాలిక్ 2019 నుంచి తిహార్ జైలులో ఉండటం తెల్సిందే. రుబయ్యా సయీద్‌ను కిడ్నాప్ చేసిన ఉగ్రవాదులు.. జైలులో ఉన్న ఐదుగు రు ఉగ్రవాదులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. దీంతో, అప్పట్లో బీజేపీ మద్దతుతో కేంద్రంలో ఉన్న వీపీ సింగ్ ప్రభుత్వం అందుకు తలొగ్గడంతో కథ సుఖాంతమైంది.

కొనసాగుతున్న వరద సహాయక చర్యలు..

ఇండోనేసియా, శ్రీలంక, థాయ్‌లాండ్‌ల్లో మృతులు వెయ్యికిపైనే

జకార్తా/న్యూఢిల్లీ: ఇండోనేసియా, థాయ్‌లాండ్, శ్రీలంకల్లో ఇటీవల సంభవించిన వర్షాలు, వరదలకు సంభవించిన ఘటనల్లో మరణాలు వెయ్యి దాటేశాయి. గల్లంతైన వారి సంఖ్య వందల్లో ఉంది. ఆయా దేశాల్లో వరద సహాయక చర్యలు యుద్ధ ప్రాతిపదికన కొనసాగుతున్నాయి. ఇండోనేసియాలోని సుమత్రా దీవిలో వరదలు, కొండచరియలు విరిగి పడిన ఘటనల్లో కనీసం 604 మంది చనిపోయారని అధ్యక్షుడు ప్రబొవొ సుబియాంతో తెలిపారు. వేలాది మంది నిరాశ్రయులుగా మారారని, ఇంకా 464 మంది జాడ తెలియాల్సి ఉందని వెల్లడించారు. గత వారం వరదలు సంభవించిన కొన్ని ప్రాంతాలకు ఇప్పటికీ సహాయక బృందాలు చేరుకునేందుకు వీలు కావడం లేదన్నారు. రోడ్లు, సమాచార వ్యవస్థలు తీవ్రంగా దెబ్బతిన్నాయని వివరించారు. తీవ్రంగా దెబ్బతిన్న నార్త్ సుమత్ర, వెస్ట్ సుమత్ర, ఆసెహ్ ప్రావిన్స్‌లను ఆయన సోమవారం పర్యటించి, బాధితులను పరామర్శించారు. అదేవిధంగా, థాయ్‌లాండ్‌లో సంభవించిన భారీ వర్షాలు, వరదల్లో 176 మంది ప్రాణాలు కోల్పోయారు. సుమారు 1.5 లక్షల కుటుంబాలపై వర్షాల ప్రభావం పడింది. దీంతో, ప్రభుత్వం మొదటి విడతలో తీవ్రంగా నష్టపోయిన 26 వేల మందికి 74 లక్షల డాలర్లను పంపిణీ చేయాలని నిర్ణయించింది. దీంతోపాటు, శ్రీలంకలో దిత్వా తుపాను సంబంధిత ఘటనల్లో 366 మంది చనిపోగా 367 మంది గల్లంతయ్యారని అధికారులు సోమవారం ప్రకటించారు. సుమారు 2.18 లక్షల మందికి ప్రభుత్వం తుఫాను షెల్టర్లలో ఆశ్రయం కల్పించింది. తేయాకు తోటలు ఎక్కువగా ఉండే కొండప్రాంతాల్లో నష్టం ఎక్కువగా ఉంది.

శ్రీలంక అధ్యక్షుడితో మాట్లాడిన ప్రధాని మోదీ

భారత ప్రధాని మోదీ సోమవారం శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిస్సనాయకెతో ఫోన్‌లో మాట్లాడారు. దిత్వా తుపాను ప్రభావిత ప్రాంతాల్లో పునరావాస కార్యక్రమాలకు అవసరమైన సాయం కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. భారత ప్రభుత్వం శ్రీలంకకు ఇప్పటికే రెండు విడతలుగా ఆహారం, అత్యవసర వస్తు సామగ్రితోపాటు సిబ్బందిని కూడా పంపించడం తెల్సిందే.

జీవాయుధాల ముప్పు ఎంతో దూరంలో లేదు

జైశంకర్ వ్యాఖ్య

న్యూఢిల్లీ: భవిష్యత్తులో జీవాయుధాల దుర్వినియోగంతో తలెత్తే ముప్పును ఎదుర్కొనేందుకు అంతర్జాతీయ స్థాయిలో కార్యాచరణను సిద్ధం చేసుకోవాలని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ అభిప్రాయపడ్డారు. అంతర్జాతీయంగా భద్రతా పరమైన అస్థిర వాతావరణం నెలకొంటున్న వేళ ఈ మేరకు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జీవాయుధాలను ప్రభుత్వేతర శక్తులు వినియోగించే బెడద ఎంతోదూరంలో లేదని ఆయన హెచ్చరించారు. ఇటువంటి విపత్తులను ఎదుర్కొనేందుకు ప్రపంచ దేశాల మధ్య సహకారం అవసరమన్నారు. బయోలాజికల్ వెపన్స్ కన్వెన్షన్(బీడబ్ల్యూసీ)కి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఏర్పాటైన సదస్సులో మంత్రి ప్రసంగించారు. 'బయో టెర్రరిజం ముప్పును ఎదుర్కొనేందుకు అంతర్జాతీయ సమాజం సిద్ధంగా ఉండాల్సి రావడం తీవ్ర ఆందోళన కలిగించే విషయం. అయినప్పటికీ, బీడబ్ల్యూసీలో ఇప్పటికీ ఇందుకు అవసరమైన ప్రాథమిక చర్యలు లేవు. నూతన శాస్త్రీయ పరిణామాలను గుర్తించేందుకు ఎటువంటి వ్యవస్థ కూడా లేదు. బీడబ్ల్యూసీపై విశ్వసనీయత పెరగాలంటే లోపాలను సరిదిద్దుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది'అని ఆయన అన్నారు. బీడబ్ల్యూసీలోని నిబంధనలకు అనుగుణంగా చర్యలు తీసుకునేందుకు భారత్ సిద్ధంగా ఉందని ఆయన చెప్పారు.

కేరళ రాజ్‌భవన్ ఇక లోక్ భవన్

తిరువనంతపురం: కేరళలోని రాజ్ భవన్‌ను పేరును లోక్ భవన్‌గా మార్చారు. దేశవ్యాప్తంగా రాజ్‌భవన్‌లను లోక్ భవన్‌గా, రాజ్ నివాస్‌ను లోక్ నివాస్‌గా మార్చాలన్న కేంద్ర హోం శాఖ ఆదేశాల మేరకు సోమవారం అధికారికంగా ఈ మార్పు జరిగింది. వలసవాద తత్వం నుంచి ప్రజాస్వామ్యంలోకి మారడంలో ఇది మైలురాయని గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్ ఒక ప్రకటనలో తెలిపారు.

జపాన్ యువరాణి ఐకోకు పెరుగుతున్న ప్రజాదరణ

దేశంలో వారసత్వ చట్టాన్ని మారుస్తుందా?

టోక్యో: జపాన్ యువరాణి ఐకోకు ప్రజాదరణ పెరుగుతోంది. ఆమె బయట కనిపిస్తే చాలు.. ప్రజలు ఓ పాప్‌స్టార్‌ను చూసినట్టు హర్షధ్వానాలు చేస్తున్నారు. చక్రవర్తి నరుహిటో, చక్రవర్తి మసాకోతో కలిసి ఈ ఏడాది ప్రారంభంలో ఆమె నాగసాకిని సందర్శించినప్పుడు, రోడ్ల వెంట జనం ఆమె పేరుతో నినాదాలు చే శారు. ఇది ఆమె తల్లిదండ్రులను సంతోషపరిచినా.. మహిళను చక్రవర్తిగా అంగీరించని జపాన్ సామ్రాజ్య చట్టంతో 2వేల ఏళ్ల జపాన్ రాచరిక మనుగడ ప్రమాదంలో పడింది. రాజ కుటుంబంలో 16 మంది సభ్యులు ఉన్నారు. అందరూ పెద్ద వాళ్ళు. నరుహిటోకు తరువాత ఇద్దరు వారసులున్నారు. నరుహిటో తమ్ముడు క్రౌన్ ప్రిన్స్ అకిషినో. అతనికి 60 ఏళ్లు. ఆయన కుమారుడు ప్రిన్స్ హిసాహిటోకు 16 ఏళ్లు. ఇప్పట్లో సింహాసనం చేపట్టే అవకాశాలు లేవు. పురుష వారసుల కొరత రాచరికానికి ఆందోళన కలిగిస్తోంది. జపాన్‌లో వృద్ధుల జనాభా పెరుగుతుండటం, యువత జనాభా తగ్గుతుండడానికి ఇది నిదర్శన.

వ్యతిరేకిస్తున్న ఓ వర్గం..

యువరాణి ఐకోకు సోమవారానికి 24 ఏళ్లు నిండాయి. అధికారం చేపట్టడానికి అనుమతించే వయసు. కానీ.. చక్రవర్తికి ఏకైక సంతానం అయిన ఐకో చక్రవర్తి కావాలంటే పురుషులు మాత్రమే వారసత్వాన్ని పొందే జపాన్ సామ్రాజ్య వారసత్వ చట్టాన్ని మార్చాలి. ప్రజలు కూడా ఇదే కోరుకుంటున్నారు. రాచరికం అంతరించి పోకుండా ఉండాలంటే మహిళలపై నిషేధం ఎత్తివేయాలని నిపుణులు చెబుతున్నారు. జపాన్ ప్రభుత్వం మహిళా చక్రవర్తిని అనుమతించాలని కోరుతూ గతేడాది ఐక్యరాజ్య సమితి మహిళా హక్కుల కమిటీ ఒక నివేదికను కూడా విడుదల చేసింది. కానీ ప్రధాన మంత్రి సనే తకైచితో సహా చట్టసభ్యులు అనేక మంది ఈ మార్పును వ్యతిరేకిస్తున్నారు.

అధికారిక కార్యక్రమాల్లో ఐకో..

ఐకో 2001 డిసెంబర్ 1న జన్మించారు. తన తల్లిదండ్రులు చదివిన గకుషుయిన్ విశ్వవిద్యాలయం నుంచి పట్టభద్రురాలయ్యారు. యాకేలోనూ ఉన్నత విద్యను అభ్యసించారు. ఆ తరువాత జపనీస్ రెడ్‌క్రాస్ సొసైటీలో వాలంటీర్‌గా పనిచేయడం ప్రారంభించారు. ఇటీవలి కాలంలో కుటుంబంతో కలిసి అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. 2021లో 20 ఏళ్లు నిండినప్పటి నుంచే ఆమె తెలివితేటలు, స్నేహపూర్వకమైన వ్యక్తిత్వం, ఫన్నీగా ఉండే తత్వం ప్రజలను ఆకట్టుకుంది. అప్పటినుంచే ఐకో అభిమానులను సంపాదించుకున్నారు. గత నెలలో ఆమె లావోస్ పర్యటన.. మొట్టమొదటి అధికారిక సోలో పర్యటన. ఆరు రోజుల పర్యటనలో భాగంగా ఆమె లావోస్‌లోని అగ్రశ్రేణి అధికారులను కలిశారు. సాంస్కృతిక, చారిత్రక ప్రదేశాలను సందర్శించారు. స్థానికులను కలిశారు. ఈ విదేశీ పర్యటన తర్వాత ఐకోకు మద్దతు పెరిగింది. యువరాణికి పెరిగిన ప్రజాదరణ చట్టాన్ని మార్చాలనే వాదనను తెరపైకి తెచ్చింది.

పోలీసులే అన్నను ఎగదోశారు

నిర్జీవ ప్రేమికుడిని పెళ్లాడిన యువతి తాజా ఆరోపణ

నాందేడ్: వేరే కులం అనే కారణంగా యువకుడిని యువతి కుటుంబసభ్యులు దారుణంగా హత్యచేసిన ఘటనలో పోలీసుల పాత్ర కూడా ఉందని ఆ యువతి తాజాగా ఆరోపించింది. దీంతో పోలీసుల పాత్రపై అదనపు ఎస్పీ ర్యాంక్ అధికారి నేతృత్వంలో దర్యాప్తు మొదలెడతామని ఎస్పీ అబినాశ్ కుమార్ సోమవారం ప్రకటించారు. మహారాష్ట్రలోని నాందేడ్ జిల్లాకు చెందిన ఆన్చల్ మమిద్వార్ అనే యువతిని సక్షమ్ తాటే అనే వేరే కులం అబ్బాయి ప్రేమించడం, ఇది నచ్చని ఆమె తండ్రి, సోదరులు యువకుడిని సోమవారం చంపేయడం తెల్సిందే. సక్షమ్ అంత్యక్రియలు జరుగుతుండగా అక్కడికొచ్చిన ఆన్చల్ అతడి మృతదేహంతోనే వివాహమాడిన విషయం విదితమే. ఈ హత్యోదంతంపై ఆన్చల్ మంగళవారం మీడియాతో మాట్లాడారు. ''సోమవారం సక్షమ్‌ను చంపేయడానికి ముందే నన్ను నా సోదరుడు హిమేశ్ స్థానిక ఇట్వారా పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లాడు. సక్షమ్‌పై తప్పుడు ఫిర్యాదుచేయాలన్నాడు. అందుకు నేను ససేమిరా ఒప్పుకోలేదు. దీంతో కోపంతో అక్కడి ఇద్దరు పోలీసులు హిమేశ్‌ను హత్యకు పురిగొల్పారు. వాళ్లతో వీళ్లతో గొడవపడే బదులు నేరుగా వెళ్లి సక్షమ్‌ను చంపేసెయ్ అని హిమేశ్‌ను ఉసిగొల్పారు. అప్పటికే హిమేశ్ పట్టరాని ఆగ్రహంతో ఊగిపోతున్నాడు. సక్షమ్‌ను చంపేశాక పోలీస్‌స్టేషన్‌కు వస్తా అనుకుంటూ వెళ్లిపోయాడు. అనుకున్నట్లే సక్షమ్‌ను చంపేశాడు. దమ్ముంటే నువ్వు పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చెయ్ అని నాతో సవాల్ చేశాడు''అని మహిళ రోదిస్తూ చెప్పింది. ''నా డిమాండ్ ఒక్కటే. సక్షమ్‌ను చంపేసిన నా తండ్రి, సోదరులు సైతం అదే రీతిలో శిక్షను అమలుచేయాలి. హత్యతో సంబంధం ఉన్న వాళ్లందరినీ ఉరితీయాలి. ప్రాణాలు వదిలినా సరే సక్షమే నా భర్త. ఇకపై అతని కుటుంబంతోనే అతని ఇంట్లోనే ఉంటా. సక్షమ్ తల్లిదండ్రుల బాగోగులు చూసుకుంటా''అని ఆమె తెలిపింది. ఆన్చల్ ఆరోపణలపై ఎస్పీ స్పందించారు. ''హత్యోదంతంలో పోలీసుల పాత్ర ఉందనేది తీవ్రమైన ఆరోపణ. ఈ విషయంపై దర్యాప్తు చేస్తాం. వాస్తవానికి మృతుడు సక్షమ్, నిందితుడు హిమేశ్ ఇద్దరికీ నేర చరిత్ర ఉంది. గతంలో ఇద్దరూ మంచి మిత్రులు. హత్య, దాడిసహా భారతీయ న్యాయసంహిత, ఎస్సీ/ఎస్టీ(వేధింపుల నిరోధక)చట్టం, భారతీయ న్యాయ సంహిత, ఆయుధాల చట్టాల కింద ఆరుగురిపై కేసు నమోదుచేశాం''అని ఎస్పీ చెప్పారు. అరెస్టయిన వారిని మూడ్రోజులపాటు పోలీసులు తమ కస్టడీలోకి తీసుకున్నారు.

పంచారామాల్లో శివాలయాలు నిర్మించినవారు?

చాళుక్య రాజులు శివ భక్తులు. వీరు పంచారామాల్లో శివాలయాలు నిర్మించారు. చాళుక్య రాజులు వేయించిన శాసనాల్లో తెలుగు భాషా పదాలు, పద్యాలు ఉన్నాయి. తెలుగు భాషలో ఆదికవి అయిన నన్నయ్య రాజరాజ నరేంద్రుని ఆస్థాన కవి. ఈయన మహాభారతాన్ని తెలుగులోకి అనువదించారు. మల్లన 'గణితసార సంగ్రహం' గ్రంథాన్ని తెలుగు పద్యాల్లో రచించారు.

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

ఇండియన్ హిస్టరీ

దక్షిణ భారతదేశ చరిత్ర (క్రీ.పూ. 250 – క్రీ.శ. 250)

శాతవాహనులు

శాతవాహన వంశస్థాపకుడు శ్రీముఖుడు. నానాఘాట్, హాతిగుంఫా శాసనాల్లో శ్రీ శాతకర్ణి గురించి వర్ణించారు. శాతవాహన రాజుల్లో ప్రసిద్ధుడు గౌతమీ పుత్రశాతకర్ణి. ఇతడి గురించి నాసిక్ శాసనంలో ఉంది. హాలుడు ప్రాకృతంలో 'గాథా సప్తశతి' గ్రంథం రచించాడు. ఒకటో పులోమావి చివరి కణ్వ పాలకుడైన సుశర్మను సంహరించాడు. యజ్ఞశ్రీ శాతకర్ణి రుద్రదాముని కుమార్తెను వివాహం చేసుకున్నాడు. యజ్ఞశ్రీ శాతకర్ణి శాతవాహన చివరి రాజుల్లో గొప్పవాడు. శాతవాహనుల్లో చివరి పాలకుడు మూడో పులోమావి.

కంచి పల్లవులు (క్రీ.శ. 300-888)

పల్లవ వంశ స్థాపకుడు 'వీరకూర్చవర్మ'. ఇతడి కుమారుడు శివస్కందవర్మ. మహాపల్లవ వంశానికి మూల పురుషుడు సింహ విష్ణువు. ఇతడు చోళ, పాండ్య, సింహళ రాజులను ఓడించి, 'అవనీసింహ' అనే బిరుదు పొందాడు. ఇతడి కుమారుడైన మహేంద్రవర్మను చాళుక్యరాజు రెండో పులకేశి 'పుల్లలూర్' యుద్ధంలో ఓడించాడు. మహేంద్రవర్మ 'మత్తవిలాస ప్రహసనం' అనే వ్యంగ్య నాటకాన్ని రచించాడు. ఇతడు గొప్ప శిల్పకళాపోషకుడు. మామండనూర్, దళవదూర్ గృహాలయాలు, చిత్తన్న వాసల్‌లోని కుడ్య చిత్రాలు ఇతడి కళాపోషణకు నిదర్శనాలు. మహేంద్రవర్మ కుమారుడు నరసింహవర్మ పల్లవ రాజులందరిలో అగ్రగణ్యుడు. ఇతడు రెండో పులకేశిని చంపి తండ్రి ఓటమికి ప్రతీకారం తీర్చుకున్నాడు.

మొదటి నరసింహవర్మ (క్రీ.శ. 630 – 668): ఇతడు శివ భక్తుడు. ఇతడు కైలాసనాథ, తీర (షోర్ టెంపుల్) దేవాలయాలను నిర్మించి కళా ప్రపంచంలో చిరస్మరణీయ స్థానం సంపాదించాడు. ఇతడు 641లో పులకేశిని ఓడించాడు. చోళ, పాండ్య పాలకులు ఇతడికి సామంతులుగా ఉన్నారు. ఇతడు సాధించిన విజయాల వల్ల 'వాతాపికొండ', 'మహామల్ల' బిరుదులతో కీర్తి పొందాడు. సంస్కృత కిరాతార్జునీయ కావ్యాన్ని రచించిన భారవి ఇతడి ఆస్థానకవి. ఇతడి కాలంలో హుయాన్ త్సాంగ్ కంచిని దర్శించాడు.

నందివర్మ: 'పల్లవ మల్ల' బిరుదాంకితుడు. ఇతడు వైకుంఠ పెరుమాళ్ దేవాలయాన్ని నిర్మించాడు. పల్లవుల దేవాలయ శిల్పకళలో ఆలయాలు, మండపాలు, రథాలు అనే మూడు రకాల నిర్మాణాలు ఉన్నాయి. వరాహ, త్రిమూర్తి, మహిషాసురమర్ధని, పంచపాండవుల మండపం (రథాలు) నందివర్మ శిల్ప కళాపోషణకు తార్కాణాలు. పల్లవుల పాలనా వ్యవస్థ మౌర్యులు, ఆంధ్ర శాతవాహనుల పరిపాలనా వ్యవస్థను పోలి ఉంది.

ద్రావిడ దేవాలయాలు

భారతీయ వాస్తుశైలిలో ద్రావిడశైలి ప్రసిద్ధమైంది. ద్రావిడ శైలి దేవాలయాల్లో ప్రముఖమైనవి బృహదీశ్వరాలయం, శ్రీ రంగనాథ స్వామి ఆలయం, మీనాక్షి దేవాలయం.

బృహదీశ్వరాలయం

దీన్ని చోళ చక్రవర్తి తంజావూరులో నిర్మించాడు. ఇది ద్రావిడ శైలికి ప్రతీక. ఈ దేవాలయం గోపురంపై ఉన్న ఏకైక కలశం బరువు 90 టన్నులు.

శ్రీరంగనాథ స్వామి ఆలయం

ద్రావిడ దేవాలయాల్లో ఇది అతి పెద్దది. ఇది కావేరి ఒడ్డున ఉన్న శ్రీరంగంలో ఉంది.ఇక్కడ స్వామి విగ్రహం శయనాకార రూపంలో ఉంటుంది. ఈ రూపంలో ఉన్న మరో విగ్రహం నెల్లూరులోని శ్రీ రంగనాయకుల దేవాలయంలో మాత్రమే ఉంది.

మీనాక్షి దేవాలయం

నాయకరాజు కాలంలో మదురైలో నిర్మించారు. ఈ ఆలయంలో పలు ప్రాకారాలు, గోపురాలు ఉన్నాయి.

పశ్చిమ చాళుక్యులు (క్రీ.శ. 500-757)

పశ్చిమ చాళుక్యుల రాజధాని 'వాతాపి' లేదా 'బాదామి'. వీరిని వాతాపి లేదా బాదామి చాళుక్యులు అని కూడా అంటారు. చాళుక్య వంశ మూలపురుషుడు జయసింహ వల్లభుడు. సత్యాశ్రయ పులకేశి 'వాతాపి' (బీజాపూర్ జిల్లా, కర్ణాటక) నగరాన్ని నిర్మించి దాన్ని రాజధానిగా చేసుకున్నాడు. రెండో పులకేశి దక్షిణాపథ సార్వభౌముడిగా కీర్తి పొందాడు. ఇతడు 'ఐహోల్' వద్ద రాయించిన శాసనం అతడి విజయాల గురించి వర్ణిస్తుంది. ఇతడు ఎలిఫెంటా, పట్టాడక్కల్ దేవాలయాన్ని నిర్మించాడు. రెండో హర్షుడిని ఓడించాడు.

తూర్పు చాళుక్యులు (క్రీ.శ. 630-970)

ఆంధ్ర సంస్కృతి, తెలుగు భాషకు తూర్పు చాళుక్యులు ఎనలేని సేవ చేశారు. ఈ వంశంలో రాజరాజ నరేంద్రుడు ఆంధ్ర భాషా సాహిత్య పరిపోషకుడిగా పేరుపొందాడు.ఈ వంశ స్థాపకుడైన కుబ్జ విష్ణువర్ధనుడికి 'విషమసిద్ధి' అనే బిరుదు ఉంది.

కళ్యాణి చాళుక్యులు (క్రీ.శ. 973-1189)

తైలపుడు రాష్ట్రకూట రాజును ఓడించి చాళుక్య రాజ్యాన్ని పునఃస్థాపించాడు. ఇతడు 'కళ్యాణి'ని రాజధానిగా చేసుకొని పాలించాడు. కళ్యాణి చాళుక్యుల కాలంలో కన్నడ, సంస్కృత భాషలు అభివృద్ధి చెందాయి. బసవేశ్వరుడు వీరశైవ (ఆరాధ్య) మతాన్ని స్థాపించాడు.

మాన్యఖేట రాష్ట్రకూటులు (క్రీ.శ. 757-973)

జైనమతానికి,కన్నడ భాషకు మాన్యఖేట రాష్ట్రకూటులు ఎనలేని సేవ చేశారు.ఈ వంశానికి మూల పురుషుడు దంతి దుర్గుడు (752–56). ఇతడికి 'ఖడ్గావలోక','వైరమేఘ' అనే బిరుదులు ఉన్నాయి.

ధ్రువుడు(780–92): ఇతడి కాలంలో రాష్ట్రకూట సామ్రాజ్యం అఖిల భారత ప్రతిష్టను పొందింది. గంగా కావేరీ నదుల మధ్య వీరికి ఎదురే లేకుండా పోయింది. ధ్రువుడికి నిరుపమ, కలివల్లభ, శ్రీ వల్లభ, ధారావర్ష అనే బిరుదులున్నాయి.

మూడో గోవిందుడు (792–814): ఇతడి కాలంలో రాష్ట్రకూట ప్రతిష్ఠ మహోన్నత స్థితికి చేరింది. ఇతడు జగత్తుంగ, ప్రభూత వర్ష అనే బిరుదులు ధరించాడు. ఇతడి కాలంలో ఉత్తరాపథంపై రాష్ట్రకూటుల అధికారం చెక్కు చెదరలేదు.

అమోఘవర్షుడు: 'మాన్యఖేట' అనే దుర్గాన్ని నిర్మించి రాజధానిగా చేశాడు. సోదరి శీల మహాదేవిని రెండో విజయాధిత్యుడి కుమారుడైన కలి విష్ణువర్ధనుడికి ఇచ్చి వివాహం జరిపించాడు. ఈవిధంగా వేంగి చాళుక్యుల మైత్రిని సాధించాడు. గంగ, అంబిరాజులను సామంతులుగా చేసుకున్నాడు. ఇతడు కన్నడ భాషలో గొప్ప పండితుడు.

రెండో కృష్ణ: ఇతడు చోళరాజు పరాంతకుడి చేతిలో 'వల్లా యుద్ధం'లో ఓడిపోయాడు. ఇతడిని 'అకాలవర్షుడు'గా పేర్కొంటారు.

రాష్ట్రకూటుల్లో మూడో కృష్ణ చివరి గొప్ప రాజు. పరాంతకుడు 'తక్కోల యుద్ధం'లో ఓటమి పాలయ్యాడు. అమోఘవర్షుడు 'కవిరాజ మార్గం' అనే అలంకార గ్రంథాన్ని రచించాడు. ఎలిఫెంటా, ఎల్లోరాల్లో రాష్ట్రకూటుల శిల్పకళను చూడొచ్చు. రాష్ట్రకూట రాజు ఒకటో కృష్ణుడు ఎల్లోరా (మహారాష్ట్ర)లో కైలాస దేవాలయాన్ని నిర్మించాడు. ఇది ఏకశిలా నిర్మితం. దీన్ని నిర్మించడానికి 150 ఏళ్లు పట్టింది. పశ్చిమ కనుమల్లో ఒక కొండరాయిని ఎన్నుకొని దాన్ని కొండల నుంచి వేరు చేసి దేవాలయంగా మలిచారు. ప్రపంచంలో ఈ తరహా దేవాలయం ఎక్కడా లేదు.

తంజావూరు చోళులు

ఈ చోళ వంశస్థాపకుడు విజయాలయుడు. ఇతడు ఉరైయూర్‌లో క్రీ.శ. 850 ప్రాంతంలో పల్లవ సామంతుడుగా ఉంటూ పాండ్య సామంతుడైన ముత్తరయార్‌ను ఓడించి తంజావూర్‌ను స్వాధీనం చేసుకున్నాడు. ఇతడి కాలం నుంచి చోళుల విజృంభణ ప్రారంభమైంది.

రాజరాజు (క్రీ.శ. 985–1014): చోళ రాజ్య ప్రతిష్టను పునరుద్ధరించి నూతనాధ్యాయాన్ని ప్రారంభించాడు. చోళుల ఇష్టదైవమైన శివుడికి బృహదీశ్వరాలయం (రాజరాజేశ్వరి దేవాలయం) నిర్మించాడు. ఇదే చోళకళకు ప్రసిద్ధి. భూమిశిస్తు విధానాన్ని సక్రమంగా అమలుపరచడానికి వ్యవసాయ భూములను 'సర్వే' చేయించాడు. ఇతడికి రాజరాజ (ది గ్రేట్) అనే బిరుదు ఉంది.

రాజేంద్ర చోళుడు(క్రీ.శ.1014–1044): ఇతడు రాజరాజు కుమారుడు. శ్రీవిజయ సామ్రాజ్యంపై దండెత్తి శైలేంద్ర రాజును ఓడించాడు.క్రీ.శ.1012లో అతడి రాజధాని నగరం 'కందరం'ను ముట్టడించాడు. బంగాళాఖాతం,హిందూ మహాసముద్రాలపై ఆధిపత్యం సాధించాడు. ఇతడు 'కదరగొండన్', 'త్రి సముద్రాదీశ్వర' అనే బిరుదులు పొందాడు. బెంగాల్‌పై విజయం సాధించాడు. తల్లి కోరికపై 'గంగైకొండ చోళపురం' అనే నగరాన్ని నిర్మించాడు. దీన్ని తన రాజధానిగా చేసుకొని పాలించాడు.

ఒకటో రాజాధిరాజు (క్రీ.శ.1044–52): ఇతడు రాజేంద్రుడి కుమారుడు. కళ్యాణి చాళుక్య రాజైన సోమేశ్వరుడిని 'కొప్పం' యుద్ధంలో ఓడించాడు. కానీ అదే యుద్ధంలో ప్రాణాలు కోల్పోయాడు. మధుర, సింహళంలో చెలరేగిన తిరుగుబాట్లను అణచివేశాడు.

రెండో రాజేంద్రుడు (క్రీ.శ. 1052–64): ఇతడు రాజాధిరాజు సోదరుడు. చాళుక్యరాజును 'కూడల్ సంగమ యుద్ధంలో' ఓడించి కొల్హాపూర్ వద్ద విజయ స్తంభాన్ని వేయించాడు.

వీర రాజేంద్రుడు (క్రీ.శ. 1064–70): వేంగి, కళింగ, చక్రకూట పాలకులపై దాడులు చేశాడు. చాళుక్య రాజులను, విక్రమాదిత్యుడిని ఓడించాడు. ఇతడు తన కుమార్తెలను విక్రమాదిత్యుడు, కళింగ గంగ యువరాజైన రాజరాజుకు ఇచ్చి వివాహం చేశాడు.

మొదటి కులోత్తుంగ చోళుడు (క్రీ.శ.1070–1120): వీర రాజేంద్రుడి తర్వాత వారసులు లేకపోవడం వల్ల రాజరాజ నరేంద్రుడు, అమ్మంగదేవికి జన్మించిన రాజేంద్రుడు అధికారంలోకి వచ్చాడు. ఇతడు కులోత్తుంగ చోళుడు అనే పేరుతో సింహాసనాన్ని అధిష్ఠించాడు. ఇతడిది చాళుక్య చోళ వంశం.

చోళుల కాలం తమిళ సాహిత్యానికి స్వర్ణయుగం. కంబకవి తమిళంలో రామాయణాన్ని రచించాడు. జయకొండార్ 'పెరియపురాణం' గ్రంథాన్ని రాశాడు.

జనరల్ నాలెడ్జ్ ఫర్ గ్రూప్స్

చారిత్రక కట్టడాలు - నిర్మాతలు

సూర్య దేవాలయం (కోణార్క్, ఒడిశా)	- నరసింహదేవ వర్మ
వైకుంఠ పెరుమాళ్ దేవాలయం(కంచి,తమిళనాడు)	- మూడో నందివర్మ
బరాబర్‌గుహలు (గయ జిల్లాలో, బిహార్)	- అశోకుడు
ఏకశిల రథాలు (మహాబలిపురం, తమిళనాడు)	- మొదటి నరసింహ వర్మ
కైలాసనాథ దేవాలయం (కంచి)	- రెండో నరసింహ వర్మ
మౌంట్‌అబు జైన దేవాలయం (రాజస్థాన్)	- తేజ్‌పాల, వస్తుపాల

Life is in language...

When you stop thinking new thoughts, new ideas, new imaginations, new feelings, new aptitudes and new intellectual creations, there is no need of a language. From the moment you get up from your bed, till the moment you go to your bed, the same set of stock vocabulary is enough. When you don't need any other vocabulary than your known, faded, stereotyped, boring, tiresome and tasteless vocabulary, it means that you have stopped thinking which makes you isolated. Find out what makes a word tick and how you can make it stick.



టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

English - (SA, SGT)

VOCABULARY

When somebody asked 'what is a language?', the other man replied 'words, words, words and words'. This is actually from William Shake-speare's immortal work 'Hamlet'.

It goes like this..

Polonius: What do you read, my Lord?
Hamlet: Words, words, words.
Polonius: What is the matter, my Lord?
Hamlet: Between whom? (In the original text, it is 'Between who?')
Polonius: I mean the matter that you read, my Lord.

In the above dialogue, one can see how important one's use of vocabulary is. Keeping a side the significance of the dialogue a while, there is a grammar mistake in it. 'Between' is a preposition. There is a rule that there must be an objective case pronoun after a preposition. Now this rule is violated. But we often say that they are exceptions. It may be true. Somebody wanted to know and asked "Did Shakespeare write in English?" Then the other man retorted "Shakespeare didn't write in English rather whatever he wrote is English".

Yes it is true. Hundred percent true.
Emily Dickinson rightly opines;

"A word is dead
When it is said,
Some say. I say it just
Begins to live
That day"

Yes. Language is lively. Life is in language. Life without language is just unimaginable, a mere cipher. In vocabulary building, the problem is not so much finding new words or even finding out what they mean. The problem is to remember them, to fix them permanently in your mind. The simple way is to 'see the word, utter it thrice, use it once and it is yours'. Your being introduced to a number of words is of no use as you will forget them as quickly as you forget the names of people you are casually introduced to at a crowded party. Unless you meet them again or unless you spend some time with them, you can't say "I know them or they know me". Try to meet some of the more difficult words, see them in their contexts, look at them from other angles and spend some time with them. Your meeting them should not be a casual one. Some association should be established between you and the words. Try to bring into sharp and permanent focus those words that are now on the blurred fringe of your mind. Imagine a context and you will fall in the need of words.

Let's taste a spoon of words from the ocean of language...

Celibacy: Unmarried state, usually a religious vow of chastity.
Censorious: Being inclined to find faults.
Clinophobia: Morbid fear of lying in bed.
Confiscate: Seize (private property) by authority.
Connoisseur: One who appreciates, understands and enjoys arts.
Conscription: Compulsory enrollment, especially for the armed forces; draft.
Convalescence: Gradual return to health and strength after illness.
Claustrophobia: An abnormal fear of being in narrow or enclosed spaces.
Cynic: A person who believes all people are motivated by selfishness or one whose outlook is scor-nfully and often habitually negat-ive. (Cynic is a member of a sect of ancient Greek philosophers who believed virtue to be the only good and self-control to be the only means of achieving virtue).
Cynophobia: Morbid fear of dogs.
Cynosure: Centre of attention. An object that serves as a focal point of attention and admiration. Som-ebody or something that is the centre of admiration, attention or attraction.
Discophile: One who studies and collects phonographs.
Dissenter: Person who is hard to be pleased. (Often Dissenter One who refuses to accept the doctrines or usages of an established or a national church, especially a Protestant who dissents from the Church of England)
Dipsomania: Morbid craving or desire for alcohol.
Ditheism: Belief in independent principles of good and evil.
Diurnal: Relating to or occurring in a 24-hour period; daily or occurring or active during the daytime rather than at night: as in diurnal animals.

SYNONYMS AND ANTONYMS

S: = Synonyms **A:** = Antonym

- **Capricious**

S: Unpredictable, impulsive, fickle, changeable, inconstant, whimsical
A: Constant, firm, steadfast, unswerving

- **Cheek**

S: Impertinent boldness: (As in 'he shows the cheek to insult his hosts'). To speak impudently to or impudence, effrontery, gall, temerity, audacity, insolence, sauce, sass (=Impertinent, disrespectful speech; back talk)
A: Politeness, courtesy, humility, gentleness, respect.
(Cheek also means 'either side of the face below the eye. Eg. They are dancing cheek to cheek)

- **Dainty**

S: Pretty, neat, delicate, refined, tas-ty, delicious, fastidious, elegant, toothsome, exquisite, cute, palatable.
A: Inelegant, coarse, vulgar, rough, crude, rude, nasty, dirty.

- **Detrimental**

S: Harmful, injurious, hurtful, pernicious, damaging, noxious
A: Good, beneficial, valuable, useful, profitable, harmless, inoffensive, unobnoxious

- **Diligent**

S: Industrious, laborious, hard-working, attentive, assiduous, observant, mindful, vigilant, watchful, wakeful, careful
A: Careless, heedless, inattentive, indifferent, unobservant, unmindful

- **Docile**

S: Pliant, tractable, amenable, teachable, yielding, compliant, tame, submissive, gentle, unresisting, dutiful, passive, acquiescent, unassertive, manageable, governable, obsequious.
A: Obstinate, stubborn, intractable, self-willed, dogged, defiant, insolent, resistant, resisting, obdurate, disobedient, willful, uncompromising, unyielding, refractory, recalcitrant

- **Droll**

S: Amusing, laughable, funny, com-ic, sarcastic, whimsical, comical, odd, queer, farcical, ludicrous, ri-diculous, absurd, diverting, romp
A: Sad, lamentable, lugubrious, tragic, painful, dolorous, hurtful, distressing, grievous, woeful, rueful, mournful, deplorable, touching

- **Ephemeral**

S: Short lived, transitory, transient, fleeting, momentary, fugitive, evanescent, fugacious, temporary
A: Eternal, perpetual, perennial, permanent, intransient, lifelong, everlasting, long-lived, prolonged, protracted

- **Enormous**

S: Immense, gigantic, colossal, huge, vast, gargantuan, monstrous, prodigious, stupendous, plentiful, plenteous, copious
A: Trivial, insignificant, ordinary, average, small, little, tiny, diminutive.

MODEL QUESTIONS

Directions (Q. No. 1 - 5): ***Out of the four choices, select the one which can be substituted for the given words or sentences.***

1. Relating to the science of sounds
   a) Acoustics b) Ultrasonic
   c) Phonetic d) Sonics
2. A word formed from the initial letter or letters of each of the successive parts or major parts of a compound term:
   a) Abbreviation b) Palindrome
   c) Acronym d) Contraction
3. A substance which alleviates pain:
   a) Narcotic b) Anodyne
   c) Chloroform d) Intoxicant
4. A person who can speak several languages:
   a) Linguist b) Lexicographer
   c) Polyglot d) Multilingual
5. Deserving blame of an offence or crime:
   a) Criminal b) Culpable
   c) Punishable d) Culprit

Directions (Q. No. 6 - 14): ***From the given options, choose the one that is nearest in meaning to the underlined word:***

6. Gandhi is an ardent abolitionist.
   a) Amnesty activist
   b) One opposed to violence
   c) War activist
   d) One opposed to slavery
7. Only barren lands must be utili-zed for building the capital of AP
   a) Unproductive b) Vacant
   c) Fertile d) Assigned lands
8. With its good bandwidth, the company made good profits in its dish sales.
   a) Measurement of handwritten data
   b) Measurement of transferable data
   c) Measurement of burned data
   d) Measurement of shredded data
9. I felt it a little brackish.
   a) Polluted b) Boring
   c) Slightly salty d) Hot
10. Finally the hero gets catharsis.
    a) Applaud
    b) Gets relief from tension
    c) Romantic reply d) Victory
11. The party's policies are deleterious to the state.
    a) Beneficial b) Harmful
    c) Retrospective d) Degrading
12. The invading force had no artillery and was completely annihilated.
    a) Defeated b) Destroyed
    c) Demolished d) Dismembered
13. The party can no longer win the admiration with its evanescent glory.
    a) Vanishing b) Susceptive
    c) Melting d) Evaporating
14. She looked at her friend's bristly chin.
    a) Soft and shining
    b) Rough c) Pricking
    d) Cadent

KEY

1) a 2) c 3) b 4) c 5) b
6) d 7) a 8) b 9) c 10) b
11) b 12) b 13) a 14) b

విపత్తు నిర్వహణలో అంతర్భాగమైనవి?

భారతదేశం- విపత్తుల నిర్వహణ

విపత్తు లేదా అత్యవసర పరిస్థితులపై నియంత్రణ ఉండటానికి, ప్రజలను విపత్తు ప్రభావం నుంచి తప్పించడానికి, వాటి వల్ల కలిగే నష్టాలను తగ్గించడానికి, విపత్తుల బారిన పడ్డ ప్రజలు కోలుకోవడానికి దోహదం చేసేలా రూపొందించిన వివిధ రకాల కార్యక్రమాల సమాహారమే 'విపత్తు నిర్వహణ'.

భారతదేశ విస్తీర్ణం 329 మిలియన్ హెక్టార్లు. దేశ భూభాగంలో ఉన్న 29 రాష్ట్రాలు, 7 కేంద్రపాలిత ప్రాంతాలు ఏదో ఒక రూపంలో, ఏదో ఒక రకమైన విపత్తును ఎదుర్కొంటున్నాయి. ఇప్పటి వరకు సంభవించిన భూకంపాలు, రెండు లేదా మూడేళ్లకు ఒకసారి దేశంలో ఏర్పడుతోన్న దుర్భిక్ష పరిస్థితులే ఇందుకు నిదర్శనం. 1967లో సంభవించిన కొయనా భూకంపం, 1993 నాటి లాతూర్ భూకంపం, 1994లో సూరత్‌లో ప్రబలిన ప్లేగు వ్యాధి, 1999లో ఒడిశా తీరాన్ని ముంచెత్తిన సూపర్ సైక్లోన్, 2014లో విశాఖ నగరాన్ని అతలాకుతలం చేసిన హుదూద్ తుపాను మొదలైన వాటిని విపత్తులకు ఉదాహరణలుగా పేర్కొనవచ్చు. వైపరీత్యాల కారణంగా ప్రాణ, ఆస్తి నష్టం అధికంగా వాటిల్లుతోంది. లక్షలాది మంది ప్రజలు నిరాశ్రయులవుతున్నారు. దేశంలోని సాంస్కృతిక, సహజ సంపద దెబ్బతింటోంది.

2004లో సునామీ వచ్చే వరకు భారత ప్రభుత్వం విపత్తులు వాటిల్లక ముందు తీసుకోవాల్సిన చర్యలపై దృష్టి పెట్టలేదు. విపత్తుల నిర్వహణ కోసం, వాటి వల్ల కలిగే నష్టాన్ని కనిష్ఠ స్థాయికి తగ్గించడానికి అమలు చేసిన కార్యక్రమాలు.. విపత్తు సంభవించిన తర్వాత తీసుకునే పునరావాస, పునర్నిర్మాణ చర్యల రూపంలో ఉన్నాయి. అందువల్ల విపత్తులు సంభవిస్తే భారీ నష్టం వాటిల్లేది. భారత ప్రభుత్వం విపత్తు నిర్వహణలోని లోపాలను సవరించి 2005 మే 20న జాతీయ విపత్తు నిర్వహణ చట్టాన్ని రూపొందించింది. అమెరికా, జపాన్ లాంటి అభివృద్ధి చెందిన దేశాలు అమలు చేస్తున్న కార్యక్రమాలు, ప్రణాళికలను దృష్టిలో ఉంచుకొని ఈ చట్టాన్ని రూపొందించారు. ఈ చట్టం ప్రకారం విపత్తుల సమగ్ర నిర్వహణ కోసం 2005 మే 30న జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికారిక సంస్థ (NDMA)ను ఏర్పాటు చేశారు. 2005 డిసెంబరు 23 నుంచి జాతీయ విపత్తు నిర్వహణ చట్టం పూర్తిస్థాయిలో అమల్లోకి వచ్చింది. ఇందులోని సెక్షన్ 3(1) ప్రకారం 2006, సెప్టెంబరు 27న ప్రధానమంత్రి అధ్యక్షుడిగా తొమ్మిది మంది సభ్యులతో నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీ పూర్తిస్థాయిలో అమల్లోకి వచ్చింది.

జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికారిక సంస్థ (NMDA)లోని ముఖ్యాంశాలు

- వివిధ స్థాయుల్లో ఉన్న సంస్థలు, ప్రభుత్వ శాఖల మధ్య సమన్వయంతో విపత్తు నిర్వహణ యాజమాన్యం చేపట్టాలి.
- ప్రభావిత ప్రాంత ప్రజల జీవనోపాధి దృష్టిలో ఉంచుకొని విపత్తు యాజమాన్యం ఉండాలి.
- విపత్తు నిర్వహణ కోసం అమలు చేసే కార్యక్రమాలు ప్రభావిత ప్రాంతాల్లో సుస్థిరాభివృద్ధిని సాధించే విధంగా ఉండాలి.
- విపత్తు నిర్వహణకు సంబంధించి చేపట్టే సాంకేతిక పరిజ్ఞానం మారుమూల ప్రాంతాల్లో ఉన్న చివరి నిరాశ్రయుడికి సైతం అందుబాటులో ఉండాలి.
- సమగ్ర విపత్తు నిర్వహణకు ప్రభుత్వం, స్వచ్ఛంద సంస్థలు, శాస్త్రవేత్తలు, ఎన్‌జీవోల మధ్య సమన్వయం పెంపొందించే విధంగా కార్యక్రమాలు ఉండాలి.
- అన్నింటికంటే ముఖ్యంగా ప్రభావిత ప్రాంత ప్రజలకు విపత్తుల నుంచి తమను తాము రక్షించుకునేలా సరైన శిక్షణా కార్యక్రమాలను నిర్వహించి వారిని చైతన్యవంతుల్ని చేయాలి.
- సంస్థాగతమైన, న్యాయపరమైన, చట్టపరమైన, సాంకేతికపరమైన అంశాలన్నింటి మధ్య సమన్వయం సాధిస్తూ, అభివృద్ధి ప్రక్రియలన్నింటిలో విపత్తు యాజమాన్యాన్ని భాగస్వామ్యం చేయాలని ఎన్‌డీఎంఏ సూచిస్తోంది.

పైన పేర్కొన్న లక్ష్యాల సాధనకు విపత్తు యాజమాన్యంలో ఉండాల్సిన దశలను ఎన్‌డీఎంఏ సూచించింది. అవి..

ఎ) నివారణ　బి) సంసిద్ధత
సి) ఉపశమనం　డి) పునరావాసం
ఇ) పునర్నిర్మాణం　ఎఫ్) ప్రతిస్పందన

ఎ. నివారణ: విపత్తు సంభవించడానికి ముందే చేపట్టే చర్యలు. ఉదాహరణకు వర్షాకాలానికి ముందే వరద ప్రభావిత ప్రాంతాల్లో వరదలు సంభవించకుండా జలాశయాల్లో పూడికలు తొలగించడం, నదులకు ఇరువైపులా కరకట్టల నిర్మాణం లాంటి చర్యలతో కూడిన కార్యక్రమమే నివారణ.

బి. సంసిద్ధత: వైపరీత్యాల ప్రభావాన్ని సమర్థవంతంగా ఎదుర్కోవడానికి వైపరీత్య ఘటనకు ముందే చేపట్టే కార్యకలాపాలను సంసిద్ధత అని పిలుస్తారు. ఉదాహరణకు వైపరీత్య ప్రభావిత ప్రాంతాల్లో సహాయక చర్యల్లో పాల్గొనే ప్రభుత్వ సిబ్బంది వైపరీత్యం సంభవించడానికి ముందే సరిపడా రేషన్, ఔషధాలు, వాహనాలను సిద్ధం చేసుకోవాలి. సమాచార, ప్రసార మాధ్యమాల ద్వారా విపత్తుల సమాచారం తెలపాలి.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
డిజాస్టర్ మేనేజ్‌మెంట్

సి. ఉపశమనం: విపత్తు ప్రభావం పరిధి, దాని వల్ల వాటిల్లే ప్రమాదాలు, నష్టాలను తగ్గించే ఏ చర్యనైనా ఉపశమనం అనవచ్చు. విపత్తుకు ముందు, విపత్తు సమయంలో, విపత్తు తర్వాత కూడా ఉపశమన చర్యలను చేపట్టవచ్చు. ఉపశమన చర్యలో భాగంగా అనేక నిర్మాణాత్మక, నిర్మాణేతర చర్యలను చేపడతారు. అవి:

నిర్మాణాత్మక చర్యలు: విపత్తు ప్రభావిత ప్రాంతాల్లో విపత్తులను తట్టుకునే భవనాల నిర్మాణాన్ని చేపట్టడం, నదీ ఆనకట్టల ఎత్తును పెంచడం, వైపరీత్య ప్రాంతాల్లో దెబ్బతిన్న రోడ్లను, కమ్యూనికేషన్ వ్యవస్థను పునరుద్ధరించడం, వైపరీత్యం వల్ల నష్టపోయిన ప్రజలకు పునరావాస, పునఃనిర్మాణ కార్యక్రమాలు చేపట్టడం మొదలైనవి.

నిర్మాణేతర చర్యలు: వైపరీత్య ప్రభావం వల్ల దగ్గరి వ్యక్తులను కోల్పోయిన వారికి కౌన్సెలింగ్ ఇవ్వడం, ఆర్థిక సహాయం అందేలా చూడటం. ఉద్యోగావకాశాలు కల్పించడం, వారిని సురక్షితంగా ఇంటికి పంపడం లాంటి చర్యలు తీసుకోవాలి.

డి. ప్రతిస్పందన: వైపరీత్యం సందర్భంలో, వైపరీత్యం సంభవించిన వెంటనే దాని ప్రభావాలను తగ్గించడానికి చేపట్టే తక్షణ చర్యలు. ప్రభుత్వ సంస్థలు, ప్రభుత్వేతర సంస్థలు, స్వచ్ఛంద సంస్థల సహాయం, సమన్వయంతో చేపట్టే చర్యలు ఇందులో భాగంగా ఉంటాయి. ఉదాహరణకు బాధితుల ఫోన్ నంబర్లు తీసుకోవడం, మెడికల్ క్యాంపుల ఏర్పాటు, ఎప్పటికప్పుడు హెచ్చరికల జారీ, సరిపడా షెల్టర్లు, ఇతర సౌకర్యాలను ఏర్పాటు చేయడం మొదలైనవి.

ఇ. పునరావాసం, పునర్నిర్మాణం: ప్రతిస్పందన, సహాయక చర్యలు చేపట్టిన వెంటనే విపత్తు ప్రభావిత ప్రాంతంలోని పరిస్థితులు, అక్కడి ప్రజా జీవనం సాధారణ స్థితికి చేరుకునేందుకు చేపట్టే చర్యలు. ఉదాహరణకు రహదారుల మరమ్మతులు, శాశ్వత గృహాల నిర్మాణం, జీవనోపాధి కల్పించడం మొదలైనవి.

- పైన పేర్కొన్న వాటిలో చివరి మూడు చర్యలు విపత్తు నిర్వహణ కోసం 2004 వరకు ప్రభుత్వం అమలు చేస్తోన్న కార్యక్రమాల్లో అంతర్భాగంగా ఉండేవి. అయితే ఇవి విపత్తు అనంతరం తీసుకొనే చర్యలు. విపత్తు వాటిల్లడానికి ముందే జాగ్రత్త చర్యలు తీసుకోకపోవడం వల్ల జరగాల్సిన నష్టం జరిగిపోయేది. ఈ లోపాన్ని సవరిస్తూ విపత్తు అనంతర చర్యలతోపాటు విపత్తులు సంభవించడానికి ముందు తీసుకునే చర్యలు(సంసిద్ధత, నివారణ) కూడా విపత్తు నిర్వహణ కార్యక్రమాల్లో అంతర్భాగంగా చేర్చాలని ఎన్ఎండీఏ సూచించింది.

విపత్తు నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం చేపట్టిన చర్యలు

- 1937లో సంభవించిన బిహార్-నేపాల్ భూకంపం తర్వాత బ్రిటిష్ ప్రభుత్వ హయాంలో విపత్తు నిర్వహణపై సెంట్రల్ రిలీఫ్ కమిషనర్ ఆధ్వర్యంలో ఒక వ్యవస్థీకృత నిర్మాణం ప్రారంభమైంది.
- స్వాతంత్ర్యం వచ్చాక కూడా విపత్తు నిర్వహణను సెంట్రల్ రిలీఫ్ కమిషనర్ ఆధ్వర్యంలోనే నిర్వహించేవారు.
- ఐక్యరాజ్యసమితి సాధారణ సభ 1990వ దశాబ్దాన్ని అంతర్జాతీయ విపత్తు తగ్గింపు దశాబ్దంగా ప్రకటించింది. దీనికి అనుగుణంగా మన దేశంలో ఒక శాశ్వత, సంస్థాగత విపత్తు నిర్వహణ విభాగాన్ని ఏర్పాటు చేశారు. ఇది వ్యవసాయ మంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో పనిచేస్తుంది.
- 1999 అక్టోబరు 29న వ్యవసాయ మంత్రిత్వ శాఖ మాజీ కార్యదర్శి కె.సి.పంత్ అధ్యక్షతన ఒక అత్యున్నత కమిటీ ఏర్పాటైంది. ఈ కమిటీ సూచనల ప్రకారం 2002 ఫిబ్రవరి 2న విపత్తు నిర్వహణ విభాగాన్ని గృహమంత్రిత్వశాఖలోని సంయుక్త కార్యదర్శి పరిధిలోకి తెచ్చారు. దుర్భిక్షం మినహా మిగతా అన్ని రకాల విపత్తుల నిర్వహణను గృహమంత్రిత్వశాఖ ఆధ్వర్యంలో చేపడతారు. దుర్భిక్ష నిర్వహణ మాత్రం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలోనే కొనసాగుతోంది.

గతంలో అడిగిన ప్రశ్నలు

1. అన్ని ప్రకృతి వైపరీత్యాలకు సంబంధించి (దుర్భిక్షం మినహా) విపత్తు నిర్వహణ కార్యకలాపాలను సమన్వయం చేయడానికి కేంద్రంలో ఉన్న సంస్థ ఏది?
(Town Planning Exam)
ఎ) హోం మంత్రిత్వశాఖ
బి) సాంఘిక న్యాయ, సాధికారత శాఖ
సి) వ్యవసాయ మంత్రిత్వశాఖ
డి) శాస్త్ర, సాంకేతిక మంత్రిత్వ శాఖ
2. కింది వాటిలో విపత్తు నిర్వహణలో అంతర్భాగమైనవి ఏవి?
(Town planning Exam)
ఎ) పునరావాసం　బి) పునర్నిర్మాణం
సి) నివారణ　డి) పైవన్నీ
3. 2005 విపత్తు నిర్వహణ చట్టం ప్రకారం ఏర్పాటు చేసిన జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికారిక సంస్థ అధ్యక్షుడు ఎవరు?
(Town planning Exam)
ఎ) ప్రధానమంత్రి
బి) హోం శాఖ మంత్రి
సి) ఆర్థికమంత్రి
డి) గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి
4. విపత్తు నిర్వహణ కార్యకలాపాలు జరిపే సమయం?
(Town planning Exam)
ఎ) విపత్తు రావడానికి ముందు
బి) విపత్తు సమయంలో
సి) విపత్తు తర్వాత
డి) పై అన్ని సమయాల్లో

సమాధానాలు

1) ఎ　2) డి　3) ఎ　4) డి

మాదిరి ప్రశ్నలు

1. ఐక్య రాజ్య సమితి విడుదల చేసిన విపత్తుల నివేదిక-2014 రిపోర్ట్ ప్రకారం ప్రపంచంలో అత్యధిక విపత్తు ప్రభావిత ముప్పు ఉన్న నగరం ఏది?
ఎ) చికాగో　బి) టోక్యో
సి) కోల్‌కతా　డి) మనీలా
2. విపత్తు నివేదిక-2014 ప్రకారం అత్యధిక విపత్తు ప్రభావిత నగరాల్లో ప్రపంచంలో ఏడో స్థానంలో ఉన్న భారత నగరం?
ఎ) ముంబై　బి) చెన్నై
సి) కోల్‌కతా　డి) కొచ్చిన్
3. ఐక్య రాజ్య సమితి సాధారణ సభ ఏ దశాబ్దాన్ని ప్రపంచ విపత్తు తగ్గింపు దశాబ్దంగా ప్రకటించింది?
ఎ) 1980　బి) 1990
సి) 2000　డి) 2010
4. విపత్తు నిర్వహణ విభాగాన్ని ఏ సంవత్సరంలో ఏర్పాటు చేశారు?
ఎ) 2002 జనవరి 2
బి) 2002 ఫిబ్రవరి 2
సి) 2003 ఫిబ్రవరి 3
డి) 2002 జనవరి 3

సమాధానాలు

1) బి　2) సి　3) బి　4) బి

What is the code for "earn"

BANK EXAMS
REASONING

Model Questions

Directions (Q. No. 1-7): Study the following information to answer the given questions.

Eight people, viz A, B, C, D, E, F, G and H are sitting in a straight line facing North. Each of them has passed a recruitment exam and must join the office in different months, viz January, February, March, April, May, June, July and August but not necessarily in the same order.

G sits third to the right of the person who joins in May. The person who joins in August sits second to the right of G. A and E are immediate neighbours of each other. Neither A nor E has joining dates in either May or August. Neither A nor E is an immediate neighbour of G.

H sits third to the right of the person whose joining date is in January. Neither A nor E has joining dates in January. H's joining date is not in August.

Only two people sit between E and the person whose joining date is in July. The person whose joining date is in February sits on the immediate left of D.

Only one person sits between A and B. C joins before July. E joins after April. G joins after A.

1. In which of the following months does H join the office?
1) April　2) June　3) July
4) February　5) March
2. Who among the following sits exactly between E and B?
1) The person whose joining date is in May
2) The person whose joining date is in January
3) D　4) A
5) The person whose joining date is in August
3. "H" is related to "July" in a certain way based on the above arrangement. "B" is related to "June" following the same pattern. "___" is related to "May" following the same pattern.
1) F　2) G　3) A　4) D　5) C
4. Which of the following is true regarding D?
1) Only two people sit to the left of D
2) D is sitting second to the right of the person whose joining date is in July
3) E and B are immediate neighbours of D
4) D's joining date is in May
5) None is true
5. Who among the following has joining date in June?
1) F　2) E　3) G　4) D　5) C
6. How many people sit between C and the person whose joining date is in April?
1) None　2) One　3) Two
4) Three　5) Four
7. Who among the following are sitting at extreme ends of the line?
1) A and the person whose joining date is in August
2) The person whose joining date is in May and E
3) C and G
4) The persons whose joining dates are in March and June
5) None of these

Directions (Q. No. 8-12): Study the following information to answer the given questions.

Eight people are sitting in two parallel rows containing four people each in such a way that there is an equal distance between adjacent persons. In row 1, A, B, C and D are sitting (but not necessarily in the same order) and all of them are facing North. In row 2, P, Q, R and S are sitting (but not necessarily in the same order) and all of them are facing South. Therefore, in the given seating arrangement, each member sitting in a row faces another member of the other row. S sits second to left of Q. A faces the immediate neighbour of S. Only one person sits between A and C. P does not face A. B is not an immediate neighbour of A.

8. Which of the following is true regarding D?
1) D sits at one of the extreme ends of the line
2) A sits on the immediate left of D
3) Q faces D
4) C is an immediate neighbour of D
5) No immediate neighbour of D faces R
9. Who among the following faces C?
1) P　2) Q　3) R　4) S
5) Cannot be determined
10. Who among the following sits on the immediate right of the person who faces C?
1) P　2) Q　3) R　4) S
5) Cannot be determined
11. Four of the following five are alike in a certain way based on the given seating arrangement and thus form a group. Which is the one that does not belong to that group?
1) A　2) Q　3) R　4) B　5) S
12. Who among the following faces R?
1) A　2) B　3) C　4) D
5) Cannot be determined

Directions (Q. No. 13-18): Study the following information to answer the given questions:

In a certain code,
"time and money" is written as "ma jo ki",
"manage time well" is written as "pa ru jo",
"earn more money" is written as "zi ha ma" and
"earn well enough" is written as "si ru ha".

13. What is the code for "earn"?
1) si　2) ru　3) ha　4) ma
5) Cannot be determined
14. Which of the following represents "more time" ?
1) pa jo　2) zi ki　3) ma ki
4) si jo　5) jo zi
15. What is the code for "manage"?
1) ru　2) pa　3) jo
4) ha　5) Either "jo" or "ru"
16. Which of the following may represent "money matters"?
1) ki to　2) ma pa　3) fi ma
4) ha ma　5) ma jo
17. What does "ru" stand for?
1) well　2) manage
3) time　4) enough
5) Either "time" or "enough"
18. Which of the following may represent "good enough"?
1) ru si　2) da ha　3) si pa
4) si da　5) ki ru

Directions (Q. No. 19-23): Study the following information carefully and answer the given questions.

A word and number arrangement machine, when given an input line of words and numbers, rearranges them following a particular rule in each step. The following is an illustration of input and rearrangement.

Input: gone over 35 69 test 72 park 27
Step I: 27 gone over 35 69 test 72 park
Step II: 27 test gone over 35 69 72 park
Step III: 27 test 35 gone over 69 72 park
Step IV: 27 test 35 park gone over 69 72
Step V: 27 test 35 park 69 gone over 72
Step VI: 27 test 35 park 69 over gone 72
Step VII: 27 test 35 park 69 over 72 gone

Step VII is the last step of the rearrangement.

As per the rules followed in the above steps, find out in each of the following questions the appropriate step for the given input.

19. **Input:** 86 open shut door 31 49 always 45
How many steps will be required to complete the rearrangement?
1) Five　2) Six　3) Seven
4) Four　5) None of these
20. **Step III of an input:** 25 yes 37 enemy joy defeat 52 46
Which of the following is definitely the input?
1) enemy 25 joy defeat yes 52 37 46
2) 37 enemy 25 joy yes defeat 52 46
3) enemy joy defeat 25 52 yes 46 37
4) Cannot be determined
5) None of these
21. **Step II of an Input:** 18 win 71 34 now if victory 61.
How many more steps will be required to complete the rearrangement?
1) Three　2) Four　3) Five
4) Six　5) More than six
22. **Input:** where 47 59 12 are they going 39
Which of the following steps will be the last but one?
1) VII　2) IV　3) V
4) VIII　5) None of these
23. **Step II of an input:** 33 store 81 75 full of goods 52
Which of the following will be step VI?
1) 33 store 52 of 75 81 full goods
2) 33 store 52 of 75 full 81 goods
3) 33 store 52 of 75 goods 81 full
4) There will be no such step
5) None of these

Explanations

(1-7):



1. 4　**2.** 1　**3.** 1　**4.** 5　**5.** 2
6. 3　**7.** 1

(8-12):



8. 4　**9.** 1　**10.** 2　**11.** 5　**12.** 1

(13-18):
time and money ® ma jo ki... (i)
manage time well ® pa ru jo...(ii)
earn more money® zi ha ma..(iii)
earn well enough ® si ru ha ...(iv)
From (i) and (ii), time ® jo
From (i) and (iii), money ® ma
From (i), and ® ki
From (ii) and (iv) well ® ru
From (ii), manage ® pa
From (iii) and (iv), earn ® ha
From (iii), more ® zi
From (iv), enough ® si
13. 3　**14.** 5　**15.** 2
16. Since "matters" is a new word. So, new code is introduced for "matters" ie, "fi". Code for "money" is "ma". **Ans: 3**
17. 1
18. Code for "enough" is "si" and since "good" is a new word, so a new code for "good", ie "da" is introduced. **Ans: 4**

(19-23):
The machine rearranges numbers in ascending order and word in reverse alphabetical order alternately.
19. Input: 86 open shut door 31 49 always 45
Step I: 31 86 open shut door 49 always 45
Step II: 31 shut 86 open door 49 always 45
Step III: 31 shut 45 86 open door 49 always
Step IV: 31 shut 45 open 86 door 49 always
Step V: 31 shut 45 open 49 86 door always **Ans: 2**
20. Can't proceed backward. **Ans: 4**
21. Step II: 18 win 71 34 now if victory 61
Step III: 18 win 34 71 now if victory 61
Step IV: 18 win 34 victory 71 now if 61
Step V: 18 win 34 victory 61 71 now if
Step VI: 18 win 34 victory 61 now 71 if
Four more steps are needed to complete the rearrangement. **Ans: 2**
22. Input: where 47 59 12 are they going 39
Step I: 12 where 47 59 are they going 39
Step II: 12 where 39 47 59 are they going
Step III: 12 where 39 they 47 59 are going
Step IV: 12 where 39 they 47 going 59 are **Ans: 5**
23. Step II: 33 store 81 75 full of goods 52
Step III: 33 store 52 81 75 full of goods
Step IV: 33 store 52 of 81 75 full goods
Step V: 33 store 52 of 75 81 full goods
Step VI: 33 store 52 of 75 goods 81 full **Ans: 3**